# భారతి

సాహిత్య మాసపత్రిక
అక్టోబరు 1983

కొత్తపుటలు
నారాయణరెడ్డి

తెలుగుభాష పుట్టుక
లకంసాని చక్రధరరావు



చంద్రబింబం
రవూఫ్

ప్రతీక
రంగారావు

పునీతులు
రావి శాస్త్రీయం
కిశోరుబాబు - అశోకుబాబు

వరంగల్ మురికివాడలు
మనోహర్ రావు

ఇంకా రమేష్‌బాబు, విజయ దత్తాత్రేయశర్మ, బి. ఆర్ కె. రావు, దుర్గాప్రసాద్, రాధాకృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, సోమసుందర్, రంగారావు ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

# భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

అక్టోబరు 1983
సంపుటము : 60 సంచిక : 10

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

# విషయానుక్రమణిక

## అక్టోబరు 1983

# కొత్త పుటలు

## డా॥ సి. నారాయణరెడ్డి

చించేస్తున్నాను ఈ పుటలు .
చివికిన కుబుసాలివి .
నా కావ్యం
మన్ను దిన్న పాము కాదు .
మార్పులా పడగెత్తే చైతన్యం .
అంటిస్తున్నాను కొత్త పుటలు
అలలగొంతుకలు తొడిగి
అరణ్య గర్జనలు పొదిగి .
ఆ పుటలు
ఉరుముతున్న ఊరేగింపులో
మెరుపుల్లా చిట్లి పోయే తలలు.
కర్మభూమి కప్పిన పొరల్ని చీల్చుకుని
కత్తిమొనల్లా పొడుచుకొచ్చే మొలకలు .
అరుణోదయాల్ని పిల్చుకుని
ఆ మొలకలు ఎదుగుతాయి అక్షరవృక్షాలై .
పుస్తకం ఒడిలో నిద్రించవు ఆ పుటలు.
మేల్కొనే వుంటాయి మూసుకున్న కళ్ళతో .
ఉక్కు చట్టాలు ఓ పికనొక్కితే
ఆ పుటలు గావుకేకలు పెడతాయి .
ఎక్కడ ఏ లాఠీ దెబ్బతో
చుక్కంత నెత్తురు చిందినా
ఆ పుటలు బజారున పడతాయి.
పెత్తనం నిషేధిస్తుంది ఆ పుటల్ని .
పిచ్చిగానీ__ఆ పుటల నిట్టూర్పులన్నీ
ప్రజల నరాల్లో చొరబడతాయి
ప్రతి ఘటన గీతాలై ;
కరుకెక్కిన పిడికిళ్ళలో
ఎరుపెక్కిన జెండాలై .

శ్రీ సోమసుందర్

# శ్రీశ్రీ ప్రతిభావంతంగా చిత్రించిన శరచ్చంద్రిక

దాదాపు ముప్పయ్యేళ్ళ క్రితం రేడియో ప్రసారం కోసం రచించబడిన కావ్యం శరచ్చంద్రిక. 1954 అక్టోబరు కృష్ణాపత్రికలో తొలిసారి ప్రచురితమైంది. భావాభివ్యక్తిలో, ఇతివృత్త నిర్వహణలో అలంకార ద్రవ్య నిష్పత్తిలో సర్వాంగీణంగా ఆధునిక యోచనాపథాన్ని పరిపూర్ణంగా ఆవిష్కరించిన కావ్యమిది.

మహాప్రస్థాన కవితలలో కవి ప్రయోగించిన శైలికీ, పదాల పోహళింపు రీతికీ స్వాతంత్ర్యోత్తర కాలంలో రచించబడిన కావ్యాలన్నీ విభిన్న వ్యక్తిత్వాన్ని సాధించాయి. లలిత శబ్ద సంపుటితో అలసాలసంగా సాగే ఛందోరీతితో ఆనాటి కావ్యాలన్నీ విశిష్టత సాధించాయి. పది పుటలాక్రమించిన శరచ్చంద్రిక అరవై ఆరు పద్యాలు గల ఉదాత్త కావ్యమిది. స్థూలదృష్టికి స్వచ్ఛంద వచన కవితలాగే కనిపించినా ఒక విశిష్ట మాత్రాచ్ఛందోరీతిని ఆంతరిక లక్షణంగా సంతరించుకుంది.

శారద చంద్రిక కవిని పలకరించడానికి వచ్చింది. అప్పుడది- "నవీన విశ్వవిద్యాలయాల్లో పురాణ కవిత్వం" లాగుంది. నిజమే మరి, ఒక విశ్వవిద్యాలయం నవీనంగా స్థాపించబడినా దాని సంపన్మయ భాండారంలో పురాణకవిత్వ సముచ్చయమంతా అలంకృతం కాకతప్పదు. అలాగే ఆధునిక విజ్ఞాన శాస్త్రమూ, సామాజిక యోచనా ధారలతో నవీనత్వ మందుకున్న విశ్వంలో చంద్రుడు ప్రకాశింపక తప్పదు. అందునా భూమికి ఆత్మబంధువుగా వెన్నెల వెలుగులతో పలకరించనూ రాకతప్పదు. పురాణ కవిత్వం లాగే చంద్రుడు సైతం ప్రాచీనకాలపు వెన్నెలలే కాస్తున్నాడు. శారద చంద్రికా శోభలూ వెలారుస్తున్నాడు. పైగా 'శ్రవణ యంత్రశాలలో శాస్త్రీయ సంగీతంలాగ ఆరాధింప బడుతున్నాడు. శ్రవణ యంత్రశాల అనే పదబంధం రేడియో స్టేషనుకు శ్రీశ్రీ కల్పించిన కొత్త పదబంధం.

యుగయుగాలుగా మన భాషలు సూర్యచంద్రాదుల్ని పురుషులుగా భావిస్తున్నారు. మన నుడికారంలో జాబిల్లి వస్తున్నాడు, వెన్నెల్లు కాస్తున్నాడు వంటి నానుడులు స్థిరపడిపోయాయి. అందుకా వెన్నెలని కూడా ఒక పురుషాకృతిని ధరించి వచ్చిన అతిథిని సంబోధించినట్లే శ్రీశ్రీ- "ఇలా వచ్చావేం వెన్నెలా? ఎలా వర్ణించను నిన్ను? మహాకవులు లోగడ చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్పాలా ?" అంటూ ప్రశ్నిస్తాడు.

నిజానికీ ప్రశ్న చంద్రుడ్ని కవి ప్రత్యక్షంగా అడుగుతూన్నట్లు కనిపిస్తున్నా, సర్వదేశాల కవుల్నీ నిలబెట్టి మన మహాకవి అడిగిన ప్రశ్నే యిది! చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెబుతూ ఇప్పటికే మన సాహిత్యానికి అనవసరపు ఉచ్చుఖాయిలా తెచ్చిపెట్టారు మన కవులు. భావ దారిద్ర్యంతో గుడిసుక్కు పడ్డారు. అలాగే తనూ చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెబుతూ సుతరామూ పీత నడకలు నడవ దలచుకోలేదు. తన అవతరణే తన కాలంవరకూ మన సాహిత్యంలో చెప్పబడని విషయాలను ఆసాద్యంగా చెప్పడానికే నిర్దిష్టమైంది. ఆ చైతన్యం ఆదినుంచీ శ్రీశ్రీని ప్రోది చేసింది. అదే ఆంతరిక విశ్వాసంగా భాసించింది. తన కవితలు జాతి జనులు పాడుకొనే మంత్రాలు కాగలవన్న స్ఫురణ కలిగిన దశాబ్దాల తర్వాత అతని కవితలన్నీ జాతి జనుల హృదయాలలో ప్రతిధ్వనించ నారంభించాయి. ఈ క్రాంత దర్శనం గాఢ ప్రతిభ వల్ల అలవోకగా అతనికి లభించిన నైసర్గిక లక్షణం. అట్టి విలక్షణ నేతృత్వంతోనే అభ్యుదయ యుగాన్ని శ్రీశ్రీ పరిపాలించాడు.

ఇంతవరకూ కవులు ఏదో కాస్త భాషాజ్ఞానమూ, ఇంతో అంతో ఛందస్సంపదా, అయిదో పదో అలంకారాలూ అరపాలు ఆవేశమూ వుంటేచాలు సంతృప్తి పడిపోయారు. పాడిందే పాటగా గతగాథల్నీ, మృతపాత్రల్నీ సృష్టిస్తూ గబ్బు పట్టించారు. అలా తాను చేయదలచలేదు. ఇదివరకెన్నడూ చంద్రుడి మొగమైనా చూడనట్లు మృషావేశం తెచ్చుకొని వర్ణించాలా? ఈ ప్రశ్న చంద్రుణ్ణి అడుగుతున్నాడు కవి. దానికి సమాధానం చెప్పుకోవలసిన బాధ్యత చంద్రుడికిలేదు. లోకస్థులకే ఉంటుంది. పైగా వెన్నెలా, చంద్రుడు వంటి చిరంతన కావ్యవస్తువుల గురించి ఏదైనా కొత్తగా రాదామని ప్రయత్నించినా, అదే భావాన్ని

ఎవడో ఒకడు, ఎప్పుడో ఒకప్పుడు వ్రాసిపారేసే ఉండవచ్చు. అలాం టప్పుడు పనిలేశా తెల్లకాగితాన్ని మళ్ళీ తాను కళంకం చేయడమెందుకు? ఈ చంద్రుడు అనాది నుంచీ కవులందరికీ ఉపాదేయ వస్తువుగా, వర్ణనీయానుభవంగా ఉపకరిస్తూనే ఉన్నాడు. ఎన్నో ఉపపత్తులూ కల్పిస్తున్నాడు. తానూ ఒకప్పుడు రొమాంటిక్ ప్రమాదంలో పడక పోలేదు. చంద్రికాసౌందర్యాన్ని ఉత్పల చంపకాదులతో అభివర్ణించక పోలేదు.

ఇంతవరకూ తాను చంద్రునితో చెప్పుకొంటున్న అంశాలు, అడిగిన ప్రశ్నలూ తాను నిర్మించబోతున్న అనభివ్యక్తి, అభినవీన కావ్యానికి ఏవీ విలక్షణ సామగ్రి ఉపయుక్తం కావాలో అన్యాపదేశంగా నిర్ణయించుకుంటున్నాడు. ఆ విశేషాలే అతని కావ్యానికి పునాది. గతంలో వ్రాయబడిన రీతిగానే యిప్పుడు మళ్ళీ రాయాలంటే ఎలా సాధ్యం? ఔచిత్యం ఎలా అంగీకరిస్తుంది? ఎవడికైనా ప్రారంభ యౌవనానికి పరాకాష్ఠవంటి ఇరవయ్యో యేడు మళ్ళీ మళ్ళీ రాదుకదా! అందుకే కవి చంద్రుడి గురించి అనవసర ఆవేశాలు పెంచదలచుకో లేదు. సొంత కోపాలు, పంతాలు, పట్టింపులు చంద్రోప లంభాలు ఆధునిక కవిగా తన కవసరంలేదు.

ఇంతకీ ఆవేశాల కవకాశమేముంది? ఎవడి బ్రతుకు వాడు బ్రతుకుతున్నాడు. ఎవడి చావు వాడు చస్తూనూ ఉన్నాడు; అందుకే యిలా అంటాడు.

"ఎంతగా ఎడం ఎడంగా ఉన్నా ఎంతగా పైపై భేదాలున్నా
ఎంతగా స్వాలిశయం పెరిగినా ఎంత బలం ధనం జనం
పెరిగినా
అంతరంగం అట్టడుగున మాత్రం అంతమందిమీ మానవులమే!"

ఎంతో సామాన్యంగా దినవారీ పలుకుబడిలో పై మాటలు చెప్పేసినా, ఎంతో విస్తృత చిత్రాన్ని అతిస్పష్టీకృతిగా శ్రీశ్రీ ప్రత్యక్షం చేస్తాడు. అంతరంగం అట్టడుగున మాత్రం అంత మందిమీ మానవులమే అన్న సార్వజనీన సత్యాన్ని దాదాపు అందరమూ మరచిపోతూంటాము. ఎవడికి వాడుగా నిర్మించుకొన్న స్వాతిశయాల కృతక గోపురాలలో బందీలవుతున్నాము. స్వాతిశయం అనే పదం అందరూ ఎరిగినదే అయినా సుపీరియారిటీ కాంప్లెక్సుకు ఇంతకన్న సమానార్థకం మరొకటి లేదని మరచిపోతూంటాము.

"అందుచేత ఓ చందమామా, అందమైన ఓ పూర్ణ సోమా
సముద్రం మీదా అరణ్యం మీదా సమానంగా ప్రకాశించే
సౌందర్యాభిరామా!"

అంటూ సంబోధిస్తూనే చప్పున తన్ను తానే సంబాళించుకుంటాడు. కుండలీకరణాల్లో "అదిగో మళ్ళీ కవిత్వం, అనుకున్నాను మొదటే నేను వెన్నెల పేరెత్తితే చాలు వెర్రెత్తిపోతుంది మనసు." అనుకుని సంయమనం బోధించుకుంటాడు. చంద్రదర్శనంతో వెర్రెత్తిపోవడం రసజ్ఞహృదయాలకు సామాన్య గుణమే. ఆ సహజగుణాన్ని ఎలా విస్మరించగలడు కవి ?

చంద్ర దర్శనోద్దీపనం తన కవితా హృదయాన్ని అతలాకుతలం చేయకపోవడం లేదు. కాని ఆనుపూర్విక స్వాత్మకావేశాల గుడిసుళ్ళ జారి పడనివ్వడంలేదు. అందుకేమంటాడు?- 'అన్నట్టు ఏమిటి చెప్మా అందామనుకున్నాను?' అని ప్రశ్నించుకుంటాడు. తనే జవాబు చెప్పు కుంటాడు. "ఏమీలేదు, ఏమీలేదనే ఇంతసేపూ చెబుతున్నాను" అనడం బొడ్డు తుంటాలు చెప్పుకోవడమేగాదు, చంద్రగోళమంతా ఒక శూన్య గోళమనీ, అది కురిపిస్తోందని భ్రమించే వెన్నెలలు సూర్యరశ్మిని ప్రతి ఫలించడమేననీ భావాన్ని ధ్వనిస్తున్నాడు. సామాన్య భాషాపదాలను అలవోకగా ప్రయుక్తం చేస్తూనే ఒకానొక అనభివ్యక్తి భావాన్ని స్ఫోరకం చేస్తాడు. చంద్రుడికి విశిష్ట మహత్తు ఏదో ఉందనీ, అది హృద యారాటాలను సాగర తరంగాలకు మాదిరిగా రెచ్చగొడుతుందనీ ఇంత వరకూ మేధావులంతా భావిస్తూ వచ్చారు. కాని శాస్త్ర పరిశోధనలు అలాంటి అపోహలను పరాస్తం చేశాయి. కనకనే కవి ఏమీ లేదనే పునరుక్తి ద్వారా వక్రోక్తిని సాధించి ఈ సత్యాన్ని స్థాపిస్తాడు.

అందరికీ అన్ని విషయాలూ అల్పంగా తెలియడమే మన అజ్ఞానానికి అసలు కారణం. తానుగా ఈ కావ్యం ద్వారా కొన్ని కొత్త విషయాలు ప్రతిపాదించ దలచినా, ఎవడో చెవితేవినేరోజులు పోయాయి. చెప్పాలనే ఉబలాటమూ వ్యర్థమే! జ్ఞానబోధ కవిత్వపనికాదు; అనుభ వాన్ని జాగృతపరచి పాఠకుణ్ని ఆలోచనా శీలిగా ప్రేరేపిస్తే కవితా ధర్మం నెరవేరినట్లే! పైగా బాహ్యదృష్టికి అందరూ అన్ని విషయాలూ ఎరిగినట్లే కనిపిస్తారు. తీరా పరీక్షిస్తే, ఎవడికీ ఏమీ తెలియదు. ముఖ్యంగా—

"ఇలా ఎందుకొచ్చామో ఇక్కడెంత సేపుంటామో
ఇక్కడ్నించి వెళ్ళేదెక్కడికో ఎల్లుండి ఏ తమాషా జరుగు
తుందో-ఎవ్వడూ చెప్పలేడంటే నమ్మండి!"

అంటూ పాఠకులతో ప్రత్యక్షంగా ప్రసంగిస్తాడు శ్రీశ్రీ.

1947 నుంచి 1969 వరకూ శ్రీశ్రీ కవితా యాత్రలో ఒక అంతర్దశగా భావిస్తే — ఆ దశలో మన మహాకవి సంశయవాదిగా దర్శన మిస్తాడు. ఆనాటి సర్వరచనలలోనూ తత్పూర్వ విగ్రహ

విచ్ఛేదకుడు ఉపశమించి ఆలోచనాపరుడు మేలుకొన్నట్లు కనిపిస్తుంది. సంశయపూరిత ప్రశ్నాపరంపరలనే ఆ ఘట్టంలోని కవితలన్నింటా సంధించాడు. బాహ్య దృష్టికి కూడా కనిపించే సదసత్ సంశయంలో మాత్రమే ఈ తాత్త్విక చింతనానికి ఆవిష్కారం కలిగి వుండలేదు. ఆనుపూర్వికమైన విలువలన్నింటినీ సంశయించే ప్రశ్నలు ప్రాబల్యం వహించాయి. సరిగ్గా అదే దశలో మానవుడు ఖగోళంపై విజయం సాధించే ప్రయత్నం విజయవంతం చేస్తున్నాడు. వ్యోమతేధుల నిర్మాణం సాంకేతికంగా విజయవంతమైంది. చంద్రగోళంపై తొలి మాన వుని పాదముద్రలు నాటి విజయవంతంగా భూమికి తిరిగి రాగలిగాడు. ఈ సంఘటన మానవులందరి ఆలోచనల పునాదులూ కుళ్ళగించ బడ్డాయి. ఆ స్ఫురణలో నవీన విజ్ఞానశాస్త్రం సాధించిన ఈ అపూర్వ విజయాలలో- "కాళ్ళక్రింద భూమి కరగిపో" నారంభించిన సత్యాన్ని శ్రీశ్రీ గమనించాడు. "పూర్వం వేసుకున్న పునాదులు కదలిపో" తున్న సత్యాన్ని రికార్డు చేస్తాడు.

" మనిషికీ మనిషికీ మధ్య మాయ పొరలు కప్పిన "

పూర్వకాలంలో " అదృష్టాల్ని " గ్రహచార గోచారాలకు తగిలించి సంతృప్తులమయ్యేవాళ్ళం.

"మనసుకీ మనసుకీ మధ్య మంచు తెరలు కప్పినప్పుడు మన విషాద శకటాల్ని ఏ నక్షత్రానికో తగిలించుకుంటూ" ప్రొద్దుపుచ్చే వాళ్ళమన్న సత్యాన్ని కంఠోక్తిగా వెల్లడిస్తాడు. అలా అలా మన బ్రతుకులన్నీ శకలాలుగా విరిగి పోయాయి. వినూత్న శాస్త్రీయజ్ఞానం ఈ అనంత శకలాలను సంధించి, ఆధునిక మానవ మూర్తిగా పున రుజ్జీవనం కలిగించింది. మానవ హృదయాన్ని పుష్టిగా నిలపగలిగింది.

నిన్నటి వరకూ మానవుని బ్రతుకు అగమ్యగోచరంగా గడ చింది. అరణ్యరోదనంగా మారింది. ద్వేషమే ప్రధాన జీవలక్షణంగా మారి పోయింది. ప్రేమ నామావశిష్టంగా మిగిలింది. కాని ప్రస్తుత మానవుడు నిర్లిప్తుడై శూన్యానికి చూపులు సారిస్తూ కూర్చుంటే కష్ట పడి ఆర్జించిన స్వాతంత్ర్యం గద్దలు తన్నుకు పోతాయి. ఈ గద్దలు సామాన్యమైనవి కావు; నేటి సామ్రాజ్య వాదులందరికీ అగ్రేసరులైన వారికి ఈ గద్దే జాతీయ చిహ్నమై, హృదయ గత పరపీడనా పరా యణత్వాన్ని చెప్పక చెప్పుకుంటోంది. మనం కంచి మేకల్లాగ బ్రతి కితే-నమ్మిన కసాయివాడే పీకలు త్తరించక తప్పదు. ఈ పురాతనభూమి వైజ్ఞానిక శాస్త్ర దృష్ట్యా ఎంతో ఈడొచ్చినది కాదు. సగటు మనిషి వయస్సు పదకొండో పన్నెండో! ఈ క్రూరతనం వీడని మనుష లందరి గురించీ, మబ్బుతునక జేబురుమాలు చాటు చేసుకొని పురాతన మైన జాబిల్లి నవ్వుకుంటోంది.

మానవుడు సాధిస్తున్న విజయాలు చంద్రుడికి తెలియవనా? నిజమే మానవుడు పరంపరాభివృద్ధి కాంచుతున్నాడు. పరిసరాలను పరిశోధిస్తూ అంతర్గత గుప్త రహస్యాలను వెలికి తీస్తున్నాడు. ప్రాకృతిక శక్తులను జయిస్తున్నాడు. అపూర్వ విజయాలు సాధిస్తున్నాడు. ఐనా మనిషిలో "సగభాగం నిరాశ – సగభాగం పటు దుఃఖం" వీడడంలేదు. అందుకే సామాన్యుల ప్రతినిధిగా కవి ఇంతసేపూ ఏదో నిరాశనే ప్రతిధ్వనించాడు. మరో వైపుగా పరిశీలిస్తే ఎంతో వెలుగు మన కన్నుల్ని మిరుమిట్లుక్రమ్మిస్తుంది.

ఈ కవిత మానవుడింకా చంద్రగోళంపై కాలూనని ముందు రోజులలో రచించబడ్డదని మనం మరచిపోకూడదు. ప్రయత్నాలు మాత్రం ఆ విజయం సాధించే దిశగా సాగుతున్నాయి. అది తథ్యమే నని కవికి స్పష్టంగా తెలుసు. అందుకే అంటున్నాడు :

"ఏమో బహుశా త్వరలో మీయింటికే రావచ్చు మేము
స్వాగతం యిస్తావు కదూ - ఆతిథ్యానికి అర్హులమే మేము
చంద్రమండలానికి ప్రయాణం - సాధించరాని స్వప్నంకాదు
గాలికన్న బరువైన వస్తువుని నేలమీద పడకుండా
నిలబెట్టలేదూ?"

అనే వాక్యాలు ఆ దశలో ప్రపంచ మేధావుల ఆలోచనలకు ప్రాతి నిధ్యం వహిస్తాయి. ఎప్పుడో మానవులు విమానాలు సాధించారు; దానితోనే కాల దూరాల మధ్య గల అనివార్య అవాంతరానికి కాల దోషం పట్టింది. పరమాణు గర్భంలోని పరమ రహస్యాలన్నీ మాన వులకు కరతలామలకాలయ్యాయి. మహాకాశ వాతావరణ మర్మాలన్నీ పరిశోధించి తెలుసుకోగలిగాడు. ఇక చంద్రగోళానికి మానవుడు ప్రయాణించడంలో అబ్బురమేముంది? ఆ విధంగా ఆధునిక మానవుని విజయాలు అసంఖ్యాకమవుతున్నాయి. సాహసోపేతంగా ముందుకు పోతున్నాడు. అజేయంగానూ, అక్షయంగానూ చిరకాలంగా మిగిలివున్న ఎవరెస్టు శిఖరం కొద్ది దినాలకు ముందే లొంగి పోయింది. చికిత్స లేదనుకున్న రాజయక్ష్మవంటి వ్యాధులు ఆధునిక వైద్య శాస్త్రానికి లొంగి పరారీ చిత్తగిస్తున్నాయి. పదార్థ విజ్ఞానశాస్త్రంలో పరిశోధనలు అమోఘవిజయాలు సాధిస్తున్నాయి. ప్రాణస్వభావాన్ని పరిశోధిస్తున్నాయి ప్రాకృతిక బీభత్సాలకు ఆలవాలమైన మహానదుల వైరి పరుగుల నరికట్టి ఎడారుల మొండి గుండెలకు మళ్ళిస్తున్నాడు మనిషి. ఆకుపచ్చరంగుతో అలంకరిస్తున్నాడు. అందుకే రేపటి మానవుడు ఉత్తర ధ్రువ ప్రాంతా లలో వ్యవసాయాదులు చేయగలుగుతాడంటే అబ్బురమనిపించదు. చిరకాలంగా చంపుతూ చస్తూ మనిషికి సాగిస్తున్నందువల్ల "సంహారం సంగ్రామం అంటే జనంలో అసహ్యం పుట్టింది." ప్రశాంత సహజీవనం నెరపాలన్న తీవ్రకాంక్ష నైసర్గికంగా పెంపొందుతోంది.

"ఇదీ మా భూలోకం కథ, ఇదీ మానవుడి ప్రోగ్రెస్‌రిపోర్టు
ఇందులో అతిశయోక్తులేవీలేవని ఎవరైనా ఒప్పు
కుంటారను కుంటా!" నంటాడు శ్రీశ్రీ!

ప్రోగ్రెస్ రిపోర్టు అనడంలో ఒకచమత్కారముంది. తానందించినది, పుడమిలో మానవులుసాధిస్తున్న అభ్యుదయ పరంపరల సమాచారమేమరి. అతిశయోక్తులూ, ఆత్మస్తుతులూలేని యధార్థాలే. మానవజాతి సాధిస్తున్న ఇంత అభ్యుదయాన్నీ తమ హస్తగతం చేసుకుందుకు స్వార్థపర వర్గాలు అనిశం ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అందుకే దారిద్ర్య రేఖకు దిగువలో జీవిస్తున్న జనాభా అత్యధిక శాతం అవుతోంది. వర్తమాన ప్రపంచాన్ని యుద్ధభయం పీడిస్తోంది. ఇరుగువాడు పొరుగువాడ్ని చూసి అనవసరంగా భయపడిచస్తున్నాడు.

"ఇక్కడ మా భారతవర్షంలో ఎక్కువగా కబుర్లెగాని
సమాజ స్వరూపం మార్చే సాహసం కనిపించడం లేదు.

అన్న కవి దర్శన ముప్పయ్యేళ్ళ తర్వాత నేటికీ యథార్థమే.

అప్పుడే ఆంధ్రరాష్ట్రం తొలి పుట్టినరోజు పండుగ జరుపుకొని పన్నెండు నెలల అభ్యుదయాన్ని తైపారు వేసుకుంది. "ఒక ఏడాదిలో ఏం సాధించగలంటే, మరి కొంతకాలం ఆగమని ప్రజలకు నచ్చ చెప్పింది." ఇప్పటికీ తెలుగు వారంతా చెల్లా చెదరయ్యే వున్నారు. వాళ్ళంతా తెల్లబోయి చూస్తూ వుండిపోయారు.

ఇవన్నీ నివేదించి చంద్రుడికి విసుగు కలిగించదలచలేదనీ, చంద్రునికో నూలుపోగన్న సామెత మన భాషలో ఉంది కనక "దారం లాంటి తేలికయిన గీతాన్ని" కాన్కగా తీసుకోమని సమర్పిస్తాడు శ్రీశ్రీ. ఇంతకీ కొత్తగా చంద్రునికి తానందించవలసిన సందేశాలేమున్నాయి?

"శరత్కాల గగనంలో చందమామ కనిపిస్తే
సరదాగా కొంతసేపు సంభాషణ సాగించా!"

డంతే! అలా సాగించిన సంభాషణలో సంతాపం, సంతోషం ఎడనెడగా సారాంశాలు కావడమూ సహజమే! ప్రసంగవశాత్తూ ప్రగల్భాలు పలికితే, అసందర్భమైన అడ్డదార్లు తొక్కితే మన్నించమంటాడు చంద్రుడ్ని. తనకా వెనక్కి తిరిగి చూచుకొనే అలవాటు లేదు. కారణం మరేమీ కాదు, అర నిముషం పశ్చాద్దర్శనంతో కాలయాపన చేశామా- అది గత శతాబ్దంలో కలసిపోతోంది.

సుందర రాగల నిముషాలన్నీ రాబోయే యుగానికే సంకేతాలు. "కావున ఓ జాబిల్లీ! రాబోయే యుగంలో కాలక్షేపం చేదాం, కలుస్తావుగా మళ్లా?" అంటూ సెలవు తీసుకుంటాడు. ఈ కవితలో సామాన్య సంభాషణా స్థాయికి సమాంతరంగా మాత్రాఛందస్సుందర వాక్య నిర్మాణాన్ని సునాయాసంగా సాధిస్తాడు. ఆ వీడ్కోలు సందర్భంలోనే అతనికొక ఆశాభావమూ స్ఫురిస్తుంది.

"రాబోయే యుగంలో బహుశానాలు
అరాజకం పోతుందనుకుంటా!
ఇప్పుడు బాధిస్తున్న హృదయావేదనలు
ఉండవను కుంటా..."

నన్న శ్రీశ్రీ వాక్యాలలో రెండు యథార్థాలు ఏక దేశంగా నెలకొన్నాయి. వర్తమాన విషమ పరిస్థితులు కల్పించిన హృదయావేదనల వల్ల తన వంటి చరితార్థులైన మేధావులు సైతం అరాజకతకు పాల్పడుతున్నారు. రాబోయే యుగాలలో స్వచ్ఛ సుందర వ్యవస్థ ఏర్పడబోతోంది. హృదయా వేదనలూ,అరాజకత్వాల అసంయమిత అగ్నికీలలూ నివారణ కాగలవు. అదీ శ్రీశ్రీ నిర్ద్వంద్వంగా ప్రకటించిన ఆత్మ విశ్వాసమూ, విశ్వాసమూను!

ఇంతవరకూ కవి చంద్రునితో చాలా విషయాలే ముచ్చటించాడు. ఇక శాఖా చంక్రమణం మాని మరికొన్ని విషయాలు సూటిగా చెప్పదలచాడు. ఆ చెప్పడం కూడా మామూలుగా కాదు; "బల్లగుద్దిన మాదిరిగా, కుండ బద్దలు కొట్టిన దాపతుగా... నీళ్ళు నములడం లేకుండా; కాళ్ళు తడబడకుండా స్పష్టంగానే కాకుండా శ్రావ్యంగా; స్వచ్ఛంగానే కాకుండా సమగ్రంగా" చెప్పేస్తానంటాడు.

ఈ మాటలు తాను చెప్పదలచిన రీతికి లక్షణాలుగా పేర్కొన్నా అన్యాపదేశంగా మంచి కవితకుండవలసిన జీవలక్షణాలే! ఆ యేడు లక్షణాలలోనూ చివరి రెండూ- "స్పష్టంగానే కాకుండా శ్రావ్యంగా, స్వచ్ఛంగానే కాకుండా సమగ్రంగా!" ఆధునిక కవిత్వ ఉండి తీరాలని మహాకవి నిర్దేశిస్తున్నాడు. పులుముడులేని స్పష్టత ఉండాలి నిజమే, కాని కటువుగాను కర్ణభేద్యంగానూ ఉండనక్కర్లేదు శ్రావ్యత భవ్యతకు బాహ్యరూపంగా అమరాలి. స్వచ్ఛంగా ఆధునిక తాత్త్వికధార ననుసంధించుకోవాలి. అంతతోనూ సరిపోదు. ఎంత లఘు కవితా స్వరూపమైనా భావన పరిపుష్టమై సమగ్రతనందుకోవాలి. ఇలా ఆధునిక కవితా లక్షణాలను ధ్వన్యాంతరంగా చెబుతాడు.

రాబోయే యుగంలో మినహాయింపులూ క్షమాపణలూ ఉండవు. సౌందర్యవంతమైనదా స్వర్ణయుగం. అభ్యుదయ సాహితీ యుగకర్తగా శ్రీశ్రీకి నిరంతరం భవిష్యత్తుపైనే నిఘా! ఆగామి కాలంపట్లనే అతని ధ్యేయమంతా! కవిగా తనను పలకరించడానికి వచ్చిన జాబిల్లి కాలం ముళ్ళడొంకనంతా కదిల్చాడు. చంద్రుడికా హైరాన తప్పలేదు. సానునయ వాక్యాలతో జాబిల్లికి వీడ్కోలు పలుకుతాడు కవి.

ఆధునిక నాగరక జీవితం, పట్టుమని పది నిముషాలైనా ఆకాశంలో చంద్రునివంక చూసే తీరుబాటు కలిగించడంలేదు. అందుకే అంటాడు:

"స్వయంగా నీతో మాట్లాడి చాలాకాలమైంది" అని. కవికీ చంద్రుడికీ నడుమ సాగిన సంభాషణలో అవ్యక్తత లేకపోలేదు కాని, ఆప్యాయతకు లోటులేదు. కారణం మరేమీ కాదు:

"ఎలాగైనా నువ్వు మాకు ఏక రక్త బంధువుడివి
నీతో కాకపోతే ఎవరితో మా ఘోషలు చెప్పుకోవాలి?"

అని సూటిగా అడుగుతాడు. ఏకరక్త బంధువనే పద ప్రయోగంలో ఒక అవగాహన ఉంది. చంద్రగోళం భూమి నుంచి విడివడిన శకలమేననీ, కాల్రకమేణా విశ్వ పరిభ్రమణంలో గోళాకృతి పొందిందనీ ఆధునిక శాస్త్రం వివరిస్తోంది. ఈ స్ఫురణతోనేకావచ్చు అనూచానంగా, మనదేశంలోనూ భూమి సంతానమైన మనకు చంద్రుడు మేనమామ వంటివాడన్న అవగాహన స్థిరపడివుంది.

శశికి వీడ్కోలందిస్తూ - "వినిర్మలమైన నీ వెన్నెల కురిపిస్తూ మనోహరమైన సంగీతం వినిపిస్తూ" అనే రెండు పద చిత్రాలు ప్రయోగించాడు. అందులో మొదటిది చంద్రుని సహజ లక్షణానికి సంబంధించినదే. కాని మనోహర సంగీతం శ్రవణేంద్రియానుభవం. మౌనంగా తన చల్లని కిరణాలు కురిపించడం ద్వారా నేత్రానందాన్ని కలిగిస్తూనే పరావర్తానుభవంగా వెన్నెల మౌనసంగీతాలు వినిపిస్తూందని కవిభావం.

ఇన్ని విజయాలు సాధించిన ఆధునిక లోకంలో ఇంకా ఎందరో అభాగ్యులున్నారు. వాళ్ళందరినీ చల్లగా పలకరించమని, గుండెలు నిమిరి ధైర్యం చెప్పమనీ కవి - చంద్రుడ్ని కోరుతాడు. అనేక బాధలనుభవిస్తున్నవారూ ఉన్నారు. "ఆసుపత్రి కిటికీలోంచి కిరణాలు జాలుగా పంపించి వ్యాధిగ్రస్తుల పాలిపోయిన కపోలాలను జాలిగా స్పృశించడం మరచిపోకు!" అన్న కవి సందేశం ఒక్కసారి పాఠక హృదయాన్ని అనుకంపతో ముంచెత్తుతుంది. వెన్నెలలో ఆసుపత్రి చిత్రాన్నంతా మనోనేత్రం ముందు నిలుపుతుంది. అలాగే ఎందరో దురదృష్టవంతులు చెరసాలలలో మ్రగ్గుతున్నారు. చేసినవో చేయనివో నేరాలతో కృశిస్తున్నారు. వారిని అలక్ష్యం చేయడం మానుషధర్మం కాదని చంద్రునికుపదేశిస్తాడు కవి. మురికి గుడిసెల్లో బ్రతుకుతున్న పరమ దరిద్రుల నుదుటిపై నిమిరి పరామర్శించడానికి, ఏ చూరుకంతలోంచో ప్రవేశించమని ఆదేశిస్తాడు. సాగనంపుతూ చంద్రుడికి ఒక హామీ కూడా అందచేస్తాడు. జాబిల్లి సముద్రంపైనో, అరణ్యంపైనో సూతకం చేసేటప్పుడు గాలి దాన్ని చెరపివేయకుండా కాలం తప్పకుండా కాపలాకాస్తుందని. నిజమేమరి, ఆధునిక కాలం సహస్రబాహువేకాదు, సహస్రాక్షిన్నీ! కనకనే జాగరూకతతో అన్నిటినీ కాపలాకాస్తుంది.

అలతి అలతి పదాలతో, సామాన్య సంభాషణా స్థాయిని మించని శైలీ విన్యాసంతో అతి విస్తారమైన భావనా లోకాన్ని తెరుస్తాడు శ్రీశ్రీ; ఏభయిలలో రచించబడిన తెలుగు కవితా లోకంలోనే శరచ్చంద్రిక విశిష్టమైనదనడంలో సందేహం ఉండనక్కరలేదు.

# పునీతులు!

చిమ్మ చీకట్లలోనూ
చిమ చిమా
కాంతి రవల్ని
ఎగజల్లుతూ
ధన్యులవుతుంటారు
కవులు,
స్త్రీలు!
వాళ్ళు
అమావాస్య దీపావళులు!

# రావిశాస్త్రీయం!

జీవితం
ప్లాటుఫారం మీదికి
సకాలంలో రాదు
"అదృష్టాల" రైలుబండి!
అది "శాస్త్రీయం" కాదు
"కృష్ణ శాస్త్రీయం"
"లేటుగా" వస్తూంటుంది!
ఒకొక్కపుడు
"రావి శాస్త్రీయం" గూడ!
అసలు రానే రాదు !!

శ్రీ కె. కిశోరుబాబు
శ్రీ కె. అశోకుబాబు

**డా॥ బి. ఆర్. కె. రావు**

# ద్రవ్యోల్బణము

[ గత సంచిక తరువాయి )

## ద్రవ్యవిధానము

దేశంలోని కేంద్రబ్యాంకు ద్రవ్య విషయంగా ప్రధాన ద్రవ్య బ్యాంకింగ్ అధికారసంస్థగా వుంటుంది. ఈ సంస్థ విధానము ద్రవ్య విధానమని పిలుపబడుతోంది. 1) బ్యాంకు రేటు 2) ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ 3) రిజర్వు రేషియో 4) సెలక్టివ్ కంట్రోల్ అనే పద్ధతుల ననుసరించి వాణిజ్య బ్యాంకుల పరపతి సృష్టి కార్యక్రమాలను అదుపుచేసి, దేశంలోని బ్యాంకు డిపాజిట్లను పరిమితం చేయడ్వానికి కేంద్రబ్యాంకు (భారత దేశంలో రిజర్వు బ్యాంకు) పూనుకుంటుంది. ఈ విధానాన్ని "టయిట్‌మని" ద్రవ్య బిగింపు విధానమని అంటారు. బ్యాంకులిచ్చే పరపతి విస్తృతం కావడంవల్లనే వస్తుసేవలకు డిమాండ్ పెరిగి, ధరలు పెరుగుతున్నాయనే ప్రమేయంతో ద్రవ్యోల్బణాన్ని నియంత్రణ చేయడానికి ద్రవ్యవిధానం పూనుకుంటుంది. ఈ ప్రమేయం నిజమైనమేరకు ద్రవ్యవిధానం జయప్రదమౌతుంది. అలాకాకుండా యుద్ధనిర్వహణకు అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణానికి కరెన్సీనోట్లను అదనంగా ముద్రించడంవల్ల ద్రవ్యోల్బణం యేర్పడినట్లయితే కేంద్రబ్యాంకు ద్రవ్యవిధానంవల్ల బహు తక్కువ ప్రయోజనంమాత్రమే కలుగవచ్చు.

## కోశవిధానము

1) పన్నుల విధింపు 2) ప్రభుత్వ ఆర్థికాది ఖర్చులు 3) ప్రభుత్వం అప్పు తీసుకోవడంగాగల విషయాలలో ప్రభుత్వమనుసరించే విధానము కోశ విధాన మనబడుతోంది. ఈ కోశ విధానానికి వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలమీద మంచి ప్రభావం ఉంటోంది.

ప్రజలు తమ ఖర్చులకు ఉపయోగించుకోవడానికి తమ చేతుల్లో ఎంత రాశిలో ద్రవ్యాన్ని ఉంచుకోవడానికి వీలౌతుందో పన్నుల విధింపు తేలుస్తుంది. ద్రవ్యోల్బణము వున్నప్పుడు పన్నుల తగ్గింపును తప్పించడము, కొత్త పన్నుల్ని విధించడము, అమలులో వున్న పన్నుల రేట్లను హెచ్చించడము తగిన పన్నుల విధానంగా పరిగణిస్తున్నారు. ప్రజల చేతుల్లో వుండే ద్రవ్యాన్ని తగ్గించి, వారి కొనుగోలు శక్తిని తగ్గించి, వారి డిమాండ్‌ను తగ్గించి, ధరల పెరుగుదలను తగ్గించడానికే అలా చేస్తారు. ఐచ్ఛిక లేక నిర్బంధ పొదుపులను ప్రోత్సహించడంవల్ల కూడా ఖచ్చితంగా యివే ఫలితాలు సమకూరగలవు. పొదుపు వస్తువులకు ప్రస్తుతమున్న డిమాండ్‌ను తగ్గిస్తుంది. తద్వారా ధరల ద్రవ్యోల్బణ పెరుగుదలనుతగ్గిస్తుంది.

ద్రవ్యోల్బణ నిరోధచర్యగా ప్రభుత్వ ఖర్చుల్ని తగ్గించాలి. ఇందువల్ల వస్తుసేవలకు డిమాండ్ యింకా తగ్గుతుంది. పన్నులవిధింపు ద్వారా ప్రభుత్వరాబడిని పెంచి, ప్రభుత్వ ఖర్చుల్ని తగ్గించడము మిగులు బడ్జెటింగ్ అనబడుతుంది. ఈ విధానంలో ఒక ముఖ్యమైన కష్టమున్నది. ద్రవ్యోల్బణస్థితిలో ప్రజలవద్ద హెచ్చుగా ద్రవ్యమున్నపుడు పన్నుల విధింపు ద్వారా ప్రభుత్వ రాబడిని హెచ్చించడము తేలికేనావచ్చు. కాని ప్రభుత్వ ఖర్చుల్ని తగ్గించడము కష్టమే. యుద్ధం జరిగేటప్పుడు, నేడు ఇండియాలోవలె అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం జరుగుచున్నప్పుడు, ప్రణాళికాయుతంగా జరిగే వ్యయాన్ని తగ్గించడము పూర్తిగా అసంభవము. ప్రభుత్వం ఒకటి లేక యింకా హెచ్చు ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకున్నప్పుడు, వాటిని మధ్యలో ఆపివేయడం ఆర్థిక వినాశనానికి పూనుకోవడమౌతుంది. అందువల్ల ప్రభుత్వ ఖర్చుల తగ్గింపును ద్రవ్యోల్బణ నిరోధ చర్యగా అమలు జరుపడానికి వీలుకాదు

ప్రభుత్వం చేసే ఋణానికి సంబంధించిన చర్యలను క్రమబద్ధం చేసి దేశంలో ద్రవ్య సరఫరాను తగ్గించవచ్చు. ద్రవ్యోల్బణ కాలంలో, గతంలో తాను చేసిన ఋణాలను తిరిగి చెల్లించడాన్ని ఆపడం ద్వారా ప్రభుత్వము దేశంలో చెలామణి ప్రవాహంలోకి వచ్చే ద్రవ్యాన్ని తగ్గించవచ్చు. ప్రభుత్వం మిగులు బడ్జెట్‌ను ఏర్పర్చగల్గితే, దాన్ని ఉపయోగించి కేంద్ర బ్యాంకు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఋణాన్ని తీర్చేసుకోవచ్చు. తద్వారా ప్రజల నుండి, వాణిజ్య బ్యాంకుల నుండి తీసుకున్న ద్రవ్యము ఉపయోగించబడనందున, ఆ ద్రవ్యము చెలామణి ప్రవాహములో ఉండదుగనుక, ఇది ద్రవ్యోల్బణ నిరోధచర్య అవుతుంది. అయితే అసంభవం కాకపోయినా బహు కష్టతరమైన బడ్జెట్ మిగులును సాధించడం ఎలాగన్నదే సమస్య అవుతుంది.

## ధరల నియంత్రణ, రేషనింగు

ద్రవ్యోల్బణ వ్యతిరేక చర్యగా వివిధ దేశాల్లో అమలు జరుపుతున్న ధరల నియంత్రణ, రేషనింగ్ చర్యలకు మంచి ప్రాముఖ్యత వున్నది. యుద్ధ కాలంతో దాదాపు ద్రవ్య, కోశ చర్యలు నిరుపయోగం కాబట్టి, రేషనింగ్, ధరల నియంత్రణ విధానం యుద్ధ కాలంలో ముఖ్యమైనట్టి, సమర్థవంతమైనట్టి ద్రవ్యోల్బణ వ్యతిరేక చర్య అని చెప్పవచ్చు. ఫలానా వస్తువుల ధరలు శాసనరీత్యా ఫలానా పైపరిమితికి మించరాదని చెప్పే చర్య ధరల నియంత్రణ చర్య అవుతుంది సంపద, సాంఘిక స్థాయిల ప్రమేయం లేకుండా కొరత సరఫరాలో నున్న వస్తువుల్ని న్యాయమైన రీతిలో పంపిణీ చేయడము రేషనింగ్ ఆశయమౌతుంది. ధరల నియంత్రణ, రేషనింగ్ ఏకోన్ముఖంగా ఒకే సారి అమలు చేయబడతాయి. అయితే యీ చర్యలు వినియోగదార్ల స్వేచ్ఛను అరికట్టి, వారి శ్రేయస్సుకు భంగం కలిగిస్తాయనే ముఖ్య అభ్యంతరంలో యీ పద్ధతుల అమలుకు ఆటంకం తలుపబడుతోంది. అంతేగాక యీ చర్యల విజయం పరిపాలనా సామర్థ్యంపైన ఆధారపడుతుంది కాబట్టి, ఆ సమర్థత అల్పాభివృద్ధి దేశాల్లో హెచ్చుగా వున్నది కాబట్టి యీ రేషనింగ్, ధరల నియంత్రణ పద్ధతులు జయప్రదం కాగలవా అనే అనుమానం కన్పర్చ బడుతున్నది.

## ఇతర పద్ధతులు

వస్తువుల్ని హెచ్చుగా ఉత్పత్తి చేసిగాని, హెచ్చుగా దిగుమతి చేసుకునిగాని సప్లయి చేయడము మరొక ద్రవ్యోల్బణ వ్యతిరేక చర్య. కొన్ని వస్తువులు తగినంత హెచ్చుగా లభ్యమౌతూ, ద్రవ్యోల్బణానికి తక్కువగా గురి అవుతాయి. అటువంటి వస్తువులు ఉత్పత్తికుపయోగించే కారణాలను హెచ్చు ధరలను అణించకుండా, కొరతగా వుండి, హెచ్చుగా ద్రవ్యోల్బణానికి గురి అవుతున్న వస్తువుల ఉత్పత్తి రంగానికి మరల్చి కొరత వస్తువుల ఉత్పత్తిని పెంచి హెచ్చుగా సరఫరా చేయడము మరొక ద్రవ్యోల్బణ వ్యతిరేక చర్య అవుతుంది. ద్రవ్యోల్బణానికి గురి అవుతున్న వస్తువుల్ని హెచ్చుగా దిగుమతి చేసుకుని దేశంలో అంతర్గతంగా వున్న వస్తు కొరతనుండి ప్రజల్ని విముక్తి చెయ్యవచ్చు.

ద్రవ్యఖర్చుల పెరుగుదలవల్లవచ్చే ద్రవ్యోల్బణాన్ని నియంత్రణ చెయ్యడం కూడ అవసరమే. వేతనాలను, జీతాలను, లాభాలను తగ్గించి ఆదాయాన్ని పెరగకుండా ఆపితే డిమాండ్ పెరుగుదలను, ద్రవ్యోల్బణ ధరల పెరుగుదలను ఆపవచ్చని చెబుతున్నారు. దీన్నే ఆదాయ స్తంభన (ఫ్రీజ్) మంటారు. వేతన స్తంభనాన్ని వ్యాపార సంస్థలు హర్షించవచ్చు. 1) ట్రేడ్ యూనియన్లు అంగీకరించితే మినహా 2) ధరలను స్తంభింపచేస్తే మినహా వేతన స్తంభనము తేలికగా జరగదు సరికదా, న్యాయంకూడా కాదు. అయితే ఈ స్థితిలో ప్రభుత్వం వస్తువులపై పన్నులను పెంచరాదు. అందువల్ల వేతన, ఆదాయాల స్తంభన ద్వారా ఉత్పత్తి ఖర్చుల పెరుగుదలవల్ల వచ్చే ద్రవ్యోల్బణాన్ని నియంత్రణ చేయడము కష్టము. ఉత్పత్తిని బాగా పెంచి, ధరలను, వేతనాలను తగ్గించడము ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి చాలా మంచి పద్ధతి అని చెప్పబడుతోంది.

## అల్పాభివృద్ధి ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణము

నిరుద్యోగ స్థితి ఏర్పడే వరకు సార్థక డిమాండ్ పెరుగుదల, ధరలస్థాయి పెరుగుదల వెంట ఉత్పత్తి, ఆదాయ, ఔద్యోగితల, పెరుగుదల జరుగుతుంది. అందువల్ల ద్రవ్యోల్బణము నిరుద్యోగ దశ వచ్చిన పిదప ఏర్పడుతుందని అనుకుంటాము. పూర్ణఔద్యోగిత దశ వచ్చి మనుషలంతా ఉద్యోగాలు పొందిన పిదప ఆదాయ, డిమాండ్లు, తద్వారా ధరలు పెరగగానే ఉత్పత్తి, ఔద్యోగితలు పెరగవు. అందువల్ల సిద్ధాంత రీత్యా పూర్ణఔద్యోగిత, ద్రవ్యోల్బణ స్థితి ఒకదాని ప్రక్క మరొకటి ఏకోన్ముఖంగా నడవడాన్ని ఊహించలేము. భారతదేశం వంటి అల్పాభివృద్ధి దేశంలో నిరుద్యోగము, ప్రచ్ఛన్న నిరుద్యోగము విస్తృతంగా ఉన్నాయి. పూర్ణఔద్యోగితా దశకు చేరని భారతదేశంలో ద్రవ్యోల్బణం వుంటుందా అని ఈ సందర్భంగా అడగబడుతోంది.

## ఆటంక జనిత ద్రవ్యోల్బణము

పూర్ణఔద్యోగిత రాకపూర్వమే ద్రవ్యోల్బణ స్థితి ఏర్పడే సంభావ్యాన్ని కీన్సు ఊహించగల్గాడు. వస్తుసేవల సరఫరా వ్యాకోచానికి ఆటంకాలు వున్నట్లయితే అభివృద్ధి చెందిన దేశాల్లోకూడా పూర్ణఔద్యోగిత రాకముందే ద్రవ్యోల్బణస్థితి ఏర్పడవచ్చని కీన్సు ఊహించాడు. పూర్ణఔద్యోగిత దశ రాకపోవచ్చు. అయినా ఉత్పత్తిని పెంచే అవకాశం లేకపోవచ్చు. క్షీణ ప్రతిఫల స్థితి అమలు జరగడం వల్ల, కారకాలు ఒకే రకంగా లేనందువల్ల సప్లయిలో అసంపూర్ణ వ్యాకోచమేర్పడటానికి తోడ్పడే ఆటంకాలు ఏర్పడతాయి, దేశంలో అనువర్తితం కాని వనరులు వుండవచ్చు. అయినా ఉత్పత్తిని పెంచే అవకాశం లేకపోవచ్చు. ఈ ఆటంకాలన్నింటిని అవరోధాలని అంటున్నారు వస్తు సరఫరాలో అసంపూర్ణ వ్యాకోచమున్నందువల్ల, వేరళి ద్రవ్య డిమాండు ద్రవ్య సరఫరాతోపాటు పెరిగినా, ద్రవ్య డిమాండు పెరిగిన అనుపాతంలో వస్తుసప్లయి పెరగదు. డిమాండ్ పెరుగుతున్నపుడు, సప్లయిని పెరగకుండా అడ్డుపడే ఆటంకాలు అవరోధాలని బాటిల్ నెక్స్ అని అన

బడుతున్నవి. అందువల్ల ఉత్పత్తి ఖర్చులు పెరిగి, ధరలస్థాయి పెరుగుతోంది. అభివృద్ధి చెందిన దేశాలతోపాటు అన్ని దేశాల్లోను కన్పించే యీ బాటిల్ నెక్స్‌తో పాటు ప్రత్యేకరూపంలో వున్న మరి కొన్ని బాటిల్‌నెక్స్ వున్నవి. ఈ ప్రత్యేక బాటిల్‌నెక్స్, అల్పాభివృద్ధి దేశాల్లో సేవారంగానికి జరిగే పస్తుసప్లయిలో సాపేక్షిక సరళ రాహిత్యతను లేక కఠినత్వాన్ని ఏర్పరుస్తున్నవి.

## ప్రత్యేక బాటిల్ నెక్స్

ప్రత్యేక బాటిల్ నెక్స్‌లోని కొన్నిటిని యిక్కడ చూద్దాము.

1) అల్పాభివృద్ధి దేశాల మార్కెట్లలో చాలా లోపాలున్నవి. ఉ : ఉత్పత్తిదారులకు, వినియోగదార్లకు మార్కెట్లను గురించి సరిగ్గా తెలియదు. ఉత్పత్తి కారకాలకు సరియైన తరలతలేదు. ఉత్పత్తి కారకాల విభజన సరిగా జరగలేదు. ప్రత్యేకీకరణ తగినట్లు జరగలేదు. ఇందువల్ల వనరులు అభీష్టతమ రీతిలో ఉపయోగించ బడుటలేదు. అందుచేత అల్పాభివృద్ధి దేశాల వస్తు సప్లయి వ్యాకోచము అసంపూర్ణంగా ఉన్నది.

2) అల్పాభివృద్ధి ఆర్థిక వ్యవస్థల్లో సాంకేతిక శ్రామికులు, మూలధనము, సాధన సామగ్రి, రవాణా వ్యవస్థ, విద్యుచ్ఛక్తి సౌకర్యాలు, మొదలైనవి కొరతకు లోనై వున్నాయి. ఈ అవరోధాల వల్ల అల్పాభివృద్ధి ఆర్థిక వ్యవస్థలు త్వరగా పెరగలేక పోతున్నవి.

3) అల్పాభివృద్ధిదేశాల్లో నిరుద్యోగ, ప్రచ్ఛన్న నిరుద్యోగాలు విస్తారంగావున్నవి. అభివృద్ధిచెందిన దేశంలో నిరుద్యోగ మున్నట్లయితే, డిమాండు వున్నట్లయితే ఉత్పత్తిని పెంచటానికి వీలుంటుంది. కాని ఇండియావంటి అల్పాభివృద్ధి దేశంలో పెద్దయెత్తున ప్రచ్ఛన్న, బహిరంగ నిరుద్యోగాలున్నప్పుడు ఉత్పత్తిని పెంచటం సాధ్యంకాదు. సార్థకడిమాండ్ పెరుగుదలను, ప్రచ్ఛన్న నిరుద్యోగస్థితి తీర్చలేదని ప్రముఖ అర్థశాస్త్రవేత్త డాక్టర్ వి.కె.ఆర్.వి. రావు వ్రాసారు.

4) సాధారణంగా అల్పాభివృద్ధి దేశాల్లో వినియోగ ప్రవృత్తి ఎక్కువగా ఉంటుంది. ఇందువల్ల వస్తుసేవల సప్లయిని పెంచడానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని వి.కె.ఆర్ వి. రావు వ్రాసారు. ఉదాహరణకు వ్యవసాయంనుండి లభ్యమయ్యే ఆహారాన్ని రైతులు యింటివద్దనే వినియోగిస్తున్నారేగాని, మార్కెట్‌కు రానివ్వడంలేదు.

5) అల్పాభివృద్ధిదేశాలు ప్రాథమిక ఉత్పత్తులలో అధిక భాగాన్నిఎగుమతిచేయడము ఒక ప్రత్యేక లక్షణము. ఆ ఎగుమతుల మేరకు దేశీయ వినియోగానికి అందే సప్లయి తగ్గుతుంది. ఎగుమతుల వల్లవచ్చిన ఆదాయాలను దిగుమతి అయిన వస్తువులను కొనడానికికాక, స్వదేశవస్తువులను కొనడానికి ఉపయోగించినపుడు ద్రవ్యోల్బణ సమస్యమరింత కష్టతర మౌతుంది.

6) రెండవ ప్రపంచయుద్ధం ముగిసినప్పటినుండి, చాలా అభివృద్ధిదేశాలు, తమ ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను వేగంగా నిర్వహించడానికి బ్యాంకులనుండి చాల ఎక్కువగా ఋణాలు తీసుకోవడమే గాక లోటు బడ్జెట్ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇలా లభ్యమైన ద్రవ్యంలో అధికభాగం సాంఘిక ఆర్థిక అవస్థాపనలో భాగాలైన విద్య, రవాణా, విద్యుచ్ఛక్తి రంగాలమీద, ఇనుము, ఉక్కు మొదలైన ప్రాతిపదిక పరిశ్రమలమీదను, పెట్టుబడి వస్తువులను తయారుచేసే భారీపరిశ్రమల మీదను పెట్టుబడి చేస్తున్నారు. ఇందువల్ల వినియోగ వస్తూత్పత్తి పెరుగుదలకు స్వల్పకాలీన వ్యవధిలో సహాయం జరగలేదు. కాని ప్రజల చేతుల్లోకి ద్రవ్యం ఎక్కువగావచ్చి వారినుండి వినియోగ వస్తువులకు సార్థక డిమాండ్ పెరిగింది.

అందువల్ల పూర్ణ ఔద్యోగిత రాకపోయినా, అల్పాభివృద్ధి దేశాల్లో ద్రవ్యోల్బణం వత్తిడి పెరిగింది. అల్పాభివృద్ధి ఆర్థిక వ్యవస్థల్లో వున్న ప్రత్యేక సమస్యలవల్ల సాంకేతిక పరిజ్ఞాన లోపము, మూలధన సంబంధమైన సాధన సామగ్రి కొరత మొదలైన అవరోధాల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. ప్రత్యేక బాటిల్ నెక్స్ స్థితిని దృష్టిలో వుంచుకుంటే, అల్పాభివృద్ధి దేశాల్లోకూడా ద్రవ్యోల్బణం వుంటుందని చెప్పవచ్చు.

## భారతదేశంలో ద్రవ్యోల్బణం-నివారణ

భారతదేశాన్ని పట్టి బాధిస్తున్న దుష్టశక్తుల్లో ద్రవ్యోల్బణం ఒకటి. అధిక ద్రవ్యంవల్ల ధనికులు దుర్మార్గాలవెంట నడుస్తుంటే, ధరలు పెరగడంవల్ల బీదలువినియోగానికి అవసరమైన మేరకు దైనందికావసరాలను కొనుగోలు చేసుకోలేక బాధపడుతూ దుర్భరదారిద్ర్యంలో వాస్తవ రూపాన ఒకరకమైన నరకాన్నే అనుభవిస్తున్నారని చెప్పవలసి వుంటుంది. ద్రవ్యాన్నయినా తగ్గించాలి,ధరలనైనా అరికట్టాలి, ఉత్పత్తినైనా పెంచాలి. రేషనింగ్‌పెట్టి, కంట్రోలు ధరలకు బీదలకు, ముఖ్యంగా మధ్యతరగతుల ప్రజలకు దైనందికావసరాలన్నింటిని తగిన మేరకు అందించాలి. లేనియెడల చాలాఅవాంఛనీయమైన దుష్ట ఆర్థిక రాజకీయాది ఫలితాలు సంభవించి దేశం పాడైపోతుంది.

**కారణాలు**

ద్వితీయ ప్రపంచ యుద్ధకాలంలోనూ, చైనా, పాకిస్తాన్‌లు మనపై దండయాత్ర చేసినపుడు మనం యుద్ధ నిర్వహణలో దిగవలసి రావడంవలన చాలా ద్రవ్యం అనుత్పాదకంగా ఖర్చయ్యి ధరలు పెరిగినవి. ఆ దుష్ట ఫలితం యీ నాటికి కూడా పెరుగుతూనే ఉన్నది. దేశ విభజనకు అంగీకరించడము, చైనాలో మన ప్రజాస్వామిక సోషలిస్టు వ్యవస్థకు పోటీగా పనిచేసే నియంతృత్వ కమ్యూనిస్టు వ్యవస్థ అధికారంలోకి రావడమువల్ల మనం ఫాసిస్టు పాకిస్తాన్ నుండి, నియంతృత్వ చైనా నుండి మనదేశ సరిహద్దుల్ని, స్వాతంత్ర్యాన్ని రక్షించుకోవడానికి రక్షణ చర్యలపైన హెచ్చుగా ఖర్చుచేయవలసి వస్తోంది. దాంతో చాలా ద్రవ్యం చెలామణి ప్రవాహంలోకి వచ్చేసింది. ఇదంతా ప్రజల దైనిక వినియోగం దృష్ట్యా అనుత్పాదకం కావడం వల్ల ధరలు బాగా పెరిగినవి.

భారతదేశం చాలా విశాలమైనది. అనేక రాష్ట్రాలు, జిల్లాలు యిందులో వున్నవి. దేశంలో వివిధ రకాల వాతావరణాలు, శీతోష్ణ స్థితులు ఉన్నవి ఒకచోట అధిక వర్షాలవల్ల వరదలొచ్చి బాధిస్తూ వుంటే, మరోచోట పండించడానికే గాక త్రాగటానికి కూడా నీరులేదు. ఈ విధంగా పంటలకు చెప్పరాని దెబ్బతగుల్తోంది. ఉప్పెనలవల్లకూడా పంటలు దెబ్బతిని, వ్యవసాయకోత్పత్తులే గాక ఆహారపు అందుబాటు కూడా బాగా దెబ్బతిన్నది. అందువల్ల ఆహారపు ధరలే గాక, వ్యవసాయోత్పత్తుల ధరలుకూడా బాగా పెరిగినవి. ముడి పదార్థాలు, ఆహారము యితర ఆర్థిక రంగాలైన పారిశ్రామిక, వ్యాపారాది రంగాలకు కావాలికదా? వీటిని అధిక ధరలను కొనుగోలు చేస్తున్న రంగాలలో ఉత్పత్తి ఖర్చులు పెరిగినవి అందువలన ఆ రంగాలు ఉత్పత్తిచేసే వస్తువులకు, అవి అందించే సేవలకు ధరలు పెరిగినవి.

పెట్రోలు ఆడ నూనెల ధరలు పెరిగినవి. రవాణా సౌకర్యాలు తక్కువగా ఉన్నవి. అందువల్ల రవాణా ఖర్చులు, తద్వారా ధరలు పెరిగినవి

విద్యుచ్ఛక్తి ఉత్పత్తి ఖర్చులు, దాని యూనిట్ ధర పెరిగి దాన్ని ఉపయోగించే రంగాలలో ప్రత్యక్షంగాను, ఆ రంగాలు ఉత్పత్తి చేసే వస్తువులపై ఆధారపడే యితర రంగాలలో అప్రత్యక్షంగాను ధరలు పెరిగినవి. అదే విధంగా రసాయనిక ఎరువుల ధరలు ఆహార ధాన్యాల ధరలు, వివిధ రంగాల వేతనాలు పెరిగి, పరస్పర ప్రభావం వల్ల ఒకదాని పెరుగుదలకు మరొకటి తోడ్పడినవి.

పారిశ్రామిక స్వాములు, వ్యాపారులు పేరాశతో కూడిన లాభార్జనకు పూనుకుని చెప్పరాని రీతుల్లో ధరలను పెంచి ప్రజల్ని బాధలకు గురిచేస్తున్నారు.

స్వాతంత్ర్య సాధనానంతరం మనం ప్రణాళికా యుక్తాభివృద్ధికి పూనుకున్నాము అనేక ప్రాజెక్టుల నిర్మాణానికి విస్తార రాసుల్లో ద్రవ్యాన్ని ఖర్చు చేస్తున్నాము. ఇందులో కొన్నిటి ఫలనకాలం అధికంగాగా, మరికొన్నిటి నిర్మాణం పూర్తికావడానికి అనేక ఆటంకాలు ఏర్పడినవి. ఈలోగా ఉత్పత్తిరాక, ధన సరఫరా పెరిగి ధరలు పెరుగుతున్నవి.

ప్రణాళికేతర వ్యయంకూడా దేశం భరించలేనంతగా పెరిగి, పెరిగిన ధన సరఫరావల్ల, అనుత్పాదక కార్యక్రమాల వ్యయంవల్ల ధరలు బాగా పెరిగినవి.

దేశంలో విదేశ ప్రచారాలవల్లకూడా ద్రవ్యం పెరిగింది. విదేశ శక్తులు యిస్తున్న ద్రవ్యంకూడా బాగా పెరిగింది. వీరు మన రాజకీయ పార్టీలను వశపర్చుకోవడానికి ద్రవ్యం యిస్తున్నట్లు పార్టీలు పరస్పరా రోపణ చేసుకుంటున్నవి. ఎలక్షన్ల సమయంలో విదేశ ద్రవ్యంతోపాటు స్వదేశధనంకూడా అతి విస్తారంగా ఖర్చుచేయబడి, ధన సరఫరా పెరిగి, దాని విలువ తరిగి, ధరలు పెరుగుతున్నవి.

అసలే ఉత్పాదకత, ఉత్పత్తి తక్కువగావున్న భారతదేశంలో వ్యాపారులు వస్తువుల్ని చీకటి బజారుకు పంపి ధరలను బాగా పెంచి వేసారు. వీరి వద్ద ఎలక్షన్ ఫండ్ కొరకు డబ్బు తీసుకుంటున్న రాజకీయ పార్టీలు, అధికార పార్టీలుగా వున్నప్పటికి ధరలను అదుపులో పెట్టడంలేదు.

మనది అల్పాభివృద్ధి దేశం. వస్తూత్పత్తి తక్కువగా ఉన్నది. పేదరికం హెచ్చుగాగా, వినియోగం తక్కువ. అందువల్ల వినియోగ ప్రవృత్తిహెచ్చు. అదనపు ఆదాయం అందినపుడెల్లా ప్రజలు వస్తువులను కొనేందుకు డిమాండ్‌ను పెంచి. ధరల పెరుగుదలకు తోడ్పడుతున్నారు.

మనదేశ ఉద్యోగుల నియామకాలలో పక్షపాతము, అన్యాయము ఉన్నది. అందువల్ల పరిపాలనలో అవినీతి, లంచగొండితనము, అసమర్థత బాగా పాతుకుపోయి వున్నవి. తత్కారణంగా ధరల నియంత్రణ జరగటంలేదు.

దొంగ కరెన్సీ దేశంలో విస్తారంగా ప్రబలి దుర్మార్గులు కొందరు కోటీశ్వరులుగా తయారు అయ్యారు. దీన్నే అర్థశాస్త్రజ్ఞులు

"పేరలల్ ఎకానమి" అంటున్నారు. దీనిపల్ల వ్యయము. ద్రవ్య సరఫరా, అధిక డిమాండు, ధరలుపెరిగి సామాన్య ప్రజలకు కంటక ప్రాయంగా ఉన్నది. ఈ దొంగ కరెన్సీకి రాజకీయ కార్యకర్తల అండదండలు బాగావున్నయ్యనే నమ్మకం ఒకటి ఏర్పడింది. పన్నులు కట్టని నల్లధనం కూడా బాగా ప్రవాహంలో ఉన్నది. ఇందువల్లకూడా, ధరలు పెరుగుతున్నవి. నల్లధనాన్ని ఉపయోగించి గృహ నిర్మాణాలు విలాస ప్రదర్శనలు చేయడంవల్ల చెలామణిలోని ధనం పెరిగి ధరలు హెచ్చినాయి.

ధరలు పెరుగుతున్నందువల్ల శ్రామికులు హెచ్చువేతనాలు, ద్రవ్యవస్తువుల రూపేణా ఇతర సౌకర్యాలు, (కరువు భత్యము,బోనసు, సబ్సిడీ ధరలకు వస్తుసేవలు) కావాలని డిమాండుచేసి పొందుతున్నారు. శ్రామిక సంఘాల నాయకులు తమ రాజకీయ ప్రాబల్యం పెంచు కునేందుకు హెచ్చువేతనాలకు సమ్మెలు చేయించి కొంతవరకు జయం పొందుతున్నారు. అయితే యిందువల్ల ద్రవ్యసరఫరాపెరిగి, ధరలు పెరుగుతున్నవి. పారిశ్రామిక స్వాములు శ్రామికులతో తగాయిదా పడినప్పుడు లాకౌట్లకు పూనుకుంటున్నారు. సమ్మెలు, లాకౌట్లు ఉత్పత్తినితగ్గించి, వస్తుసరఫరాను తగ్గించి ధరలపెరుగుదలకు దోహదం చేస్తున్నవి. సమ్మెలు, లాకౌట్లు జరుగుతుంటే పూనుకుని సమస్యను పరిష్కరించకుండా ప్రభుత్వం మిన్నకుంటోంది. ఆర్థికవ్యవస్థ దేశను పాడైపోయిన తర్వాత తాము ఏంలాభం పొందాలనుకుంటున్నారో అధికార, ప్రతిపక్షాలు, శ్రామికనాయకులు ప్రజలకు సంజాయిషీ యివ్వ వలసిఉన్నది. దేశపరిపాలనలో ఫాసిస్టు వ్యవస్థ (ధనిక నియంతృత్వం- మధ్యతరగతి తప్పుత్రోవ పట్టినందువల్ల యిచ్చే సహకారంతో) నుకోరే ధనికులకు, వారి ఏజెంట్లకు బాగాస్థానం ఏర్పడి వున్నందువల్ల వారు ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలేదు.

సాంఘిక సంక్షేమానికి చేసేఖర్చువల్ల ఉత్పాదకతగాని, ఉత్పత్తిగాని పెరగడంలేదు. కాని ద్రవ్యరాశి పెరిగి, డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నవి.

లోటుబడ్జెట్ పద్ధతి అవలంబించడం వల్ల ధనరాశి పెరిగింది. దాంతో సరితూగగల ఉత్పత్తి మాత్రం పెరగలేదు. అందువల్ల ధరలు పెరిగినాయి.

మూలధన వస్తువులను ఉత్పత్తిచేసే ఫ్యాక్టరీల నిర్మాణానికి పెద్దఎత్తున ఖర్చుజరిగింది. మూలధనవస్తూత్పత్తి మాత్రం ఆలస్యంగా జరిగింది. వాటి నిర్మాణ ప్రారంభానికి, ఉత్పత్తికి మధ్యనున్న దీర్ఘఫలన కాలంలో ధరలు పెరిగినాయి.

వాణిజ్య బ్యాంకుల మీద రిజర్వు బ్యాంకు కంట్రోలు సరిగా అమలు జరగలేదు. అందువల్ల తప్పుమార్గాన అప్పులిచ్చారు. ఈ సమయంలో పెరుగుతున్న ద్రవ్య చెలామణితోపాటు ఉత్పత్తి పెరగ నందున ధరలు పెరిగినవి. బ్యాంకు వడ్డీరేటును తగ్గించడంవల్ల పొదుపులు-బ్యాంకు డిపాజిట్ల రూపంలో - తగ్గి ద్రవ్య ప్రవాహం పెరిగి ధరలు పెరిగినవి.

ఒక విధంగా అభివృద్ధి కార్యక్రమాలు, వాటి నిర్వహణకయ్యే ఖర్చు దేశ ఆర్థిక స్థోమతను మించిపోవడంవల్ల ద్రవ్య ప్రవాహం పెరిగింది. దాంతో ధరలు పెరిగినవి. విదేశాలనుండి, అంతర్జాతీయ సంస్థలనుండి వచ్చే ఋణాలు ద్రవ్య సరఫరాను పెంచుతున్నవే గాని తగిన అనుపాతంలో ఉత్పత్తిని పెంచడంలేదు. కనుక ధరలు పెరుగు తున్నవి.

ప్రభుత్వ, ప్రభుత్వ నిర్దేశిక దుకాణ వ్యవస్థలు దైనందిక వస్తువులను, తగిన రాశిలోను, గుణ విశిష్టతలోను, తగిన ధరకు వస్తువులను ప్రజానీకానికి అందించలేక పోతోంది.

మన దేశంలో మల్టీ నేషనల్ కార్పొరేషన్లు (బహుళ జాతీయ వ్యాపార సంస్థలు) కొన్ని వస్తువులను ఉత్పత్తిచేసి అమ్ముతున్నవి. వాటి వ్యాపారం గుత్త వ్యాపారంగా నడుస్తోంది. ఈ సంస్థలకు రాజకీయ నాయకులమీద, ఉద్యోగులమీద పలుకుబడి ఉన్నది. అందు చేత వారు హెచ్చుధరలకు వారి ఉత్పత్తులను అమ్ముకుంటున్నారు. వీరి వ్యాపార ప్రకటనలలో అతిశయోక్తులుంటున్నవి. ప్రజలు ఆ అతిశయోక్తులకు లోబడి హెచ్చు ధరలకు వారి వస్తువులను కొంటున్నారు.

సంఘటిత కార్మికులు సమ్మెలు మొదలైన చర్యలద్వారా హెచ్చు వేతనాలు పొంది హెచ్చుగా డిమాండ్‌చేసి హెచ్చు ధరలకు కొనుగోలు చేస్తూవుంటే అసంఘటిత శ్రామిక వర్గాలు పెద్ద ధరలకు కొనలేక బాధపడుతున్నవి.

మన బడ్జెట్‌లు, అభివృద్ధి కార్యక్రమాలు ఉత్పత్తి మూలకాలుగా కాక, ఔద్యోగితా మూలకాలుగా వున్నందువల్ల ఉత్పత్తికంటె శ్రామికు లకు అందే వేతనమూలక ద్రవ్యం పెరిగి ధరలు పెరుగుతున్నవి.

## అరికట్టే చర్యలు

భారతదేశ ఆర్థిక రాజకీయ సాంఘిక ప్రయోజనాల సాధనావ సరం దృష్ట్యా అవాంఛనీయ పరిస్థితులు సంభవించకుండా వుండేందుకు ద్రవ్యోల్బణాన్ని అరికట్టే చర్యలను తీసుకోవడము తప్పని సరి.

వీలైనంతవరకు ద్రవ్యోల్బణం రాకుండావుండేటట్లు చెయ్యాలి. వస్తే పెరగకుండా వుండేందుకు తరిగిపోయేందుకు చర్యలు తీసుకోవాలి.

వీలైనంతవరకు ఉత్పాదక ఆర్థిక కార్యక్రమాల నిర్వహణ పైనా, తక్కువ కాలంలోనే ఫలితాలనిచ్చే ఆర్థిక ప్రాజెక్టుల మీద ద్రవ్యాన్ని ఖర్చుచెయ్యాలి. తప్పనిసరి అయిన దీర్ఘకాలీన ఫలన ప్రాజెక్టుల మీదనే ద్రవ్యాన్ని ఖర్చు చెయ్యాలి, అలా అయితే ద్రవ్యోల్బణం రాకుండా వుంటుంది.

ఒకవేళ ద్రవ్యోల్బణం వచ్చి తీవ్రంగా పెరుగుతున్నట్లయితే అవసరమైన పరిపాలనా, రాజకీయ, ఆర్థిక, సాంఘిక చర్యలన్నింటినీ కఠినంగా అమలుజరిపి ద్రవ్యోల్బణాన్ని పెరగకుండా వుండేటట్లు, తరిగిపోయేటట్లు చెయ్యాలి. ద్రవ్యోల్బణాన్ని ఆపడానికి, దాన్ని ఆపి తీరాలనే గాఢ వాంఛ, పట్టుదల, అందుకవసరమైన చర్యలు తీసుకునేందుకు రాజకీయ నిర్ణయము తీసుకోవడము అవసరము. ద్రవ్యోల్బణ వ్యతిరేక చర్యలను జయప్రదం చెయ్యటానికి వివిధ వర్గాల ప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి, శ్రామిక వర్గాల ప్రజలు, రాజకీయ ప్రతిపక్షాలు ప్రభుత్వంతో పూర్తిగా సహకరించాలి.

ఎన్నికలలో విజయం పొందడానికి ధనికుల నల్లధనాన్ని, దొంగ కరెన్సీని, వ్యాపారస్తుల చీకటి బజారు లాభాలను రాజకీయ పక్షాలు ఉపయోగించరాదు. స్మగ్లర్లను, చీకటి బజారును, వస్తువులను దాచే వారిని, నిర్ణీత ధరలకంటె హెచ్చుధరలకు వస్తువుల్ని అమ్మేవారిని గట్టిగా శిక్షించి వారి వ్యాపారాన్ని ఆపివెయ్యాలి. ప్రజలు అవసరమైన దానికంటె హెచ్చుగా కొనరాదు. విదేశాలనుండి ధనాన్నిపొంది, ఆ దేశాల ఏజెంట్లుగా పనిచేసేవారి వ్యయాలను ఆపివెయ్యాలి.

లాకౌట్లను, సమ్మెలను ప్రభుత్వము, శ్రామికులు, ఉత్పత్తిదారులు, ప్రజలు కలిసి పరిష్కరించాలి. ప్రభుత్వం గట్టిచర్యల ద్వారా వాటిని ఆపి, ఉత్పత్తికి, వస్తు సప్లయికి అంతరాయం లేకుండా చెయ్యాలి. రాజకీయ పార్టీలు, శ్రామిక సంఘాలు, వ్యాపార, ఉత్పత్తిదారుల సంఘాలు పాక్షిక రాజకీయ వర్గప్రయోజనాలను వదిలిపెట్టి జాతీయ ఆర్థిక ప్రయోజన దృష్టితో పనిచెయ్యాలి. అధిక వేతనాలను, లాభాలను ఆపాలి. రాజకీయకార్యకర్తల లంచగొండితనాన్ని అరికట్టాలి.

దైనందికావసర వస్తువుల పంపిణీలో సంతృప్తిని విజయాన్ని సాధించడానికి ప్రయివేటు, సహకార, ప్రభుత్వ వ్యాపార రంగాలు పోటీపడి పనిచేసి తమ సమర్థతను, నీతినిజాయితీలను చూపించాలి.

వడ్డీ వ్యాపారులు, బ్యాంకులు అవసరమైన మేరకు మాత్రము, ఉత్పత్తి కార్యక్రమాలకు మాత్రము అప్పులనివ్వాలిగాని, అనుత్పాదక, విలాస కార్యక్రమాలకు అప్పులనివ్వరాదు. ద్రవ్యప్రవాహాన్ని పెంచరాదు. ద్రవ్యోల్బణాన్ని అపడానికి బ్యాంకు వడ్డీరేటును హెచ్చించడము అవసరము.

వ్యవసాయ రంగానికి కావలసిన రారకాలను, ఎరువులు, నీరు, విద్యుచ్ఛక్తి మొదలైన ఉత్పాదకాలను సరసమైన ధరలకు రైతులకందించి వారి ఉత్పత్తులైన ఆహార ముడిపదార్థాలను ప్రజలకు, ఫ్యాక్టరీ స్వాములకు సరసమైన ధరలకు అందించితే వేతనాలు, లాభాలు, ఉత్పత్తి అయిన వస్తువుల ధరలు పెంచవలసిన అవసరముండదు. ఆ స్థితిలో ద్రవ్యోల్బణము వుండదు.

ధరలు పెరగడాన్ని పరిపాలనా చర్యల ద్వారా ఆపితే, వేతనాలు, ఉత్పత్తి ఖర్చులు పెరగకుండా చూడవచ్చు. తద్వారా ద్రవ్యోల్బణాన్ని తొలగించవచ్చు.

వివిధ ఆర్థికరంగాలను సమర్థవంతులైన మేనేజర్లకు, టెక్నీషియన్లకు, శ్రామికులకు అప్పగించి ఉత్పత్తిని బాగా పెంచాలి. ఉద్యోగులుకూడా పాలనాచర్యలు తీసుకోవడంలో జాప్యం చెయ్యరాదు.

నీటిపారుదల సౌకర్యాలను, విద్యుచ్ఛక్తి సరఫరాను బాగా పెంచాలి. జాతీయ రివర్‌గ్రిడ్, పవర్‌గ్రిడ్‌లను ఏర్పర్చి పంట భూముల నుండి సువర్ణాన్ని పొందాలి. ఫ్యాక్టరీల నుండి వస్తుసంపదను కోకొల్లలుగా అందుకోవాలి. రవాణా కమ్యూనికేషన్ సౌకర్యాలను, మార్కెట్ యార్డ్ సౌకర్యాలను బాగా పెంచాలి.

అధికారులలో అవినీతి, లంచగొండితనము, పక్షపాతము లేకుండా వస్తువులన్నిటిని నిర్ణీత ధరలకు అమ్మేటట్లు చెయ్యాలి. అవినీతి పరుల్ని, లంచగొండులను, పాతకులను తొలగించివెయ్యాలి.

దేశంలో పొదుపు ఉద్యమాన్ని, బ్యాంకు డిపాజిట్లను బాగా పెంచాలి. ప్రజలకు యీ అవసరాన్ని గురించి బాగా తెలియచెప్పి డిపాజిట్ వుద్యమాన్ని జయప్రదంచేసి, ప్రవాహంలో ద్రవ్యాన్ని తగ్గించితే ధరల పెరుగుదలను అరికట్టే వీలుంటుంది.

వ్యవసాయ, పారిశ్రామిక, గనుల రంగాలలోను, యింకా యితర రంగాలలోను ఉత్పత్తిని బాగా పెంచి, రవాణా ఆటంకాలు లేకుండా మార్కెట్లో అందరికి కొనడానికి వీలుకలుగచేస్తే ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి వీలుకలుగుతుంది.

( సమాప్తం )

డా॥ లకంసాని చక్రధరరావు

# తెలుగు భాష పుట్టుక - పెరుగుదల

## ( క్రీ. పూ. 1000 — క్రీ. శ. 574 )

క్రీస్తుపూర్వం 3000 సంవత్సర ప్రాంతంలో మూలద్రావిడ భాష ఒకటి భారతదేశంలో వ్యవహారంలో ఉండేదనీ దానిలో అనాటికే కొన్ని మాండలికాలు ఉండి ఉండవచ్చనీ భాషాశాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. క్రీ. పూ. 1500 సంవత్సర ప్రాంతానికి ఆర్యులు హిందూదేశానికి వచ్చి ఋగ్వేదానికి సన్నిహితమైన సంస్కృత భాషలో మాట్లాడేవారు. తదనంతరం వేయిసంవత్సరాలపాటు ఆర్యద్రావిడ భాషా సంస్కృతులు పరస్పరం మిశితమై ప్రభావితమయ్యాయి. నల నీర మయూర మలయ మీనాది పదాలు ద్రావిడ భాషల నుంచి సంస్కృతంలోకి తీసుకోబడ్డవే. మొహంజొదారో హరప్పాలలోని నాగరకత ద్రావిడ సంబంధి అని అనేక ప్రాచ్యపాశ్చాత్య విపశ్చితుల అభిప్రాయం. అనాటికే ద్రావిడుల కొరకరకమైన లిపి ఉండేదని రష్యా భాషాశాస్త్రవేత్త గురోఫ్ నిరూపించారు.

1. బ్రాహుఈ, మాల్తో, కూడుఖ్ భాషలు ఉత్తర ద్రావిడ భాషలు. తెలుగు, గోండి, కొండ, పెంగో, మండ, కుఇ, కువి, కోలామీ, నాయకీ, పర్జి, గదబలు మధ్యద్రావిడ భాషలు. క్రీ. పూ. 3500 సంవత్సర ప్రాంతంలో మూలద్రావిడ భాష నుంచి మొట్ట మొదట బ్రాహుఈ భాష విడివడి ఉంటుంది. ఈ భాష ప్రస్తుతం పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో వ్యవహరించబడటం కూడా ఈ ఊహను బలపరుస్తోంది. తర్వాత కూడుఖ్, మాల్తోలు క్రీ. పూ. 3000 సంవత్సర ప్రాంతంలో ప్రత్యేక భాషలుగా భారతదేశంలో అవతరించాయి. కుఇ, కువి, కొండ, గోండి భాషలు క్రీ. పూ. 1500 సంవత్సర ప్రాంతంలోనూ ప్రత్యేక భాషలయ్యాయి. తెలుగు క్రీ. పూ. 1000 సంవత్సరాలనాడు పత్యేక భాష అయినట్లుగా శ్రీయుతులు ఎమ్. ఎస్. ఆంద్రొనొవ్, ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగార్లు నిర్ణయించారు. ఇప్పటికి 3000 సంవత్సరాలకు పూర్వమే తెలుగు భాష వెలుగొందింది అనేది నేటి భాషాశాస్త్రజ్ఞులెల్లరు అంగీకరించిన విషయం. తెలుగు సాంస్కృతిక సంబంధాలలో తమిళ కన్నడాది దక్షిణ ద్రావిడ భాషలతో సంబంధం కలిగి ఉన్నా భాషా సంబంధాల విషయంలో మధ్యద్రావిడ భాషలతో మిక్కిలి సాన్నిహిత్యాన్ని కలిగి ఉంది.

2. 3000 సంవత్సరాలకు పూర్వం ఉన్న తెలుగు భాషా స్వరూపాన్ని తెలుసుకోవటానికి లిఖిత పూర్వకాధారాలు ఏమీలేనప్పటికీ ఇతర ద్రావిడ భాషలందలి పదజాలాన్ని తెలుగు మాటలతో పోల్చి చూచి (తులనాత్మక పద్ధతుల ద్వారా) తెలుగు సంస్కృతిని నిరూపించవచ్చు. సుప్రసిద్ధ ద్రావిడ భాషాశాస్త్రవేత్తలయిన ఎమ్. బి. ఎమెనో, థామస్ బరోలు తమ ద్రావిడభాషా వ్యుత్పత్తికోశం ( 1961 )లో 4572 సజాతీయ ద్రావిడభాషా పదాల్నిచ్చారు. తెలుగు మాటలను ఈ నిఘంటువు సాయంతో పరిశీలిస్తే మన పూర్వుల సంస్కృతి సంప్రదాయాల పదాల అసలు అర్థాలు తెలుస్తాయి.

అ. రాజకీయ సంస్థలు :— ఆదిమాంధ్రులకు 'ఱేడు'(రాజు) ఉండేవాడు. అతడు 'నాడు'ను 'ఏలు'తూ వుండేవాడు. వానికి లోబడి ఉన్నవారు 'తెఱ' (కప్పము) లను చెల్లించేవారు. 'కోట'లు 'అగడ్తలు' ఉండేవి. అగడ్తలు నీటితో నింపబడి ఉండేవి. 'ఊర్లు' (గ్రామాలు) 'ప్రోలులు' (సురక్షిత పట్టణాలు) మన పూర్వీకులకు ఉండేవి. వారికి 'పోరు'లతో సంబంధం ఉంది. 'ఓడ'టం 'గెలవ'టం ఉంది. 'తొత్తు'లు ( నౌకర్లు ) యజమానిని కొలిచే ( సేవించే ) వారు. పూర్వకాలంలో 'ప్రెగ్గడ'లు (మంత్రులు) తెలుగువారికి లేరు.

ఆ. సాంఘిక సంస్థలు :— అమ్మ, అయ్య, అప్ప, అక్క, చెల్లియలు, అన్న, తమ్ముడు, అల్లుడు, అత్త, మామ అనే సంబంధాలు పూర్వాంధ్రులకు పరిచితాలు. పెండ్లి చేసుకొనేవారు. మగడు, ఆలు అనే శబ్దాలు క్రమంగా పురుషుణ్నీ, స్త్రీని మాత్రమే కాకుండా భర్తను, భార్యను కూడా సూచిస్తాయి. ఉమ్మడి కుటుంబాలు వీరికి వుండేవని 'కూడు' శబ్దాన్ని బట్టి తెలుస్తోంది. మన పూర్వీకులకు వర్ణ వ్యవస్థలు తెలియవు. వృత్తుల్నిబట్టి తర్వాతి కాలంలో 'మేదఱ, జాలరి' మొదలైన పదాలు ఏర్పడ్డాయి. దేవుణ్ణి దేవతను సూచించే పదాలు పూర్వం లేవు. ప్రాచీనాంధ్రంలోని వేల్చు ( అగ్నిలో ఆహుతి చేయు ) పదం నుంచి 'వేల్పు' పదం అనంతరకాలంలో ఆవిర్భవించింది. 'గుడి'కి మొదట గృహం (గుడిసె) అనే అర్థం ఉంది. కాని దేవాలయం అనే అర్థం లేదు. మూల ద్రావిడంలోని 'కో' శబ్దానికి 'రాజు' అనే అసలు అర్థం.

కో + ఇల్ > కోవిల్ > కోవెల అనే పదానికి తర్వాతి కాలంలో దేవాలయం అనే అర్థం కల్గింది. కల్ల, బొంకు (అసత్యం), దొంగ (చోరుడు) అనే పదాలు పూర్వాంధ్రంలో ఉన్నాయి కాని సత్యాన్ని తెలిపే పదం ఒక్కటి కూడా లేకపోవటం విశేషం.

ఇ. ఆహారపానీయాలు :– కొన్ని పదార్థాల కలయికతో కూడిన వాటిని అంబలి, కూడు మొదలగు వాటిని ప్రాచీనాంధ్రులు సేవించేవారని మనం ఊహించవచ్చు. గంజి, కలి, పెరుగు, చల్ల, వెన్న, కూర, కాయలు వీరికి తెలుసు. వీరు 'కల్లు' తాగేవారు. కాని ధూమపానం చేసేవారు కారు. తేనెను వీరు సంపాదించేవారు. 'అరిసె'లు 'వడ'లు 'దోసె'లు వీరి పిండివంటలు.

ఈ. నాగరికత :– గుడిసెలు, పెంకుటిల్లు, మేడలు, మిద్దెలు వీరు కట్టుకొని నివసించేవారు. తిరగలి, రోలు, రోకలి, చేట, చీపురు, గొడుగు వీరికి ఉండేవి. 'కాల్చు' కోవటం, 'కాచు' కోవటం, 'వండు' కోవటం వీరికి అలవాటు. 'కుండలు', 'గిన్నెలు', 'చెంబులు','గరిటెలు' వీరికి ఉన్నాయి. నేయటం తెలియటమే కాకుండా వీరు కోకలు, రవికెలు, గోచీలు ధరించేవారు. 'అందెలు, మువ్వలు, మురుగులు, కడియాలు' వీరి ఆభరణాలు. ఇనుము, వెండి, పసిడి, చెంబు (రాగి) వీరికి తెలిసిన లోహాలు. ఓడలు, పడవలు ఉపయోగించి సముద్రాన్ని (కడలిని) దాటేవారు. వీరి సంగీత సాధనం 'క్రోవి'.

ఉ. ఆయుధాలు :– 'అంబు'లను 'విల్లు'లను ఉపయోగించి 'వేట'కు వెళ్ళేవారు. "ఈటెలు, గొడ్డళ్ల, కోలలు, గుదియలు" వీరి ఇతరాయుధాలు.

ఊ. వ్యవసాయం :– "ఆవులు, ఎద్దులు, ఎనుములు, గొర్రెలు, ఏటలు, కోళ్లు" వీరి సంపద. కొడవలి వీరు ఉపయోగించేవారు. పొలాలు, చేలు వీరికి ఉన్నాయి. చెరువులలోని, కాలవలలోని, ఏఱుల లోని, కొలకులలోని నీరు నుపయోగించి "ఆళ్ల, ఆరికె, వరి, ఉల్లి, పసుపు, చేమ, గెనుసు, పెసర, కంది, మినుము"లను పండించేవారు.

ఎ. వృక్షాలు, జంతువులు, పిట్టలు :– "నేరేడు, మారేడు, ఉసిరిక, చింత, మామిడి, నెల్లి" మొదలయిన చెట్లు వందలకొలది ఉన్నాయి. "బల్లి, తొండ, పాము, త్రాచు, మొసలి, పంది, పిల్లి, నాయి ( కుక్క), గాడిద, ముంగిస, దోమ, పులి, నక్క, జింక, ఎలుగు" మొదలయిన జంతువులు వీరికి తెలుసు. సింహం గురించి వీరికి తెలియదు. "పిచ్చిక, చిలుక, డేగ, నెమలి" మొదలయిన పిట్టలు వీరికి చిరపరిచితాలు.

ఏ. శరీరభాగాలు :- "కన్ను, కాలు, చేయి, ముక్కు, నోరు, వ్రేలు, గోరు, చెవి" మొదలయిన దృశ్య శరీర భాగాలే కాక "మెదడు, ఉల్లము, నరం, నెత్తురు, కండ మూలుగు" మొదలైన అదృశ్య శరీర భాగాలుకూడా వీరెరుగుదురు.

ఐ. రోగాలు, మందులు :- 'తెగుళ్ళు' వచ్చినప్పుడు 'మందు' (మరుందు) ల్ని ఉపయోగించేవారు. తట్టు, అమ్మ, కాఁక (జ్వరం) అనే జబ్బులు వీరికి వచ్చేవి.

ఒ. 'ఎఱుక' (జ్ఞానం), 'తెలివి' (బుద్ధి) మొదలైన ఆలోచనా ద్యోతకాలైన పదాలు వీరికి ఉన్నాయి. పదాన్ని 'మాట' అని వ్యవహరించేవారు. వ్రాయటం, చదవటం వీరికి తెలుసు. కలిమిలేములు, అమ్మటం, కొనటం, పగ, చెలుములు వీరి సాంఘిక జీవనంలోని కొన్ని విశేషాలు. "పొఱుదు (సూర్యుడు), నెల (చంద్రుడు), చుక్క (నక్షత్రం), మిన్ను (ఆకాశం), నేల (భూమి), ఎండ, వాన, ఏడు (సంవత్సరం), పగలు, రేయి, నిన్న, నేఁడు, రేపు, మాపు, కారు, నల్ల, ఎఱ్ఱ, తెల్ల, పచ్చ, నూఱు" వరకు అంకెలు వీరికి తెలుసు.

3. జిహ్వామూల హనుమూలీయ శ్వాసాల్పప్రాణ స్పర్శం (క) తాలవ్య స్పృష్టోష్మాల్ప ప్రాణశ్వాసం (చ)గా మారటానికి తాలవ్యాచ్చులే కారణం అనటంలో సందేహంలేదు. అందు వల్లనే ఈ మార్పును తాలవ్యీకరణమని భాషాశాస్త్రవేత్తలు వ్యవహరిస్తున్నారు. మూలద్రావిడమందలి పదాది క-కారం తర్వాత తాలవ్యాచ్చులు (ఇ,ఈ,ఎ,ఏ లు) పరంగా ఉంటే ఆంధ్ర తమిళ మలయాళాలలో ఆ క-కారం చ-కారంగా మారుతుంది.

| మూ. ద్రా. | తె. | తమి. | మల. | కన్న |
|---|---|---|---|---|
| కెయ్ | చేయు | చెయ్ | చెఴక్క | కెయ్/గెయ్ |
| కెత్ | చెదరు | చితర్ | చిదఱుక | కెదఱు |
| కిచ్/కిత్ | చిదుము | — | — | కిత్తు |
| కెణ్ | చెనకు | — | — | కెణకు |

తమిళంలో కెటు, కిళి మొదలైన పదాలున్నాయి. ఇవి *చెటు, *చిళి పదాలుగా తమిళంలో మార్పు చెందలేదు. ధ్వని సూత్రాలకు అపవాదాలు లేవుకదా మరి ఇది అపవాదం కాదా? అని ప్రశ్నించవచ్చు. మూలద్రావిడ భాషలో *క-కారం తర్వాతి తాలవ్యాచ్చుకు పరంగా మూర్ధన్యాక్షరం ఉంటే తమిళ మలయాళాలలో *క-కారం చ-కారంగా మారదని భావించవచ్చు.

| మూ. ద్రా | తె. | తమి. | మల. | కన్న. |
|---|---|---|---|---|
| *కెట్- | చెడు | కెటు | కెడుక | కిడు/కెడు |
| *కిళ్ | చిలుక | కిళి | కిళి | గిళి |
| *కెణ్-/*కిణ్- | చెండు | కెణ్డు | — | కిండి |

తమిళ మలయాళాలలో ఈ మార్పుకు బాధకాలుగా కన్పించే చెటి (చెట్టు) మొదలైన శబ్దరూపాలు తెలుగు నుంచి ప్రతిదేయ పదాలుగా భావించవచ్చు.

తెలుగులోని కినియు, కెడయు, కిట్టు, కెరలు మొదలైన పదాలున్నాయి. ఈ పదాలలోని *క-కారం చ-కారంగా మారలేదు. ఇవి అపవాదాలు కావా?

| తె. | కన్న. | తమి. | మల |
|---|---|---|---|
| కిట్టు | కిట్టు/గిట్టు | కిట్టై | కిడయుక |
| కెరలు | కెరళు | కిళర్ | కిళరుక |

తెనుగులోఉన్న కిట్టు, కినియు, కెరలు మొదలగు పదాలు కన్నడం నుంచి ఎరవుగా తీసుకోబడిన పదాలు. కాబట్టి ధ్వని సూత్రాలకు అపవాదాలు లేవు.

క్రిందు, క్రేవ మొదలగు పదాలు తెలుగులో ఉన్నాయి. ప్రాచీన కాలంలో ద్రావిడ భాషల్లో సంయుక్తాది పదాలు లేవని అందరూ అంగీకరించారు. *కిట్-ఇ *కెట్- అవ్ అనే శబ్దాల నుంచి క్రమంగా క్రిందు, క్రేవ శబ్దా లేర్పడ్డాయి. ఈ సందర్భంలో *కిట్, *చిట్‌గా ఎందుకు మారలేదు? ఇది ధ్వని సూత్రానికి అపవాదం కాదా?

తమిళ శిలాశాసనంలో 'చేరమాన్' (క్రీ. పూ. 300) అనే పదం ఉంది. ఈ పదం కేరళ పుత్రసంబంధి. కేరళ పదమే తమిళంలో చేర పదంగా మారింది. ద్రావిడ భాషల్లో తాలవ్యీకరణం క్రీ. పూ. 300 సంవత్సర ప్రాంతానికే జరిగి ఉంటుంది. తాలవ్యీకరణం తెలుగులో ప్రవర్తితం కావటానికి పూర్వమే కొన్ని పదాల్లో వర్ణ వ్యత్యయం జరిగినట్లు భావించవచ్చు. వర్ణ వ్యత్యయం క్రీ. పూ. 300 సంవత్సరానిక్రి పూర్వమే జరిగింది. వర్ణ వ్యత్యయం జరిగిన తర్వాత తాలవ్యీకరణం జరిగి ఉంటుంది. మొదటే తాలవ్యీకరణం జరిగినట్లు భావిస్తే *కిట్ మొదలైన పదాలలో తాలవ్యీకరణం జరగలేదని భావించవలసి వస్తుంది. కాని ఆ విధంగా తలంచటం భావ్యంకాదు. ధ్వని సూత్రాలకు అపవాదాలు లేవుకదా. క్రిందు, క్రేవ మొదలైన పదాలు తాలవ్యీకరణం జరగటానికి ముందే ఏర్పడినట్లు నిశ్చయిస్తే ఈ విరోధం లేకుండా పోతుంది.

| ఎ | ఏ | సి | ఏ | ఇ |
|---|---|---|---|---|
| క- చ- | ఆంధ్ర తమిళ వ్యవహర్తల ప్రాంతం | 300 | క- తర్వాత ఇ,ఈ,ఎ,ఏలలో ఏదో ఒక అచ్చుండాలి. | |

ఈ తాలవ్యీకరణ సూత్రానికి అపవాదాలుగా కనబడేవి నిజంగా అపవాదాలు కావని సూక్ష్మపరిశీలనచేసి చూస్తే వాటికికూడా కొన్ని నియమాలూ, పద్ధతులూ ఉన్నాయని తెలుస్తుంది. ఈ పరిశీలనబట్టి తెలుగుదాక క్రీ. పూ. 300 సంవత్సరానికి పూర్వమే ఉండేదని స్పష్టమౌతుంది.

లిఖితపూర్వకాధారాలు లేకున్నా తులనాత్మక పరిశీలన వల్ల సజాతీయ పదాల పరిశీలనవల్ల వర్ణవ్యత్యయంవల్ల తెలుగుభాష క్రీ.పూ. 1000 సంవత్సరాల నాటికే ఉందనేది స్పష్టం.

4. తెలుగువారి నుద్దేశించి 'ఆంధ్ర, ఆంధ్రపదాలు' క్రీ-పూర్వం నుంచి వ్యవహృతాలయినాయి. విశ్వామిత్రుడు తన యాభై ఏభైమంది పుత్రుల్ని శునశ్శేఫుణ్ణి అన్నగా అంగీకరించని కారణంగా అనార్యులైన ఆంధ్ర, పుండ్ర, శబర, పుళింద, మూతిబాదిదస్యుల్లో కలిసి పోవలసిందిగా శపించినట్లు ఐతరేయ బ్రాహ్మణం (క్రీ. పూ. 600)లో ఒక ఐతిహ్యంఉంది. కారావర స్త్రీకి వైదేహునకుపుట్టి వేటవల్ల జీవించేవారు ఆంధ్రులు అని మనుస్మృతి (10-36)లోఉంది. భరతుడి నాట్యశాస్త్రం (క్రీస్తుశకారంభం)లో పాత్రోచిత భాషను గురించి చర్చిస్తూ ఆంధ్రాది జాతులకు శౌరసేని మొదలైన ప్రాకృతాలను ప్రయోగించరాదని తెలిపాడు. ఆంధ్రులు వ్యవహరించేభాష తెలుగుభాషరాక మరేభాష ఔతుంది. కాబట్టి ఐతరేయ బ్రాహ్మణ కాలంనాటికే ఆంధ్రభాష ఉందనేది స్పష్టం. ఈ అన్నికారణాలవల్ల క్రీ.పూ. 1000 ప్రాంతానికే తెలుగు వెలుగొందిందని నిర్ణయించవచ్చు.

5. శాతవాహనుల పరిపాలనకాలం (క్రీ. పూ. 200, క్రీ. శ. 200)నుంచి రేనాటి చోళులకాలం (క్రీ. శ. 575) వరకు తెలుగుభాష స్వరూప నిరూపణ మొనర్చటానికి ఆకాలంలో వేయబడ్డ సంస్కృత ప్రాకృత శాసనాలే ఆధారాలు. ఆంధ్రరాజులైన శాతవాహనులు ప్రాకృత భాషను రాజ్యవ్యవహార భాషగా ఉపయోగించారు. హాలుడు (క్రీ.శ. 22) సేకరించిన 'సత్తస ఈ' (గాథ సప్తశతి) మహారాష్ట్రీ ప్రాకృతంలో ఉంది. శాతవాహనరాజులు ప్రాకృతాన్ని దైనిక వ్యవహారంలో వాడేవారని సోమదేవసూరి కథాసరిత్సాగరం వల్ల తెలుస్తోంది. వారి శాసనాలుకూడా ప్రాకృతంలోనే వున్నాయి. పల్లవుల విష్ణుకుండినుల పూర్వచాళుక్యుల కాలంలో సంస్కృత భాష ప్రశస్తి ప్రాచుర్యాలను పొందింది. బృహత్కథారచన సందర్భంలో గుణాఢ్యుడు చేసిన శపథం కథాసరిత్సాగరంలో ఈవిధంగా వుంది. శాతవాహన రాజుకు ఆరునెలల్లో సంస్కృత వ్యాకరణం తాను నేర్పగలనని శర్వవర్మ పలకగా అందుకు ప్రతిగా గుణాఢ్యుడు పలికినవిధం-

"షడ్భిర్మాసైస్త్వయా దేవశిక్షిత శ్చేత్తతో మయా సంస్కృతం
ప్రాకృతంతద్వద్దేశ
భాషాచ సర్వథా భాషాత్రయమిదం త్యక్తం యన్మనుష్యేషు
సంభవేత్"

–కథాసరిత్సాగరమ్

అని ప్రతినపూని ఓడిన కారణంగా ఈ గుణాఢ్యుడు పైశాచీ భాషలో బృహత్కథను వ్రాసినట్లుగా ఉంది. గుణాఢ్యుడుద్దేశించిన దేశభాష తెలుగే. హ్యూన్ త్సాంగ్ (క్రీ. శ. 631) కూడ తెలుగు భాషను పరోక్షంగా ఉద్దేశించి వ్యాఖ్యానించాడు.

6. సంస్కృత ప్రాకృత శాసనాలలోని పదాలుకొన్ని తెలుగు భాషా సంబంధులై కన్పిస్తున్నాయి. ఏ భాషలోనైనా ఊళ్ళపేర్లు, మనుషులపేర్లు మార్పు పొందవు కదా. తెలుగు పేర్లను సంస్కృతీకరించ వచ్చునుకదా అనే సందేహం కొందరకు కిలగవచ్చు. కాని ఆ అలవాటు ఆదిలోలేదు. అదీకాక తాము దానమిచ్చిన ఊర్లపేర్లు, వాటిఎల్లలు ఎల్లరకు తెలియాలని ప్రభువుల కుంటుంది కాని గూఢ వస్తుమయ కావ్యంగా వెలుగొందాలనేభావం ఉండదుకదా. ప్రాచీనరాజుల సంస్కృత ప్రాకృత శాసనాలను పరిశీలించి తెలుగుపదాలైన మనుష్య గ్రామ నామాదులను గుర్తించవచ్చు. ఈ మాటలనుబట్టి ఆ నాడు తెలుగు ప్రముఖంగా వ్యవహరించబడేదనటం స్పష్టం.

తెలుగు విభక్తి ప్రత్యయంతో కూడిన సంస్కృత సమ్మశబ్దం 'నాగబు' అమరావతీ స్తూపంలో కన్పించింది. ఈస్తూపం మూడు అంచెలుగా కట్టబడింది. క్రీ. పూ. 200 మొదలుకొని క్రీ. శ. 200 లోపుగా ఈ నిర్మాణం జరిగింది. ఈ కాలానికి చెందింది ఈ మాట ఈ మాటను గురించి మొదట తెలిపినవారు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు. 'నాగబు' లోని 'బు' తెలుగు విభక్తి ప్రత్యయం. ఇది నేటి 'ం, ము'లకు పూర్వరూపం. సంస్కృత ప్రాకృత శాసనాలలోని కొన్ని తెలుగు పదాలను పరిశీలిద్దాం

అత్తివర్మ, గోరంట్ల తామ్రశాసనం (క్రీ. శ. 350) లోని 'అస్తుకక్కర, తానుపాక, తాన్తికొన్త, తెల్లవల్లి' అనే పదాలు, శాలంకాయన పెదనందివర్మ పెదవేగి శాసనం (క్రీ.శ. 390) లోని 'అఱుతొఱు' పదం. విజయదేవవర్మ ఏలూరు తామ్రశాసనం (క్రీ.శ. 5వ శతాబ్ది) లోని 'ఏలూర' అనే ఊరిపేరు, రెండవ సింహవర్మ ఒమ్గోడు శాసనం (క్రీ. శ. 480-500) లోని 'కడాకుదురు' అనేమాట, విష్ణుగోపుని ఉరవపల్లి తామ్రశాసనం (క్రీ. శ. 342-366) లోని 'కణ్డుకూర' పదం శాలంకాయన నందివర్మ పెదవేగి శాసనం (క్రీ. శ. 475) లోని 'కమ్చురాఞ్చెరువే' అనేమాట, అనంతవర్మ శృంగవరపు కోట దానశాసనం (క్రీ.శ. 450) లోని 'కిణ్డెప్ప' అనే వ్యక్తినామం, మాధవవర్మ ఈపూరు తామ్రశాసనం (క్రీ.శ. 495) లోని 'కుడావాడ' గ్రామనామం, నందివర్మ కంతేరు తామ్రశాసనం (క్రీ.శ. 4వ శతాబ్ది) లోని 'కురువాడ' పదం, అత్తివర్మ గోరంట్ల శాసనం (క్రీ. శ. 4వ శతాబ్ది) లోని 'కొట్టిశర్మ' నామం, జయవర్మ కొండముడి తామ్రశాసనం (క్రీ. శ. 270-285) లోని 'కొణ్డముడి' మాట, చందసతి కొడవలి శాసనం (క్రీ. శ. 3వ శతాబ్ది) లోని ఖడవలి (కొడవలి) శబ్దం, విజయస్కందవర్మ ఒంగోడు శాసనం (4వ శతాబ్ది) లోని 'గోలశర్మ' వ్యక్తినామం, విజయస్కంధవర్మ కంతేరు తామ్రశాసనం (క్రీ. శ. 4వ శతాబ్ది) లోని 'చిన్తపురి' గ్రామనామం, శాలంకాయన నందివర్మ పెదవేగిశాసనం (క్రీ. శ. 475) లోని 'చెఞ్చెరువ' అనే ఊరిపేరు, రెండవకుమార విష్ణుని చెందలూరు తామ్రశాసనం (క్రీ. శ. 5వ శతాబ్ది) లోని 'చూయిపాక' గ్రామనామం, విష్ణుగోపుని నెడుంగరాయ దానశాసనం (క్రీ. శ. 5వ శతాబ్ది) లోని 'దొడ్డిస్వామి' నామం మాధవవర్మ ఈపూరు తామ్రశాసనం (క్రీ.శ. 475) లోని 'మంచణ్ణ' అనే వ్యక్తినామం. వీరపురుషదత్తుని నాగార్జున కొండశాసనం (క్రీ.శ.239) లోని 'మహాతలవర' బిరుదవాచకం, శక్తివర్మ రాజోలు తామ్రశాసనం (క్రీ.శ. 537) లోని 'రాకలువ' శబ్దం, విక్రమేంద్రవర్మ చిక్కుళ్ళ తామ్రశాసనం (క్రీ. శ. 537) లోని 'రావిరేవ, రేగొన్టం, చెందుహూర వాసక' గ్రామనామాలు, యువరాజ శివస్కందవర్మ మైదవోలుశాసనం (4వ శతాబ్ది) లోని 'విరపర' అనే ఊరిపేరు, శ్రీపులోమావిమ్యాక దోని శాసనం (క్రీ.శ. 200) లోని 'వేపురకే' (వేపూరు) గ్రామనామం శాసనాల్లో కన్పిస్తున్నాయి.

ఈ పదాల్నిబట్టి ఊళ్ళపేర్ల చివర 'ఊరు, కుదురు, కొన్త,కోడు, చెఱువు, తొఱె, పర, పల్లి, పాక, మంచి, ముడి, మూడిరేవు మొదలైన తెలుగు పదాలు ఉండేవనేది స్పష్టం. ఈ నాటికీ నేటి తెలుగునాటి మాటలే గ్రామనామాంతాల్లో కన్పిస్తున్నాయి. ఈ శాసనాలలోని వేప,రావి,రేగు, తాడి, మొదలైన మాటల్నిబట్టి నాడు నేడు చెట్లను ఒకే విధంగా మనం వ్యవహరిస్తున్నాం. ఆకాలంలోనూ రేవులుండేవి. వాటిని

'తొాజె' అనికూడా వ్యవహరించేవారు. కురు, పెరు, చెన్ను, చిన్న, తెల్ల మొదలైన విశేషణాలు నాడూ ఉన్నాయి. వైరి సమాసాలుగా నేడు భావింప బడేవి నాడూ ఉన్నాయి. 'మహాకొంయూరు, మహా తలవర' మొదలైనవి ఇట్టివి.

హాలుడు (క్రీ.శ. 20-24) సంకలనం చేసిన గాథాసప్తశతి (సత్తసఈ)లో అనేక తెనుగుపదాలున్నాయి. ఈ గ్రంథంలో 'అత్తా' శబ్దం పదకొండు పర్యాయాలు ప్రయోగించబడింది. ఈ పదం తెలుగు మాట. ప్రాకృతంలోని 'పాడి, పొట్ట (పొట్ట), పిల్ల, కరణి (సాదృశ్యం) పంది, కుండ, మోడి (గారడి)' అనేపదాలు తెలుగు పదాలే. ఈపదాలలో కొన్నింటి తెలుగులోని అర్థాలకంటె భిన్నార్థాలు ఉండే ఆ భిన్నార్థాలకు అర్థవిపరిణామమే కారణంకాని వేరొకటి కారణంకాదు. ఈ పదాలకు సంస్కృత సమీప మాతృకలను చూపించటం కూడా కష్టమే. 'ఓ' అనే సంబోధకశబ్దం, 'కై' అనే విభక్తి ప్రత్యయంకూడా 'సత్తసఈ'లో ప్రయోగించ బడ్డాయి, అంటే తెలుగు ప్రభావం ప్రాకృతంమీద ఎంతగా పడిందీ తెలుస్తోంది.

క్రీ. శ. 575వ సంవత్సరానికి పూర్వం ఉన్న తెలుగు భాషా స్వరూపాన్ని సంస్కృత ప్రాకృత శాసనాలను మిగిలిన ద్రావిడ భాషలను ఆధారంగా గ్రహించి పైరీతిని నిరూపించవచ్చు.

## రిఫరెన్సు పుస్తకాలు


1. ఆంద్రొనోవ్, యం.యస్. : ది బ్రాహుఈ లాంగ్వేజి.
2. కృష్ణమూర్తి, భద్రిరాజు : తెలుగు లాంగ్వేజి ఎండ్ కల్చర్ 3000 యియర్స్ ఎగో, సావనీర్, 10త్ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ ఆఫ్ ద్రవిడియన్ లింగ్విస్టిక్స్, జూన్ 1981.

డా॥ కొత్తపల్లి రాధాకృష్ణమూర్తి

# ఆంధ్ర దేశము మధ్యయుగపు చరిత్రలోని భూమి, గ్రామ సరిహద్దు వివాదములు వాని పరిష్కారములు

**ఆం**ధ్ర దేశ చరిత్ర యొక్క మధ్యయుగపు కాలములో పంట భూమి మరియు గ్రామ పొలిమేర వివాదములు పెక్కు సంభవించినవి. సామాన్యముగా నివి వ్యక్తుల మధ్య, గ్రామాల మధ్య ఏర్పడినవి. వీనికి సంబంధించిన విషయములు మన దేశమున లభ్యమగు అనేక తామ్ర శిలా శాసనముల ద్వారా తెలియును. ఇంకను స్మృతిశాస్త్ర, ధర్మశాస్త్ర కర్తల గ్రంథములు, ఆంధ్ర భాషా గ్రంథములు ఈ వివాదములకు శాంతియుత పరిష్కార మార్గములను సూచించినవి. వీనిని పరిశీలించిన ఎడల యీ కాలమునాటి కోర్టు వ్యాజ్య పద్ధతుల కంటె ఆ కాలము నాటి న్యాయ విధానములు సులభముగా అలంతి వ్యయ ప్రయాసలతో కూడి యున్నట్లుగా తెలియును.

ఈ వివాదములకు అనేక రకపు కారణములు గలవు. భూస్వామిత్వమునకు పెక్కు వ్యక్తుల పోటీ, గ్రామము లేక సేద్యపు భూమి యొక్క సరిహద్దుల న్యాయాక్రమణ, పంట కాలువలయొక్క యాజమాన్యమున పోటీ, భూఫల సాయమున క్రమముగా అనుభవించుట మొదలగునవి యీ తగాదాలకు[1] కారణ భూతములైనవి. వీనిని సోదాహరణముగా తెల్పుటకు అనేక శాసనములు మనకుపలభ్యమగుచున్నవి.

అనంతపురం జిల్లా, గుత్తితాలూకాలో నున్న దోనెకల్లులోని క్రీ. శ. 1059-1060 నాటి కన్నడ[2] శాసనము ఇద్దరు బ్రాహ్మణులు బలవంతముగా ముగ్గురి గావుండుల యొక్క ఉంబళి భూమిని ఆక్రమించిరని తెలుపును.

గుంటూరు జిల్లా, తెనాలి తాలూకాలో నున్న దుగ్గిరాలలోని క్రీ. శ. 1214 నాటి తెలుగు శాసనము,[3] దుగ్గిఅలపూండి, ఇవని, దుగ్గమపూండి, మొరమపూండిల మధ్యగల సరిహద్దు వివాదమును వర్ణించును. కాకతీయ గణపతి దేవ చక్రవర్తి (క్రీ.శ. 1199-1262) యీ తగాదాను పరిష్కరించుటకు మల్లపరాజ, రుద్రపరాజ అని పేర్లుగల అధికారుల నంపెను. వీరు దుగ్గిఅల పూండిలోని అశేష మహాజనాల సహాయముతో యీ విషయమును సమగ్ర పరిశీలనముచేసి దుగ్గిఅల పూండి పక్షముననే తీర్పుయిచ్చి దాని సరిహద్దులను నిర్ణయించిరి.

కరీంనగరు జిల్లాకు చెందిన కాకతీయ గణపతిదేవ చక్రవర్తి యొక్క తామ్ర శాసనములు[4] క్రీ.శ. 1246 నాటివి సంస్కృతభాష, నాగరి లిపిలో నున్నవి. పంటకాలువ యాజమాన్యము కొరకు గ్రామాల మధ్య జరిగిన పోటీని యివి వర్ణించును. చామనపల్లి మహాజనాలకు, కుమ్మరికుంట, దేవనపల్లి, కట్యకోలపల్లి గ్రామాల పెద్దలకు గొనుగు కాలువగూర్చి తగాదా వచ్చెను. ప్రభుత్వాధికారి మరియు చామనపల్లి మహాజనాలు ఓరుంగల్లు వెళ్ళి గణపతిదేవ చక్రవర్తికి తమ అభిప్రాయములను విన్నవించిరి. వెంటనే ఆ మహారాజు నారాయణ, మహరూక అని పేర్లుగల యిద్దరు అధికారులను ఆ వివాద పరిష్కారము కొరకు పంపెను. వారిరువురు పైన పేర్కొన్న గ్రామాల పెద్దల యొక్కయు, స్థానిక అధికారుల యొక్కయు సహాయముతో యీ జగడమును పునః పరిశీలించి చామనపల్లి మహాజనాల సాక్ష్యాధారమును విని, చివరకు గొనుగు కాలువ ఆ బ్రహ్మణులదే అని తీర్పు యిచ్చిరి. ఈ విషయములో అనేకమంది చుట్టుపట్ల గ్రామస్థులు ఆ కాలువ బ్రాహ్మణులదే అని సాక్ష్యమును గూడా యిచ్చిరి.

కడప జిల్లాకు చెందిన మరియొక శాసనము క్రీ. శ. 1257 నాటిది పెరుంగండుర అగ్రహారపు[5] బ్రాహ్మణులకు ఇనుంబ్రోలు లోని వెళ్ళళలకు మధ్య జరిగిన సేద్యపు భూమి తగాదాను తెల్పును. ద్విజుల

అగ్రహారపు భూములను వెళ్ళలు కౌలుకు తీసికొనిరి. కొంతకాలము తరువాత ఉభయులు నిర్ణయించుకొనిన ఆరికోరును వారు బ్రాహ్మణులకు చెల్లించుటకు నిరాకరించిరి. అందుచే బ్రాహ్మణులు నెల్లూరు మండలమును పాలించు తెలుగు చోడరాజైన మూడవ మనుమసిద్ధి (క్రీ. శ. 1251-67)కి తమ తగాదాను గూర్చి విన్నవించిరి. అపుడు మనుమసిద్ధి వెళ్ళలను వెడల గొట్టి భూమిని బ్రాహ్మణుల స్వాధీనము చేయించెను.

ఆంధ్ర దేశపు భూమిజులు, భూస్వాములు, భూషష్ఠాష్టకముల కాస్కారము లేకుండ నుండుటకై చక్కని నైతిక సూత్రముల పాటించిరని యీ సందర్భములో నుద్ఘాటింప వలసి యున్నది. ఉదాహరణ కొక మహారాజు అగ్రహారమును బ్రాహ్మణులకు దానము చేయుచు ఈ క్రింది విధముగా శాసించెను :

"అవిక్రయ మనాధేయ మత్రత్యం క్షేత్ర మందిరం,
స్వయం వస ద్భిర్భోక్తవ్యం సదా సన్మార్గవర్తిభిః"

ఈ శ్లోకం అనంతపురం జిల్లాలోని కన్నడ శిలాశాసనాంతమున నున్నది.

ఆ కాలము నాడు చెరువు, కాలువ, జలాశయము, గుంట, బావి మొదలగు వానినుండి వరి భూములకు, తోటలకు వంతుల వారిగా సమముగా వ్యవసాయ దారులు నీటిని పారుదల చేసికొనిరి. ఈ మేరకు వారు ఒడంబడిక లొనర్చుకొనిరి. ఉదాహరణకు చిత్తూరు జిల్లా, చంద్రగిరి తాలూకా లోని తిరుపతిలో గల శ్రీ గోవింద రాజస్వామి దేవాలయము యొక్క బాహ్య ప్రాకారము మీద లిఖించబడిన శాసనము [8] క్రీ.శ. 1260 నాటిది యీ విషయమును ప్రస్తావించును. వంతుల వారిగా మిత పరిమాణమున నీటిని వాడునపుడు కర్షకుల ఒడంబడిక ప్రకారము, పైన పేర్కొన గుడియొక్క నందన వనమునకు తిరుపతిలోని పెంజెఱువు నుండి సమాన పరిమాణములో నీరు పెట్టుకొనవలెనని అది సూచించును.

భూమి, గ్రామ సరిహద్దుల వివాదములలో పాల్గొను కక్షల గూర్చి మనకు శాసనముల అనుశీలనము వలన తెలియును. తఱచుగా కృషీవలులు, తదితర వ్యక్తుల మధ్య యివి చెలరేగెడివి. రెండు దేవాలయపు అధికారుల మధ్యగాని లేక బ్రాహ్మణులు, దేవాలయము మధ్య కూడా యివి జరిగెడివి. ఇంకను ఒక గ్రామము మరియొక గ్రామము మధ్యలేక ఒకే గ్రామము అనేక గ్రామాల మధ్య నుత్పన్నమయ్యేవి. వీటిలో రాజులు, రాజ ప్రతినిధులు, సేనాధికారులే కాకుండా స్థానిక అధికారులు కూడా జోక్యము చేసికొనిరి. ఈ విషయమును పైన వుల్లేఖించిన శాసనములు తెల్పును.

హైందవ న్యాయశాస్త్ర గ్రంథకర్తలు పైతగాదాల పరిష్కారము కొరకు అనేక సూత్రములను, నీతులను ప్రవచించిరి.[10] గ్రామాల మధ్య సరిహద్దు వివాదమును ఒక న్యాయ వ్యవహారాల తీర్పు సంఘము ద్వారా పరిష్కరించుకొనవలయునని, దానిలోని సభ్యులు సమీపించిన గ్రామ వాసులుగా నుండవలయుననియు విజ్ఞానేశ్వరుడు వక్కాణించెను.[11] క్రీ.శ. 13వ శతాబ్దిలో నున్న కేతన కవియు అదే విధముగా యిట్లు నుడివెను. "చుట్టు పట్ల యూళ్ళ గలుగు ప్రజలు సాక్షిగాను."[12]

పై సూచించబడిన సూత్రములను ఆంధ్రదేశపు పరిపాలకులు, ప్రజలు అమలు పరచిరి. మొదట న్యాయ సంఘ సభ్యులు, మధ్యవర్తులు వివాదగ్రస్థమైన ప్రదేశమును పరిశీలించేవారు. తరువాత వ్యక్తులకు, గ్రామాలకు సంబంధించిన లిఖిత పత్రములను, శాసనములను పరీక్షించేవారు. చాల అరుదుగా పరిష్కారము కొరకు వాదులు దివ్య పరీక్షను అవలంబించేవారు.

పైన ఉదహరించబడిన అనంతపురం జిల్లా, గుత్తి తాలూకా లోని దోనెకల్లుకు చెందిన క్రీ. శ. 1059 – 1060 నాటి కన్నడ[13] శాసనము కఠోరమైన దివ్య పరీక్షను అభివర్ణించును. ఆచార్య కె. ఎ. నీలకంఠ శాస్త్రిగారు శాసనార్థమును ఆంగ్లమున[14] చక్కగా నిర్వచించినారు. ఇద్దరు బ్రాహ్మణులచే బలప్రయోగముతో ఆక్రమింపబడిన ఉంబళి భూమిని తమదని నిరూపించుటకు ముగ్గురు గావుండులు ఒక నిర్ణయము తీసికొనిరి. దాని ప్రకారము ముగ్గురిలో నొకడు బ్రాహ్మణుల నెదుట కత్తితో పొడిచికొని ఆత్మహత్య చేసికొనెను. ఆచార్య నీలకంఠ శాస్త్రిగారు యీ సంఘటనమును విజయవంతమైన సత్యాగ్రహమున కిదొక మచ్చు తునకని యిప్పటి పరిభాషలో నుడివిరి.[15] బ్రాహ్మణులు వెంటనే ఉంబళి భూమిని వదలిరి. తరువాత గావుండులు మరణించిన వాని వారసులకు అదనముగా ఒక వాటా యిచ్చి మిగిలినది సమాసముగా పంచుకొనిరి.

గ్రామాల మధ్య సరిహద్దు వివాదమును న్యాయ వ్యవహారాల తీర్పు సంఘము ద్వారా పరిష్కరించుకొనిరని ఋజువు చేయుటకు ఒక ఘనమైన ఉదాహరణ కలదు. శ్రీకాకుళం జిల్లా, అదే తాలూకా లోని శ్రీకూర్మంలోనున్న క్రీ. శ. 1230 నాటి శిలాశాసనము బొంతలకోటి మరియు పొన్నడియ గ్రామాల మధ్య జరిగిన సరిహద్దు తగాదాను[16] వర్ణించును. అర్వాచీన తూర్పు గంగరాజయిన మూడవ అనంగ భీమదేవుడు (క్రీ. శ. 1211-1238) యీ వివాదమును తీర్చుటకు ఒక న్యాయ వ్యవహారాల తీర్పు సంఘమును ఏర్పరచెను. ఈ సంఘమునకు నరసింహ మహాముని అధ్యక్షుడు మరియు నీక్రింది వారు దానిలో సభ్యులుగా నుండిరి.

1. ముఖలింగంలోని మధుకేశ్వరాలయము యొక్క స్థానపతి రామీశ్వర ఆండాలి.
2. సింహపురపు నాయకులు.
3. శ్రీకూర్మం, దాని దగ్గర గ్రామాల నాయకులు.
4. భోగాపురపు దేసి రట్టడ్లు.
5. తాడి తొఅతి మహాజనాలు.

విజ్ఞానేశ్వరుడు వ్రాక్రుచ్చినట్లుగా యీ పై సభ్యులందరు బొంతలకోటి, పొన్నడియలకు సమీచీన గ్రామ కాపురస్తులై[17] నుందురు. తీర్పు సంఘము మొదట నీ రెండు గ్రామాలకు చెందిన పూర్వ శాసనములను పరిశీలించెను. తర్వాత అర్వాచీన తూర్పు గంగ రాజయిన అనియంక భీమ రావుత దేవరకు తమ అభిప్రాయమును విన్నవించిరి. పిదప శ్రీముఖవాచకము ప్రకారము శ్రీపాదములు (నరసింహ మహామునులు), తీర్థపాదదాసులు (బహుశా పై స్వాముల వారి శిష్యులు), తిరుపతి శ్రీవైష్ణవులు, దేశాధికారులు, కళింగమండల నాయకులు వీరంతా కలిసి పొన్నడియ యొక్క పత్రముల పూర్తిగా పరీక్షించిరి. తదుపరి పొన్నడియ పక్షమున వివాదమును పరిష్కరించి, గ్రామపు సరిహద్దుల చక్రపు జాళ్లను నాటించిరి. చివరకు యీ సంఘము పొన్నడియ నివాసులకు పూంటాకు నొసంగెను.

ఇంతవరకు చదివిన విషయములనుబట్టి భూమి, గ్రామ సరిహద్దు వివాదములు మధ్య యుగపు ఆంధ్రదేశములో శాంతియుతముగా పరిష్కరించబడినట్లు తేట తెల్లమగును. ఆంధ్ర ప్రజలు నీతిమంతులై, దైవభీతిపరులై, ఆగమ ధర్మశాస్త్ర ఆజ్ఞానువర్తనులై జీవించుటయే దీనికి కారణములు. రాజుయొక్క మార్గము (న్యాయనిర్ణయము)ను ధిక్కరించిన వారికి సర్వస్వహరణమును, దేశత్యాగమును, వృత్తి హరణమును,[18] పొత్తునకు వెలి అను కఠిన శిక్షలు యివ్వబడుటచే ప్రజలు వినయ విధేయులై సత్యశీలురై మసలిరి. అదియుగాక తగాదాలు రాకుండా నుండుటకు ఆంధ్రులు బహు కట్టుదిట్టమైన చర్యలను అవలంబించిరి. క్రయ శాసనము లేక శ్రావణ పత్రము[19]ను సర్వ వివరములతో లిఖించిరి. ధర్మ శాస్త్రకర్తల ఆజ్ఞాను సారము పొల, గ్రామాలకు ప్రకృతి సిద్ధమైన వస్తు విశేషములను అన్ని దిక్కులలో సరిహద్దులుగా మన పూర్వీకులు స్థిరీకరించుకొనిరి.

> "ధ్వజినిమత్స్యని చైవస్తైదాని భయ వర్జిత
> రాజశాసన నితాచ సీమ పంచ విధస్కృతః"

ఇవి లేని పక్షమున చక్రపు జాళ్లను, రవి చంద్రులు, శివలింగము, నంది వాహనములు చిత్రముల గండరించిన రాతి బండలను సరిహద్దులందు స్థాపించిరి. ఈ సరిహద్దురాళ్ళను పెకలించిన నేరస్థులపై జరిమానావిధించబడినట్లు శ్రీకృష్ణదేవరాయల (క్రీ. శ. 1509-30) కాలమునాటి చిత్తూరు జిల్లాలోని నాగలాపురంలోగల వేదనారాయణస్వామి గుడియొక్క దక్షిణ, పడమర, తూర్పు గోడల మీదగల కన్నడ శిలాశాసనముద్వారా తెలియును.

## మూలగ్రంథములు


1. జర్నల్ ఆఫ్ ఎ. పి. హిస్టరీ కాంగ్రెసు, (6వ సభ) లోని నా యొక్క వ్యాసము, పేజీలు 97 - 103
2. దక్షిణ భారతదేశపు శాసనావళి, 9వ సంపుటము, మొదటి భాగము, నెంబరు 123.
3. పై గ్రంథము, 10వ సంపుటము, నెంబరు 261.
4. ఎ. పి. శాసనావళి - కరీంనగరు జిల్లా డా॥ పి. వి. పి. శాస్త్రి గారిచే సవరించబడినది. పేజీ 146.
5. పై గ్రంథము, పేజీ 147.
6. ఎ. ఆర్. ఇ., 1907-1908, నెంబరు 580, పేజీలు 70-71
7. దక్షిణ భారతదేశపు శాసనావళి, 9వ సంపుటము, మొదటి భాగము, నెంబరు 250, పంక్తులు 59 - 60.
8. తిరుమల తిరుపతి దేవస్థానముల శాసనావళి, 1వ సంపుటము, నెంబరు 90.
9. దక్షిణ భారత దేశపు శాసనావళి, 5వ సంపుటము, నెంబరు 100; పై గ్రంథము, 10వ సంపుటము, నెంబరు 261; డా॥ పి.వి.పి. శాస్త్రిగారిచే సవరించబడిన పై గ్రంథము, పేజి 146.
10. మనుధర్మశాస్త్రము, VIII, 245-246, యాజ్ఞవల్క్యస్మృతి, II 153-161, అర్థశాస్త్రము, 168.
11. యాజ్ఞవల్క్య స్మృతి, II, 149-150.
12. విజ్ఞానేశ్వరీయము, కందుకూరి వీరేశలింగం గారిచే ప్రచురించబడినది, సం. 1895.

13. దక్షిణ భారతదేశపు శాసనావళి, 9వ సంపుటము, నెంబరు 123.

14. ది ఎర్లీ హిస్టరీ ఆఫ్ ది డక్కన్, 6వ పార్టు, పేజీ 421.

15. పై గ్రంథము, పేజీ 421.

16. దక్షిణ భారతదేశపు శాసనావళి, 5వ సంపుటము, నెంబరు 1290.

17. యాజ్ఞవల్క్య స్మృతి, II, 149-150; జర్నల్ ఆఫ్ ఆంధ్రా హిస్టారికల్ రిసెర్చి సొసైటి, 20వ సంపుటము, పార్టులు 1-4, పేజీలు 12-16; డా॥ సి. వి. రామచంద్రరావుగారి గ్రంథము- అడ్మినిస్ట్రేషన్ అండ్ సొసైటి ఇన్ మిడీవల్ ఆంధ్రా, పేజీలు 285 - 287.

18. దక్షిణ భారతదేశపు శాసనావళి, 5వ సంపుటము, నెంబరు1290; డా॥ సి. వి. రామచంద్రరావు గారి పైగ్రంథము, పేజీ 287; డా॥ శ్రీమతి అల్లాడి వైదేహి కృష్ణమూర్తిగారి గ్రంథము - సోషల్ అండ్ ఎకానమిక్ కండిషన్స్ ఇన్ ఈస్టర్న్ డక్కన్, పేజీ 82.

19. నెల్లూరు జిల్లా శాసనావళి, 1వ సంపుటము, గూడూరు 4; దక్షిణ భారతదేశపు శాసనావళి, 6వ సంపుటము, నెంబర్లు 666, 1132.

20. మనుధర్మ శాస్త్రము-VIII, 246-251; ఇండియన్ ఆంటిక్వెరీ, 51వ సంపుటము, పేజీ 18; బృహస్పతి స్మృతి కుటుంబము లోని పెద్దలు, తక్కిన యువకులకు, పిల్లలకు తమభూముల హద్దులగూర్చి చెప్పవలయునని తద్వారా యీ విషయములు ఇతరులకు తెలియునని యు నుడివెను. ఈ విధముగా సరిహద్దుల గూర్చిన పురాతన సమాచారము ప్రజలజ్ఞాపకములో కొన సాగును. విజ్ఞానేశ్వరుని ప్రకారము ఈ సరిహద్దులు రెండు రకములు - కనపడునవి, దాగియున్నవి.

21. దక్షిణ భారత దేశపు శాసనావళి 9వ సంపుటము, రెండవ భాగము, నెంబర్లు 526, 527, ఏ. ఆర్. ఇ. 1904, నెంబర్లు 619, 626.

శ్రీ చింతలపూడి వెంకటేశ్వర్లు

# ఆంధ్ర మహాభారతావతారికా మీమాంస

ఆంధ్ర మహాభారతావతారికను జూడ సహజముగ నొక సందియము వొడమును. అది యవతారికా కర్తృత్వమును గుఱించినది. నన్నయ తానై యీయవతారికను రచించెనా లేక తరువాతి కాలమున మఱొక రెవరేని రచియించిరా?

నన్నయ స్వయముగ రచయించియున్నచోనది ప్రథమ పురుష యందేల యుండవలయును? అట్లు రచియించుటకు కారణమేమి? పూర్వకవి సంప్రదాయమా? లేదే!

నన్నయ విరచిత మహాభారత భాగమునకు కృతిపతి రాజరాజ నరేంద్రుడనునది నిర్వివాదము. మఱి యవతారికయందు కృతి సమర్పణముండి తీరవలయునుకదా! ఎందుచేత నన్నయ్య యట్లు గావింపలేదు? ఈ విషయమున శ్రీయుతులు జొన్నలగడ్డ మృత్యుంజయ రావుగారి యభిప్రాయమిది.

"రాజరాజు నన్నయతో 'మహాభారత బద్ధ నిరూపితార్థ మేర్పడఁ దెనుఁగున రచియింపు మధిక ధీయుక్తిమెయిన్' అని మాత్రమే యనెను. కాని 'రచియించి దానిని నా కంకితమిమ్మ'ని యతఁడు నన్నయను అడిగినట్లు లేదు. రాజరాజు తేలలేదు కాని యతనిలోఁ గృతిపతిత్వాకాంక్షయుండి యుండదా! రాజరాజునకంకితమిచ్చితినని యెచ్చటను నన్నయయుఁ బైకిఁదేలలేదు. కాని కృతిపతికిఁదక్కవలసిన మరియాదలన్నియు నతనికతఁడు గ్రంథమునఁ జెల్లింపనే చెల్లించెను. ఆశ్వాసారంభములందును, నాశ్వాసాంతములందును రాజరాజ ప్రశంసా స్పదములగు పద్యములను రచించియే యుంచెను. కృతి రచనకుఁ గృతి స్వీకారమునకు నడియే మొదలుగదా! స్పష్టముగాఁ గృతి నిమ్మనుటయు, నిచ్చుటయుఁ దరువాతి కాలమున నేర్పడియుండును గాని యా కాలమునఁ గృత్యభ్యర్థనా ప్రదానముల స్వరూపము యిటులే యుండె ననుకొనవలయును."

మృత్యుంజయరావుగారు తమ యనుమానమునకు తగిన సమాధానము దొరుకనందున నట్లు తేల్చివైచిరి గాని యట్లు కాదు. అవతారికయందలి ప్రథమ పురుషకు వారి యనుమానమునకు సంబంధముకలదు.

ఈ ప్రథమ పురుషాప్రయోగము మున్ను సంస్కృత సాహిత్యమున కాని, తరువాతి తెలుఁగు సాహిత్యమునందు కాని కానము. కవిజనాశ్రయమునందు కలదు కాని దాని విషయము వేరు. దాని కర్తృత్వమును గుఱించియు ననేక వివాదములున్నవి. ఆ విషయమును 'వేములవాడ భీమకవి పూర్వాశ్రమములో మల్లియ రేచనా!' అను నా వ్యాసమున విపులముగ చర్చించితిని. ఇరువురును నొకరేయని నా యభిప్రాయము. మల్లియ రేచనకు సమకాలికుఁడైన నన్నెచోడుడు నన్నయ కొకింత పూర్వుడనియును నా యభిప్రాయము. నన్నెచోడు డసలు కుమారసంభవమును వ్రాయలేదనియును, అది మానవల్లి రామకృష్ణకవిగారి కల్పనమనియును ప్రకటించిన డా. కొర్లపాటి శ్రీరామమూర్తిగారి యభిప్రాయముతో నేనేకీభవింపను. వారు చూపిన యుపపత్తులన్నింటను అనుమానప్రమాణమే యెక్కుడగుట యందుకు కారణము. అందువలన కృతి రచనకుఁ గృతి స్వీకారమునకు నడియే మొదలు గదాయను మృత్యుంజయరావుగారి సమాధానము స్వీకార యోగ్యమనిపించుటలేదు.

అవతారికను సూక్ష్మముగ పరిశీలించిన యెడల 'శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ...' అను మంగళ శ్లోకానంతరం 'అని సకల భువన రక్షణ ప్రభువులై యాద్యులైన హరిహర హిరణ్యగర్భ పద్మోమావాణీ పతుల స్తుతియించి తత్ప్రసాద సమాసాదిత నిత్య ప్రవర్ధమాన మహా మహీ రాజ్య విభవుండును......' అని కృతి భర్తయగు రాజరాజ నరేంద్రుని వర్ణనము నడచును. మంగళ శ్లోకమందలి విషయము వచనమున పునరావృతమైనది. అంతియేగాక త్రిమూర్తుల క్రమము మారినది. ఏ ప్రయోజనము నాశించి యట్లు మారియుండును?

ఇటీవలి ఆచార్య పెన్నెత్స వెంకటరాజుగారి పరిశోధనమును బట్టి పై మంగళ శ్లోకమున శ్రీచక్రార్చనము గలదు. చాళుక్యులు శ్రీవిద్యోపాసకులు. అవసరమనుకొనినచో గుప్తముగానున్న ఆ

శ్లోకార్థమును వచనమున స్పష్టము చేయవలయును. కాని యట్లు జరుగ లేదు. తిక్కన గావించిన కృతి నిర్మాణ ప్రస్తావనము జూడుడు. 'శ్రీయన గౌరినాఁబరఁగు......' అను ప్రార్థనా పద్యానంతరము 'అని సకల బ్రహ్మ ప్రార్థనంబు సేసి,..' అనుచు వెంటనే ప్రస్తావనా విషయమునకు సాగును.

అవతారికయందట్లుగాక ప్రారంభమందు నుతింపబడిన హరిహర హిరణ్యగర్భాదులు మరల ముగింపులో హరిహరాజ గజాననాదులందు ప్రార్థింపబడిరి. ఆలోచింప నీ రెండు ప్రార్థనాభాగములకు నడుమనున్న భాగమంతయును ప్రక్షిప్తముగనే తోచుచున్నది. రాజరాజునుగూర్చి యెడనెడ నన్నయ చెప్పిన కొన్ని పద్యములందు పొదగబడి యుండ వచ్చునుగాక.

కాళిదాసు, భవభూతి, మాఘుడు మున్నగు సంస్కృత కవుల కొక యాచారమున్నది. మంగళశ్లోకానంతరమో, లేక తదర్థానంతరమో నేరుగా కథలోనికి వెళ్ళుదురు. కృతి సమర్పణాదు లుండవు. నన్నయ గారి మంగళ శ్లోకమును జూచినపుడట్లే యనిపించును. అతడా యవతారికను వ్రాసియుండలేదేమో? కాని ఆశ్వాసాది, ఆశ్వాసాంత పద్యములను కూడ తెలుగుకవి నన్నెచోడుడు అనుసరింపబడి యుండవచ్చు ననిపించును.

నన్నెచోడుని యందొక విశేషముకలదు. కృతిపతి, కథా నాయకుల యభేదకత్వము వలన ఆస్వాసాద్యంతముల యందలి పద్యములు ప్రత్యేకించి వ్రాయబడినట్లుండవు. ప్రతి ఆశ్వాసమునకును మొదలు తుదలందు కథానాయకుడైన పరమ శివుని ప్రస్తావనము వచ్చును. కథానాయకుడే కృతిపతి. కథానాయకుని వర్ణించు నెపమున కృతిపతిని వర్ణించి ఆశ్వాస సంధి పద్యములనేక విభక్తికముల గావించి ఒక విలక్షణమైన పద్ధతిని యనుసరించెను. సంపాది కన్నదతవులీ విషయమున నీతనికి మార్గదర్శకులై యుండవచ్చును. లేదా మత కలహములందు నశించిన పూర్వాంధ్ర సాహిత్యముననిది సామాన్యము కావచ్చును.

ఏది యెటులున్నను నన్నయ తన గ్రంథములందు ఆశ్వాసాద్యంతములందు కృతిపతిని పొగడి యున్నందున అవతారికను కూడ వ్రాసియే యుండనగును. కాని మనముందున్న యవతారిక మాత్రమతడు వ్రాసినది కాదు. అట్లనుటకు మరికొన్ని యాధారములను పరిశీలింతము.

ఆశ్వాసాద్యంతములందెక్కడను నన్నయ రాజరాజనరేంద్రుని రాజమహేంద్రవర పాలకునిగ పేర్కొనలేదు. ఆది పర్వ ప్రథమాశ్వాసాంతమందు 'నిరవద్యనరేశ్వర' అనియు, ఆది పర్వ పంచమాశ్వాసాంతమందు 'సంవిద్యాయువతి మదన' అనియు, ఆదిపర్వాంతమందు 'నిరవద్యరవిప్రభ' అనియు రాజరాజనరేంద్రుడు వర్ణింపబడెను. ఆదిపర్వ ద్వితీయాశ్వాసాంతమందు మాత్రము 'రాజమహేంద్ర కవీంద్ర సమాజ సురక్ష్మాజ' అని కలదు. కాని రాజరాజనరేంద్రుని 'రాజమహేంద్ర' యని సంబోధించుట కలదు. అట్టి సంబోధనము ఆది పర్వ సప్తమాశ్వాసాంతమందు కననగును. కావున పై వర్ణనమును 'రాజమహేంద్ర! కవీంద్ర సమాజ సురక్ష్మాజ!' అని చదువనగును. అప్పుడు ఆశ్వాసాద్యంతములందెచ్చటను రాజరాజనరేంద్రుడు రాజమహేంద్రవర పాలకుడుగా పేర్కొనబడనటులే. అనగా నన్నయ తన ఆంధ్ర మహాభారతమును రచించు సమయమునకు రాజరాజనరేంద్రుడు రాజమహేంద్రవరమును చేరియుండడు. బహుశః అప్పటికి వేంగీ రాజధాని బెజవాడనుండి నిరవద్యపురము (నిడదవోలు)నకు మారి యుండును. నాటి చరిత్రమంతయు నేటి చరిత్రకారుల యూహా నిర్మితమే గావున రాజరాజనరేంద్రుడు తన రాజధానిని రాజమహేంద్రవరమునకు మార్చుటకు ముందు కొన్ని సంవత్సరములు నిరవద్యపురమున నుండి యుండుననుకొనవచ్చును.

అతడు రాజమహేంద్రవరమును నిర్మించెనని కదా చరిత్రకారుల అంచనా! కాని అది పూర్తిగా అబద్ధమని కొందరు పరిశీలకుల యభిప్రాయము. శ్రీ సారంగు లక్ష్మీనరసింహారావుగారు తమ 'నన్నయ' అను గ్రంథమందు నన్నయ తణుకువాడనియు, నాటి చాళుక్య రాజధానీ నగరము నిరవద్యపురమనియు ధ్రువీకరించిరి. నిరవద్యపుర విషయమున వారిచ్చిన వివరణమును పరిశీలింపుడు.

"రాజనరేంద్రుని రాజధాని యిప్పుడు నిడదవోలు అనియున్న నిరవద్యపురము. ఆతని స్థిర నివాసము అక్కడనే! ఆతనికే గాదు, పూర్వ చాళుక్యులలో మొదటి చాళుక్య భీముని నుండి వచ్చిన వారందరును నిరవద్య పురముననే యుండుచున్నట్లు శాసన నిదర్శనములున్నవి. కానివారికి అధికారిక రాజధాని వేంగియే! అక్కడనే, చిత్రరథ స్వామి సన్నిధినే పూర్వసాంప్రదాయానుసారము వారి పట్టాభిషేకములు జరుగుచుండెను. దక్షిణదేశపు వారైన కులోత్తుంగుని కుమారులు తమ రాజధానిని జననాథపురమునకు మార్చువరకు వేంగియే వారి రాజధాని, నివాసము నిరవద్యపురము. జననాథపురమును నిరవద్య పురము దగ్గిరనే యున్నది."

అందువలన రాజమహేంద్రవరమును నిర్మించిన దెవరో ఖచ్చితముగ చెప్పుటకు వీలులేదు. ఇంతవరకు సరియైన నిర్ణయము జరుగ లేదు. శ్రీ త్రిశేషులు కాశీభట్ల బ్రహ్మయ్యగారు తమ 'నన్నయ్యభట్టారక చరిత్రము' నందు 'తొల్లి యోఢ్రదేశాధీశుఁడగు గౌతమ దేవుండు

గోదావరీ తీరమందుగల భూమినంతను న్నాక్రమించెననియు, అతని పుత్రుండగు మహేంద్రదేవుఁడు రాజమహేంద్రవరమును కట్టించెననియు యీ దేశమున ప్రతీతి కలదు' అని వ్రాసియుండెను. అదియే నిజమైనచో రాజరాజ నరేంద్రునకు ఏడెనిమిది వందల సంవత్సరములకు పూర్వమే రాజమహేంద్రవరము నిర్మింపబడి యుండవలయును. అంతే కాక కనింగ్‌హామ్‌గారు తమ భారత భౌగోళిక చరిత్రయందుదహరించిన 'దంతపురము' రాజమహేంద్రవరమే యని శ్రీ యాతగిరి శ్రీరామ నరసింహారావుగారి యభిప్రాయము. మూడవ గోదావరి వంతెనకు దగ్గరలో గోదావరీ తీరమున కనిపించు పెద్ద దిబ్బను త్రవ్విన యీ విషయము బయటపడునని వారి నమ్మకము. అది బుద్ధుని దంతములను భద్రపరచిన బౌద్ధ స్థూపమని అనుమానము. త్రవ్వకములు జరిగి పై విషయము నిజమని తేలినయెడల రాజమహేంద్రవర చరిత్ర యింకను ఆరేడువందల వత్సరముల వెనుకకు నడచును. కాబట్టి రాజరాజనరేంద్రునకు, రాజమహేంద్రవరమునకు నెట్టి సంబంధమును లేనట్లు స్పష్టమగుచున్నది.

నిరవద్యపురమును కేంద్రముగ చేసికొని తనకు దక్కిన వేంగీ స్సామ్రాజ్యమును పరిపాలించుకొనునాటికి రాజరాజనరేంద్రుని యాస్థానమున సోమేశ్వరుని రాయబారి నారాయణభట్టు ప్రవేశించియుండెను. ఆతడు కావించిన సంధి ఫలితముగ పూర్వ చాళుక్య, పశ్చిమ చాళుక్య, చోళ రాజ్యముల మధ్య యుద్ధములు ముగిసి కొంత శాంతి నెలకొన్నది. అట్టి తరుణమున నన్నయ తణుకులో యజ్ఞము గావించి వైదికధర్మ ప్రబోధనా లక్ష్య లక్షితుడై రాజరాజ నరేంద్రుని కోరికను పురస్కరించుకొని, నారాయణ భట్టును అండనుంచుకొని ఆంధ్ర మహాభారత నిర్మాణమున కుద్యుక్తుడాయెను. కనుకనే నన్నయ రాజరాజనరేంద్రుని నిరవద్య పురాధీశ్వరుడుగనే పేర్కొనెను.

వాస్తవమిట్లుండ నవతారికయందు నన్నయ మహాభారత రచనా కాలమునకు రాజరాజనరేంద్రుడు రాజమహేంద్రవరమును పాలించుచుండిన యట్లు స్పష్టముగా కలదు. 'మనుమార్గుండగు విష్ణువర్ధనుండు అఖిల జలధి వేలా వలయ వలయిత వసుమతీ వనితా విభూషణంబైన వేఁగిదేశంబునకు నాయక రత్నంబునుం బోని రాజమహేంద్ర పురంబునందు మహేంద్ర మహిమతో బరమానందంబున ననవరత మహా మహీరాజ్య సుఖంబు లనుభవించుచుండె'నని యవతారికయందున్న విషయము. అశ్వాసాద్యంత పద్యముల బట్టి మన మూహించిన దానికిది పూర్తి వ్యతిరేకము. ఇందేదియో ఒకటి నన్నయ కృతము కానిదై యుండవలయును. అట్లుకానిది ఆశ్వాసత్రయము కాదుకదా!

దీనిని బట్టి అవతారిక నన్నయ కాలమున గాక ఆ తరువాత యెప్పుడో వ్రాయబడియుండవలయును.

'నానా రుచిరార్థ సూక్తి నిధి నన్నయ భట్టు...' అని తన్ను దాను పొగడుకొనిన నన్నయ తన వంశమును గురించి ప్రస్తావింపక పోవుటయు ఆతడా యవతారికను వ్రాయలేదనియే తెలియజెప్పుచున్నది. అంతియేగాక—

'ఆదరణీయ సార వివిధార్థగతి స్ఫురణంబు గల్గి య
ష్టాదశ పర్వ నిర్వహణ సంభృతమై పెనుపొందియుండ సం
దాదిఁ దొడంగి మూఁడుకృతు లాంధ్ర కవిత్వ విశారదుండు వి
ద్యా దయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయ భట్టు దక్షతన్'

అను తిక్కన సోమయాజి రచనమును బట్టి నన్నయ మూడు పర్వములను పూర్తిచేసియే యుండును. ఏదియో అటుల చెప్పినాడని తీసివేయుట యొక సోమయాజి సత్యశీలతను, అవధానమును శంకించి నట్లే కాగలదు. అతని కాలమునకు పూర్తిగ లభించిన నన్నయ కృత పర్వత్రయ గ్రంథము ముందు వెనుకలు కారణాంతరమున తదనంతర కాలమున కొంత శిథిలములైయుండ వచ్చును. వెనుక భాగమును యెఱ్ఱాప్రెగ్గడ పూరించిన విషయమెల్లరకును విదితమే. అందులకాధారములు స్పష్టములు. కాని ముందు భాగమగు అవతారికా భాగము విషయము అస్పష్టము.

నన్నయ భారత భాగమట్లు శిథిలమగుటకు గల కారణములు కొంత చర్చింపవలసి యున్నది. వెనుక భాగము శిథిల మగుటకు కీటకములు కారణమని కొందరు విమర్శకుల యభిప్రాయము అట్లు కాదనను కాని యెఱ్ఱన పద్యమందలి ధ్వనిని యాధారముగ జేసికొని యూహించిన పై కారణమున కంటె మిన్నయైన కారణ మింకొకటి కలదు. నన్నయ గ్రంథరచన మాగిపోవుటయును, వ్రాసినది శిథిలమగుటకును గల ముఖ్యకారణ మానాటి మతకలహములై యుండవచ్చును.

గుణకర్మలను కాదన్ని వేదలము పుట్టుకను ఆధారము చేసికొన్నందువలన నిర్వీర్యమైన వర్ణ వ్యవస్థ, దానిపై నిర్మింపబడిన వైదిక సంప్రదాయములు ప్రజాదరణమును గోల్పోవు సమయమున బౌద్ధ మావిర్భవించినది. కాలగమనమున చిరిగి యందేర్పడిన తగవుల కారణమున జైనము విజృంభించినది. దక్షిణ భారతమున కది పరాయిది వలె కనిపించుటవలన యిచ్చటి వైదిక సంప్రదాయములకు వ్యతిరేకముగ శాక్తేయము, వీరశైవములను తిరుగుదాటు ధోరణులు తల యెత్తినవి. ఆంధ్రదేశ మప్పుడు పై మతముల సంఘర్షణములకు రంగభూమియైనది. అట్టి సమయమున వైదిక మార్గానుయాయులైన చాళుక్య ప్రభువులు మిగిలిన మతములను అణచ బూనిరి. వైదిక సంప్రదాయ ప్రచారమునకై ఉత్తమ సాహిత్యమును సృష్టింపవలసినదిగ

తమ యాస్థాన కవులగు నన్నయాదులను ప్రోత్సహించిరి. ప్రజలను తమకు వ్యతిరేకముగ తయారుచేయుచున్న యితర మతముల ప్రచారకులను, వారి సాహిత్యమును నాశనము చేయించిరి. ఆనాటి పరిస్థితుల కటువంటి తీవ్ర చర్యలు తప్పనిసరికానోపు. నూతన రాజ్య నిర్మాణము లందును, ఉన్నవాటి నిర్మూలనమునందును మతాధిపతులు ప్రధాన భూమికలను నిర్వహించిన రోజులవి.

చాళుక్య ప్రభువుల పనుపున నన్నయ గావించిన పరమత దమనకాండలో అధికముగ నష్టపోయిన మతము జైనము. అప్పటికే వీరశైవుల నుండి తీవ్ర ప్రతిఘటనము నెదుర్కొనుచున్న జైనము నన్నయాదులచేత పూర్తిగ దెబ్బతిన్నది. సామాన్యుల కొఱకు వారు నిర్మించిన తెలుగు సాహిత్యము తుడిచిపెట్టుకుపోయినది. వైదికాచారములను హేతువాద దృష్టితో విమర్శించిన వీరశైవాదులకు సహితము దాదాపు యిట్టి గతియే పట్టినది. అవి మొదట హేతువాద దృష్టితో బయలుదేరినప్పటికి రానురాను వానియందు మూర్ఖత్వము బలసినందున ప్రజలు కూడ ఆ మతములను ద్వేషించిరి. అందువలన నన్నయాదుల ప్రయత్నములు కొంతవరకు ఫలించినవి. ఇదియంతయు చరిత్ర చీకటి పుటలను తడవిన మనకు లభించు అస్పష్ట సమాచారము. నన్నయ రచనమున కనిపించు బ్రాహ్మణోత్కర్షయే పై విషయములను మనము నమ్మవలసి వచ్చుటకు గల పెద్ద యాధారము.

ఈ బ్రాహ్మణోత్కర్ష విషయమై రేగిన దుమారమునకు శ్రీయుతులు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు సమాధాన మిచ్చుచు 'ఘనుత కీర్తి! బ్రాహ్మణుడు పుట్టినతోడనే పుట్టు నుత్తమ జ్ఞానము' అను అమూలకమైన నన్నయ 'బ్రాహ్మణ ప్రశంసకు అనుశాసనిక పర్వము నుండి ఆధారము చూపి సమర్థించిరి. మారుమూలలనుండి తన యుద్దేశమున కనువగు విషయముల నేరుకొనిన నన్నయ అదే యనుశాసనిక పర్వమునుండి బ్రాహ్మణుని నిజతత్త్వమును వివరించు

'స్వభావః కర్మచ శుభం, యత్ర శూద్రేఽపి తిష్ఠతి।
విశిష్టస్స ద్విజాతేర్వై విజ్ఞేయ ఇతిమే మతిః ॥
నయోనిర్నాఽపి సంస్కారో నశ్రుతం నచసన్తతిః ।
కారణాని ద్విజత్వస్య వృత్తమేవతు కారణమ్॥
సర్వోఽయం బ్రాహ్మణో లోకే, వృత్తేన తు విధీయతే।
వృత్తే స్థితస్తు శూద్రోఽపి బ్రాహ్మణత్వం నియచ్ఛతి॥
బ్రాహ్మః స్వభావః సుశ్రోణి సమః సర్వత్రమే మతిః।
నిర్గుణం నిర్మలం బ్రహ్మ యత్ర తిష్ఠతి స ద్విజః॥

మున్నగు వివరణములను యెందులకు స్పృశింపనట్లు ?

నన్నయ జన్మను ఆధారముగ చేసికొనిన వర్ణ వ్యవస్థను సమర్థించుచు వ్రాసిన కావ్యములు అందుకు వ్యతిరేకించు యితర మతముల వారికి బాధాకరములైనవి. అంతియగాక వారిపైనను, వారి సాహిత్యము పైనను నన్నయ గావించిన దౌర్జన్యకాండ సహింపలేనిదైనది. అప్పటి జైనులయు, వీరశైవులయు ప్రతాపములందరెరిగినవియే కదా! శాపానుగ్రహ సమర్థులను కొందరి చేతిలో నన్నయ భట్టు కాయువు చెల్లియుండుననినను ఆశ్చర్యపడనవసరము లేదు. అంతియేకాదు, వారు జరిపిన ప్రతిక్రియలో నన్నయాదులు నిర్మించిన సాహిత్య మంతయు నశించియుండును. రాజరక్షణ ముండుటవలన ఆంధ్ర మహాభారత భాగమైనను ఒకప్రతి మిగిలినది. అవియైనను పై ఘర్షణముల ఫలితముగ భద్రముగ నుండుటకు వీలులేదు. శత్రువుల చేతగావచ్చును, శత్రువుల నుండి రక్షించు ప్రయత్నమునందు అతిభద్రముగ దాచుటవలన కొన్ని సంవత్సరముల తరబడి కదపకుండ యుంచినందున పురుగుల ప్రభావము కావచ్చును – మొత్తముమీద ఆద్యంతములు దెబ్బతిన్నవి. రాజాదరణము బ్రాహ్మణ పక్షమందుండుటవలన జీర్ణవైదిక ధర్మరక్షా దీక్షితులగు బ్రాహ్మణులు తమ సాహిత్యము కొంత శిథిలమైనను పునర్నిర్మించుకొనగలిగిరి. నష్ట సాహిత్యులగు యితర మతముల వారు కొందఱు కాలగమనమున తెరమరుగైరి. కొలది మంది ప్రజల మధ్య కొంతకాలము జీవించియున్నప్పటికి చరిత్ర వారిని గమనింపలేదు క్రమక్రమాభివృద్ధినందిన బ్రాహ్మణ పక్షపాత ఫలితముగ జీర్ణమైన నన్నయ కృత మహాభారతభాగము పునరుద్ధరింపబడినది, బ్రాహ్మణేతరుల గ్రంథము లణగద్రొక్కబడినవి. నన్నయ ఆదికవియైనాడు. అంతకుముందున్న కవులందరు తెఱమరుగైరి.

చరిత్రమునకందినంతవరకు నన్నయకు ముందున్న కవి నన్నెచోడుడు. కాగా అతడు, అతని గ్రంథము కుమారసంభవము మొన్న మొన్నటి వఱకును వెలుగుచూడలేకపోయిరి. అందుకు కారణము అతడు బ్రాహ్మణేతరుడగుటయే. మల్లియరేచన బ్రాహ్మణావతారమెత్తినందున కొంతవరకు నిలబడగలిగినాడు. పద్మకవి మల్ల, చామకూర వెంకటకవి మున్నగు బ్రాహ్మణేతరు లెంతటి గడ్డు పరిస్థితుల నెదుర్కొనిరో మనకు తెలిసిన విషయమే.

శ్రీశ్రీకి ముందున్నదంతయు ఆంధకారమేనని ఒక మహనీయుడు నుడివినట్లు నన్నయకు పూర్వమసలు తెలుగున సాహిత్యమేలేదని వ్రాకుచ్చు ప్రబుద్ధులు కలరు. కాని విజ్ఞులట్లు భావింపరు. ప్రముఖ భాషా శాస్త్రజ్ఞులు, చరిత్రకారులునైన ఎస్. కె. ఛటర్జీగారు యీ విషయమును ప్రస్తావింపుచు సింధులోయ నాగరికతకు సరిసమానమైన తుంగభద్రలోయ నాగరికతనుకలిగిన తెలుగుజాతి నిన్నమొన్నటి

నన్నయ తెలుగున దేవభాషను మేళవించి కవిత్వము చెప్పవలెను తన స్వంత సాహిత్యమును నిర్మించుకొనలేదనుట హాస్యాస్పదమనిరి. తెలుగు సాహిత్య చరిత్రమును రచించిన జి. వి. సీతాపతిగారు సహితము తెలుగుదేశమున నన్నయకు ముందు జైనులు కొన్ని గ్రంథములు రచించిరనియును, వారితోపాటు వారి గ్రంథములు నాశనము చేయబడినవనియును, వాటి సహాయ సంపత్తులు లేనిదే నన్నయ ఒక్కసారిగా అంతటి మహాకవి కాగలిగెడువాడు కాదనియును వ్రాసియుండిరి. ఎఱ్ఱన తన నృసింహ పురాణమున నన్నయకు ముందున్న సాహిత్యమును సూచన ప్రాయముగ తెలియ జేసెను. నన్నెచోడుడు తనకు ముందుగల సాహిత్యమును మిక్కిలి దక్షతతో విమర్శించియుండెను.

కాబట్టి నన్నయను ఆదికవిని చేయుట, బ్రాహ్మణాధిక్యమును కాపాడుట, జీర్ణభాగమును పూరించుట యను నీమూడు ముఖ్య ప్రయోజనముల నాశించియే భారతావతారిక మార్చబడినదని నా యభిప్రాయము.

ఇంతటి వివాదాస్పదమైన ఆంధ్ర మహాభారతావతారికను మార్చి, లేక కల్పించి వ్రాసిన వారెవరై యుందురనునదికూడ పరిశీలింపవలసిన విషయమే. తద్రచనయకా వర్ణింపనెఱిగినవాడు కనుక యెఱ్ఱన మొదటి ముద్దాయి. అవతారికయందు కాన్పించు నన్నయ శైలి యీ యనుమానమునకు బలము నిచ్చుచున్నది. కాని పూరణమునకు వెనుక నున్న యెఱ్ఱాప్రెగ్గడను గుఱించిన వర్ణనముకూడా ప్రథమ పురుషయందే కలదు. ఇది యొక విధముగ పై విషయమును బలపఱచు చున్నది. నా యుద్దేశమున పూరించిన కవి తన గుఱించి చెప్పుకొనుటకు యిష్టపడక మిన్నకుండ వ్రాయసకాడో, లేక యీ విషయమెఱింగిన తరువాతివారో యెఱ్ఱనను వర్ణించి తద్విషయమును చెప్పియుండవచ్చును. అతడే అవతారిక విషయమునుకూడ కొంత పరిశ్రమించి యుండ వగును. కాని,అవతారిక యందు విష్ణు పరమేశ్వరులను వర్ణించవలసిన యెడల యుపయోగింపబడిన 'హరిహర' శబ్దము తిక్కనను జ్ఞప్తికి తెచ్చుచున్నది. ఏదియేమైనను యీ విషయము యిదమిద్ధమని తేల్చ వీలుగానిది. అందుకు ప్రత్యేక పరిశోధనమవసరము.

ఇక పోగా యెంతటి మహాకవియైనను, అందులో అతడాదికవి యైనచో తన నూతన ప్రయోగముల విషయమున తీవ్ర ప్రతిజ్ఞలు చేయడు. అది వాచాలత్వమగును. కాళిదాసంతటివాడు విజ్ఞులగు పాఠకులు మెచ్చునంతవరకు తన ప్రయోగము సాధువని భావింపనను యభిప్రాయమును వెలిబుచ్చి యున్నాడు. అట్టియెడ ఆంధ్రమహాభారతావతారికను నన్నయ స్వయముగ వ్రాసియుండెనని నమ్మ వచ్చునా! అట్లు నమ్మినచో నందలి నన్నయను గుఱించిన విశేషణములు రాజరాజనరేంద్రునకుపయోగింపబడిన విశేషణములతో కలిసిపోవునే!

కృతి భర్తయెడల యవతారికయందుపయోగింపబడిన విశేషణము లెంతవరకు సమర్థనీయములో రాజరాజనరేంద్రుని చరిత్రము జూడ తెలియుచున్నది. అఖిల జలధి వేలావలయ వలయిత వసుమతీ వనితా విభూషణంబా వేంగీదేశము! నిజ భుజ విక్రమ విజితారాతి రాజ నివహుండా రాజరాజనరేంద్రుడు! నానా రుచిరార్థ సూక్తి నిధి యనునదియు నిట్టిదేనా? నిత్య సత్య వచనుడిట్టి యబద్ధములను వర్ణింప గలడా?

కాబట్టి మంగళ శ్లోకము, మరికొన్ని నన్నయభట్టు యభిప్రాయములు వ్యక్తములగు కొన్ని పద్యములు మినహాయించి మిగిలిన యవతారికయంతయును నన్నయకు తరువాయి వ్రాయసగాండ్రో, లేక మరెవరో వ్రాసియుండవలయును. ఇంకను యీ విషయమై విజ్ఞులగు విమర్శకులు నన్నయమీద తమకున్న భక్తిని కొంత ప్రక్కకునెట్టి చారిత్రక, హేతువాద దృష్టులతో పరామర్శింతురుగాక!

## చూచిన గ్రంథములు

1. వ్యాసభారతము-నన్నయ పరిష్కారము.
—డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

2. నన్నయ —శ్రీ సారంగు లక్ష్మినరసింహారావు

3. నన్నయ భట్టారక చరిత్రము —శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్య

4. నన్నెచోడుని కుమారసంభవము ప్రాచీన కావ్యమా
—డా॥ కోర్లపాటి శ్రీరామమూర్తి

5. హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్ —శ్రీ జి. వి సీతాపతి

6. ద్వితీయ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక.

శ్రీ పుప్పాల మనోహర్ రావు

# వరంగల్ మురికివాడల నివాసులు ఒక పరిశీలన

వరంగల్ పట్టణము కాకతీయుల కాలమునుండి ప్రసిద్ధిగాంచినది. ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణాలో ద్వితీయ పట్టణముగా ఇది పేరు పొందిన ఒక జిల్లా కేంద్రము. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు మరియు పారిశ్రామిక సంస్థలు కల్గి అధిక ప్రజానీకముతో రద్దీ కల్గి ఉంటుంది. 55.98 కి.మీ. వైశాల్యము కల్గినపట్టణము. క్రమేపి జనాభా అభివృద్ధి చెందడము వల్ల పట్టణ పరిమితిని 60 కి.మీ. పురపాలక సంఘమువారు పెంచడము జరిగింది. కాజీపేట, వరంగల్, హన్మకొండ మరియు ఇతర ప్రదేశాలు మొదలుకొని, పట్టణ పరిధిలో నివసిస్తున్న వారి ప్రజల సంఖ్య 3.3 లక్షలకు పైన కల్గిఉన్నది.

రైల్వే జంక్షన్‌గా ప్రసిద్ధిచెందిన కాజీపేట, విద్యాసంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు నిలయమైన హన్మకొండ మరియు వ్యవసాయ మార్కెట్టు, సినిమా పరిశ్రమలు, బట్టలమిల్లు, రైసు మిల్లులు, ఇతర పరిశ్రమలతో కూడుకొన్న వరంగల్ పట్టణము. ఈ మూడు పట్టణాల కలయిక వరంగల్ పట్టణముగా పరిగణింపనైనది. ఇక్కడ నివసిస్తున్న 3.3 లక్షలపైన కల్గిన జనాభాలో ఇతర గ్రామీణ ప్రాంతాలు మరియు పట్టణ, ఇతర ప్రాంతాలనుండి ప్రజలు ఈ పట్టణానికి జీవనోపాధి కొరకు వచ్చిన వారి సంఖ్యకూడ కన్పిస్తుంది. ఉద్యోగ వేటలో పరిశ్రమలలో పనిచేయుటకు, ఇతర కూలీలు మరియు చిన్నచిన్న పనులుచేసి జీవించేవారు, రిక్షా పని, బండితోలుకొనుట, ఇండ్లు కట్టువారు, చెప్పులు కుట్టేవారు మొదలగు వారు ఈ పట్టణ మురికివాడలో నివసించుచు అనేక సమస్యలకు గురిఅవుచున్నారు.

ఆరోగ్యము, విద్య, మరియు తిండి, ఇల్లు, వస్త్రములు లేకుండ నిరాశ చెందిన జీవితము గడుపుచున్నారు. మన సమస్యల పరిష్కారం చేయాలంటే భగవంతుడే మనకు దిక్కు అనుకొంటు దేవుణ్ని ప్రార్థిస్తున్నారు.

పట్టణ పరిధిలో నివసించుచున్న మురికివాడల నివాసులలో ఎనిమిది మురికివాడలను పరిశోధన ప్రాంతాలుగా తీసుకొని వారి యొక్క సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను పరిశీలించనైనది. కాజీపేటకు చెందిన సోమిడిప్రాంతము, హన్మకొండకు చెందిన మచిలీ బజారు, వరంగల్‌కు చెందిన పుప్పాలగుట్ట, శివనగర్, కరీంబాద్, కాశీబుగ్గ, మండిబజార్, తూర్పుకోట వరంగల్ మరియు అండర్‌బ్రిడ్జి రోడ్డు ప్రాంతాలను పరిశోధనా ప్రాంతాలుగా తీసుకోవడము జరిగింది. ఒక్కొక్క మురికివాడలో 20 కుటుంబాలను, ఇందులో వరంగల్ తూర్పుకోట, అండర్‌బ్రిడ్జి, మచిలీబజార్ ప్రాంతాలలో (25) కుటుంబాల చొప్పున కలుపుకొని మొత్తం ఎనిమిది మురికి వాడలలోని 175 నివాసులను, వారి పరిస్థితులను పరిశీలించడం జరిగింది

అభివృద్ధి చెందుతున్న దేశాలలో గ్రామీణ అభివృద్ధియే కాక పట్టణ ప్రాంతాలలోని మురికి వాడలను నిర్మూలించి సౌకర్యాలు కల్పించడము కూడ దేశాభివృద్ధి పరిగణలో భాగముగా తీసుకోవడము ప్రభుత్వ లక్ష్యముగా పెట్టుకొని అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడము జరుగుతున్నది. అయినప్పటికీ, జనాభా అభివృద్ధితో పాటు సమస్యలు పెరిగి, అనేకమంది గ్రామీణ ప్రాంతాలలోనేకాక, పట్టణ ప్రాంతాలలో కూడ మురికి వాడలలో నివసించుచు పేదరికముగా బ్రతుకుచున్నారు. వీరి స్థితిగతులను పరిశీలించినచో దేశాభివృద్ధిదృష్ట్యా మురికివాడల నివాసుల సమస్యలను నిర్మూలించ వలసిన అవసరము ఎంతైనాఉంది.

వీరు నివసిస్తున్న ప్రాంతాలు పరిశీలించినట్లు అయితే-ముఖ్యంగా రెండువిషయాలు కన్పిస్తాయి. ఒకటి వీరు నివసిస్తున్న వీధులు ఎత్తు పల్లాలు కల్గిన స్థలాలు. రెండు : వీధులు దుర్వాసనలో కూడుకొని ఉంటాయి. మరియు వీరి గృహాల ఇంటికప్పులు రకరకాల వస్తువులతో కప్పబడి ఉంటాయి. ఒక ఇంటికప్పుపైన కొంతభాగము గడ్డితో, మిగతా భాగము గోనెసంచులు, పెంకులు, కిరోసిన్ డబ్బా రేకులు, అరకు సంచులు మొదలగు వాటితో కప్పబడినప్పటికి, వర్షము వచ్చినపుడు చిన్నచిన్న రంధ్రాలనుండి నీళ్ళుకారడము, ఎండా, చలి రావడము ఏర్పడి జీవించడానికి దుర్భరముగా ఉంటుంది. గోడలు పొట్టిగా వుండి, ఒకవైపు కూలిపోయి, మరొకవైపు కూలిపోయే పరిస్థితిలో వీరిగృహాలు

శిథిలావస్థలో కన్పిస్తు పొడవైన మనుష్యులు లోనికి స్వేచ్ఛగా వెళ్ళలేని పరిస్థితిలో కన్పించగలవు. మురికి కాలువలు, రోడ్లు, విద్యుత్, వైద్య విద్యాసదుపాయాలు మచ్చుకైనా కానరావు. దుర్వాసన కల్గిన వీధులలో నివసించుతూ, గాలి, నీరు స్వచ్ఛమైనది దొరకకుండా అనేకసమస్యలు ఎదుర్కొంటూ ఒక రోజు - ఒక యుగముగా జీవితము గడుపుతు ఉంటారు. పిల్లలు, పెద్దలు, స్త్రీలు అర్ధనగ్నముగా, దుమ్ము, ధూళిపట్టి పేలిన ముఖాలతో, మండే కడుపులతో కన్పిస్తారు. ఇలాటి పరిస్థితుల్లో నివసిస్తున్న నివాసులను మురికివాడల నివాసులుగా గుర్తించడము జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లో 1387 మురికివాడలలో 19 లక్షల 98 వేల మంది నివసిస్తున్నారు. 1974-75 నుండి 1981-82 వరకు 464 మురికి వాడలలోని 8 లక్షల 4 వేల జనాభాను కల్గిన మురికివాడలను మాత్రమే మెరుగు పరచడము జరిగింది. ఇంకా పదకొండున్నర లక్షల మంది ఉంటున్న 923 మురికివాడలు ఉన్నాయి. మెరుగు పరచవలసిన మురికివాడల సంఖ్య అధికముగా ఉందని (1981) పురపాలక సంఘాల సర్వేలో వెళ్ళడైనది- రాష్ట్ర ప్రభుత్వము మురికి వాడలను మెరుగు పరచుటకు గత సంవత్సరములో (1982) 3 కోట్ల 30 లక్షల రూపాయిలు ఉండగా 4 కోట్ల 72 లక్షలకు పెంచాలని నిర్ణయించడము జరిగింది. మురికి వాడలను మెరుగు పరచుటలో పెరుగుతున్న ధరల దృష్ట్యా ప్రభుత్వము కేటాయించిన డబ్బు సరిపోవడము లేనందున, కార్యక్రమాలు మధ్యలోనే నిలిపివేయడము జరుగుతుంది. మురికివాడల అభివృద్ధితో పాటు, ధరల పెరుగుదలను కూడ దృష్టియందు ఉంచు కొని కార్యక్రమాలకు సరిపోవునంత డబ్బు సమయానుకూలంగా ఆ ధన సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వము అందజేయవలెను-

వరంగల్ పురపాలక సంఘ పరిధిలో మొత్తము (24) మురికివాడలను గుర్తించడం జరిగింది. ఇవేకాక అనేక మురికి వాడలు క్రొత్తగా తయారవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలు కరువు ప్రాంతాలుగా ఏర్పడి, సమస్యలను తట్టుకోలేక పట్టణప్రాంతాలకు బ్రతకడానికి రావడము జరుగుతుంది. దీనివల్ల క్రొత్తగా ప్రతి సంవత్స రానికి మురికివాడలు ఇంకా అభివృద్ధి చెందుతూనే ఉన్నాయి. కావున పట్టణ ప్రాంతాలలో సమస్యలు పెరిగి ప్రజలు ఇబ్బందులపాలు అవుతున్నారు.

వరంగల్ పట్టణములో పరిశోధించిన ఎనిమిది మురికివాడల నివాసులు అనేక సమస్యలతో బ్రతుకుచున్నారు. ఒక్కొక్క ప్రాంతములోని అక్కడి ప్రజలను, ప్రాంతాలను, వారి సమస్యలను పరిశీలించి వ్రాయబడినది.

పుప్పాలగుట్ట, కరీమాబాద్-కాశిబుగ్గ, మండిబజార్, మచిలీ బజార్, కాజీపేటలోని సోమిడి ప్రాంతము, వరంగల్‌లో తూర్పుకోట, అండర్ బ్రిడ్జి ప్రాంతాలలోని నివసిస్తున్న మురికివాడలలోని 175 నివాసులను పరిశీలించి అక్కడి ప్రజలు ఎదుర్కొనే సమస్యలు, సాధారణ లక్షణాలను వివరించనైనది.

సాధారణము అయిన మురికివాడ నివాసుల లక్షణాలు అనేకము కన్పించినవి. అందులో కొన్ని లక్షణాలను తెలుపనైనది. వీరి ప్రాంతాలు ఎక్కువగా రాళ్ళు, ఎత్తు పల్లాలు కల్గిన స్థలాలు, దుర్వాసనతో కూడిన మురికినీటి గుంటలు, సర్కారితుమ్మలు అనే పేరు కల్గిన ముళ్ళ చెట్లు కల్గి, దగ్గరకు వెళ్ళేవరకు నివాస గృహాలు కన్పించవు - కన్పించిన గృహాలు (గుడిసెలు) తలుపులు, కిటికీలు లేనటువంటివి. లోపలిభాగము చీకటిని కల్గి ఉన్నాయి. గోడలు ఒక ప్రక్క కూలిపోవడమువల్ల గోనెసంచులు సాటుగా కట్టుకున్నారు- గృహాలు, అక్కడి వ్యక్తులు దుమ్ము, ధూళితో కన్పిస్తారు. గృహాలు శిథిలావస్థలో ఉన్నవి- ఇండ్లకు పైన కప్పబడిన భాగము గడ్డితో పెంకులతో కాక కొంత భాగము గోనెసంచులు, వరకు సంచులు, కిరోసిన్ డబ్బారేకులు మొదలగు రకరకాల వస్తువులతో కన్పించినవి. వర్షాలు పడినప్పుడు కప్పు పైభాగము నుండి ఏకాక్రింద కాలువల నుండి వచ్చేనీరు కూడ ఇంట్లోకి ప్రవేశించును. గృహాలు నివసించ డానికి అనుకూలంగా లేవు.

వీధులు - మురికినీరు గుంటలు, రాళ్లకల్గి, కాలినడక కూడ సరిగా లేకుండా, ముళ్ళతో నిండిఉంటుంది. ఇరుకైన దారులు, కొండ ప్రాంతాలు కలవు. వీధులలో మున్సిపల్ చెత్తకుండీలు ఉండవు. వీధులు దుర్వాసనతో, మల మూత్రముల నీటితో ఉండి, ఈగలు, దోమలు, అధికముగా కన్పించినవి. వీధులు, గృహాలు నేలను కల్గి ఉన్నాయి. శుభ్రమైన రాళ్ళతో కప్పబడిలేవు.

వీరు దుమ్ము, ధూళి పట్టిన శరీరాలతో, జుట్టు, గడ్డము పెరిగి తలకు నూనె లేకుండ కన్పిస్తారు. తినడానికి తిండిలేకపోవడము వల్ల పేలిన ముఖాలతో, మండే కడుపులతో, చిక్కిపోయి నిరాశాజీవులుగా కన్పిస్తారు. శరీరము నిండా గుడ్డలు లేకుండ పిల్లలు నగ్నముగా, పెద్దలు అర్ధ నగ్నముగా ఉన్నారు.

"బ్రతికే విధానము తెలియక, విజ్ఞానము, చదువు లేక అజ్ఞానంగా పేదరికముగా బ్రతుకుతున్న మమ్మల్ని దేవుడే రక్షిస్తాడు" అని అంటున్నారు.

వీరు నివసిస్తున్న ప్రాంతాలు- రైల్వేస్టేషన్, రైసుమిల్లులు, తోళ్ళ కార్ఖానాలకు, మరియు పశువుల మలమూత్రములు అయిన పెంటకుప్పలకు దగ్గరగా ఉన్నాయి. దీనివల్ల స్వచ్ఛమైన గాలి లభించడము లేదు. ఇండ్లచుట్టు పశువుల మలమూత్రములు, వీధులలో వ్యక్తుల మలమూత్రములు కల్గి దుర్వాసన వస్తుంది. అనారోగ్యముగా ఉంటూ- జ్వరాలు, పోలియో, పోచమ్మవ్యాధి, మరియు తల, కాళ్లు, నడుము నొప్పులు, కడుపులో నొప్పులు కల్గిన వ్యక్తులు బాధ పడుచున్నారు.

పెంపుడు జంతువులు అయిన కుక్కలు, పిల్లులు, పందులు, మరియు ఆవు, గేదెలు, ఎడ్లు మొదలగునవి వాటితో కలిసి ప్రక్క ప్రక్కనే వీరు నివసిస్తారు, రోడ్లు, వైద్య, విద్యా, గృహ సౌకర్యాలు కన్పించవు. ఈ విధమైన లక్షణాలు మురికి వాడలలో కన్పించడము జరిగింది.

వీరిలో వివిధ కులాలకు చెందినవారు కలరు. హరిజనులు, వెనుకబడినవారు, ముస్లింలు, గిరిజనులు మొదలైన కులాలకు చెందినవారు జీవిస్తున్నారు. గిరిజనులు 12.57% ఉండగా, ముస్లింలు 15.42%, వెనుకబడిన తరగతికి చెందినవారు 29.71%, హరిజనులు 42.28% ఉన్నారు. ఇందులో అధికశాతము హరిజనులు మురికివాడలలో నివసించుచున్నారు. ద్వితీయస్థానములో వెనుకబడిన తరగతికిచెందినవారున్నారు. మిగతావారు తరువాత స్థాయిలో ఉన్నారు. ముస్లింలు, గిరిజనులు ఉన్నారు. బ్రాహ్మణ, రెడ్డి, వెలమకు చెందిన కులాలులేవు.

పట్టిక-1

**కులము**

| కులము | పరిశోధనకు ఎన్నుకోబడినవారు | శాతము |
|---|---|---|
| హరిజనులు | 74 | 42.28% |
| వెనుకబడినవారు | 52 | 29.71% |
| ముస్లింలు | 27 | 15.42% |
| గిరిజనులు | 22 | 12.57% |
| మొత్తము | 175 | — |

వీరిలో 13.55% విద్యకలిగినవారు ఉన్నారు. వీరిలో ప్రాథమిక విద్య వరకు చదివినవారు 7.42% ఉండగా, మాధ్యమిక విద్య చదివినవారు 2.28%. ప్రాథమిక విద్యకంటే మాధ్యమిక విద్య చదివిన వారిసంఖ్య తక్కువగా ఉండగా, ఉన్నత విద్య చదివినవారుకూడ 2.85% ఉండెను. 1.14% మాత్రము కళాశాలవిద్య అభ్యసించినవారు (ఇంటర్, గ్రాడ్యుయేట్) ఉన్నారు. వీరు 1-20 సంగాల వయస్సు కల్గినవారు 1.71%, 21-35 సంవత్సరాలు ఉన్నవారు 33.71%, 36-50 సంవత్సరాలు ఉన్నవారు 50.85%, 51 సంగాలు పైబడిన వయస్సు కలవారు 13.71% ఉన్నారు. వీరిలో 86.28% విద్య ఆసక్తే లేనివారు ఉన్నారు. కనుక విజ్ఞానము లోపించి ఆలోచన లేని వివిధ కార్యక్రమాలకు తలపడి సమస్యలను పెంచుకొంటున్నారు. వీరికి విద్యనేర్పించ వలసిన అవసరం ఉంది.

పట్టిక - 2

**విద్యా విధానము**

| వయస్సు | విద్యలేనివారు | ప్రాథమికి | మాధ్యమిక | ఉన్నత | కాలేజి |
|---|---|---|---|---|---|
| 1-20 | 2 | — | 1 | — | — |
| 21-35 | 46 | 7 | 2 | 2 | 2 |
| 36-50 | 82 | 4 | 1 | 2 | — |
| 51-పైన | 21 | 2 | 1 | 1 | — |
| మొత్తము | 151 | 13 | 5 | 5 | — |

ఇలాంటి పరిస్థితిలో ఉన్న నివాసులు అందరూ ఒకే ప్రాంతానికి సంబంధించిన వారుకాదు. వివిధ ప్రాంతాల నుండి బ్రతకడానికి స్థావరాలు ఏర్పరచు కొన్నారు. వీరిలో పుట్టినప్పటినుండి ఇక్కడే నివసిస్తున్నవారు 57.14% కాగా ఐదు సంవత్సరాల నుండి ఇక్కడ బ్రతుకుచున్నవారు 5.71% మరియు ఆరు సంవత్సరాల నుండి, పదిసంవత్సరాలు నివసిస్తున్నవారు 5.57% ఉండగా, పదకొండు సంవత్సరాలు పైన ఉన్నవారు 28.57% ఉంటున్నారు.

అధికశాతము పట్టణాలలో నివసించుచున్నారు. వీరు వివిధ ప్రాంతాలనుండి వస్తు ఇక్కడ వుండటము జరుగుతుంది. 68.57% పట్టణాలలో నివసిస్తున్నప్పటికి, 31.42% గ్రామాలలో నివసించిన వారు ఉన్నారు. మురికివాడలలో నివసించే వారిలో గ్రామీణ ప్రాంతాలలో నివసించి వచ్చినవారు ఎక్కువగా ఉన్నారని తెలుస్తుంది.

వివాహము అయిన వారు మరియు వివాహము చేసుకోని వారు ఉన్నారు. వివాహము అయినవారు 97.71% ఉండగా 2.28% పెళ్ళి కాని వారుఉన్నారు. ఇద్దరు ఉన్న కుటుంబాలు 78.28% ఉండగా 3-4 కుటుంబ సభ్యులు ఉన్నవారు 14.85%, 5-6 కుటుంబసభ్యులు ఉన్నవారు 5.14%, 7 గురికి పైన ఉన్నవారు 7.42% అంటే అధిక శాతము ఇద్దరు ఉన్న కుటుంబాలు అని, మిగతా కుటుంబాలు పిల్లలు కలిగి ఉండిన కుటుంబాలని తెలిసింది.

పట్టిక - 3

**కుటుంబ సభ్యులు**

| కుటుంబ సభ్యులు | పిల్లలు | పెద్దలు | మొత్తం |
|---|---|---|---|
| 1 - 2 | 76 | 61 | 137 |
| 3 - 4 | 48 | 26 | 74 |
| 5 - 6 | 32 | 9 | 41 |
| 7 - పైన | 10 | 3 | 13 |
| మొత్తం | 166 | 99 | 265 |

ఇందులో వివిధ వృత్తులు చేసి సంపాదించుకొని బ్రతికేవారు ఉన్నారు. రిక్షా, కూలి, ఉద్యోగము, వ్యవసాయము, చెప్పులు కుట్టుకొనువారు మరియు ఇతర చిన్న చిన్న పనులు చేసుకొనేవారు ఉన్నారు. వీరు రోజు చేస్తున్న వృత్తిని బట్టి వీరురోజుకు సంపాదించుచున్న ఆదాయాన్ని తెలుపనైనది.

రిక్షాత్రొక్కి బ్రతికేవారు రోజుకు 5-8 రూపాయిలు సంపాదించేవారు 7.71% కాగా, 8-10 రూపాయలు సంపాదించేవారు 8.56%, 10 రూ. పైన సంపాదించేవారు 1.13% మాత్రమే ఉన్నారు. అంటే 11.42% రిక్షాత్రొక్కి బ్రతికే వారికి రోజువారి ఆదాయము తక్కువ వుందని చెబుతున్నారు.

కూలిపనిచేసి సంపాదించేవారిలో 5-8 రూపాయలు సంపాదించే వారు 23.42% ఉండగా, 1-2 రూపాయలు సంపాదించేవారు ఒక శాతం, 3-4 రూపాయలు సంపాదించేవారు 3.42%, 8-10 రూపాయలు సంపాదించేవారు 16.55%, పదిరూపాయిల పైన సంపాదించేవారు 1.26% మాత్రమే ఉన్నారు. అంటే మొత్తం కూలిచేసి బ్రతికేవారు 53.71%లో అధిక శాతము వ్యక్తులు రోజుకు సంపాదించినది సరిపోవడము లేదని చెబుతున్నారు. వ్యవసాయము పైన ఆధారపడి బ్రతికే వారు 2.26%. వీరికి అసలు సంపాదనే లేదు. పంటలు ఎండిపోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగముపై ఆధారపడి బ్రతికేవారు 5-8, రూపాయలు సంపాదించే వారు 1.13% ఉన్నారు. 8-10 రూపాయలు సంపాదించేవారు కూడ 1.13% ఉన్నారు. పదిరూపాయిలపైన సంపాదించేవారు మాత్రము 16.26% మాత్రమే ఉన్నారు. అయినప్పటికి చాలా కష్టముగా జీవితము గడుపు చున్నాము అని 16% ఉన్న మొత్తం ఉద్యోగులు చెప్పడము జరిగింది.

ఇంకా ఇతర పనులు అయిన చెప్పులు కుట్టుట, కూరగాయలు, పాలు అమ్ముట, వీధులలో అడుక్కోవడము, బట్టలు ఉతకడము, ఇండ్లలో చాకిరీ పనిచేసి బ్రతకడము మొదలగు వెనుకబడిన జాతికి చెందిన వీరు 16.57% ఇతర పనులద్వారా రోజుకు 3-4 రూ. సంపాదించేవారు 2.26%, 5-8 రూ. సంపాదించేవారు 5.13% మరియు 8-10 రూపాయలు సంపాదించేవారు 2.26%, పదిరూపాయల పైన సంపాదించేవారు 4% మాత్రమే ఉండగా 2.84% ఏమీ సంపాదించకుండా బ్రతుకుచున్నారు. మొత్తం 175 మందిని పరిశీలించగా 5.14% ఏ సంపాదనా లేకుండా బ్రతుకుచున్నారు. 0.57% మాత్రమే 1-2 రూ. లు సంపాదిస్తున్నారు. దీనివల్ల ఎన్నిపనులు చేసినా ఈ వీధులలో నివసించువారు కుటుంబ పోషణ చేసుకోవడానికి రోజూ సంపాదిస్తున్న డబ్బు సరిపోవడములేదని ఈ పరిశీలనలో వెల్లడైనది.

పట్టిక - 4

**వృత్తి ఆదాయము**

| ఆదాయము | రిక్షా | కూలి | వ్యవసాయం | ఉద్యోగం | ఇతర |
|---|---|---|---|---|---|
| లేదు | — | — | 4 | — | 5 |
| 1- 2 | — | 6 | — | — | — |
| 3- 4 | — | 6 | — | — | 4 |
| 5- 8 | 3 | 40 | — | 2 | 9 |
| 9-10 | 15 | 29 | — | 2 | 4 |
| 10-పైన | 2 | 10 | — | 24 | 7 |
| మొత్తం | 20 | 91 | 4 | 28 | 25 |

మురికివాడల నివాసులు వివిధ సమస్యలతో నివసించుచున్నారు. వివిధ కులాలకు, వర్గాలకు చెందినవారు కలసి వీరిలో ఉన్నప్పటికీ వీరి ఆర్థిక పరిస్థితి మాత్రమే క్షీణించి ఉండడము వీరిలో కుటుంబ సభ్యులకే సంపాదించినది సరిపోక పోవడము వల్ల కుటుంబ సమస్యలు ఎదుర్కోవలసివస్తుంది. వీరికి విద్యా సౌకర్యాలు లేక పోవడమువల్ల వీరి పిల్లలు అధికశాతము చదువుకోలేక పోవడమే కాక అధిక శాతము విద్య నేర్చిన పెద్దలుకూడ లేరు. ఈ ప్రాంతాలలో నివసించే మురికినివాసులు సామాజిక అవసరాలు లోపించి అనేక ఇబ్బందులు పడుచున్నారు.

వీరిలో స్వంత గృహాలు కల్గి ఉన్నవారు 91.42% ఉండగా, 8.55% మాత్రమే అద్దె గృహాలలో నివసిస్తున్నారు. గుడిసెలలో నివసించేవారు అధికశాతం ఉన్నారు. వీరిలో 53.71% గుడిసెలలో నివసించగా 37.71% పెంకుటిండ్లు కల్గిఉన్నారు. వీరు నివసించుచున్న గుడిసెలు చాలా చిన్నవిగా ఒకే గదిని కల్గి, గోడలు చుట్టు చిన్నగా నిర్మించి ఉన్నవి. పొడవైన వ్యక్తులు వంగి లోనికి వెళ్ళవలెను.

ఇంటి పైకప్పు కిరోసిన్ రేకులు, గడ్డి, పెంకు, గోనె సంచులు, కాగితాలు మొదలగునవి కప్పబడి, కప్పు పైభాగమున రాళ్ళుపేర్చి ఉంచినారు. గాలికి లేచిపోకుండా రాళ్ళు పనిచేస్తాయని చెప్పారు. వర్షం, గాలి, అధికముగా వచ్చినపుడు గుడిసెలు లేచిపోవడము, మరియు వర్షానికి నీళ్ళుకారడము, అజాగ్రత్త వహించితే నిప్పు అంటుకోవడము వీరు ఎదుర్కొనే గృహ సమస్యలు. మరియు తిండి, వంట, నిద్ర మొదలగు పనులను కలిపి చిన్నగా ఒకే గది ఉంటుంది. చీకటిగా గాలిలేకుండా ఉంటుంది. కుక్కలు, పిల్లులు, పందులు మొదలగు పెంపుడు జంతువులు కూడ వీరితోపాటు ఆ గదిలోనే నివసించుచున్నవి. పిల్లలు తింటున్న ఆహారము పెంపుడు జంతువులు కూడ కలిసి తినడము లేక వెత్తుకొని వెళ్ళడము జరుగుతుంది. ఇండ్లకు కిటికీలు, తలుపులు రక్షణగాలేవు. గోనెసంచి పరదాలను గుమ్మానికి చాటుగా కట్టి పనులకు వెళతారు. పిల్లలను కొంతమంది వెంట తీసుకు వెళతారు. కొందరు ఇంటివద్దనే ఉంచి వెళతారు. వీరు నివసిస్తున్న గృహాలు అన్నీ ఒకే దగ్గర క్రిక్కిరిసిపోయి దగ్గరగా ఉంటాయి. పెంపుడుజాతి పశువులు కూడ వారితో నివసించుచుంటాయి. 86.28% పందులు, 13.71% ఇతర పెంపుడు జంతువులు అంటే- కుక్కలు, పిల్లులు, మేకలు, కోళ్ళు, బత్తెలు, మరియు 5.71% ఇతర ఆస్తులు (బండి, ఇంట్లో సామాను) కలవు. ఏ ఆస్తులు లేకుండా బ్రతుకుతున్న వారు 94.28%

వీరు నివసిస్తున్న గృహాలలో 96.57% విద్యుత్ సౌకర్యము లేనివారు ఉన్నారు. మంచినీరు లేనందున అనేక ఇబ్బందులుపడి తెచ్చుకొనేవారు 39.99% గా, బావినీరు తెచ్చుకొనేవారు 48.57% ఉండగా, 11.42% మాత్రమే నల్ల, బోరింగునీరు వాడుచున్నారు. అంటే నల్ల, బోరింగు సదుపాయాలు వీరు నివసిస్తున్న వీధులలో తక్కువగా ఉన్నవి. మిగతావారు బావి, చెరువు, వర్షము నీరు మొదలగు నీరుపైన ఆధారపడి ఉన్నారు. మంచినీరు సరిగా దొరకకుండ ఇబ్బంది పడుచున్నారు. వీరికి మరుగుదొడ్ల సౌకర్యము 100% లేదు అని చెప్పడము జరిగింది. వీధి దీపాలు కల్గినవారు 8.57% ఉండగా, 94.28% సౌకర్యము లేనివారు ఉన్నారు. అధిక శాతం వీధి దీపాల సౌకర్యము లేనివారు ఉన్నారు. 79.99% రోడ్ల సౌకర్యము కూడ లేని వీధులు రాళ్ళు, ఎత్తు పళ్ళాలు కల్గి వర్షా కాలము నీరునిలచి వీరి ప్రాంతమునకు నడవడానికి కష్టంగా ఉంటుందని చెబుతున్నారు.

మురికినీరు నిలచిన గుంటలో ఈగలు, దోమలు వృద్ధిచెందుతూ చెడువాసనతో కూడుకొని ఉంటుంది. దీనివల్ల 76.57% జ్వరాలుతో బాధపడుచూ, పోలియో, మలేరియా, బి. పి. మొదలగు ఇతర అనారోగ్యాలతో బాధపడువారు 23.42% ఉన్నారు. అంటే పరిశోధన చేసినవారేకాక ఇంకా అధిక శాతము ఎప్పటికీ ఏదో ఒక అనారోగ్యముతో బాధపడుచునే ఉన్నారు. 53.71% ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్ళు తుండగా, 46.28% ప్రభుత్వ హాస్పిటల్‌కు వెళ్ళుతున్నారు. అయినా వీరికి ఆరోగ్యము బాగుపడటము లేదని నిరాశగా చెబుతున్నారు. వీరు సంపాదించినది రోగాలకే సరిపోవడము లేక 19.24% పిల్లలని పనులకు పంపి డబ్బులు సంపాదించుచున్నారు. అయినా రోజుతిండికే సరిపోవడములేదు. వడ్డీ వ్యాపారుల నుండి, ప్రభుత్వము నుండి 82.28% అప్పులు తెచ్చుకొంటున్నామని చెప్పారు. వడ్డీ వ్యాపారుల వద్ద 92.57%, బ్యాంకులద్వారా 7.42% అప్పులు పొందుతున్నారు. వీరికి కూడ అలవాట్లు కలవు.

కల్లు, సారా, పొగ, ఇతర ఖర్చులకు రోజుకు ఒక రూపాయి ఖర్చు చేసేవారు 85.7%, రెండురూపాయలు ఖర్చుచేసేవారు 42.85%, మూడు రూపాయలు ఖర్చు చేసేవారు 21.14%, నాలుగు రూపాయలు ఖర్చు చేసేవారు 6.28%, ఐదు రూపాయలు ఖర్చు చేసేవారు 11.99% ఉండగా, ఏడు రూపాయలు పైన ఖర్చు చేసే వారు 3.99% మాత్రమే ఉన్నారు. ఎక్కువ ఖర్చుచేసేవారు తక్కువ శాతము ఉండగా ఒక రూపాయి ఖర్చుచేసేవారు ఎక్కువ శాతం ఉన్నారు. 33.7% సినిమాలు చూసేవారు, 73.14% పొగ – కల్లు త్రాగేవారు, 23.42% సారత్రాగేవారు, 3.42% ఇతర అలవాట్లు అంటే గంజాయి, నల్లమందు మొదలగునవి. ఆరోగ్యము చెడిపోవ డానికి కూడ ఇవి కారణమవుతున్నవి. వీరు హాస్పిటల్‌కి వెళ్ళినప్పటికీ మంచి సదుపాయం దొరకనివారు 57.14%. వీరు ప్రభుత్వ ప్రైవేటు హాస్పిటల్‌కి వెళ్ళి డబ్బు ఖర్చు చేసినప్పటికి వీరు ఆరోగ్యముగా ఉండడములేదు. సరిఅయిన సదుపాయం లభించక అనారోగ్యముతో బాధపడుచున్నారు. వీధులు అపరిశుభ్రముగా ఉండటము, మరియు హాస్పిటల్‌లో సరిఅయిన మందులు దొరకక పోవడము, దురలవాట్లే వీరి ఆరోగ్యము చెడిపోవడానికి కారణము అని పరిశీలనలో వెళ్ళడైనది.

వీరు నివసిస్తున్న స్థలము 31.99% ప్రభుత్వ అధీనములో మరియు 58.85% ప్రైవేటు అధీనములో, 5.14% స్వంతము కల్గి

ఉండడము వల్ల వీరిని ఎవరు వెళ్ళమని అనడము లేదు. ఇతరుల స్థలాలలో నివసించుచున్న 9.71% నివాసులు మాత్రం వెళ్ళమని చెప్పినా? వేరే వెళ్ళేమార్గంలేక తిట్లు, చీవాట్లు తింటు అక్కడే పడిఉండడము జరుగుతుంది. కనుక వీరికి ఇళ్ళస్థలాలు ఇప్పించవలసిన అవసరం ఉంది.

వీరు నివసించు స్థలాలు చిన్నగా ఉండడమువల్ల ప్రజలు అధికముగా ఉండడమువల్ల కిక్కిరిసి ఇరుకుగా దగ్గర దగ్గరగా నివసించవలసి వస్తుంది. దీనివల్ల అల్లర్లు, అశాంతి ఏర్పడి వారిలో వారికి తగాదాలు కూడా వస్తాయి. వీరిలో తగాదాలు వచ్చినప్పుడు న్యాయస్థానం కానీ, పోలీసు స్టేషన్‌కానీ, ఇతరులుకానీ పరిష్కరించరు. మాకు మేమే పరిష్కరించుకొంటాము అని 88.57% చెప్పారు, 11.42% మాత్రము వారు యేర్పరచుకొన్న కమిటీలు ద్వారా పరిష్కరిస్తారని చెప్పడము జరిగింది. ఈ విధముగా వీరికి న్యాయస్థానాలు, పోలీసుస్టేషన్ మొదలగు రక్షక సంస్థలుకూడ అనుకూలంగా లేవు.

వీరు పట్టణానికి దూరంగా వున్నప్పటికీ పురపాలకసంఘ హద్దులలోనే జీవిస్తారు. ప్రజాస్వామ్య పరిరక్షణ దృష్ట్యా వీరి రక్షణకూడ తీసుకోవడము ప్రభుత్వ బాధ్యతగాఉంది. ప్రభుత్వాన్ని ఎన్నుకొనుటలో వీరుకూడ భాగస్వాములు. వీరిలో 96.57% ఓటుహక్కు వినియోగించుకొనువారు ఉండగా, 2.28% ఓటుహక్కు వినియోగించనివారు. ఓటుహక్కులేనివారు 1.14% మాత్రమే ఉన్నారు. అధికశాతం ఓటుహక్కు వినియోగించిన వారే వున్నారు. వీరిలో 65.14% కాంగ్రెసు (ఐ) అభిమానులు ఉండగా, 11.42% కమ్యూనిస్టు పార్టీ అభిమానులు, 6.28% జనతాపార్టీ అభిమానులు మరియు ఇండిపెండెంట్లను అభిమానించేవారు 13.71% ఉన్నారు.

ప్రభుత్వము అనేక అభివృద్ధికార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ మురికివాడల నివాసుల ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలను నిర్మూలించ లేకపోతున్నది. కనీసము వీరిసమస్యలను తెలుసుకొని మురికివాడలను మెరుగు పరచుటలోకూడ శ్రద్ధ వహించుటలేదు. ఇంకా ఈ వాడలు అభివృద్ధి చెందుతూ దేశానికి "క్యాన్సర్‌వ్యాధి" లాగ తయారు కాగలదు.

## ముగింపు

క్రమేణా అభివృద్ధి చెందుతున్న మురికివాడలను పూర్తిగా నిర్మూలించడము కష్టము. కనుక "పరిసరాల అభివృద్ధి" అనే కార్యక్రమాన్ని తయారుచేసి అన్ని పట్టణప్రాంతాలలోని మురికివాడల నివాసుల మెరుగుపరుచుటకు ప్రభుత్వము అనేక డబ్బు ఖర్చు చేసినప్పటికి వీరియొక్క ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులను మెరుగు పరచలేక పోయినది.

వీరు నివసించే ప్రాంతాలలో ఇండ్ల స్థలాలు పట్టాచేసి, గృహనిర్మాణము చెయ్యాలి. వీరివీధులలో విద్యుత్, రోడ్లు, మురికినీటి కాలువలు, మంచినీటి సౌకర్యము, ఏర్పరచి, ప్రతిఇంట్లో విద్యుత్ సౌకర్యము కల్పించవలెను. మరుగుదొడ్లు, స్నానపాటికలు, పార్కులు నిర్మించవలెను. వీరు బ్రతకడానికి వ్యక్తుల అభిరుచులను బట్టి పనులు కల్పించవలెను. బ్యాంకులద్వారా అప్పులు ఇప్పించి, ఉపాధిసౌకర్యాలు కల్పించినప్పుడే వీరి పరిస్థితులు మెరుగుపడి పట్టణ అభివృద్ధి జరుగుతుంది. ప్రజలను ప్రదేశాన్నికూడ గుర్తించవలెను.

ప్రభుత్వము మురికివాడల మెరుగుపరచే కార్యక్రమము క్రింద కేటాయించిన డబ్బును చిత్తశుద్ధితో, పట్టుదలతో, క్రమశిక్షణతో ఖర్చుపెట్టినచో కొంతవరకు మెరుగు పడగలవు. ప్రభుత్వం కేటాయించిన డబ్బును, మురికి వాడలను మెరుగు పరచే కార్యక్రమము క్రింద ఏవిధముగా ఖర్చుపెడుతున్నారు? ఎంత ఖర్చు అవుతుంది? ఎంత పని చేసారు? ఎంత అభివృద్ధి జరిగింది? అనే విషయాలను గమనించి నియంత్రణ చేయవలెను. దేశాభివృద్ధిలో భాగముగా పట్టణాభివృద్ధి జరగాలంటే మురికివాడల నివాసుల పరిస్థితులను మెరుగు పరచుట ఎంతైనా అవసరము.

[ రచయిత కాకతీయ విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పరిపాలనా విభాగంలో పనిచేస్తున్నారు. ]

శ్రీ మాదిరాజు రంగారావు

# ప్రతీక - నవల్లో దీని స్వరూపం

సాహిత్యంలో ప్రతీకల ప్రయోగం ఈ కాలంలో విరివిగా కన్పిస్తోంది. ప్రతి సృజనాత్మక ప్రక్రియలోనూ ఎక్కడో ఒకచోట అంతో ఇంతో చోటుచేసుకొని కన్పిస్తుంది. ముఖ్యంగా కవిత్వం నవలలో ఆధునికతకు చిహ్నంగా కళాత్మకమైన శిల్పపరిధిని విస్తృతం చేసే అంశంగానూ గుర్తింపుకు వచ్చింది. ఆధునిక యుగంలో మనస్తత్వ శాస్త్రంలో విస్తారమైన పరిశోధనలవల్ల ఎన్నో రహస్య విషయాలు బహిర్గతం కావడంతో విజ్ఞానం పెరగడంతో ప్రతీకి విశిష్టమైన స్థానాన్ని పొందింది.

ప్రాచీన సాహిత్యంలోనూ అక్కడక్కడా ప్రతీకల వాడుక లేకపోలేదు. పౌరాణిక తాంత్రిక మంత్ర శాస్త్రాలకు సంబంధించిన అనేక సందర్భాల్లో ప్రతీక ప్రయోగం కన్పిస్తుంది. మానవుని సంస్కృతిలో మత ప్రస్థానంలో ప్రతీకల కెంతో ప్రాముఖ్యం ఉంది. పురా గాథల్లో సముద్రం చేతన (కాన్షియస్‌నెస్)కూ సర్పం ఒకప్పుడు శక్తి (భౌతిక)రూపానికీ మరొకప్పుడు ఆధ్యాత్మిక శక్తిలోకి పరివర్తనం చెందే మానసిక శక్తికీ ఇంకొకప్పుడు ధర్మానికీ, చంద్రబింబం మనస్సుకూ ప్రతీకలుగా కన్పిస్తాయి. ధ్యానశక్తి కేంద్రాలుగా మంత్ర శాస్త్రంలో ఎన్నో తటస్థ పడతాయి. వీటిని గురించి పరిశీలిస్తూ పోతే ఆది మానవ సంస్కృతీ గర్భంలోకి ప్రయాణం సాగుతుంది. సమాజ శాస్త్రం, నృశాస్త్రం,జానపద సాహిత్యంలో దీనిప్రాముఖ్యాన్ని అందరూ గుర్తించిందే. ఈ సందర్భంలో ప్రజల విశ్వాసాలు ఆచారాలకూ సంబంధించిన ఆసక్తికరమైన అంశాలెన్నో బయటికి వచ్చాయి. టోటెమ్, టాబూ పురాతన సంస్కృతికి సంబంధించిన చిహ్నాలు సంప్రదాయ పురాణ ప్రతీకలుగా నిలచి పోయాయి.

ఆధునిక యుగంలో నవల్లో ప్రతీకల ప్రవేశం విశిష్టమైన పాత్రనే నిర్వహిస్తోంది. ఇందులో నేరుగా చెప్పేదానికన్నా విశిష్టమైన అభివ్యక్తి పద్ధతిలో ఆవిష్కృతం అవుతుంది. ఇది ప్రతీకల నాశ్రయించి జరగడంవల్ల అదే ఉద్యమ రూపం దాల్చడంచేత ప్రతీక వాదం గానూ వ్యాప్తిలోకి వచ్చింది. ప్రతీక విశిష్టమైన అభివ్యక్తి విధానానికి సంబంధించిన సంవిధానం (టెక్నిక్)గా విమర్శిత మౌతుంది. అయితే సృజనాత్మక లక్షణంలో భాగంగా పర్యాప్తమయ్యే వీలు లేక పోలేదు. ఒక భావం లేదా ఆవేశం ప్రత్యక్షంగా కాక పరోక్షంగా అభివ్యక్తం చేసే కళారూపంగానే సృజన కార్యంలో అంతర్లీనమై భాసించే తత్త్వమూ దీనికి చేకూరింది. రచయిత తనలో ఆవహించిన భావప్రపంచాన్నీ, ఆవేశరూపాన్నీ యథాతథంగా అనుకున్న ప్రమాణంలో అందించడానికి అశక్తంగానూ, అందింప గలిగినా అసంపూర్ణంగానూ ఉంటుందను కోవడంవల్ల కాల్పనికాన్ని ఆశ్రయించడం జరుగుతుంది. ఈప్రయత్నమే ప్రతీకను ఉద్గమింప జేస్తుంది. దీన్ని సముచితంగా యోజితం చేయడం చేత రచయిత తాను భావించింది కొంతవరకైనా సాధించిన తృప్తితో పాటు రచనకూ గుణాత్మకమైన రూపం సిద్ధిస్తుంది.

పందొమ్మిదవ శతాబ్దిలో ఫ్రాన్సులో ఇదొక ఉద్యమంగా విలసిల్లింది. ఈ ఉద్యమంలో ప్రముఖంగా పేర్కొనదగిన రచయిత బాద్‌లేర్, దీన్ని కొనసాగించినవారు రిమ్‌బాడ్, వెర్‌లేన్, మలరెమ్ తోపాటు వెర్‌లేన్. బాదలేర్, అతని అనుయాయులూ[1] కవిని ఋషి స్థాయికి తీసుకువెళ్ళారు. కవి వాస్తవ ప్రపంచానికి వెనుకనున్న అతీతమైన దాన్ని చూడగల శక్తి కలవాడుగా భావించారు. ఆదర్శలోకాన్నీ, ఆలోచనా రూపాన్నీ సూక్ష్మసూక్ష్మంగా రచనలో పరివర్తితం చేయడానికి ప్రతీక ఎంతో సహాయపడుతుందనీ విశ్వసించారు. వీరిరచనల్లో వైయక్తికమైన ప్రతీకలు గొప్పచమత్కృతితో ఆకర్షణీయంగా రూపొందాయి. ఈ రచయితల ప్రభావం ఇంగ్లీషు అమెరికన్ కవులపై[2] బాగా ప్రసరించింది. మొదటి ప్రపంచయుద్ధం (1914-18) తరువాత కాలం అంతా ప్రతీక వాదమయంగా విలసిల్లింది. సాహిత్యానికి విలువ చేకూర్చే కొన్ని ఉత్తమ లక్షణాలవల్ల ఆ తరువాతనూ కవిత్వం, నవల్లో వాటి ఉన్నతికి దోహదం చేసేదిగా నిలచింది. ప్రాచీనంగా వస్తూన్న సంప్రదాయ ముద్ర వెనుక ఉంటూనే పాశ్చాత్య సాహిత్య ప్రభావంవల్ల భారతీయ సాహిత్యంలో అందులో తెలుగు నవల్లో ప్రతీకాత్మకత విశిష్టమైన గుణాధానానికి దారి తీసిందనడంలో అనుమానం లేదు. పురాణగాథలు మతం, తత్త్వంతో కూడిన సంస్కృతి నాశ్రయించిన సంప్రదాయ ప్రతీకలతో పాటు ఆధునిక యుగప్రభావంతోనూ కాల్పనిక వాతావరణంతో, వాస్తవ స్ఫూర్తితో సృజనాత్మకశక్తి ప్రసారంగల వైయక్తికమైన ప్రతీకల ప్రయోగం సమృద్ధంగా కన్పిస్తుంది.

సాహిత్యంలో ప్రతీక కళాత్మకమైన విలువల్ని అధికం చేసేది గానే రాణిస్తుంది. పూర్వం నవల్లో ఎక్కడో అక్కడక్కడా తెలీకుండానో, తెలిసో చోటుచేసుకునేది. ఈనాడు ప్రయోజన తత్పరతతో విస్తృతంగా ప్రయుక్తమౌతూంది. దీన్ని సమర్థించేందుకు మానవుల క్రియాకలాపమంతా ప్రతీకాత్మకమేనని సాధారణీకృతం చేసేధోరణి వ్యక్తమైంది. నవల మానవ జీవితానికత్యంత సన్నిహితమైంది కాబట్టి అంతర్గతంగా ప్రతీకను పర్యవసింపచేసే యోచన ఇందులో స్పష్టం. సాహిత్యమంతా ఒక విధంగా ప్రతీకాత్మకమే అదే విధంగా భాషకూడా అనీ అనడం జరిగింది. సాహిత్యం భాషా గతమైంది. మానవులు పరస్పరం మనోభావాలను ప్రకటించేందుకు ఉపయోగించే సాధనం భాష. ఇది ఒక క్రమంలో కొన్ని గుర్తుల ఏర్పాటువల్ల రూపొందింది. ఇది భాషాగతమైన మౌలికమైన అంశాన్ని స్పృశిస్తుంది. భాషాపరమైన దృష్టికీ, సాహిత్య పరమైన దృష్టికి ఈ సందర్భంలో భేదాన్ని గుర్తించడం అవసరం. ప్రస్తుతం సాహిత్య పరంగానే అభిలషణీయం. ప్రతీక సాహిత్యానికి అవశ్యకమైన స్థితిగానూ పరిగణించడం విశేషం నవల్లో ఇది అనివార్యమైందిగానూ స్పష్టం చేయడమైంది.[4]

1) గుర్తు 2) ప్రతీక - ఈ రెండూ సందర్భాన్ని బట్టి పరస్పరం పరివర్తనం చెందుతాయి. మొదటిదాని విస్తరణ రూపంగా రెండోది పరిణమించడమూ ఉంది. ఈ స్థితిలో గుర్తునూ, ప్రతీకనూ వేరువేరుగా స్పష్టంగా గుర్తించవచ్చు. గుర్తు (సైన్) పరంపరగా వచ్చే అందరూ అంగీకరించే ఒక నిర్దిష్టమైన భావాన్ని జ్ఞాపకం చేస్తుంది. బాణం ఒక దిశను సూచించేందుకు గుర్తు. ఒక్కొక్కపుడు ఒక విషయంపై ప్రత్యేకంగా దృష్టిని నిలిపేందుకు గుర్తించడానికి ఉపయోగిస్తుంది. గుర్తుకు నిర్ణీత (ఆర్బిట్రరీ) లక్షణం ముఖ్యం. ప్రతీక విషయంలోనూ చాలా కాలంగా ఒక అర్థం వాడుకలో ఉండవచ్చు. అది సంప్రదాయ ప్రతీకగా స్థిరపడింది. అయినప్పటికీ అర్థ విస్తృతిలో ఇది భేదిస్తుంది. నలుపు అజ్ఞానానికి చీకటిపే, స్థిరపడిందే. అయినప్పటికీ సాహిత్యంలో ఆ పైన ఇంకా ఊహకు అవకాశం కలిగిస్తూనే ఉంటుంది. మరో సందర్భంలో వేరే అర్థాన్ని స్ఫురింపజేసే అవకాశం తప్పకుండా ఉంటుంది. ఒకే ప్రతీక ఆ తరువాత మరొకరి చేత వాడుకలో సందర్భాన్నిబట్టి కొత్త అర్థాన్ని ఉద్దేశించవచ్చు. ఈ భేదాన్ని స్పష్టంగా గుర్తించి, మొదటి దాన్ని నిర్ణీత (ఆర్బిట్రరీ) ప్రతీక అనీ, రెండోదాన్ని సాహిత్య (లిటరరీ) ప్రతీక అనీ పేర్కొనడం జరిగింది. ఒకప్పుడు నిర్ణీతమై, స్థిరపడిన గుర్తు లేదా చిహ్నం, ఆ తరువాత పరిధిని దాటి విస్తృతిని పొంది సాహిత్య ప్రతీకగా పరివర్తనం పొందవచ్చు. ట్రాఫిక్‌ను నిలిపే ఎరుపురంగు అపాయానికి గుర్తు. ఇది సాహిత్యంలోనూ ప్రయుక్తమై నిర్దిష్ట పరిధిని దాటి సంఘర్షణకూ విప్లవానికీ ప్రతీకగా విస్తృత దశను పొందింది. అదే విధంగా ట్రాఫిక్‌ను ముందుకు సాగించే క్షేమానికీ (నిరపాయానికీ) గుర్తు ఐన ఆకుపచ్చ రంగు సమృద్ధికీ, సౌభాగ్యానికీ యోజితమైంది. గుర్తు, ప్రతీక రెండూ ఉపయోగించే సందర్భం, ఆశించే ప్రయోజనం బట్టి వేరు వేరు లక్షణాలతో మనకు అవగతికి వస్తాయి. గుర్తు ఒక దానికి బదులు మరొకటి (1:1) ప్రాతిపదికపై ఉంటుంది. ప్రతీక ఎప్పుడూ ఒకదాని బదులు మరొకటిగా ఉండదు. తనతో సంబంధం వీడకుండా ఆ పైన మరో విశిష్టమైనదాన్ని స్మరింపచేస్తుంది, ఆలోచింపచేస్తుంది. ఇది బాహ్యార్థకం. గుర్తుకు పూర్తిగా భిన్నమైన స్థితిని పొందుతుంది. వివిధ వ్యక్తుల ఆలోచనా శక్తిని బట్టి ఎన్నో విధాలైన అర్థాలను భావింపజేసే శక్తినీ కలిగి ఉంటుంది. ఒకే ప్రతీక, అర్థ సముచ్చాయాన్ని ఏక కాలంలో స్ఫురింపజేసే శక్తి కలిగి ఉంటుంది.

ప్రతీక వాస్తవికం అనీ, ఆదర్శకం అనీ రెండు విధాలు. వాస్తవికం మానవ జీవితంలో భౌతికమైన ప్రాపంచిక వాస్తవాన్ని ఆశ్రయించింది. కోట రాచరికానికీ తల్లి రక్షణకూ భద్రతకూ ప్రతీకలు. రెండోది ఆదర్శకం పరం, దివ్యం, శ్రేయం మొదలుగా ఉత్కృతమైన అతీత లక్షణాలు కలిగింది. భూమి మాతృశక్తికీ, ఆకాశం అదర్శానికీ హంస ఆత్మకూ ప్రతీకలు. మరో విధంగానూ విశ్లేషించవచ్చు. ఎంతో కాలం నుండి ఉపయోగంలో ఉంటూ స్థిరపడినవీ, సంస్కృతిలో భాగంగా నిలచినవీ పూర్వగాథా సంపన్నమైనవీ సంప్రదాయ (ట్రెడిషనల్) ప్రతీకలు. ఉదయించే సూర్యుడు కొత్త జన్మకూ, అస్తమించే సూర్యుడు మృత్యువుకూ వెలుగు జ్ఞానానికీ, చీకటి అజ్ఞానానికీ, ఆదిశేషుడు విద్యకూ, పాము సంతానానికీ ఇలా ఎన్నో ఉన్నాయి. ఇవే వివిధ సందర్భాల్లో వివిధమైన అర్థాలను భావింపజేస్తూ ఆలోచనకు శక్తినీ, దీప్తినీ కలిగిస్తాయి.

ఇవి ఒకవిధం మరోవిధం, రచయిత స్వతంత్రమైన వ్యక్తిత్వాన్నిబట్టి ఎంతో కాల్పనికతనూ, ఆలోచనాస్ఫూర్తినీ సంతరించుకున్నవి. వైయక్తిక లేదా వ్యక్తిగత (పర్సనల్) ప్రతీకలు. ఇవి మొదట్లో కష్టంగా అర్థం కావచ్చు. కాలం గడిచేకొద్దీ, శక్తినిబట్టి సుగ

మత్వాన్ని పొందుతాయి. షెల్లీ, కీట్సుమొదలైన కాల్పనిక కవుల రచనల్లో వ్యక్తిగత ప్రతీకలు చాల ఎక్కువ. తెలుగులో కృష్ణశాస్త్రిని ప్రముఖంగా పేర్కోవచ్చు. ఒకభావచిత్రంలో పూవు బహ్వర్థకంగా జీవితానికీ, స్త్రీకీ, సౌందర్యానికీ ప్రతీకయై యుండవచ్చు. మెల్‌విలె నవల మాబిడిక్-లో(తిమింగిలం) బహ్వర్థకమైన ప్రతీకగా నిలిచింది. 1. తిమింగిలం అంటే కేవలం తిమింగిలమేను. 2. తెల్లజాతి రక్తమాంస గతమైన భౌతిక రూపం. 3. ఆత్మయొక్క ప్రస్థానం (దీన్ని చాలా మంది నిరాకరించారు). 4. నృశాస్త్ర-సాంఘిక-మనస్తత్వ పరమైన అర్థాలు. 5. ముఖ్యంగా ఫ్రాయిడ్ యుంగ్ మనస్తత్వపరమైన సిద్ధాంతాల అన్వయం. ఈ విధంగా అనేకమైన విమర్శలు వివిధ స్థాయిల్లో వెలువడినాయి. విశ్వనాథ-వేయిపడగలు 1) పరిపూర్ణ సనాతన ధర్మానికి 2) అవ్యక్త సామూహిక చేతనలోని పురా రూపానికి (ఆర్కిటైపు) 3) అధర్మాన్ని సహించని ఆత్మశక్తి నిక్షిప్తమైన భౌతిక రూపానికి 4) కర్మసాక్షి భౌమాకృతికీ ఈ విధంగా అనేకమైన వ్యాఖ్యానాలకు అవకాశమిచ్చే ప్రతీకగా నిలచింది. ఈ ప్రతీకలు వాస్తవానికి దూరమై నిత్యజీవితంనుండి తప్పించుకునే ప్రయత్న పర్యవసానాలనే అభిప్రాయమూ ఉంది. ఇది నిజంకాదు. సాహిత్యంలో అందులోనూ నవల్లో (పై పరిశీలననుబట్టి) జీవితం ఆధారంగా, వాస్తవ స్ఫూర్తితోనే ప్రవృత్తమౌతుందన్న విషయం మరచిపోకూడదు. జీవితంలోని అనేక ముఖాలను స్పృశించే లక్షణం దీనికి బాగాఉంది.

## II

అదృశ్యమానమైన ఏదేని వస్తువుకో భావానికో దృశ్యరూప సంకేతమే ప్రతీక. మనస్సులోని ఆలోచనలు, ఆవేశాలు నేరుగా వర్ణించకుండా మూర్తమైన(కాంక్రీట్)భావ రూపాల పోలికతోనో సూచనతోనో వ్యక్తీకరించే కళారూపం- ప్రతీక వాదం. పాఠకునిలో ప్రకృతంతో పాటు మరో భావప్రపంచాన్ని సృజిస్తుంది. ప్రతీక నిర్మాణంలో వాస్తవాన్ని వీడకుండానే అతీతమైన భావ ప్రపంచంలోకి ప్రవేశింపజేసే లక్షణం ఉంది. ఒక్కొక్కప్పుడు మూర్తలక్షణానికి భిన్నంగా, వర్ణించే వస్తు సామ్యంలో నిబిడమైన భావనచేత అమూర్త (ఎబ్‌స్ట్రాక్ట్) మైన లక్షణం చోటుచేసుకోవచ్చు. ప్రతీకలో అర్థం అవగతికి వచ్చేముందు దానిరూపం అనుభవంలోకి వస్తుంది. అనుభవం బట్టి ఆపైన హేతువు పనిచేస్తుంది. రచయిత సాధారణంగా సమగ్రంగా వ్యక్తం చేయలేని లేదా గుప్తంగా ఉంచదలచుకున్న భావం, వాస్తవాన్ని స్పృశిస్తూనే అతీతమైన ప్రపంచంలో మరోరూపాన్ని అందుకోవడం ఇందులో ముఖ్యం. గాఢత్వమూ, గంభీరత్వమూ మొదలైన విశిష్టగుణాలు ఒకప్రమాణంలో ఆలోచనా స్థానీయాలై ఉంటాయి. రచయిత భావం లేదా ఉద్దేశ్యం పరోక్షంగా అర్థవంతమూ, విశిష్టమూ ఐన కళాత్మకరూపంలో ఆవిష్కృతమై పాఠకులమనస్సు ఆకర్షిస్తుంది, ఆలోచింపచేస్తుంది. గాఢమైన అనుభవ ముద్రనూవేస్తుంది. దీన్ని మరొకమారు స్మరిస్తే, రచయిత మనస్సులో నిబిడంగా ఉన్న భావలోకాన్ని వ్యక్తం చేయడానికి నవల్లో సాధారణ కథాజగత్తు అసమగ్రంగా అనిపించడంవల్ల కళాత్మకను సిద్ధింపజేసే ఉద్దేశంతోనూ, పాఠకుల్ని ఆలోచింప చేయాలన్న అభిలాషవల్ల, ప్రతీక అవతరిస్తుందని నిస్సంశయంగా చెప్పుకోవచ్చు. వాస్తవ జగత్తునుండి భావనా జగత్తులోకి లేదా ఆదర్శలోకంలోకి చొచ్చుకొని పోయేందుకు చేసే ప్రయత్నమే ఐనా, దీని నిర్మాణరూపం నవల్లో వాస్తవ తలంపైనే స్థిరంగా ఉంటుంది. ఈ ఉనికి పాత్ర-ఇతివృత్తం అభిప్రాయం-సంఘటనలు వాతావరణం మొదలైన అనేక అంశాలతు సంబంధించి ఉంటుంది. ఆ నవల్లో దేన్నైనా మరచిపోవచ్చుగాని ప్రతీకను సులభంగా మరచిపోలేం. దీన్నిప్రభావం ఎంతో శక్తివంత మైంది. నవల ఆరంభంనుండి సమాప్తిదాకా, అఖరికి పేరుపెట్టడంలోనూ ఏ స్థానంలో నైనా ఉండవచ్చు.

ప్రతీక పూర్వం నుండి అంతో ఇంతో వాడుకలో ఉన్నా దాని స్థానం చాల పరిమితమైంది. కాల్పనిక యుగంలో మనస్తత్వశాస్త్ర పరిచయంతో, నవ్యతకోసం అన్వేషణలో, కాల్పనిక వాతావరణంతో అతి విస్తృతమైన పరిధినీ, వైవిధ్యాన్నీ సంతరించుకుంది. దీనితో ప్రతీకాత్మక నవల వాస్తవం నుండి కాక కాల్పనికంనుండి అవతరించిందన్న అభిప్రాయం వ్యాప్తిలోకి వచ్చింది. ఇందులో కొంత నిజం లేకపోలేదు. శిల్ప విషయకంగా చూస్తే ఒక్కొక్కపుడు వాస్తవ భూమి నుండి భావలోకానికి మలుపు తిరిగేప్పుడు, భావరూపాలు కొంత అస్పష్టమైన ధోరణినీ, అమూర్తమైన స్థితినీ పొందే వీలుంది. మెలరమ్ పేర్కొన్నట్లు ఈసందర్భంలో అమూర్తానికీ, మూర్తానికీ మధ్య సాదృశ్య సమ్మేళనం ముఖ్యం. ఇది కవిత్వానికి ఎక్కువగా అన్వయిస్తుంది, నవల్లో ఈలాంటి సందర్భాలు రావు. కవిత్వంలోనే మొదట దీని ప్రవేశం – వ్యాప్తీ జరిగింది. ఇటీవల నవల్లో ప్రాముఖ్యం లభించింది. ఉన్న స్థాయిని ప్రకాశమానం చేసే అవసరమైన లక్షణం గానూ భావితం అవుతూంది. పూర్వ కాలంలో గొప్ప రచయితలు టాల్‌స్టాయ్, విక్టర్‌హ్యూగో, బాల్జాక్ మొదలైనవారు ప్రతీకపై

దృష్టి లేకుండానే రచనలు చేసారు. ప్రతీకపై దృష్టి లేనివీ, తటస్థమైన దృష్టితో వ్రాసినవీ ఎన్నో ఉత్తమ రచనలు లేకపోలేదు. తెలుగులో వీరేశలింగం, చిలకమర్తి, ఉన్నవ, బాపిరాజు మొదలుగా పేర్కోవచ్చు. జీవితంలో అన్నిరంగాల్లో మార్పులు వచ్చినట్లే సాహిత్యం లోనూ వచ్చాయి. ఈ మార్పులు రాకపూర్వం జీవితం సుఖంలేదా? అని ప్రశ్నించవచ్చు. ఇది ఇట్లా ఉంచి ఈ మార్పుల ప్రభావానికి దూరంగా ఉంటూ ఇప్పుడు జీవితంలో సుఖం పొందగలమా? అనేదీ వేరే ప్రశ్న. మొట్టమొదట ఈ మార్పులను కాదని దూరంగా ఉండలేం. ఆధునిక యుగంలో ప్రతీకవాదం ఒక ఉద్యమంగానూ విలసిల్లడంతో, సాహిత్యంలో దీని ప్రభావం తప్పనిసరిగా పరిణామంలో భాగమై నిలుస్తుంది. పోనుపోను మార్పును కోరే లక్షణంతోపాటు కళాత్మకతనూ సంతరించుకోవడం విశేషం. ప్రతీక నవల్లో ముఖ్యంగా, ఆశక్తి దాయకమైన ఆధునిక లక్షణంగా పరిశీలనార్హమైన ప్రశస్తినీ పొందింది. ప్రతీకను గుర్తించి శాస్త్ర పరిచయంతోనో, సంపూర్ణ పరిజ్ఞానంతోనో ఏ విధంగా ప్రయుక్తమైనా, చారిత్రక కారణాల వల్ల అనివార్యంగా వచ్చే మార్పుల్ని తనలో విలీనం చేసుకొని ప్రస్థానం సాగించే సాహిత్యంలో, గుణాత్మకమైందీ, ఉన్నత విలువలకు దోహదం చేసేదీ, తప్పకుండా ప్రజల మన్ననలను పొందుతుంది.

## III

నవల్లో ప్రతీక కథా పరిధిలోనే భావితం కావాలి. కథా పరిధికి భిన్నంగా లేదా ఏ మాత్రం సంబంధంలేకుండా యోజితం కాకూడదు. ఇది సాధారణ నియమం. దీన్ని అవలంబించక పోవడం వల్ల అసలు ప్రయోజనం దెబ్బతింటుంది. అస్పష్టతకు దారితీస్తుంది. పాఠకుల్లో వైముఖ్యాన్ని కలిగిస్తుంది. ఇక విమర్శకులు ప్రతీక కెన్నో అర్థాలు అన్వేషించి ఏదో విధంగా సమన్వయం చేయాలనే డొంక తిరుగుడు ప్రయత్నమూ చేయకూడదు. తాను ఆలోచించేవి ఎంతవరకు సముచితంగా నిలబడేదీ జాగ్రత్తగా వివేచించాలి.

అది వాస్తవిక కవిత్వంలో ప్రతీక నిర్వహించే పాత్ర స్పష్టమే. హేతువుకన్నా అనుభూతికీ, చేతనకన్నా ఉపచేతనకూ ప్రాముఖ్యం ఎక్కువ. ఈ ధోరణి ఎంతో సాంద్రంగానూ, వేగంగానూ ఉంటుంది. నవల్లో అనుభూతి గుణం వెంటనే ఆలోచనావేగాన్నీ కలిగి ఉంటుంది. ఇది క్లిష్టత కన్నా సారళ్యాన్నీ; క్లుప్తత కన్నా వివరణ రూపంతో ప్రత్యేకతను పొంది, నిర్వహణంలో కవిత్వం నుండి భిన్నంగా ఉంటుంది. వస్తువు - ఇతివృత్తం పాత్ర - సంఘటనలు - వాతావరణం మొదలైన అంశాల సంబంధంతో సారళ్యానికి అవకాశం ఎక్కువ. ఈ దృష్టితో చూస్తే వస్తువుకో, భావానికో ప్రాతినిధ్యం వహించే ప్రతీక నవల్లో ఏమాత్రం కళాత్మకతకు భంజకం కాదు. ఇంకా సమాజంలో మానవీయ సంబంధాలు, మనస్తత్వం ప్రవర్తనం - ప్రభావితం చేసే పరిసరాలు, రచయిత సిద్ధాంతాల ఆవిష్కారంలో ప్రతీక ఎంతో రమణీయంగా ఉపయుక్తమౌతుంది. సాధారణం నుండి గహనమైన విషయాలదాకా దీని వర్తనం వ్యాప్తమైంది. విశిష్టమైన సంక్లిష్టమైన, చిత్రణంలో దీన్ని ఉపయోగించినపుడు రచనకు కలిగే కళారూపం ఉన్నతంగా ఉంటుంది.

ఒక ప్రతీక అర్థం ఇదమిత్థమని తేల్చేసి ఆలోచనల్ని మూసే యలేం. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధమైన అర్థాన్ని రచయిత ఉద్దేశం,కథాసందర్భం, పాత్రచిత్రణం, సంఘటనతీరు, వాతావరణ కల్పనం బట్టి, అనేక విధాలుగా స్ఫూర్తికి వస్తుంది. ఇది పాఠకుని అనుభవ శక్తిపైనా, ఆలోచనావైఖరిపైనా ఆధారపడి వుంటుంది. ఇది నియతమైన ఏదోస్థితికి ఒదిగిపోయి సంకుచితం కాకపోవడంవల్ల నవ్యత, ఆకర్షణకలిగి ఉంటుంది. అలంకారంవలె ఏదో విస్పష్టమైన లక్షణంలో ఒదిగిపోదు. ఏదో ఒక లక్షణాన్ని అన్వయించి చూచుకోవడమూ కుదరదు. దీని అన్వయం సమయోచితంగా చేయవలసిఉంటుంది.

మనస్తత్వ శాస్త్రంలో ఫ్రాయిడ్, అడ్లర్, యుంగ్-పరిశోధనల వల్ల మానవ జీవితాన్ని గురించి ఎన్నో ఆశ్చర్యకరమైన ఆసక్తికరమైన అంశాలు బయటికివచ్చాయి.ఫ్రాయిడ్ సైకో-ఎనాలిసిస్‌లో అణచివేతలు, ప్రతిఘటనలు, లైంగిక ప్రవృత్తులు, కలలు గురించి-అవ్యక్త చేతన వేసే మారువేషాలపై క్షుణ్ణంగా శాస్త్రీయమైన చర్చలు జరిగాయి. ఈ రహస్యశోధనలో, అన్వేషణలో ప్రతీకల పట్టికకూడా సిద్ధంకావడం మరోవిశేషం. ఇది ప్రతీక వాదానికి శాస్త్రీయంగా మనస్తత్వ పరంగా బలమైన ఆధారాన్ని కలిగించింది. ప్రతీకల నిర్మాణానికి మార్గం సులభమైంది. దీనిపట్ల ఆశక్తిని పెంచింది, ఆలోచనకు దారితీసింది. అడ్లర్ ఇండివిడ్యువల్ సైకాలజీలో వైయక్తికమైన మనస్తత్వం - ప్రవర్తనం (బాల్యం - పరిసరాల ప్రభావంతోరూపొందే) ఆత్మన్యూనత, ఆత్మాధిక్యతాభావం, నవల్లో పాత్ర చిత్రణపై గొప్ప వెలుగును ప్రసరించింది. వ్యక్తిగతమైన మనస్తత్వపు

లోతుల్ని బాగా ఆవిష్కరించడానికి ప్రతీకల సహాయం తీసుకోవడమూ జరిగింది. యుంగ్ సామూహిక అవ్యక్తచేతన (కలెక్టివ్ అన్‌కాన్షస్‌నెస్) లో, పరిశోధనవల్ల ప్రతీక వైయక్తిక పరిధినుండి సామూహిక పరిధిలోకి వెళ్ళడం జరిగింది. సమస్త మానవజాతి మానసికమైన విచిత్రాకృతులకు - సామూహిక అవ్యక్తచేతనలో నిక్షిప్తమైన కీలకాలు కారణంగా గుర్తించడంతో ప్రతీక పరిధి చెప్పరానంతటి విస్తృతినీ, గంభీరత్వాన్నీ పొందింది. వైయక్తిక దశనుండి సామూహిక దశకు తీసుకు వెళ్ళడంతో ఇతర మానవ శాస్త్రాలతో పరిచయమూ అనివార్యమౌతూంది. చేతన-ఉపచేతన-అవ్యక్త చేతన-సామూహిక అవ్యక్తచేతన స్థాయిల్లో ప్రతీక వర్తనం ఎంతో వైవిధ్య విలసితమైంది. దీనితో నవలకుగల సామాజిక చిత్రణం, వివరణం, దర్శనం శక్తులకు కొత్తలోకం ఎదుట నిలచింది.

ప్రతీక చేతనకూ-అవ్యక్త చేతనకూ వంతెనవలె అయింది. ఈ రెండిటినీ ఒకవిధంగా సంయోజించే చక్కని రూపంగానూ భావితమైంది. ఆధునిక యుగంలో కేవలం అభివ్యక్తి సాధనంగానేకాక సృజన వికాసంలో అంతర్భాగమై, నవలకు స్థాయిని సంపాదించి పెట్టింది. ఇది సరిగా ఉపయోగంలోకి రావడం రచయిత ప్రజ్ఞపై ఆధారపడి ఉంటుంది. కొత్తను అన్వేషించే మనస్తత్వం, కళాదృష్టిలో విశిష్టత, మనస్తత్వ ప్రకాశనంపై అభిలాషతో నవలను గాఢంగా తీసుకొనే లక్షణంవల్ల ప్రతీక ఎన్నటికీ ప్రాచుర్యాన్ని కలిగే ఉంటుంది.

# "నీవు"

"నీవూ" అనుకొనే
నీవు
నిజానికి ఈ ప్రకృతి అద్దంలో
ప్రతిబింబం మాత్రమే !
నిజమైన "నీవు"
వేరే ఉన్నావు !

బండ రాళ్ళలో
కొండ గుహల్లో
ఒక రకంగా

పిచ్చుక గూళ్ళలో
ఇసుక గుళ్ళలో
ఒక రకంగా

పూలవాన చినుకుల్లో కారుమబ్బు తునకల్లో
నీరెండ తళుకుల్లో మండుటెండ ఛురకల్లో
ఒక రకంగా
ఎత్తు గుండెలలో లోతైన మనసు పొరలలో
మమత పొత్తిళ్ళలో మానవతా పొలిండ్లలో
ఒక రకంగా
మొత్తానికి అన్నింటిలోనూ
రకరకాలుగా
అలాయిలా అని చెప్పలేనన్ని రీతులుగా
పరిపరి విధాలుగా
నీవే ఉన్నావు !
ఆ దేవుడవై ఎప్పుడూ ఉంటావు !

# రాగోదయం !

వైశాఖ మాసపు వేసవి
మాఘ మాసపు వానవిలా
వెన్నెల పులకరింతలతో
ఒళ్లంతా కళ్లు చేస్తుంటే

ఆశ్చర్యంతో
అంతరాన్నడిగాను
అసలు కథేమిటని !

నా హృదయాన్ని విప్పి
సిగ్గు మొలక లేస్తున్న
నా వలపుల పట్టు మహిషిని తట్టి లేపి
తీపి కలల మురిపాలపిట్టని పట్టి కుదిపి
నాకు చూపిందది !
గుండెను తోడ బెట్టిందది !

అందుకే ఈ శిశిరంలో
నవ వసంతోదయం
నీలి జేగురు రంగులతో వికసిస్తోంది !

అందుకే కాబోలు ఈ ఆషాఢంలో
శ్రావ్య శ్రావణ మేఘ సందేశం
ఋగ్వేద స్మృతులుగా వినిపిస్తోంది !

డాక్టర్ గుమ్మనూరు రమేష్ బాబు

శ్రీ ఎ. విజయ దత్తాత్రేయ శర్మ

# తూర్పు గోదావరి జిల్లా గ్రామ నామములు - ఒక పరిశీలన

(గత సంచిక తరువాయి)

## మన్యంలో మామిడి

మన్యప్రాంతంలో నెటికి ఏ ఏటికాఏడు కొత్త మామిళ్ళను తినడం ఒక పండుగలా చేసుకునే ఆచారం ఉన్నది. తూర్పు గోదావరి జిల్లాలో మారేడుమిల్లి (రం) అడవులలో గంగమ్మ పండుగలో ఒక భాగంగా దానివి జరుపుకుంటారు. "అడవిలోని స్థలాల పేర్లలో సుమారు పాతిక శాతం మామిడివే. చెట్టు తీరును, పండ్ల తీరును బట్టి రకరకాల పేర్లు."114 ఈ జిల్లాలోని 'ఏజన్సీ' (మన్యం) తాలూకాలైన రంప చోడవరం, ఎల్లవరములలో మామిడి గ్రామనామంగా పలు రకాలుగా ఉన్నది. ఆకుమామిడి కోట, బండమామిడి, గోరమామిడి, గుజ్జుమామిడి వలస, మామిడి వలస, ముంజ మామిడి, పందిరి మామిడి కోట, తురు మామిడి (అన్నీ రం): బండ మామిళ్ళు, బర్రి మామిడి, బొడ్డు మామిడి, దబ్బ మామిడి, మామిడివాడ, దోరమామిడి, గొప్పలతోట మామిడి, కోటబండి చిప్పల మామిడి, మామిడిపాలెం, పులుసు మామిడి, తిరు మామిడి, పేటమామిడి, ఎర్రమామిడి లంక (అన్నీ ఎ). మిగతా తాలూకాలలో కూడ మామిడి గ్రామనామంగా లేకపోలేదు. ఉదా॥ మామిడికుదురు (రా), మామిళ్ళదొడ్డి (కా), మామిడాడ (పె).

## చెట్లు - పంటలు మొ॥ సంబంధములు

మొగలికుదురు, చింతపల్లి (రా); చింతలూరు, గుమ్మరేగుల, మర్రిపీడు, ములగపూడి, బండేర్రిగుల, తోటకూరపాలెం, తోటపల్లి (అన్నీ పర్తి): బూరుగుపూడి, దోసకాయలపల్లి, జంబూపట్నం, గుమ్మళ్ళదొడ్డి (రాజ); చింతపల్లి, ఈతపూడి, కాండ్రేగుల, పనస పాడు (కా), రెల్లుగడ్డ (అ), ఈతకోట (కొ), కందులపాలెం, తాడిపల్లి, తామరాపల్లి, తోటపేట (రామ), మద్దివీడు, మద్దులూరు, మర్రివాడ, మారేడుమిల్లి, ములగలగూడెం, నిమ్మలపాలెం, ఉసిరిక దోనెల (రం), బూరుగుపాలెం, బూరుగులాడ, చింతకర్రిపాలెం, చింతకొయ్య, చింతలపూడి, చింతలవాడ, జాజిగెడ్డ, జాజిపాలెం, జాజివలస, నిమ్మలపాలెం, మర్రిపాలెం, రావిబండ, రావిగూడెం, రేగులపాడు, ఉమెత్త (ఎ); కందికుప్పం (ము); బెండపూడి, చీపురు, దొండవాక, కాకరపల్లి, రావికంపాడు, శృంగవృక్షం(తు); గోరింట, మర్రిపాక, మర్రిపూడి (పె); చింతలూరు, జొన్నాడ, మారేడుబాక, తోటపూడి, వడ్లమూరు (అ); తాటపర్తి (పి). ఈ విధంగా మన్యం ప్రాంతం చేరియున్న ఈ జిల్లాలో శతాధికంగా గ్రామనామములు చెట్లు చేమల పేర్లనుబట్టి ఏర్పడినవి.

## జంతు/పక్షి మొ॥ సంబంధములు

కాకినాడకు ఆ పేరు అక్కడ 'కాకులు' విస్తారంగా ఉండటం చేతనే వచ్చినదని ఒక ఊహ.115 ఇంకా ఈ జిల్లా పక్షి-జంతు సంబంధములైన గ్రామ నామములున్నవి. ఉదా॥ గొర్రిపూడి, సర్పవరం, తురంగి (కా): పులిదిండి, ఏనుగుపల్లి (కొ): బొల్లెద్దుపాలెం, దుప్పలపూడి (రాజ); శరభవరం (ప్ర&రం&ఎ); గుర్రప్పాలెం (పె): పశువుల్లంక (ము); దేగలకోట, జలగలగడ్డ, మేకలవలస, నాగలోవ, పోతుతారు, పులిమెట్ట, వ్యాఘ్రపురం (ఎ).

## కుల, మత, జాతి సంబంధములు

బోయినపూడి, గొల్లలపాలెం (కా): గొల్లప్రోలు (పి), కోమటిపాలెం, పూజారిపాకలు (రం); బావనధార, చాకిరేవులపాలెం, గిరిజనపురం, ఎరకలపాలెం (ప్ర): బోయినగుమ్మి, బోయినపల్లి, బోయిపాడు, జంగాలతోట, సెట్టివల్లి (ఎ); రావులపాలెం (కొ&ఎ), వడ్డిపట్టు (కొ). రాజుపాలెం (కా), రాచపల్లి (పి); రాజుపాలెం(పె).

## అ ప్ప న ప ల్లి (రా)

"పూర్వము ఇచట ఉప్పరులు నివసించుటచే దానికి ఉప్పరవల్లి అని పేరు వచ్చెనట. తరువాత క్షత్రియు లిచ్చటికి వచ్చి ఉప్పరులను తొలగించి దానికి అప్పనపల్లియని పేరు పెట్టిరట."116

కులము పరముగా నేర్పడిన ఒక గ్రామనామము మారిన తీరునకు ఇది యొక ఉదాహరణ. వృత్తిపరముగా నేర్పడి అపభ్రంశ మొందిన గ్రామనామమునకు 'వాడపల్లి' (కొ) ని ఉదాహరణగా, పేర్కొన వచ్చును. నదీతీరమున నున్న ఈ గ్రామమునందు ఒకప్పుడు ఓడలు తయారు చేయబడుతూండటంచేత అది 'ఓడపల్లి' నామము కలిగి నేటికి వాడపల్లిగా మారినదని తెలియుచున్నది.117

## గ్రామనామములు - గృహనామములు

ఇవి అవినాభావ సంబంధము కలవి. ఉదా॥ లొల్ల (రామ&కొ), కాండ్రేగుల (పె&కా), ముక్కామల, నేదునూరు, పక్కిలంక (అ), మరువాడ (తు), కోలంకి (ప్ర&కా), గున్నేపల్లి (ము), పెనుమళ్ళ (ము&కా), వల్లూరు (కొ), గంటి (కొ), అంగర (అ), నేలటూరు (అ), కొక్కొండ (ఎ), కిమ్మూరు (ఎ), యార్లగడ్డ (ఎ), యండమూరు (కా), మన్యంవారిపాలెం (పె), సిద్దా వారి పాలెం (ప్ర) వంటి గ్రామనామములను బట్టి ఆయా ఇంటి పేర్లను బట్టి ఆయా గ్రామ నామములేర్పడుట గ్రహించవచ్చును.

ఒకే పేరుగల గ్రామాలను వేరువేరుగా గుర్తించడానికి ఆయా పేర్ల ముందు పెద్ద, చిన్న అని విశేషణము చేర్చడం ఒక ఆనవాయితీ. ఈ విశేషణానికి ఆధారాలు ఆయా గ్రామాల జనాభా లేక వైశాల్యం కారణం కావచ్చును. ఉదా॥ :- పెదపల్లి-పినపల్లి (అ): పెదబ్రహ్మదేవం (కొ)-చినబ్రహ్మదేవం (పె): పెదమల్లాపురం - చినమల్లాపురం, పెదసంకర్లపూడి, చినసంకర్లపూడి (ప్ర): చినబారంగి-పెదబారంగి, పెదగెద్దాడ-చినగెద్దాడ (రం): పెదఅద్దేపల్లి - చిన అద్దేపల్లి, పెదగార్లపాడు - చినగార్లపాడు, పెద మునకగెడ్డ-చినమునకగెడ్డ, పెదవడిశకుర్రు, చినవడిశకుర్రు, చిన రెల్లంగిపాడు - పెదరెల్లంగిపాడు (అన్నీ ఎ).

క్రొత్తగా ఏర్పడిన గ్రామాలను అదే పేరుగల పాత గ్రామాల నుంచి వేరుగా గుర్తించడానికి ఆయా గ్రామనామముల ముందు పాత, క్రొత్త అని విశేషనామములు చేర్చటం సులభమైన పద్ధతి. ఉదా॥ :- ఇంజరం (కొ), పాతఇంజరం (ము) పాతతుంగపాడు (రాజ), పాతగన్నవరం (కొ).

భౌగోళిక విశేషణములను ముందు చేర్చి కూడా ఒకే పేరు గల గ్రామములను వేర్పరిచి చెప్పుట గలదు. ఉదా:-ఎగువధారపల్లి-దిగువధారపల్లి (ప్ర) తిరుపతి రాజుపాలెం నార్త్-తిరుపతి రాజు పాలెం సౌత్ (పె): లక్ష్మీపురం (రం), ఈస్టులక్ష్మీపురం (ప్ర): ఐలాండ్ పోలవరం (ము): ఇతరములైన ప్రత్యేకతలను పేర్కొని కూడ ఒకే పేరున్న గ్రామాలను వేరుగా గుర్తించు కొనుట ఉన్నది. ఉదా:-మల్లవరం (రాజ): కమతాంమల్లవరం(తు): దొంగల మల్లవరం (ఎ): వేమవరం (తు) - పిట్టలవేమవరం(కొ): వైనతేయ కొత్తపల్లి (కొ): లంకల గన్నవరం (రా): నిమ్మకాయల కొత్తపల్లి (అ):

వేర్పాటుగ గుర్తించడానికి వీలు కల్పించని గ్రామనామములకు ఈ క్రింది వాటిని ఉదాహరణగా పేర్కొనవచ్చును. అమ్మపేట, అంగివరం, లో దొడ్డిమర్రిపాలెం, రాజవరం, రామవరం, శరభవరం, వంకరాయి, వట్టిగెడ్డ ఎర్రగొంది (అన్నీ ఎ): కోట (ఎ&రాజ&రామ), కొత్తూరు (ప్ర) రామన్నపాలెం, నరసాపురం, పెద్దూరు, ఈగవలస, బూరుగుబండ, చెరువుపాలెం, తాటివాడ (అన్నీ రం).

ఒక గ్రామనామము ననుసరించి ఏర్పడిన మరికొన్ని గ్రామనామములకు ఉదాహరణలు:-అంతర్వేది-అంతర్వేదిపాలెం (రా): పెదపట్నం - పెదపట్నంలంక (రా): చొల్లంగి-చొల్లంగిపేట (ప్ర), గోడి-గోడిలంక (అ): అన్నంపాలెం - అన్నంపాలెంపాడు (ఎ): ముమ్మిడివరం (ము)-ముమ్మిడివరప్పాడు(కొ): ఇమ్మిడివరం-ఇమ్మిడివరప్పాడు (రం): చెరుకుమళ్ళ- చెరుకుమళ్ళపాడు, పైడిపుట్ట-పైడిపుట్టపాడు (ఎ): విలస-విలసవిల్లి - విలసగంగవరం (రామ): పెద్దాపురం (పె) - పెద్దాపురప్పాడు (కొ) ; వాకాడ-వాకాడపూడి (కా); గుడిగళ్ళ - గుడిగళ్ళభాగ (రామ): గంటి-గంటిపెదపాడు (కొ): నరేంద్రపట్నం-నామగిరి నరేంద్రపట్నం (ప్ర).

కొన్ని సందర్భములందు ఒకే గ్రామమునకు రెండు పేర్లు కూడ చలామణిలో ఉన్నవి. ఉదా॥ వేములపల్లి అను సీతయ్యపాలెం (అ): సెలములోవ అను సోదెలంపాలెం (ఎ): లంజలూరు అను గాంధీనగరం (రం): మన్య ప్రాంతమునందు గుడిశ, గుండ్రాతి, పాలెం (రం): బంద (రం): చవిటిదిబ్బలు, దొంతరాయి, వంకరాయి (ఎ) వంటి గ్రామనామము లున్నవి.

## కోటలు

ఈ జిల్లాయందు 'కోట' అనునది గ్రామనామాంత్యముగా శృత మవుచున్నది. ఉదా॥ బురదకోట, బూసికోట, చీపురుకోట, చినబాలకోట, దేగలకోట, గండికోట, ఈదులకోట, కడారికోట, కొర్నికోట, కొప్పులకోట, కోట, కొత్తకోట, లంకమిరియపుకోట, మడుగుకోట, మూర్లకోట, నీలికోట, పాతకోట, రేవడికోట, సింగముకోట, తంగేడుకోట, తాడికోట (అన్నీ ఎ): అకుమామిడికోట, వలమలకోట, చావడికోట, నేలకోట, పందిరిమామిడికోట (అన్నీ రం): బురదకోట (ప్ర): భీమవరపుకోట (తు): కంద్రి

కోట (పె). ఈ ఉదాహరణలను బట్టి మన్య ప్రాంతము నందే ఎక్కువగా 'కోట'లు ఉండియుండునని భావించవలసి లేదు. ఉదా॥ కదుములకోట అనగా కదిమిచెట్లకోట (సం. కదంబ) కదము = నీపము ; కోట = కంచె లేక గుబురు అని నిర్వచింప బడినది.118 పైగా, ఈ కోటలు ఎక్కువగా మన్య సీమయందు యుండుట ఈ అభిప్రాయమునకు తావిచ్చుచున్నది.

## లంకలు

సప్త గోదావరీ పారివాహిక ప్రాంతమైన ఈ జిల్లాయందు 'లంకలు' గ్రామనామాంత్యముగ నుండుట ఈ ప్రాంత భౌగోళిక విశేషతను తెలియజేసేదిగా ఉన్నది. ఉదా॥ అప్పారాముపిలంక, గుడిమెల్లంక, మెండెపులంక, రామరాజులంక (భా); బొబ్బిలంక, ములకలంక (రాజ); బండారులంక, బెండమూరులంక (అ); కొమరాజులంక, ఉబలంక (కొ), జాడుగపాలిలంక (అ).

## ముగింపు

పై వివరాల వలన ఈ జిల్లా గ్రామ నామములపై స్థానిక పాలక వంశములైన తూర్పు చాళుక్య, రెడ్డి, పెద్దాపురం, పిఠాపురం మొ॥ నాటి ప్రభావము ప్రస్ఫుటముగా ద్యోతక మగుచున్నది. పంచారామములలో రెండింటికి ఈ జిల్లా స్థావర మగుటచేతను, సప్త గోదావరులు సప్త మహర్షుల పేరను బరగుటచేతను, పౌరాణిక, మతపరమగు ప్రభావము గ్రామనామముల పుట్టు పూర్వోత్తరములపై ఎక్కువగా కానవచ్చుచున్నది. 'ఏజన్సీ' (మన్యం) తాలూకాలలోని గ్రామములలో అత్యధిక శాతము గ్రామ నామములు ప్రకృతిపరమైనవిగా నున్నవి. సరిహద్దు రాష్ట్రము లైన ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రముల భాషాప్రభావముగాని, గిరిజన భాషా ప్రభావముగాని గ్రామనామములపై కనిపించుట లేదు. ఒకే పేరుగల గ్రామములు పలుతావులందు యథాతథము గాను, స్వల్ప భేదములతోనూ ఉండుట, ఇరుగుపొరుగు జిల్లాలోని గ్రామముల పేర్లు కూడ ఈ జిల్లాలో ఉండుట వలన వలస పోవుటలు, నూతన గ్రామమును నెలకొల్పుకొనినను పాత పేరుపై మక్కువ మిగిలియుండుటయు తెలియనగును. ఈ జిల్లా గ్రామ నామముల విషయమై ఇంకను విస్తృత శాస్త్రీయ పరిశోధన జరుగ వలసిన అవసరమును ఈ ప్రాథమిక పరిశీలన గుర్తించుచున్నది.

## ఆధారసూచికలు


1. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము, మూడవసంపుటము, (హైదరాబాదు, 1962) పుట 453.

2. ఆంధ్రప్రదేశ్ దర్శిని (విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విజయవాడ, 1976), పుట 1024.

◆ సౌలభ్యము కొరకు కుండలీకరణములలో తాలూకాల పేర్లు సంక్షిప్తముగా పేర్కొన బడినవి. ఆ సంజ్ఞావివరణ : అ = అమలాపురం, ఆ = ఆలమూరు, ఎ = ఎల్లవరం, కా = కాకినాడ, కొ = కొత్తపేట, పి = పిఠాపురం, పె = పెద్దాపురం, ప్ర = ప్రత్తిపాడు, ము = ముమ్మిడివరం, రా = రాజోలు, రాజ = రాజమండ్రి, రామ = రామచంద్రాపురం, రం = రంపచోడవరం, తు = తుని.

◆ ఈ ప్రకరణమునకు, పట్టిక-2 నకు ప్రధాన ఆధారగ్రంథము-కుందూరి ఈశ్వరదత్తు, ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, (ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, ద్వితీయ ముద్రణ, 1979)

3. ఎపిగ్రాఫికా ఇండికా, (ఎ. ఇ), XII, పుట 1 - 3. సముద్రగుప్తుని (క్రీ. శ. 335-380) అలహాబాదు శాసనము లోను, పశ్చిమచాళుక్య పులకేశి అయివోలు శాసనము (ఎ. ఇ. VI, పుట 11) లోను కూడ ప్రసక్తమైన 'పిష్టపురము' ఈ మండలములో అత్యంత ప్రాచీనమైనది.

4. ఎ. ఇం. XIII, పుట 104-105.

5. సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్, [యస్. ఐ. ఐ.], VI, నెం. 692

6. పైది, V, నెం. 62 & ఎ. ఇం, VI, నెం. 20.

7. మద్రాస్ డిస్ట్రిక్ట్స్ గజిటీర్స్ : గోదావరి, [గవర్నమెంట్ ప్రెస్, మద్రాస్, 1901], పుట 235 అధస్సూచికలో వ్యాఖ్య.

8. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పుట 234-236.

9. పైది, పుట 230-231.

10. పైది, పుట 96.

11. యస్. ఐ. ఐ, IV, నెం. 1020 (శ. సం. 1040).

12. డా॥ నేలటూరి వెంకటరమణయ్య, విష్ణుకుండినులు, [హైదరాబాదు, 1973], పుట 73.

13. ఇండియన్ ఏంటిక్వురి, XIV, C. Z III.

14. ఎ. ఇం. IV. నెం. 33.

15. ఎ. ఇం. XIV, పుట 83 – 96.

16. యస్. ఐ. ఐ. X, నెం. 554.

17. ఎ. ఇం. XIII, నెం. 24.

18. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పుట 148.

19. ఎ. ఇం, III, పుట 286.

20. పైది, IV, పుట 324.

21. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పుట 118.

22. పైది, పుట 49 (ప్రథమ భాగం)

23 ఖండవిల్లి లక్ష్మీరంజనం & బాలేందుశేఖరం, ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి, (మద్రాసు, 1965), పుట 41.

24. చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రి, కథలు గాథలు, తృతీయ భాగము, [కడియం, 1960], పుట 500.

25. యస్. ఐ. ఐ. IV, నెం. 1361 & 1291.

26. గీ. ఏక భోగంబు గాగ నేలేటి గరుసు
గడలి సీమయు గౌతమీ గంగ మేన
కస్తురపు గ్రోవి కాశ్మీరఖండ మవధి
యేలె విశ్వకుటుంబి భీమేశ్వరుండు.

[భీమేశ్వర పురాణము, పంచమాశ్వాసము, పద్యము 89]

27. మల్లంపల్లి సోమశేఖరశర్మ, హిస్టరీ ఆఫ్ ది రెడ్డి కింగ్‌డమ్, [వాల్తేరు, 1948], పుట 131.

28. డా॥ ఆర్. సుబ్రహ్మణ్యం, ది సూర్యవంశి గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, [వాల్తేరు, 1957], పుట 141.

29. యస్. ఐ. ఐ. V, నెం. 48, 49.

30. పైది, IV, నెం. 1344.

31. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పుట 217.

32. డా॥ యన్. వెంకట రమణయ్య, ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి, [మద్రాస్, 1950], పుట 289.

33. డా॥ ఎన్. రమేశన్ [సం.], ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిక్ట్ గెజిటీర్స్: ఈస్ట్ గోదావరి, [హైదరాబాద్, 1979], పుట 247.

34. బి. వి. కృష్ణారావు, హిస్టరీ ఆఫ్ ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి, పుట 238.

35. డా॥ ఎన్. వెంకటరమణయ్య, ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి, పుట 163.

36. భారతి, జనవరి, 1982. పుట 10.

37. పైది, మే, 1982, పుట 50.

38. పైది, మార్చి, 1983, పుట 71–72.

39. ఆంధ్రదేశ చరిత్ర–భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము (హైదరాబాద్, 1976), పుట 275.

40. హిస్టరీ ఆఫ్ రెడ్డి కింగ్‌డమ్, పుట 182.

41. కొనసీమ నేలిన హైహయ వంశీకులలోనూ చోడ నామధేయులు కలరు.

42. ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి, పుట 142.

43. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పుట 473.

44. పైది, పుట 364

45. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము [హైదరాబాద్, 1971] పుట 1–3

46. ఆం. ప్ర. డి. గ–ఈస్ట్‌గోదావరి, పుట 240.

47. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పుట 473–77.

48. ఎమ్. సోమశేఖరశర్మ, ఎ ఫర్‌గాటెన్ చాప్టర్ ఆఫ్ ఆంధ్రా హిస్టరీ (హిస్టరీ ఆఫ్ ది ముసునూరి నాయకాస్), [మద్రాసు, 1945].

49. మడికి సింగనకవి 'జ్ఞానవశిష్ఠరామాయణ' పీఠికలో తన తండ్రి అయ్యలమంత్రి తొయ్యేటి అనపోత భూపాలుని మంత్రియై 'పెద్ద మడికి' యందు సుక్షేత్రములను పొందినట్లు వ్రాసాడు. ఈ 'పెద్ద మడికి'యే నేడు మడికి [ ] గా వ్యవహరింపబడుతోంది — భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పుట 476 – 77.

50. పైది, పుట 64.

51. కథలు-గాథలు; పుట 499

52. వడ్డాది అప్పారావు [సం] రెడ్డి సంచిక, [రాజమండ్రి, 1947], పుట 80.

"కాటయరెడ్డి వేముఁడవ ఘోట మహాద్భుత చండఖడ్గుడై
కాటమరేని కోటఁగొని గౌతమవాహిని దాటిపోయి...."

[చాటుపద్య మణి మంజరి II, పుట 66]

ఈ కాటమరేని కోట నేటి కాట్రేని కోన [ము], కాట్రేని పాడు[రా]లలో నేదైనా కావచ్చునని రెడ్డి కింగ్‌డమ్స్, పుట 32. కాటయవేముని కాలమునకే అవి కాటమరేని కోటలుగా నున్నవి కాబట్టి అంతకు పూర్వం ఎవరేని కాటప్రభుని పేర వెలసెనా!

కాటయవేముని కుమారగిరి రాజీయ వ్యాఖ్యావతారికలో:

"ధాటీ ఘోటీఖురాగ్రత్రుటిత గిరితటీయత్ర మొల్లేటిదుర్గం।
దుర్భేదం వజ్రకూటం చితపతి రభసా, రామగిర్యాఖ్యదుర్గం।
.... .... .... ....
దుర్గం కిమ్మూరుసంజ్ఞందలిచరిపుచితే దుర్గమం బెండపూడిమ్॥

పై వాటిలో మొల్లేరు [ప], వజ్రకూటం, [ప] బెండపూడి [తు] రామగిరి [రాజ] కిమ్మూరు [ప] ఈ జిల్లాలోనే కలవు.

53. పైది, పుట 62.

54. భూగోళసర్వస్వము, మొదటి సంపుటము, పుట 1-3

55. పైది, పుట 593.

56. రెడ్డిసంచిక, పుట 357.

57. రెడ్డి కింగ్‌డమ్స్, పుట 25.

58. రెడ్డి సంచిక, పుట 396-397

59. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పుట 592.

60. పైది, పుట 596.

61. పైది.

62. కథలు గాథలు, పుట 501 & రెడ్డి సంచిక, పుట 311, 312.

63. రెడి సంచిక, పుట 146.

64. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పుట 122.

65. డా॥ నేలటూరి వెంకటరమణయ్య, పల్లవులు - చాళుక్యులు, [మద్రాస్, 1969], పుట 303 అధస్సూచికలో వ్యాఖ్య.

66. ది సూర్యవంశి గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పుట 41.

67. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశము, ఆరవ సంపుటము, [హైదరాబాదు, 1969], పుట 52.

68. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పుట 505.

69. షేరు మొహమ్మదు క్షితపశేఖరుఁ డద్భుత శౌర్యధైర్య దుర్వారుఁడు మెచ్చి పైఁడి యొసఁగ దగిన కేలనానంగు పేశ దైత్యారి సమానమూర్తి తన హస్తముమీదుగ నందె వార్ధి గంభీరుఁడు వత్సవాయికుల పేరయ తిమ్మ నృపాలుఁ డున్నతిన్.

—ఏనుగు లక్ష్మణకవి, 'రామవిలాసము', అవతారిక, పుట 23.

70. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము, ఆరవ సంపుటము, పుట 55.

71. ఆం. ప్ర. డిస్ట్రిక్ట్ గజిటీర్స్ : ఈస్ట్ గోదావరి, పుట 250.

72. డా॥ తూమాటి దొణప్ప, ఆంధ్ర సంస్థానములు - సాహిత్య పోషణము [వాల్తేరు, 1969], పుట 247.

73. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము, ఐదవ సంపుటము, పుట 693.

74. ఆం. ప్ర. డి. గ. : ఈస్ట్ గోదావరి, పుట 248.

75. ఆంధ్ర సంస్థానములు - సాహిత్య పోషణము, పుట 534.

76. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పుట 408, 410.

77. ఆం. ప్ర. డి. గ. : ఈస్ట్ గోదావరి, పుట 242.

78. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము, మూడవ సంపుటము, పుట 111.

79. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము; పుట 23.

80. పైది, మూడవ సంపుటము, పుట 90.

81. పైది, మొదటి సంపుటము, పుట 287.

82. పైది, పుట 453-454

83. ఆం. ప్ర. డి. గ. ఈస్ట్‌గోదావరి, పుట 244.

84. మద్రాస్ డిస్ట్రిక్ట్ గజిటీర్, గోదావరి, వాల్యూం 1, పుట 252.

85. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము, మూడవ సంపుటము, పుట 112–113.

86. కథలు–గాథలు, పుట 600.

87. మద్రాస్ డిస్ట్రిక్ట్ గజిటీర్స్: గోదావరి, వాల్యూం 1, పుట 252.

88. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము, మూడవసంపుటము, పుట 310.

89. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పుట 81.

90. సంగ్రహాంధ్రవిజ్ఞానకోశము, అయిదవ సంపుటము, పుట 64

91. పైది, నాల్గవ సంపుటము, పుట 621–622

92. పైది, అయిదవ సంపుటము, పుట 694.

93. 'ఆంధ్రభూమి' [వారపత్రిక] 28. 4. 1983, పుట 48.

94. కథలు–గాథలు, పుట 502

95. ఆం. ప్ర. డి. గ. ఈస్ట్ గోదావరి, పుట 248

96. మద్రాస్ డిస్ట్రిక్ట్ గజిటీర్స్, గోదావరి, పుట 253.

97. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము, మూడవసంపుటము, పుట 44–45

98. మ. డి. గ. గోదావరి, వాల్యూం II [మద్రాసు, 1935], పుట 194.

99. ఆం. ప్ర. డి. గ. ఈస్ట్‌గోదావరి, పుట 241–242.

100. మ. డి. గ. గోదావరి, పుట 215.

101. సం. ఆం. వి. కోశము, మూడవసంపుటము, పుట 646

102. మ. డి. గ. గోదావరి, పుట 219–220.

103. ఆం. ప్ర. డి. గ. ఈస్ట్ గోదావరి, పుట 238.

104. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పుట 506.

105. ఆం. ప్ర. డి. గ : ఈస్టు గోదావరి, పుట 241.

106. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పుట 81.

107. పైది, పుట 599.

108. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పుట 355.

109. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పుట 235.

110. డా॥ ఆర్. సుబ్రహ్మణ్యం ది తూండి కాపర్–ప్లేట్ గ్రాంట్ ఆఫ్ విష్ణుకుండిన్ కింగ్ విక్రమేంద్రవర్మ, [హైదరాబాద్, 1962], పుట 3.

భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పుట 2.

111. పైది, పుట 476.

112. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పుట 169.

డా॥ ఎన్. రమేశన్, కాపర్ ప్లేట్ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ మ్యూజియం, వాల్యూం 1, [హైదరాబాద్, 1962], పుట 243.

113. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పుట 12.

114. ఆంధ్రపత్రిక [వారపత్రిక] 20–4–83, డా॥ పి. శివరామ కృష్ణమూర్తి, 'మన్యంలో మామిడి కొత్త' వ్యాసం, పుట 25.

115. మ. డి. గ. : గోదావరి, పుట 210.

116. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పుట 311.

117. ఆం. ప్ర. డి. గ. : ఈస్ట్ గోదావరి, పుట 241.

118. కుందూరి ఈశ్వరదత్తు, శాసన శబ్ద కోశము (ఆంధ్రదేశము), [హైదరాబాద్: 1967], పుట 58.

(అయిపోయింది)

శ్రీ జాస్తి దుర్గాప్రసాద్

# శ్రీ విషమసిద్ధి పెద్దాపురపాడు తామ్ర శాసనము - 1

### మొదటి రేకు - రెండవ ప్రక్క

1. ✽ స్వస్తి । శ్రీమతాం సకల జగదభిష్టూయమాన మానవ్య
2. స గోత్రాణాం । హారీతి పుత్రాణాం స్వామి మహాసేన పాదాను
3. ధ్యాతానాం । కౌశికీ వరప్రసాదలబ్ధ రాజ్యానాం । భగవన్నా
4. రాయణ ప్రసాద సమాసాదిత వర వరాహ లాం
5. ఛనానాం । చాలుక్యానాం కులజలధిసముదితేన్దు శ్రీ
6. విష్ణువర్ధనమహారాజః । తస్యాత్మజ శ్రీ[1] జయసింహవర్మణః ।
7. తత్ప్రియానుజస్య । ఇన్ద్రభట్టారకస్య ప్రియఃతనయ శ్రీ[2] విషమసి
8. ద్ధి మహారాజః ॥। యాపనీయ వృక్షమూలగణ తిలకస్య భ

### రెండవ రేకు - మొదటి ప్రక్క


9. గవతః కనకనన్ద్యాచార్యస్య దర్మోపదేశ నకసుమిస్థితా
10. య జినాలయాయ । భగవతామర్హతాం బలివైశ్వదేవ శరణా
11. ర్థం స్వధర్మాభివృద్ధ । అష్టమి విషయే కాకణ్డిపఱ్ఱునామ గ్రామస్య
12. జినాలయస్య స్థల భోగక్షేత్రస్య ఉత్తరతః రథ్యామార్గః పూర్వతః
13. పన్థః దక్షిణ స్తటాకం పశ్చిమ స్తటాకాదుదగ్రిత్యా జుగత్యా
14. రథ్యా మార్గః ॥। గ్రామస్య పూర్వస్యాన్దిశి కుమ్మలమ్మునామ
15. క్షేత్ర[3] ద్వాదశవ్రీహి ఖణ్డికాఫలస్థానం । అన్యం పితమైక
16. పదుగనామక్షేత్రం ద్వాదశ వ్రీహి ఖణ్డికాఫలస్థానం । గ్రామస్య
17. దక్షిణతః త్రిశత క్రముక వృక్షవాటం ॥ ✽ ॥ తస్యైవ ప్రతి

### రెండవ రేకు - రెండవ ప్రక్క

18. బద్ధే । తురంగునామ గ్రామ జినాలయస్య స్థల భోగ క్షేత్రస్య
19. పూర్వ తఃప్పన్థః దక్షిణతః రథ్యా పశ్చిమతః రథ్యా ఉత్తరతః గోవా
20. రం ॥। గ్రామస్య ఉత్తరతః తాఱమ్మునామ ఫ క్షేత్రం తస్యపూ
21. ర్వతః గోవారం దక్షిణతప్పన్థః పశ్చిమతో కప్పగడా
22. ఉత్తరతః దమ్మిగుణ్ణక్షేత్రం ॥। ✽ ॥। తస్యైవ ప్రతిబద్ధే
23. క్త్రొయ్యూరు నామ గ్రామ జినాలయస్య స్థల భోగ క్షేత్రస్య పూ
24. ర్వతః రథ్యా దక్షిణతోరణ్యం[4] పశ్చిమతో వటవృక్షం ఉత్తరతో
25. రథ్యా మార్గం గ్రామస్య ఈశాన్యాన్దిశి అష్టశత ఖణ్డికాఫల
26. స్థానం త్రిరావనామక్షేత్రం । తస్య పూర్వతః ఊషు క్షేత్రం దక్షిణ

### మూడవ రేకు - మొదటి ప్రక్క


27. తో నవరామం పశ్చిమతో గ్రామస్య మహాసీమా ఉత్తరస్యాపి[5] మహా
28. సీమా । అన్యం ద్విశత ఖణ్డికాఫలస్థానం ద్విరావం గ్రామస్య దక్షిణ
29. తః షడ్ఖణ్డికా కోద్రవ బీజఫలస్థానం ✽ ఇత్యేవమాది క్షే
30. త్రస్య ఉభయ సస్య భోగ్యస్య సర్వకర పరిహారోదత్తః
31. బహుభిర్వసుధాదత్తా ॥। బహుభిశ్చానుపాలితా ॥। య
32. స్య యస్య యదా భూమి ॥। స్తస్య తస్య తదాఫలం ॥। నవి
33. (షం వి) షమిత్యాహుః దేవస్వం విషముచ్యతే ॥। విషమేకా
34. (కినం హన్తి) ॥। దేవస్వం పుత్రపౌత్రికం ॥। స్వదత్తం పరదత్తం వా ॥।
35. (యో హరేత్తు) వసుంధరాం ॥। షష్టివర్షా[6] సహస్రాణి ॥। విష్ఠాయాం జా
36. (యతే క్రిమిః) ॥।



మొదటి రేకు - రెండవ ప్రక్క

## అనువాదము

1–8 శుభము. శ్రీమంతులు, సకల జగత్తుచే స్తుతింపబడు చున్న మానవ్యస గోత్రీకులు, హారీతిపుత్రులు, స్వామి కుమారస్వామి పాదములు ధ్యానించువారు, పార్వతీ పర ప్రసాదముచే పొందబడిన రాజ్యము కలవారు, భగవన్నారాయణుని అనుగ్రహముచే సంపాదింపబడిన ఉత్తమ వరాహలాంఛనము కలవారు, నగు చాలుక్యుల వంశమనెడి సముద్రములో పుట్టిన చంద్రుని వంటివాడు శ్రీ విష్ణువర్ధన మహారాజు. అతని కుమారుడు శ్రీ జయ సింఘ(హ)వర్మ. అతని ప్రియ సోదరుడగు ఇంద్ర భట్టారకుని ప్రియ తనయుడు శ్రీ విషమసిద్ధి మహారాజు—




రెండవ రేకు - మొదటి ప్రక్క

8–11 యాపనీయ (జైనులలోని అధానవర్గము) ఉపదేశిక గణములో శ్రేష్ఠుడు, పూజ్యుడు - నగు కనకనన్ది ఆచార్యుని ఉపదేశములకు యేర్పడిన జినాలయము కొరకు; పూజ్యులగు అర్హతుల యొక్క బలివైశ్వ దేవముల (పశు పక్ష్యాదుల) రక్షణ కొరకు; స్వధర్మాభి వృద్ధికొరకు—

11–17 అష్టమి విషయ మందలి కొకణ్డిపోఞ్ఞు నామక గ్రామము నకు సంబంధించిన జినాలయము యొక్క స్థల భోగ క్షేత్రమునకు – ఉత్తరమున రాజమార్గము, తూర్పున కాలిబాట, దక్షిణమున తటాకము, పడమర తటాకము నుండి ఉత్తరముగ పోవు రాజమార్గము ॥ గ్రామము నకు పూర్వదిశయందు పంప్రెంపు (పట్టుకొనవచ్చును)

విత్తనములు పట్టుటకు సరిపోవు భూస్థానమగు తుమ్మ అమ్మ నామక క్షేత్రము, మరియు అంతే విస్తీర్ణము గల పితిత్రైక (?) పదుగ నామక క్షేత్రము; గ్రామము నకు దక్షిణమున మూడువందల పోకచెట్లుగల తోట;




రెండవ రేకు - రెండవ ప్రక్క

18- 22 ఆ కనకనన్ది ఆచార్యునితో సంబంధించిన – తురంగు నామక గ్రామ జినాలయము యొక్క స్థలభోగక్షేత్రము నకు – తూర్పున కాలిబాట, దక్షిణమున రాజమార్గము, పశ్చిమమున రాజమార్గము, ఉత్తరమున గోచారము ॥ గ్రామమునకు ఉత్తరమున తా...నామక పలక్షేత్రము (పంటభూమి). దానికి తూర్పున గోచారము, దక్షిణమున కాలిబాట, పడమర ఉప్పుగడ్డ, ఉత్తరమున చమ్మగుణ్ణ క్షేత్రము;

22- 29 ఆ కనకనన్ది ఆచార్యునితో సంబంధించిన – క్లొయ్యూరు నామక గ్రామ జినాలయము యొక్క స్థలభోగక్షేత్రము నకు – తూర్పున రాజమార్గము, దక్షిణమున అరణ్యము' పడమర వటవృక్షము, ఉత్తరమున రాజమార్గము ॥

గ్రామమునకు ఈశాన్య దిశయందు ఏబదివందల పుట్లు ధాన్యము లభించు త్రిరావనామక క్షేత్రము. దానికి తూర్పున పవిటీభూమి, దక్షిణమున నవరామము, పడమర గ్రామ పొలిమేర, ఉత్తరమునను పొలిమేరయే. మరియు రెండువందల పుట్లు ధాన్యము లభించు ద్విరావ నామక క్షేత్రము; గ్రామమునకు దక్షిణమున ఆరుపుట్ల అక్క విత్తనములు చల్లుటకు సరిపోవు పంటభూమి;



మూడవ రేకు - మొదటి ప్రక్క

29– 30 (ఉభయ సస్యభోగ్యమగు) ఇత్యాది క్షేత్రమునకు సమస్తమైన పన్నుల మినహాయింపు చేయబడినది.

31– 32 పలువురిచే భూమి దానము చేయబడినది. పలువురిచే నయ్యది అనురక్షింపబడినది. ఎప్పుడెవ్వరెవ్వరికి భూమి యుండునో, అప్పుడు వారివారికి ఫల(సాయి) ముండును.

33– 34 విషము విషము కాదందురు. దేవస్వము (దేవతల– పండితుల– సొమ్ము) విషమనబడును. విషమొక్కనినే చంపును. దేవస్వము పుత్రపౌత్రులనుగూడ చంపును.

35– 36 స్వదత్తముగాని పరదత్తముగా అయిన భూమిని ఎవడు హరించునో, వాడు మలమునందు అరువది వేల సంవత్సరములు క్రిమిగా పుట్టుచుండును.

## శాపవము

ఈ శాసనము మరోరెండు శాసనములతో బాటు[7] తూర్పు గోదావరి జిల్లా కాకినాడ–ద్రాక్షారామ మార్గములో అర్యవటమునకు దాపున నున్న 'పెద్దాపురప్పాడు' అను గ్రామ సరిహద్దులలో పాటి మట్టి త్రవ్వుచుండిన ఆ గ్రామ నివాసులైన కొందరు ఆది ఆంధ్రులకు ఒక మృణ్మయ పాత్రలో లభించినది. విషయము కర్ణాకర్ణిగ తెలిసిన నేను కొంత వ్యయప్రయాసలకులోనై వారి నుండీ వాటిని సంపాదింప గలిగితిని.[8]

## ఆకారాదికములు

ఈ శాసనమున మూడు రేకులున్నవి. ఒక్కొక్క రేకు పొడవు 17. 5 సెం. మీ; వెడల్పు 8 సెం. మీ.; మందము 0. 25 సెం. మీ. అయితే రేకుల పొడవు, వెడల్పులు అన్నీ ఒకే మందములో లేవు. ఈ రేకులను ఒక కడియములో దూర్చి భద్ర పరచుటకు అనువుగ ఒక్కొక్క రేకుకు యెడమప్రక్క అంచునకు ఒక సెంటీమీటరు దూరమున 1. 3 సెం. మీ. వ్యాసముగల రంధ్రము ఉన్నది. శాసనపు రేకుల తూకమీక్రింది విధముగా నున్నది–

మొదటి రేకు తూకము 175 గ్రాములు
రెండవ రేకు తూకము 245 గ్రాములు
మూడవ రేకు తూకము 145 గ్రాములు


రేకుల తూకము మొత్తము 565 గ్రాములు.

అయితే బంగారమేమో యన్న భ్రమతో కడియమును తెగగొట్టి రేకులను తీయుటలో మొదటి రేకు కుడివైపు క్రింది అంచున చిన్న ముక్క (అదృష్టవశాత్తూ అక్షర భాగము కాదు), మూడవ రేకు కుడివైపు రంధ్రము క్రింది అంచు కొంత భాగము (అయితే సాంప్రదాయముగా నుండు వ్యాస ప్రోక్త గీతములగుటచే పూరింపుటలో యిబ్బంది కలుగలేదు) పోయినవి. రేకులను శాస్త్రీయ పద్ధతిలో కిలము మొదలైనవి పోగొట్టుటలో యెటువంటి యిబ్బంది యును కలుగలేదు.[9] మొదటి రేకు మొదటి ప్రక్క, మూడవరేకు రెండవ ప్రక్క వ్రాతలేదు. రేకుల మీది అక్షరములు లోతుగాను, పొంకముగానే చెక్కబడినవి. శాసనాక్షరములు మొదట పెద్దవిగా నున్నను పోను పోను చిన్నవిగా, గుండ్రముగా, అందముగాను చెక్కబడినవి.

ఈ శాసనమందలి మొత్తము పంక్తుల సంఖ్య 36.

| | | |
|---|---|---|
| మొదటి రేకు | రెండవ ప్రక్క | 8 పంక్తులు. |
| రెండవ రేకు | మొదటి ప్రక్క | 9 పంక్తులు. |
| రెండవ రేకు | రెండవ ప్రక్క | 9 పంక్తులు. |
| మూడవ రేకు | మొదటి ప్రక్క | 10 పంక్తులు. |
| | మొత్తము | 36 పంక్తులు. |

## రాజ ముద్రిక - కడియము



శాసనపు మూడురేకులను గుదిగ్రుచ్చి యుంచిన సుమారు ఒక సెంటీమీటరు మందముగల రాగి కడియము యింతకు ముందే నుడివినట్లు తెగగొట్టబడినది. సుత్తిదెబ్బలకు, ఆకురాతి రాపిడులకు మెలికలు తిరిగి కొన్ని చోట్ల బద్దెవాటుగా తయారయినది.

కడియమున గల రాజముద్రిక తూర్పు వేంగి చాళుక్యవంశ భూవరుల సాంప్రదాయము లోనే యున్నది. ముద్రిక పైభాగమున సూర్యుడు, చంద్రవంక—వీటికి దిగువన 'శ్రీ విషమసిద్ధి'

అని అక్షరములును ('శ్రీ' అక్షరభాగము లుప్తము). క్రింది భాగమున వరాహప్రతిమయు, దానికి కుడిప్రక్క అంకుశమును, అన్నింటికంటె దిగువన పద్మమును ఉబ్బుగ పోతపోయబడి యున్నవి. రాజముద్రికతోనున్న కడియము మొత్తము 645 గ్రాముల బరువు తూగినది. అనగా రాజముద్రికతో నున్న కడియమునకు గుదిగ్రుచ్చబడి యుండు యీ శాసనము మొత్తము తూకము 1210 గ్రాముల పైబడియుండునన్నమాట.

## శా స న భా ష

ఈ శాసన భాష పూర్తిగా సంస్కృతము. గద్యములో నున్నది. అయితే దానము చేసిన భూభాగముల సరిహద్దులను దెలుపు సీమలు మాత్రము (గ్రామముల నామములతో కలిపి) దేశభాష (తెలుగు) లో నున్నవి. భూమిదాన రక్షణ, భక్షణల ఫలాఫలముల దెలుపు వ్యాస ప్రోక్త శ్లోకములు మామూలుగా ప్రతిశాసనాంతమున నున్నట్లే దీనిలోను కడపట నున్నవి.

## శా స న లి పి

ఈ శాసనపు లిపి క్రీ. శ. 7, 8 శతాబ్దులలో ఆంధ్రప్రాంతములో వాడుకలోనున్న తెలుగు-కన్నడ లిపియే. శాసనమున ద్విత్వాక్షరములు, సంయుక్తాక్షరములు, పూర్ణానుస్వారములు సంస్కృత సాంప్రదాయానుసారముగా వ్రాయబడినవి. అయితే యీ శాసనపులిపిలో గమనార్హమైన కొన్ని అంశములున్నవి. అచ్చు అక్షరములతో 'అ' 11, 15, 25, మరియు 28 వ పంక్తులలోను, 'ఇ' 7 మరియు 29 వ పంక్తులలోను, 'ఈ' 25 వ పంక్తిలోను, 'ఉ' 12, 19, 20, 21, 22, 24 మరియు 27 వ పంక్తులలోను, 'ఊ' 26 వ పంక్తిలోను కన్పట్టును. వీటిలో హ్రస్వాక్షరములు '' (ఇ) గాను, అందులో దీర్ఘము 'ఐ' (ఈ) గాను స్పష్టమైన భేదముతో వ్రాయబడినవి. అలాగే '?' (ఉ), '?' (ఊ) లకు మధ్య భేదము సుస్పష్టము.

పోతే హల్లులలోని 'ఇ' కార, 'ఈ' కారములకును భేదము స్పష్టముగా చూపబడినది. హ్రస్వ ఇత్వము అక్షరము పైభాగమున అక్షరమునకు జేర్చి వృత్తముగా ఒక రేఖ రెండు కొసలు అక్షరము పైకి జారునట్లు (3 వ పంక్తి నందలి 'కౌశికి' అన్న పదములోని 'శి=గి' మాదిరి) యీయబడినది. దీర్ఘము రేఖలోని ఎడమవైపు కొసలోపలికి కొద్దిగా వంపు తిరిగినట్లు (అదే 'కౌశికీ' పదములోని 'కీ=?' మాదిరి) వ్రాయబడినది. ఇదే విధముగా 'ఉ' కార, 'ఊ' కారములకును భేదము చూపబడినది. (మొదటి పంక్తిలోని 'జగదభిష్టూయమాన' పదమునందలి 'ష్టూ=? 2 వ పంక్తి చివరలోగల 'పాదాను' లోని 'ను=?' మాదిరి).

ఇంక హల్లులలోను ప్రత్యేకించి గమనింపదగిన విశేషములున్నవి. ఉదాహరణమునకు 'అ' అను యక్షరము-ఈ 'అ' కారము అలఘు అ కారముగా (శకట రేఫముగా) 'కొకణ్డిఃస్ఱు' (11 వ పంక్తి), 'కుమ్మఱమ్ము' (14 వ పంక్తి), 'ఊఱమ్మ' (20 వ పంక్తి), 'క్ఱొయ్యూను' (23 వ పంక్తి) వంటి తెలుగు పదములనుండుటసర్వసామాన్యమే అయినను 'పితఱైక' (15వ పంక్తి), 'పూర్వ తఱ్పన్థః' (19 వ పంక్తి), 'దక్షిణతఱ్పన్థః' (21వ పంక్తి) వంటి సంస్కృత సమాసములందును అలఘు 'అ' కారముగా వాడబడినది. అలాగే 'లాంఛనానాం' (5-6 వ పంక్తి), 'సింహ' (6 వ పంక్తి) పదములందు వర్గానునాసికల నుపయోగింపలేదు. 'ర' కార సంయుక్తమున 'ర' కారమునకు బదులుగా కుడిపైపున 'ˉ' 'ర' కార పొల్లును నిల్పుచు ఆ వెనుకటి యక్షరము ద్విత్వము గావింపబడినది. ఉదా॥ 'జయసింహవర్మ్మణః' (6 వ పంక్తి), 'మార్గ్గణః' (12, 14 మరియు 25 వ పంక్తులు), 'పూర్వ్వతః' (12, 19, 20-21, 23-24 మరియు 26 వ పంక్తులు)మొదలైనవి. శాసనాక్షరములకు చాలవరకు తలకట్టు స్పష్టముగా '✓' మాదిరి యివ్వబడినది. అయితే అట నట అర్ధచంద్రాకృతిలో '◡' వలె నీయబడుట గమనార్హము.

శాసన కావ్యకర్త, ఆజ్ఞప్తి, లేఖక నామధేయములు, దాన కాలము శాసనములో ఉటంకింపబడకుండుట మరియొక విశేషము.

## శా స న కా ల ము

శాసనమునందు దానసమయ సందర్భము లీయబడలేదు. శకముగాని, ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరముగాని, మరియే యితర సూచనలుగాని కానరావు. కాని శాసనము మొదటి రేకు రెండవప్రక్క గల శాసనపాఠము మొదటి 8 పంక్తులలో నీయబడిన వంశక్రమమును, రాజ ముద్రికపైనున్న 'శ్రీ విషమసిద్ధి' బిరుదమును జూడ పూర్వాంధ్రమును వేంగి రాజధానిగా చేసుకొని పాలించిన పూర్వ చాళుక్య పరిపాలకులలో మొదటివాడైన కుబ్జ విష్ణువర్ధనుని మనుమడు రెండవ విష్ణువర్ధనమహారాజు యీ దానము నొసంగినట్లు అర్థమగుచున్నది. ఈ రెండవ విష్ణువర్ధనుడు క్రీ. శ. 673 మొదలు క్రీ. శ. 681 వరకు సుమారు తొమ్మిదిసంవత్సరములు రాజ్యము చేసెనని అనేక శాసనములను బట్టి యిదివరకే నిర్ధారింపబడినది.[10] కనుక యీ శాసనము అతని తొమ్మిది సంవత్సరముల పరిపాలనా కాలములోనె ప్రకటింపబడి యుండుననునది నిర్వివాదాంశము.

## శాసన విషయము

శాసనములో ముందుగా వేంగిచాళుక్య వంశవర్ణనము కావింపబడినది. వంశక్రమములో శ్రీ విష్ణువర్ధన మహారాజు, అతని కుమారుడు శ్రీ జయసింహవర్మ, జయసింహుని ప్రియ సోదరుడు ఇన్ద్రభట్టారకుడు, ఆ ఇన్ద్రభట్టారకుని ప్రియ తనయుడు శ్రీ విషమసిద్ధి మహారాజు (రెండవ విష్ణువర్ధనుడు) పేర్కొనబడినారు.

'విషమసిద్ధి' బిరుదాంకితుడయిన రెండవ విష్ణువర్ధన మహారాజు జైన యాపనీయ గణశ్రేష్ఠుడు, పూజ్యుడునగు కనకనన్ది ఆచార్యుని ఉపదేశములకై యేర్పడిన జినాలయముల కొరకు, పూజ్యులగు అర్హతుల బలివైశ్వదేవముల రక్షణకొరకు, స్వధర్మాభివృద్ధికొరకు యీ భూదాన శాసన మివ్వబడినది.

కనకనన్ది ఆచార్యుని అధీనములో కాకణ్డిపల్లు, తురంగు మరియు క్త్రొయ్యూరు గ్రామాలలోని జినాలయము లుంచబడినట్లు తెలియుచున్నది. ముందుగా కాకణ్డిపల్లు గ్రామ జినాలయ స్థలభోగ క్షేత్రమునకు సరిహద్దులు పేర్కొనబడినవి. ఆ గ్రామ పూర్వదిశయందుగల ఒక్కొక్కటి పన్రెండు (పుట్లు కావచ్చును) విత్తనములు చల్లుటకు సరిపోవు ఫలస్థానములగు కుమ్మఅమ్ము, పితత్రైక(?) పడుగ నామక్షేత్రములు మరియు దక్షిణమున మూడువందల పోక చెట్లుగల తోట జినాలయము అధీనము చేయబడినది.

పిదప తురంగు గ్రామ జినాలయ స్థలభోగ క్షేత్రమునకు ఎల్లలు యీయబడినవి. ఈ గ్రామమునకు ఉత్తరమునగల తాలఅమ్మ ఫలక్షేత్రము, తూర్పున గోచారము, దక్షిణమున కాలిబాట, పడమర ఉప్పుగడ్డ, ఉత్తరమున దమ్మిగుణ్డ క్షేత్రము హద్దులుగా గలిగినది-జినాలయము అధీనము గావింపబడినది.

ఇంక క్త్రొయ్యూరు గ్రామ జినాలయ స్థలభోగ క్షేత్రమునకు సరిహద్దులు, యీ జినాలయాధీనము గావింపబడిన ఆ గ్రామమునకు ఈశాన్య దిశయందుగల ఎనిమిది వందల పుట్లు ధాన్యము లభించు త్రిరావ క్షేత్రమునకు సరిహద్దులు, రెండు వందల పుట్లు ధాన్యము లభించు ద్విరావ క్షేత్రమును, గ్రామమునకు దక్షిణముననున్న ఆరు పుట్ల ఆళ్ళ (ధాన్యము) విత్తనములు వేయుటకు సరిపడు క్షేత్రమును 22వ పంక్తినుండి 29వ పంక్తివరకుగల శాసనభాగమున వివరింపబడినవి.

కనకనన్ది ఆచార్యుని అధీనములోని కాకణ్డిపల్లు, తురంగు మరియు క్త్రొయ్యూరు గ్రామాలలోవి జినాలయములకు సంబంధించిన పైన పేర్కొనబడిన ఫలక్షేత్రముల కన్నింటికి (రెండు పంటలూ అనుభవింప వీలగునట్లు) యీ శాసనము ద్వారా అన్ని రకముల సుంకముల మినహాయింపు రెండవ విష్ణువర్ధనమహారాజు యిచ్చినట్లు కనబడుచున్నది.

శాసనాంతమున సంప్రదాయము ననుసరించి వ్రాయు వ్యాస గీతా శ్లోకములు యీ దానమునకు ప్రమాణములుగ పేర్కొనబడినవి.

## విశేష చారిత్రకాంశములు

'సర్వలోకాశ్రయ', 'ప్రశయాదిత్య', 'విషమసిద్ధి', మరియు 'మకరధ్వజ' బిరుదులు వహించిన రెండవ విష్ణువర్ధన మహారాజుచే ప్రకటితమయిన తామ్ర, శిలా శాసనములు యింతదనుక మనకు ఆరు లభ్యమయినవి. ఇందు మొదటిది విష్ణువర్ధనువి "పెదచెరుకూరు శిలాశాసనము." విజయయాత్ర (?) నుండి ప్రత్యాగతుడగుచు విష్ణువర్ధనుడు సామంత పరివేష్టితుడై చెఱుకూరు (గుంటూరు జిల్లా) గ్రామమునకు విచ్చేసి భగవంతుడు త్రివిక్రమస్వామిని సేవించిన సందర్భమున ఉంద్రాల పాలెము, ఓబలసాని పాలెము, చెఱుకూరు గ్రామములందు కేసరిపాటి కొలతతో కొన్ని భూఖండములు, మరియు కసుకుర్తి, ఇనుగుర్తి, కొండపాంటూరు గ్రామములను త్రివిక్రమ పురమను వ్యవహారనామము కల్పించి త్రివిక్రమస్వామికి సమర్పించినాడు. శాసనమునందలి దానకాలము క్రీ. శ. 656 అయి యుండనోపును.[12] అనగా విష్ణువర్ధనుడు పెదతండ్రి మొదటి జయసింహవల్లభుని పాలనా కాలములో అతడికి పరిపాలనలో సహాయకారిగా ఉండి యుండవలెను.

రెండవది కొణికి శాసనము. రెండవ విష్ణువర్ధనుడు తన పెద తండ్రి జయసింహ వల్లభుని 30 వ ప్రవర్ధమాన విజయ రాజ్య సంవత్సరములో (క్రీ. శ. 669) స్వీయఆయుర్బల విజయ భోగైశ్వర్య వృద్ధికి ఆతుకూరు నివాసి, పరాశర గోత్రికుడునగు విదుశర్మకు కమ్మరాష్ట్రమందలి కొణికి గ్రామమును దానమిచ్చిన సందర్భమున యీ శాసనము నిచ్చినాడు.[13]

విష్ణువర్ధనుని మూడవ శాసనము రేయూరు దానశాసనము. తన ద్వితీయ ప్రవర్ధమానవిజయరాజ్య సంవత్సరములో (క్రీ. శ. 674) బలవిజయారోగ్య నిమిత్తము కర్మరాష్ట్రమందలి రేయూరు గ్రామమును కాశ్యప గోత్రికుడు, బొప్పబోయ తనయుడు, బ్రాహ్మణుడు నగు కుమారశర్మకు దానమిచ్చిన సందర్భములోనిది.[14]

ఇంక నాల్గవది అతడి మూడవ పరిపాలనా కాల సంవత్సరములో (క్రీ. శ. 665) వర్మాణ్డు విషయము నందలి పంటి ముక్కు గ్రామములోని కొంత భూభాగమును బ్రాహ్మణ కుట్టి శర్మకు దానమిచ్చిన సమయమున ప్రకటించిన పమిడి ముక్కల శాసనము.[15]

ఐదవ శాసనము అదే గ్రామములోని మరొక భూభాగమును వత్సగోత్రీకుడు, వాజసనేయ చరణుడునగు భావశర్మకు దాన మొసంగుచు నిచ్చినది.[16] అయితే యిందు దానకాలము పేర్కొనబడలేదు.

ఆరవ శాసనము రెండవ విష్ణువర్ధనుడు తన అయిదవ పరిపాలనా కాల సంవత్సరములో (క్రీ. శ. 668) సూర్యగ్రహణ సందర్భమున కండేఱువాటి విషయ మండలి అసనపుర నివాసి దుర్గశర్మకు గుద్రహార విషయములోని పల్లివాడ గ్రామమును దాన మిచ్చిన సందర్భములోనిది.[17]

ఇంక యిప్పటి యీ 'పెద్దాపురప్పాడు-1' తామ్రశాసనము యేడవది. విష్ణువర్ధనుడు వెలువరించిన, యిప్పటి వరకు వెలుగులోనికి వచ్చిన వానిలో సరిక్రొత్త శాసనము.

'అనేక సమర సంఘట్టోపలబ్ధ యుద్ధవిజయ యశస్కుడు'గా కుమారుడు మంగి యువరాజు శాసనమొక దానిలో[18] రెండవ విష్ణువర్ధనమహారాజు పేర్కొనబడుచున్నను ఆ అనేక సమరవిజయములకు సంబంధించిన వివరములు మనకలభ్యముగా నున్నవి. ఇంతదనుక విష్ణువర్ధనుడు దానమిచ్చిన గ్రామములు కృష్ణానదికి దక్షిణముననే గుర్తింపబడినవి. కృష్ణకు ఉత్తరముగా ఇతని అధికారము ఎంతవరకు విస్తరించినదో అగమ్యగోచరముగా నుండెడిది. అయితే పల్లివాడ దానశాసనము (పైన పేర్కొనబడిన అరవ శాసనము) వలన అతడి అధికారము గుద్రహార విషయము వరకు (తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురము తాలూకా) నెలకొని యున్నదని తెలియుచున్నది.

ఇప్పటి క్రొత్త 'పెద్దాపురప్పాడు-1' తామ్రశాసనము విష్ణువర్ధనుని రాజ్యముయొక్క పరిధిని ఉత్తరముగా మరింత విస్తరింపజేయుచున్నది. ఇందు పేర్కొనబడిన కాకర్దివల్లు గ్రామమును ప్రస్తుతము తూర్పుగోదావరి జిల్లా ముఖ్య పట్టణమైన కాకినాడతోను, తురంగు గ్రామమును కాకినాడ అంతర్భాగమే అయిన జగన్నాధ పురమందలి తురంగేశ్వర ఆలయ ప్రాంతముతోను, క్రొయ్యూరు గ్రామమును కొవ్వూరు (కాకినాడ జగన్నాధపురము వంతెనకు పడమరగా ఒక కిలోమీటరు దూరములోనున్నది) తోను గుర్తింపననువుగా నున్నవి. పైగా శాసనము దొరికిన పెద్దాపురప్పాడు- ఆర్యవటము ప్రాంతము కాకినాడకు అత్యంత సమీప ప్రదేశమగుట గమనార్హము. అయితే శాసనములో పేర్కొనబడిన ఆయా గ్రామములందలి జినాలయముల శిథిలములనైననూ యీనాడు గుర్తించుట అంత సులభము కాకపోవచ్చును. కాని శాసనము లభించిన ప్రాంతమంతయును క్రీ. శ. ఆరంభ శతాబ్దులలో జైన మత ప్రాచుర్యముతో పరిఢవిల్లినట్లు అందరకు తెలిసినదే. ఆర్యవటమునకు 'జైనపాడు' అని పూర్వ నామము. జైన విగ్రహములును, శిథిలములును, యీ ప్రాంతమున విరివిగా లభ్యమయినవి.[19]

ఆంధ్రదేశమున క్రీ. శ. ఏడవశతాబ్ది క్షీణిస్తున్న బౌద్ధమునకు నిదర్శనమయినట్లే జైనులు తమ మతము ప్రజలలోనికి చొచ్చుకొని పోవుటకు చురుకుగా కృషి సల్పుట కూడా వీక్షించినది. వేంగీ చాళుక్య పాలకులు జైనమతావలంబకులు కాకున్నను (శైవకుడయిన విమలాదిత్యుడు మినహా) జైనమును బాగుగానే ఆదరించిరి నిదర్శనము లున్నవి. ఇంతదనుక వేంగీ చాళుక్య భూపతులు జైనమును ఆదరించినట్లు తెలుపు మొదటి శాసనము మూడవ విష్ణువర్ధన మహారాజు (క్రీ.శ. 718-752) కాలము నాటిది.[20] అయితే యిప్పటి పెద్దాపురప్పాడు-1 శాసనము నుండి తెలియనగునది రెండవ విష్ణువర్ధన మహారాజు కూడ జైనము నాదరించిన విషయము. వేంగీ చాళుక్య వంశములో 'పరమ మాహేశ్వర'నిగా బిరుదు వహించిన మొదటి మహారాజు యితడే. అటువంటి యితడు జైనము నాదరించుట నిజముగా విశేషమే. ఇతని సంతతి వాడైన రెండవ అమ్మరాజు కూడా 'పరమ మాహేశ్వరుడే'.[21] అయినను (క్రీ. శ. 945-970) జైనము నాదరించినాడు. కాని జైనమునకై యితడిచ్చిన దానములు యితరుల అభ్యర్థనపయి నీయబడినవి.[2] సింహాసన మునకయి తఱచు దాయాదులతో పోరాటము సల్పవలసి వచ్చినందున అందుకు తన సైన్యాధికారులపై ఆధారపడిన ఇతడు వారిని సంతృప్తి పరచుటకు, తద్వారా వారి విధేయతను నిలుపుకొనుటకు జినాలయముల స్థాపన, పోషణలకై దానముల నిచ్చియుండవచ్చును.[23] ఇదే కారణము పురస్కరించుకొని తఱచు ఉత్తరమున కళింగ గాంగులతోను, దక్షిణమున పల్లవులతోను తలపడవలసి వచ్చిన, రెండవ అమ్మరాజు పూర్వీకుడైన రెండవ విష్ణువర్ధనుడును యీ 'పెద్దాపురప్పాడు-1' శాసనమున పేర్కొనబడిన ఆయా గ్రామాలలోని జినాలయములకు దానములిచ్చి జైనము నాదరించి యుండవచ్చును. ఇది ఊహాజనిత హేతువు మాత్రమే. ఏది యేమైనను వేంగీ చాళుక్య భూవరులు జైనము నాదరించినట్లు తెలుపు మొదటి శాసనమిప్పుడు రెండవ విష్ణువర్ధనుని యీ 'పెద్దాపురప్పాడు-1' శాసనమే యగును.

పోతే 'పెద్దాపురప్పాడు-1' శాసనమున గమనించదగిన మరియొక విశేషాంశ మున్నది. అది జైన యాపనీయ గణమునకు సంబంధించిన ప్రసక్తి. ఇంతకు ముందు మనకు లభించిన వేంగీ చాళుక్య పాలకుల శాసనములలో మొదటగా యీ యాపనీయుల ప్రసక్తి రెండవ అమ్మరాజు మలియంపూండి శాసనములో వచ్చినది.[24]

అమ్మరాజు తన రాజ విషయాధ్యక్షుడు, కర్మరాష్ట్రి అధిపతియునగు దుర్గరాజు నిర్మించిన కటకాభరణ జినాలయమునకయి దానమిచ్చిన సందర్భమున ఆ ఆలయ ప్రధానాచార్యుడును, ప్రతిహార్యమహిమో పేతుడను అయిన శ్రీ మాందిరదేవముని యాపనీయుడని పేర్కొనబడినాడు. శ్వేతాంబర, దిగంబరుల మధ్య అవగాహన యేర్పఱచి జైన సంఘములో ఐక్యతా పునరుద్ధరణకై తీవ్రప్రయత్నము చేసినవారు యీ యాపనీయులు.[25] ఈ శాఖీయులది ఉదార దృక్పథమగుట కారణముగా దక్షిణ భారతదేశములో శాఖోపశాఖలుగా విస్తరించి మిక్కిలి ప్రజాదరణ చూరగొన్నారు.[26] గుంటూరు జిల్లాలో నున్న ధర్మవరము గ్రామ పూర్వనామము ధర్మపురి. యాపనీయ సంఘమునకు ఆంధ్రదేశములో అనాడు యీ ధర్మవరము ప్రధానకేంద్రము.[27] అయితే యీ యాపనీయులు రెండవ అమ్మరాజు పరిపాలనకు మూడువందల సంవత్సరాల పూర్వమే గోదావరీ సీమయందు క్రీ. శ. ఏడవ శతాబ్ది ద్వితీయార్ధములోనే ప్రాచుర్యములో నున్నట్లు యీ 'పెద్దాపురప్పాడు-1' శాసనము స్పష్టము చేయుచున్నది. శాసనములో పేర్కొనబడిన కాకణ్డిపల్లు, తురంగు మరియు క్లొయ్యూరు గ్రామాలలోని జినాలయములకు పాలకునిగా, అధిష్ఠాతగా యున్న కనకనన్ది ఆచార్యుడు యాపనీయ గణశ్రేష్ఠుడుగా కీర్తింపబడినాడు. అతని అధీనములోని జినాలయములకే రెండవ విష్ణువర్ధన మహారాజు అనేక ఫలక్షేత్రములను దానమిచ్చినాడు.

## సంశయాత్మక విషయములు

సంశయము సమగ్ర చారిత్రిక పరిశోధనకు ప్రథమసోపానమని నా అభిప్రాయము. ఏ ఒక్కరూ జ్ఞానమును పూర్తిగా బొపోసన పట్టుట సాధ్యము కాదు. మిడిమిడి జ్ఞానముతో నాయోపినమేర విషయములను వివరించుట జరిగినది.[28] నాకు కల్గిన ఒకటి, రెండు సందేహములను వెలిబుచ్చి యీ రచనను ముగించెదను.

శాసన పాఠములో అట నట కొన్ని పదములకు (పదములే సరియైనవి కాకపోవచ్చును) అర్థము సందర్భానుసారముగానై నను తెలియుటలేదు. అవి-శాసనము తొమ్మిదవ పంక్తిలో చివరనున్న 'నక సుమిస్థితాయ', పదునొకండవ పంక్తి యందలి 'అష్టమి విషయే', పదమూడవ పంక్తిలోని 'ఉదగ్రిత్యా జుగత్యా' అనునవి. అదే విధముగా కనకనన్ది ఆచార్యుని అధీనములో నున్న అయా గ్రామాలలోని జినాలయములకు సమస్త సుంకముల మినహాయింపుతో యిచ్చిన స్థలభోగక్షేత్రములకు హద్దులు చూపబడినవి. కాని క్షేత్రములతో హద్దుల సమన్వయము స్పష్టముగా లేదు. అనగా యే క్షేత్రమునకు యే హద్దులో స్పష్టపడుటలేదు

## సంకేత వివరణ పట్టిక

1. శ్రీ = శ్ర్రి
2. శ్రీ = శ్ర్రి
3. క్షేత్ర = క్షేత్రం
4. దక్షిణతోరణ్యం = దక్షిణతోఽరణ్యం
5. ఉత్తరస్యాపి = ఉత్తరతోఽ
6. షష్టివర్ష = షష్టివర్షా
7. ఈ మూడు శాసనములేగాక మరియొకటి కూడ ఉండియుండవలెను-కారణము-ఈ శాసనములు యిచ్చినవారే ధనాశచే మరియొక శాసనములోని తుదిఫలకమునందలి ఒక భాగమును నా కందజేసిరి.
8. ఈ శాసన సేకర్తణలో నాకు నా సహాధ్యాపకులు శ్రీ రాయుడు గంగారావు, మరియు శ్రీ సలాది ప్రభాకరమూర్తి నాయుడులు యెంతో సహకరించినారు.
9. ఈ ప్రయత్నములో శ్రీ కొండా వెంకటేశ్వరరావు యిచ్చిన సహకారమునకు నా కృతజ్ఞతలు.
10. ఎన్. వెంకటరమణయ్య, ది ఈస్టర్న్ చాళుక్యాస్ అవ్ వేంగి, 1950, పుట 68; బి. వి. కృష్ణారావు, హిస్టరీ అవ్ ది ఈస్టర్న్ చాళుక్యాస్ అవ్ వేంగి, పుట 108.
11. సౌత్ ఇండియన్ ఇన్స్క్రిప్షన్స్, వాల్. 6, నెం 202.
12. భారతి, సెప్టెంబరు, 1972, పుటలు 12-20
13. ఎపిగ్రాఫియా ఇండికా, వాల్. 31, పార్ట్ 2, పుటలు 74-80
14. ఇండియన్ అంటిక్వేరి, వాల్. 7, పుట 185.
15. కాపర్ ప్లేట్ గ్రాంట్ నెం. 15, అఫ్ 1916-17.
16. సి. పి. గ్రాంట్ నెం. 14 అఫ్ 1916-17.

17. ఇండియన్ అంటిక్వెరి, వాల్. 7, పుట 185.

18. ఇండియన్ అంటిక్వెరి, వాల్. 20, పుట 104.

19. విజ్ఞాన సర్వస్వము, సంపుటి-3, పుట-553; ఎస్. గోపాల కృష్ణమూర్తి, జైన వెస్టిజెస్ ఇన్ ఆంధ్ర, పుటలు 23 మరియు 67-68.

20. జర్నల్ ఆఫ్ ఆంధ్ర హిస్టారికల్ రిసెర్చి సొసైటీ, వాల్. 16, పుటలు 42-49.

21. ఎపిగ్రాఫియా ఇండికా, వాల్. 23, పుట 161 వగయిరా; ఇండియన్ అంటిక్వెరి, వాల్. 22, పుట 15.

22. ఎపిగ్రాఫియా ఇండికా, వాల్. 7, పుటలు 177-192;
" వాల్. 9, పుటలు 47-56;
" వాల్. 24, పుటలు 288.

23. బి. ఎస్. ఎల్. హనుమంతరావు, రెలిజియన్ ఇన్ ఆంధ్ర, పుట 170.

24. ఎపిగ్రాఫియా ఇండికా, వాల్. 9, పుటలు 47-56.

25. సి. జె. షా, జైనిజమ్ ఇన్ నార్త్ ఇండియా, పుటలు 181-182.

26. పి. బి. దేశాయి, జైనిజమ్ ఇన్ సౌత్ ఇండియా, పుట 169; ఎం. రాజగోపాలరావు, జైనధర్మము, పుటలు 27-28.

27. విజ్ఞాన సర్వస్వము, సంపుటి 3, పుట 549; ఎస్. గోపాల కృష్ణమూర్తి, జైన వెస్టిజెస్ ఇన్ ఆంధ్ర, పుట 37.

28. ఈ రచనలో నాకెంతో తోడ్పడిన అస్మజ్జనకులు శ్రీ శాంతానంద సరస్వతి (పండితరావు- శాస్త్రి వేంకట నరసింహరావు) కి, గురుతుల్యులు శ్రీ ముసునూరి సాంబశివ రామమూర్తికి నా కృతజ్ఞతలు.


# చంద్రబింబం

శ్రీ ఎస్. ఎ. రష

మొతపులు ప్రస్ఫుటించే
నదీ కెరటాల కదలికల్లో
అస్తిత్వం కోసం పెనుగులాడే
అకశేరుకంలా నలుగుతో,
గిలగిల్లాడుతూ—
పసిడికాంతు లీనుతూ
చంద్రుడు
సాలీడులా వెన్నెల జరీతాళ్ళతో
జారుతూ,
ఆకాశం గోడకి ఎగబ్రాకుతూ—ఉన్నాడు.

—()—

# చందోలు నందలి పండీస్వరస్వామి ఆలయము - ఒక పరిశీలన

ఆంధ్ర, తమిళ దేశములను ఒకే పాలన క్రిందికి తెచ్చిన ఘనత చాళుక్య చోళ రాజైన మొదటి కులోత్తుంగ రాజేంద్ర చోళునకు దక్కినది. ఈతని పాలనలో ఆంధ్రదేశము రాజకీయముగా నిటు పశ్చిమ చాళుక్యుల దాడుల వల్లను, అటు తూర్పు గాంగుల వల్లను ఎన్నో వత్తిడులకు, అటు పోట్లకు గురైనది. అయినప్పటికిని సాంస్కృతికముగను, మత విషయము లందును సర్వతోముఖాభివృద్ధి నొందినది. అందుకు కారణము ఆంధ్రదేశమునందలి పెక్కు మండలాధీశ్వరుల పాలనే కావచ్చును. పేరునకు సార్వభౌమత్వ మంతయు చాళుక్య చోళ రాజుల దైనప్పటికిని నాటికి ఆంధ్ర దేశమంతయు అనేక మండలాధీశ్వరుల పాలన క్రిందనే యున్నది. పన్నెండవ శతాబ్ది మధ్య భాగమునకు సంబంధించిన పెక్కు తెలుగు శాసనముల వలన నీ విషయము స్పష్టమగుచున్నది.[1] అట్టి మండలా ధీశ్వరులలో ముఖ్యులు వెలనాటి చోళులు. వీరు చాళుక్య చోళ రాజులకు మంత్రులుగను, సేనాధిపతులుగను[2] సేవచేసి, క్రతత్ప్రాపకమున క్రమముగా పంచ మహా శబ్దములతో వెలనాటి విషయమునకు మండలాధీశ్వరులై చందోలును ముఖ్యపట్టణముగా జేసికొని వందేండ్లకు పైగా పాలన సాగించిరి.[3] వీరికి ముఖ్యపట్టణమైన చందోలు నేటి గుంటూరు జిల్లా, బాపట్లతాలూకాలోని చందోలు అను గ్రామము. ఇది పొన్నూరునకు 42 కి. మీ. దూరములో నున్నది.

చందోలు నందు నేటికిని నిల్చి వున్న దేవాలయములు, వాని శిల్పము, అందలి శాసనములు మున్నగునవి పరిశీలించినచో నాటి సామాజిక, సాంఘిక, మత విషయములకు సంబంధించిన విషయములనేకము వెలుగులోనికి వచ్చును. ఈ వ్యాసమునందు చారిత్రకముగా చందోలునకు గల ప్రాముఖ్యత పరిశీలింపబడును.

ప్రాయికముగా శాసనాధారములను పరిశీలించినచో నిది 'ధనద పురము'[4] గాను, 'ధనదప్రోలు'[5] గాను, మరియు 'సనద ప్రోలు'[6] గాను పిలువబడినది. మంచన కవి విరచితమైన 'కేయూర బాహుచరిత్ర' యందు ఇది 'ధనదపురము' గాను, అనేక చెఱకు తోటలతోను, తటాకములతోను, దేవాలయములతోను విలసిల్లునది గాను వర్ణింపబడినది.[7] తదుపరి కాలమున 'చంద్రగిరి పట్టణము' గాను, కాలక్రమమున ప్రజల నోటిలో నిది 'చందోలు' గాను నామాంతర మొందినది.

ఈ ఊరి యందలి ప్రధానవీధి కిరుచెరగుల శైవ వైష్ణవాలయము లున్నవి. ఇందు ఒకటి పండీస్వరాలయము, మరి యొకటి చెన్నకేశవాలయము. విష్ణ్వాలయమైన చెన్నకేశవాలయము నందు శాసనములు మృగ్యములు. కాగా, శైవాలయమైన పండీస్వరాలయమునందు ఎనిమిది శాసనములు కలవు. శాసనముల సంఖ్య తక్కువేయైనను చరిత్ర నిర్మాణమునకు ఇవి అందించు విషయములు ఎంతయో ముఖ్యమైనవి.

శక సంవత్సరము 1063, అనగా క్రీ. శ. 1141 లో మహామండలేశ్వరుడైన కొండ పడుమటి బుద్ధరాజు నాదిండ్ల యందలి 2 ఖండికల భూమిని ధనద ప్రోలిలోని పండీస్వరస్వామి కర్పించినట్లున్న శాసనము[8] వీనిలో మొదటిది. ఈ శాసనమునకు సంబంధించిన విషయములు పరిశీలించినచో కొన్ని ఆసక్తికరమైన విషయములు బయల్పడును. వెలనాటి పృథ్వీశ్వరుని పిఠాపురము శిలాశాసనము[9] పరిశీలించినచో వెలనాటి రాజులకును కొండపడుమటి రాజులకును చుట్టరికము లున్నట్లు తెలియుచున్నది.[10] ప్రస్తుత శాసనము నాధారముగా చేసికొని ఈ రెండు కుటుంబముల మధ్య సన్నిహిత సంబంధములు గుర్తించుటకు వీలు కలుగుచున్నది. మరి యొకటి వెలనాటి రాజేంద్ర చోడుని ప్రియురాలైన ప్రోలాంబిక యొసగిన దాన శాసనము.[11] ఇంకొక ప్రధాన శాసనము కాకతీయ రాజైన గణపతి దేవుని కాలము నాటిది.[12] ఇందు గణపతి దేవుని సేనాధిపతియైన జాయపనాయకుడు దేవాలయమును మరమ్మతులు చేయించినట్లుగాను, ఆలయమునకు గణపతి దేవుడు యొక గ్రామమును దాన మొసగినట్లును తెలుపబడినది. ముఖ్యముగా ఈ పండీశ్వరుని ఆలయమును వెలనాటి చోళ నాయకుడైన కులోత్తుంగ చోళ గొంకరాజు నిర్మించినట్లును, దానికి తన సోదరుడైన 'పండ' ని పేరిడినట్లును ఈ శాసనము తెలుపుచున్నది. దీనిని బట్టి లింగోద్భవ స్వామి ఆలయమైన పండీస్వరస్వామి ఆలయము వెలనాటి కులోత్తుంగ చోళ గొంకని వలన నిర్మితమైనట్లు తెలియవచ్చుచున్నది. కావున నీ ఆలయ నిర్మాణము వెలనాటి రాజైన రెండవ గొంకని కాలమున, అనగా క్రీస్తుశకము 1137-1161-62 మధ్య ప్రాంతమున జరిగియుండునని చెప్పవచ్చును.

శైవ మతాలయములందు ప్రధానముగ లింగాకారమును ప్రతిష్ఠించుట యొక ఆచారము. పండీశ్వరస్వామి ఆలయమునందు ప్రతిష్ఠాపితమైన మూలవిగ్రహము లింగోద్భవమూర్తి.13 అంశుమ ద్భేదాగమము, కరణాగమముల వంటి ప్రామాణిక పూర్వ గ్రంథము లందు చెప్పబడిన ప్రమాణముల కనుగుణముగా, శివుని ప్రతిమ లింగము యొక్క ముందు భాగమునందు చెక్కబడినది. లింగము ముందు పై భాగమున కుడి వైపునందు హంసాకారమున బ్రహ్మ దేవుడును, కూర్మాకారమున భూమిని త్రవ్వుతున్నట్లుగా విష్ణువును లింగమునకు ఎడమ వైపు క్రింది భాగమున చెక్కబడినది. అటు వంటి లింగోద్భవమూర్తి ప్రతిమలు ఆంధ్రదేశమునందు ద్రాక్షారామములోను, భీమవరమునందును కలవు. జె. ఎన్. బెనర్జియా గారి అభిప్రాయము ననుసరించి దక్షిణ భారత దేశము నందలి లింగోద్భవమూర్తి ప్రతిమలు ఎల్లోరా, తంజావూరు ప్రతిమలను పోలి యుండును.14 కాని, ఆసక్తికరముగా ఆంధ్రదేశమందున్న లింగోద్భవమూర్తి విగ్రహములందు మాత్రము ఆ ప్రతిమలలో వలె అగ్ని జ్వాలలు చెక్కబడలేదు.

ఈ ఆలయము యొక్క ప్రాకారపు గోడ నిర్మాణమును పరికించినచో మనకు చోళుల నిర్మాణ శైలి విశదము కాగలదు. ఆలయమున ప్రధానముగా ముఖ మండపము, అంతరాళము, గర్భ గృహము వరుసగా లున్నవి. ముఖ మండపము ద్వారమున కిరు ప్రక్కలను ద్వార పాలుర విగ్రహము లున్నవి. ద్వారము పై భాగమున గజలక్ష్మి మలచబడినది. ముఖ మండపము నందు రెండు వరుసలు స్తంభము లున్నవి. వీనిపై కొందరు స్త్రీలు నృత్యము చేయుచున్నట్లుగా చెక్కబడినది. వీరభద్రస్వామి, పార్వతి మరియు మహిషాసుర మర్దని ఈ ఆలయమునందున్న ఇతర ముఖ్య విగ్రహములు.

వెలనాటి రాజైన రెండవ చోడుడు పండీశ్వరస్వామి ఆలయ ప్రాంగణమున అసంఖ్యాకముగా అద్వైతులను, జైను లను, బౌద్ధులను, చారవాకులను, సాంఖ్యులను, ఆధ్యాత్మికులను, అష్టమూర్తి వాదులను సమావేశపరచి బౌద్ధ గురువైన బౌద్ధపదా చార్యుని, వీరశైవమత ప్రచారకుడైన మల్లికార్జున పండితుని సభ కాహ్వానించి వారి వాదములకు వీలు కల్పించెనట.15 చంద వోలు కైఫియత్ ననుసరించి చూచినచో వాదములో విజయము నొందిన మల్లికార్జున పండితుని చూచి యోర్వలేక, బౌద్ధ గురువు యొక్క శిష్యులలో నొకడు పండితారాధ్యుని పూజ సామగ్రిలో నొక పాత్రను దొంగిలించెనట. అంత కోపించిన పండితుని శిష్యు లాతనిని చంపివైచిరట. అటువంటి హంతకునకు ఏ శిక్ష విధించవలెనని బౌద్ధ గురువు పండితు నడుగగా, పండితుడా హంతకుని కళ్లు పెరికించవలెనని చెప్పెనట. అప్పు డా బౌద్ధ గురువు నువ్వే యా హంతకుని వనగా పండితుడు తన కండ్లను తానే పెరికి యాలయమునందలి లింగము పాదముల కడ పడవైచె నట. శివుడు పండితునకు చూపొసంగినప్పటికిని యా పట్టణమును, ఆలయమును దూషించుచూ పండితుడా వూరిని విడిచిపోయెనని తెలుపుచున్నది.16

పండీశ్వరస్వామి యాలయము నందున్న లింగోద్భవమూర్తి విగ్రహమును చేబ్రోలు లోని ఆలయమునందు ప్రతిష్ఠించుటకు రెడ్డిరాజులు ప్రయత్నించినట్లును స్వామి మహిమ వలన అందు సఫలీకృతులు కానట్లును ఆ ఊరి ప్రజల నమ్మకము. ప్రస్తుతము లింగోద్భవమూర్తి ప్రతిమ ఆలయ ప్రాంగణమునందు ఎటువంటి ఆచ్ఛాదన లేక పడి యున్నది.

ఇటువంటి చారిత్రిక ప్రాధాన్యతను కలిగియున్న చందోలు గ్రామమునందు చరిత్రకారులు, పరిశోధకులు ఇతోధికముగా పరి శోధనలు సల్పినచో అనేక ఆసక్తికరమగు విషయములు వెల్లడి కాగలవు.

**అ ధో జ్ఞా పి క లు**

1. యస్. ఐ. ఐ. IV, నెం. 1138, 1140, 1182.
   యస్. ఐ. ఐ. X, నెం. 97, 103, 112.
2. పైది VI, నెం. 109.
3. ఎపిగ్రాఫియా ఇండికా IV, నెం. 4, వెలనాటి పృధ్వీశ్వరుని పిఠాపురము శిలాశాసనము.
4. పైది.
5. పైది. VI, నెం. 210, 211.
6. పైది X, నెం. 132.
7. కేయూరబాహు చరిత్ర, ప్రథమ ఆశ్వాసము, ప. 16, 18, 19.
8. ఎపిగ్రాఫియా ఇండికా, VI, నెం. 26.
9. పైది VI, నెం. 4.
10. కొండపడుమటి బుద్ధరాజు సోదరియైన అంకమ వెలనాటి రాజైన రెండవ చోడుని భార్య.
11. యస్. ఐ. ఐ. VI, నెం. 210.
12. పైది, నెం. 214.

13. ఇటువంటి శైవ ప్రతిమలు శివుని లింగాకారమును మానవాకృతిని కలిగియుండును. దీనికి సంబంధించి పౌరాణికముగా ఒక గాథ యున్నది. దీనిననుసరించి ఒకానొకప్పుడు బ్రహ్మ, విష్ణువులు విశ్వమును సృష్టించుటలో తమ తమ ఆధిక్యతలను గూర్చి పరస్పరము వాదులాడుకొనుచుండగా అంత శివుడు ఆకస్మికముగా మింటి కెగయుచున్న అగ్నిజ్వాలవలె వారి ముందు నిలిచెనట. ఆ మహాగ్నిజ్వాలల యొక్క అద్యంతము లను కనుగొనమని శివుడు కోరగా బ్రహ్మ, విష్ణువు లిరువురును ప్రయత్నించి విఫలురయ్యిరట. తొలుతగా బ్రహ్మ తాను కనుగొంటినని అనృతము పలికినందులకు శివుడు కోపించి నాటినుండి బ్రహ్మదేవున కెటువంటి పూజాదికములు జరుగ గూడదని శపించెనట. విష్ణుమూర్తి తన అశక్తతను తెలియపరచగా శివుడందులకు సంతసించి ఇకమీదట తనతో సమానముగా పూజాదికములను విష్ణువునకు కూడా జరుపబడునని అభయమిచ్చెనట. [జె. ఎస్. బెనర్జియ, డెవలప్‌మెంట్ అఫ్ హిందు ఐకనోగ్రఫి]

14. జె. ఎన్. బెనర్జియ, డెవలప్‌మెంట్ అఫ్ హిందు ఐకనోగ్రఫి, పేజి 463.

15. పండితారాధ్య చరిత్ర

16. లోకల్ రికార్డ్సు, XIX, పేజి 443.

డా॥ ఎమ్. క్రిష్ణకుమారి

# భీమకవి కాలము

వేములవాడ భీమకవి, తత్సంబంధ విషయములపై డా. కొర్లపాటి శ్రీరామమూర్తిగారు వ్రాసిన వ్యాసపరంపరల గూర్చి నా అభిప్రాయమును జనవరి 'భారతి' ప్రచురించినది. దానిపై డా॥ శ్రీరామమూర్తిగారి వివరణ మే 'భారతి' లో ప్రకటించ బడినది.

డా॥ శ్రీరామమూర్తిగారు తెల్పిన విమర్శకుని ప్రాథమిక విధులు తప్పక పాటించవలసినవే. అవి విమర్శకుని పరిశ్రమకు సంబంధించినవి. విమర్శకుని వ్యక్తిత్వమునకు సంబంధించిన రెండు విషయములను కూడ వాటితో జోడించవలసి యున్నది. అవి : 1. సత్యాన్వేషణ తత్పరత, 2. తమ వాదమే వేదమన్న మొండి పట్టుదల లేకుండుట.

భీమకవి 'వేములవాడ వంశజుడు'. 'తరముల్ నాల్గయిదెందు నెందు నగు దత్తగ్రామనామంబులన్ బరగున్ వంశము' అని సూరన్న చెప్పాడు గదా! భీమకవి కరీంనగర్ జిల్లాలోని వేములవాడలో కొన్నినాళ్లున్నట్లు గోపరాజు పద్యము సాక్ష్యము. గోదావరి మండలములోని వేములవాడ భీమకవి నివాసమనుటకు 'వేములవాడను వెలసిన భీమేశ్వరు కరుణగల్గు భీమసుకవి' అన్న పద్యమాధారము కాని ఆ పద్యము ప్రక్షిప్తమని ప్రసిద్ధ పరిశోధకుల అభిప్రాయము కనుక అది ప్రామాణికము కాజాలదు. అంతకు మించిన ప్రబల ప్రమాణ మవసరము. "ఎంత ప్రక్షిప్తమైనను కొంత నిజముండును" అన్న మాటే శ్రీ శ్రీరామమూర్తిగారికి (చూ. భారతి ఫిబ్రవరి 83 పు. 55) ప్రమాణమైన వారికొక నమస్కారము. క్రీ. శ. 1829 లో కావలి వెంకటరామస్వామి గారు తమ "బయొగ్రాఫికల్ స్కెచస్ ఆఫ్ ది డెక్కన్ పొయిట్స్" గ్రంథంలో భీమకవిని గూర్చి "హివజ్ బారన్ ఎట్ లేములవాడ ఇన్ ది ప్రొవిన్స్ అఫ్ వెలిగందల" అని వ్రాసిన దానిని యీ సందర్భములో గమనించ వలసియున్నది.

వేములవాడలోని భీమేశ్వరుడు దక్షారామ భీమేశ్వరుడే అనుటకు "ప్రమాణము అమెరికాలోని తిరుపతి వేంకటేశ్వరుడే" అని డా॥ శ్రీరామమూర్తిగారి సిద్ధాంతము. బాగున్నది! ఈనాడు మన దేశంలో ఎన్నో వేంకటేశ్వర దేవాలయములు వెలసినా, ఏ ఒక్కటైనా 'తిరుపతి వేంకటేశ్వర దేవాలయం' గా పిలువబడుతున్నదా? 'ఏడుకొండలవాడా! వేంకటరమణా! గోవిందా' అన్న భక్తుల సంకీర్తనలు తిరుపతి వేంకటేశ్వరుని కాక ఇతర ప్రాంతములలోని వేంకటేశ్వరుల నుద్దేశించి చేయబడుచున్నవా? తిరుమలలోని వేంకటేశ్వరుడు 'ఒరిజినల్' అయితే ఇతర క్షేత్రములలో వెలయుచున్న వేంకటేశ్వరులు 'ట్రూ కాపీ' లు. 'ట్రూ కాపీ' ని 'ఒరిజినల్' గా చెప్పటం సమంజసమా? వేములవాడలోని భీమేశ్వరుని పంచారామాలలో ఒకటైన దక్షారామమున వెలసిన జ్యోతిర్లింగ స్వరూపుడగు భీమేశ్వరస్వామిగా భీమకవి భావించెనని డా॥ శ్రీరామమూర్తిగారు చెప్పబూనుట దురదృష్టము.

కావలి గోపరాజు భీమకవిని వేశ్యాలోలునిగా చిత్రించదలచిన 'లేమలవాడన్ మెరసిన' వాడని వ్యంగ్యముగా చెప్పి విడుచునా? పైగా ఆ నోటనే 'భీముని నుతభీముని బలభీము విమత భీముని దలతున్' అని కీర్తించునా? కుబుద్ధి 'భీమన పద్యమన్న గడు బ్రీతివహించుచు మేలుమే' లనుటకు హేతువు భీమకవి శాపానుగ్రహ సమర్థతకు భయపడే గాని వేరుకాదు. భీమకవిని 'పృథుకుకవి స్వాంతభీముని' గా పిండిప్రోలు లక్ష్మణకవి 'లంకా విజయము' లో కీర్తించుట ఇట గమనించదగినది. గోపరాజుకు

భీమకవిపై 'అంతస్తాపమైన కోపమే' ఉన్నయెడల 'చతురహృద్యాన పద్య గద్యపద్య విద్యా విద్యోదితులయిన కవీశ్వరు' లలో ఒకనిగా అతనిని ప్రత్యేకముగా నుతించునా? గోపరాజు కన్న సూటిగా పూర్వ కవులను శ్రీలోలులుగా నుతించిన కవులు గలరు. ఉదా॥

'శ్రీ మన్మథుడై చెలంగు శ్రీనాథు కవిన్'

— కూచిమంచి జగ్గకవి

'మానినీలోక సమ్మదభద్రు శివభద్రు'

— మొల్ల

'బాణు భామాపంచబాణు దలచి'

— వక్కలంక వీరభద్రకవి

పై కవులందరు 'అంతస్తాపమైన కోపము' 'అసూయ'ల చేతనే ఆయా కవుల నావిధముగా పేర్కొన్నారని చెప్పసాహసించ గలమా? గోపరాజు సహృదయముతోనే భీమకవిని నుతించా డనుటకు సందేహము లేదు.

లక్షణ కవులు మధ్యాక్కరకు చెప్పిన లక్షణము 'రెండింద్ర గణములు ఒక సూర్యగణము' ల రెట్టింపు. భీమకవి మొదలు అప్పకవి వరకు అందరి మతము ఇదే. ఈ లక్షణము మధ్యాక్కర పాదాన్ని రెండు సమభాగములుగా విభజించుతుంది. ఒక పద్య పాదాన్ని మధ్యకు విభజించినపుడు రెండు దళములలోని గణములు సమానమైనపుడు మొదటి దళము మొదటి అక్షరమునకు, రెండవ దళము మొదటి యక్షరమునకు యతిని కూర్చినపుడే అది 'సరసము' గా ఉండుననుట సర్వత్ర అంగీకరింపదగినది కాదు. ఉదాహరణకు నాలుగు సగణములు–అనగా 12 అక్షరములు– ఉన్న తోటకవృత్తము నకు యతి 9వ యక్షరము. నాలుగు రగణములు– అనగా పన్నెండు అక్షరములే– ఉన్న స్రగ్విణికి యతి 7వ అక్షరము. ఈ రెండు వృత్తములను తెలుగు కవులు ఆదరించి ప్రయోగించిరి. పద్యము నడిచే తీరును బట్టి యతి నిర్ణయించబడుట సహజము కదా! నన్నయ మధ్యాక్కరలలో లాక్షణికులకై నియమమునకు లొంగని పాదములనేకము గలవు. లాక్షణికుల మతమున కనుగుణముగా నన్నయ మధ్యాక్కర పాదములనెన్నిటినో పరిష్కర్తలు దిద్దినట్లు పరిశోధకు లిదివరకే స్పష్టపరచిరి. దీనిని బట్టి నన్నయ కాలమున మధ్యాక్కర లక్షణము మన లక్షణకవులు చెప్పిన రీతిగా లేదని స్పష్టము. నన్నయకాలమునకూడ మధ్యాక్కరకు పై గణనియమమే ఉన్నయెడల నన్నయ కూడ నాల్గవగణాద్యక్షరమే యతిగా రచించి ఉండెడి వాడు. కాని నన్నయ పద్యములను బట్టి ఆ కాలమున మధ్యాక్కర పాదము రెండు దళములుగాకాక మూడు దళములుగా విభజింపబడు చుండెడిదనియు, అందు మొదటి దళమున రెండింద్ర గణములు, రెండవ దళమున ఒక సూర్యగణము, ఒక ఇంద్ర గణము, లేక ఒక ఇంద్రగణము ఒక సూర్యగణము, మూడవ దళమున ఒక ఇంద్రగణము, ఒక సూర్యగణము ఉండెడివనియు గ్రహింపగలము. పై మూడు దళములలో మొదటి దళమును మూడవ దళముతో కలిపి చదివిన అది ద్విపద పాదమవుతుంది. అనగా ద్విపద పాదములో మధ్యన ఒక సూర్యగణము, ఒక ఇంద్రగణము ముందు వెనుకలుగా కూర్పబడినను మధ్యాక్కర ఏర్పడ గలదన వచ్చును. ద్విపద ప్రాచీనమైన దేశీయఛందస్సుగా గుర్తించబడినది. ద్విపద పాదములు రెండు తరువోజగాను, కొద్ది మార్పుతో సీసముగాను ఏర్పడినవి కదా! అట్లే మధ్య కూర్ప బడిన కొన్ని అక్షరములతో ద్విపద మధ్యాక్షర లేక మధ్యాక్కరగా మారినది. ఇప్పుడు నన్నయ మధ్యాక్కరలను పరిశీలింతము.

భూపాలనీకుని । క్రొమ్మలియందు । బుట్టిన సుతుడు

1–4–177

అమరంగ ధర్మువు । రక్షించు(బ్రీతి । నని శత్రులందు

3–1–225

చలితుడై నిజనాథు । డరిగిన దోన । చనియెనవ్వార్త

3–2–149

పరగ నా కారణ । మున నిట్టి దుఃఖ । భారము దాల్చె

3–3–229

పై పాదములలోను, మరికొన్ని పద్యపాదములలోను రెండవ దళమున ముందు ఇంద్రగణము, తరువాత సూర్యగణము కూర్ప బడుట గమనించగలము.

కడునిమ్ముగా దున్ని । బీజములు సల్లి । కర్షకుండున్న

అంటూ సాగే పద్యముతోపాటు అనేక ఇతర పద్యములు, పద్యపాదములు రెండవదళమున ముందు సూర్యగణము తరు వాత ఇంద్రగణముతో కూర్పబడినవి. ఈ కోవకు చెందిన పద్య పాదములే నన్నయ మధ్యాక్కరలలో అధికముగా నుండుటచే లాక్షణికులు, ఎట్టిన ఈ గణనియమమునే ప్రమాణముగా గైకొని యుందురు.

ఈ విధముగా మూడు దళములతో ఏర్పడిన మధ్యాక్కర పాదములో మూడు దళముల ఆద్యక్షరములకు యతిమైత్రి ఉండుట సరసము గదా అనవచ్చును. నిజమే. కాని, మధ్యదళమున గల సూర్య, ఇంద్రగణములు ముందు వెనుకలగుటకు అవకాశ

నున్నవి. దేవవర్మ కొడుకైన భీమరాజుకు కృష్ణవిజయములో చెప్పబడిన ఆరు విశేషణములలో మైలమ భీముడు, భండన భీముడు అనునవి తప్ప మిగిలినవి నిజముకాదు అని 'భారతి' అక్టోబరు 82 పుట 22 లో వ్రాసి మరల మే 23 'భారతి' లో అట్లని తాము నిర్ణయింపలేదని వ్రాయుట విచారకరము. భ్రమ ప్రమాదములు ఎవరికైన తప్పవు. కాని గ్రంథములోని మూడింట రెండు వంతుల విషయములు భ్రమ ప్రమాదములని నిర్ణయించి నపుడు ఆ గ్రంథ ప్రామాణికతను సంశయించటం తప్పా? అది ప్రామాదికతకు నిదర్శనమా?

పరమ సత్యములు కాక, శుద్ధాబద్ధములు కాక భ్రమ ప్రమాద భరితములైన విషయములు గల రచనలలోని సత్యాసత్య ములను స్పష్టమైన, ప్రామాణికమైన ఇతర ఆధారములతో కాక కేవలము ఊహలపై ఆధారపడి చర్చించి సిద్ధాంతీకరింప బూనుట ప్రయోజనకారి కాజాలదు.

కందూరు నాటిని పాలించిన తెలుగు చోళులు "పానుగల్లు-నల్లగొండ పట్టణములలో తమ రాజధానిని స్థిరపరచి ఏఱువ సింహాసన మని దానికి పేర్వెట్టిరి" అని శ్రీ తేరాల సత్యనారాయణ శర్మగారు వ్రాయగా డా॥శ్రీరామమూర్తిగారు ఏఱువచోళులు, కందూరిచోళులు భిన్నులని అభిప్రాయపడి నారు. భావిపరిశోధనలే సత్యమును నిర్ణయింపగలవు. ఇక "ఆగంతుకములైన అభిమానములను బట్టి ఇష్టానుసారముగ వాగ్వ్యయము" చేసిన దెవరో "భారతి" పాఠకులే నిర్ణయించుకొనగలరు.

శ్రీ సూర్యదేవర రవికుమార్

# కొన్ని మాటల అర్థాలు

తరవారి: అంటే ఒక పక్క పదునుగా ఉండే కత్తి అని అర్. ఎల్. టర్నర్ తయారు చేసిన "ఎ కంపారిటివ్ డిక్షనరీ అఫ్ ది ఇండో ఆర్యన్ లాంగ్వేజెస్" (1966) లో ఉంది. ఇది హర్ష చరితంలో వాడబడినట్లు తెలుస్తోంది. నిఘంటువులలో "తరవాలికా-" అన్న మాట ఉందిట. "తలవారణ-" అన్న మాట కూడా ఉన్నట్లు తెలుస్తోంది. జిప్సీల (పాలస్తీనా) భాష "తిర్వాలీ", అఫ్ఘన్ "తరాలీ", వైగాలీ "తర్వీలీ, తారోలీ", బాష్కారిక్ "తర్వేల్", తోర్వాలీ "తెర్వెల్", కాశ్మీరీ "తర్వార్", సింధీ "తరారి", పంజాబీ "తర్వాల్, తల్వార్", పడమటి పహాడీ భాష "తరువార్", కుమయూనా "తర్వార్", నేపాలీ "తర్వార్, తల్వార్", అస్సామి "తరోవాల్", బెంగాలీ "తరోయాల్", మైథిలీ, ఒరియా "తరు ఆరీ", అవధి "తర్వార్", హిందీ "తర్వార్, తల్వార్", గుజరాతీ, మరాఠీ "తల్వార్", కటి "తెర్వ్యేచ్", ప్రిసున్ "త్రిజ్", అన్న మాటలకి కత్తి అర్థమే ఉన్నట్లు చెప్పబడుతోంది.

అర్థశాస్త్రంలో "సారంగం" అనే మాట ఉంది కాబట్టి అది గ్రీసుభాష "సిరింక్స్" లోంచి వచ్చి ఉండాలి కనుక ఆ పుస్తకం అలెక్సాండరు తర్వాత ఎప్పటిదో అన్నారుట కొందరు. గ్రీసు దేశం వారు పర్షియా లేదా ఇరాన్ ద్వారా ఇంకా ముందు నుంచే భారతదేశంతో సంబంధాలు కలిగి ఉండేవారు కదా అని కొందరు అంటారు.

టర్నర్ నిఘంటువులోనే "కరపాల" అంటే "కత్తి" అన్న అర్థం ఉంది. ఈ మాటతో బాటు "కరవాల" (ప్రాకృతం)- కత్తి: "కరుఅర్" (బీహారీ) తెడ్డు: "కర్వాల్, కరుఅర్, కర్వార్/ర" (హిందీ) తెడ్డు, కత్తి: "కర్వాల్" (గుజరాతీ) కత్తి: అన్న మాటలు ఇవ్వబడి ఉన్నాయి.

తమిళ, తెలుగు ప్రాంతాలలో క్రీ. శ. కి కొంచెం ఇటూ అటూ విదేశాల వారు ఉండేవారని చదువుతాము కదా? శకులు, అభీరులు వగయిరా! చోళులు, చాళుక్యులు, చేరులు మధ్య ఆసియా నుంచి వచ్చిన వారని ప్రొఫెసర్ బాగ్చీగారు రాశారు. యాదవులే విదేశాల నుంచి వచ్చారని ప్రొఫెసర్ రాయి చౌదరిగారు రాశారు.

ఏది అన్యదేశం, ఏది కాదు?!

"మురుండ" అంటే శకుల భాషలో ప్రభువు అని అర్థం ఉందిట. "ముటుడ" కీ దీనికీ సంబంధం ఉందా?

పాత మరాఠీలో "లెమ్క" (లెంక) అంటే కొడుకు, కూతురు కూడాట. "లేంక" అంటే లోపంకల అనే అర్థం ఉన్నట్లు తోస్తుంది ఎన్నో భాషలలో! ప్రాకృతంలో "లిమ్క" (లింక) అంటే బిడ్డట.

"వేలవ" అనేమాట మోనియర్ విలియమ్స్ నిఘంటువులో ఉంది. ఒక రకం ప్రతిలోమ సంబంధపు సంతానానికి ఈ మాట వాడేవారని అనుకోవాలి.

"లేఖ-" అంటే దేవుడనే అర్థం ఉంది కదా? (అధికారి అని కూడా ఉందా?)

ఇక "ఇక్క-" అనేది "ఇహ" కి దగ్గరగా తోచటం లేదూ?

ముండుటచేతనో, లేక ఏ ఇతర కారణముచేతనో రెండవ దళాద్యక్షరమునకు కూడ యతి నిర్ణయింపబడలేదు. అనగా పాదము మధ్య కొన్ని గణములు చేర్చబడినను యతిస్థానము మారలేదు. అయినను, మూడు దళముల అద్యక్షరములకు యతిమైత్రి గల పద్యపాదములు నన్నయ మధ్యాక్కరలలో అనేకములు కలవు. ఒక ఉదాహరణ.

ఎందుండి వచ్చితి । ఋషికుమారయే । నెన్నడు నిట్టి
ఇందుండు మీవని । కృష్ణమృగచర్మ । కృతకుశాసనము

3_3_97

యుద్ధమల్లుని శాసనములోని మధ్యాక్కరలలో కూడ నొక పాదమిట్లే యున్నది.

క్రమముగ దానికి । కలశమిడ్డట్లు । గా మొగమాడు

నన్నయ తరువాత మధ్యాక్కర పాదమందలి రెండవ దళమున ముందు సూర్యగణమే ఉండవలెనను నియమ మేర్పడి ఆ నియమము వలన ఆ పద్యపాదము రెండు సమాన దళములుగా విడగొట్టబడి రెండు దళముల అద్యక్షరములకు యతి కూర్చబడినది. రెండు దళములుగా మధ్యాక్కర పాదమును విడగొట్టి చదివినపుడు దానిలో పద్యపు నడక కన్న పాట పోకడ ఎక్కువగా కనిపిస్తున్నది.

'బాయి బాయి కలిపితోలి బాలలకు బలము కుంగె' అంటూ సాగే కపిల పదాలు 'కొండ గోగులు పూసెనేమొ కొండనిమ్మలు కాసెనేమొ' అంటూ ప్రారంభమయ్యేఏలలు, ఇంకా యీ కోవకు చెందిన జానపద గీతాలు మధ్యకు విరిగే మధ్యాక్కరపాదాలే. మధ్యాక్కరపాదం మధ్యకు విరువబడి ఒక జానపద గీతంతో సమానమైనపుడు దానికి కావ్యగౌరవం ఎలా కల్పింపబడుతుంది?

39 నన్నయ పద్యలక్షణములను వదలి, ఒక్క ఎఱ్ఱన పద్యమే భీమకవికి యతి విషయమున ప్రమాణమైనచో-ఎఱ్ఱనను భీమకవి అంతటి ప్రామాణికునిగా గ్రహించియుండినచో-క్రొంచపదవృత్త విషయమున ఎఱ్ఱన మతమును భీమన నిర్లక్ష్యము చేయజాలడు.

లక్షణ కర్తలు కూడ కవులే కదా! భీమకవి రాఘవపాండవీయము, నృసింహ పురాణము వంటి గ్రంథములు రచించినాడు గదా! అతడే మధ్యాక్కరను నాల్గవ గణాద్యక్షరము యతిగా పై గ్రంథములలో ప్రయోగించి ఎఱ్ఱనకు మార్గదర్శకుడైనాడేమో! లేక ఈనాడు మనకు లభించని నన్నయ-ఎఱ్ఱన మధ్యకాలమందలి రచనలలోని మధ్యాక్కరలు ఎఱ్ఱనకు, భీమనకు మార్గదర్శకమైనవేమో! అట్లు కాకున్న, ఎఱ్ఱన మధ్యాక్కరను నన్నయకన్న భిన్న మార్గమున వ్రాయుటకు గల బలమైన కారణమేది?

ఇక నన్నయ మార్గమునే అనుసరించి ఎఱ్ఱన రచించిన మధురాక్కరను "కవిత్రయానంతర కవులు రచించక పోవుటకు" కారణము కలదు.

మాత్రాగణప్రధాన రచనలైన అక్కరలు అయిదు. ఇవి కన్నడ భాషనుండి తెనుగున గ్రహింపబడినవి. తెలుగు లాక్షణికులు 'అంధపరంపర' గా అయిదు అక్కరలకు లక్షణములు చెప్పిరి. కాని ఆంధ్రసాహిత్యమున మధ్యాక్కర, మధురాక్కర తప్ప ఇతర అక్కరలు లక్షణగ్రంథములలో తప్ప కనిపించవు. ఈ రెండు అక్కరల నైనను ప్రయోగించిన మన మెరిగిన ప్రాచీన కవులు నన్నయ, ఎఱ్ఱనలే. మధ్యాక్కరలో తప్ప మిగిలిన నాల్గు అక్కరలలో చంద్రగణము కలదు. చంద్రగణములు తెలుగు కవులకు రుచించలేదు. తెలుగు దేశీయ ఛందస్సులైన ద్విపద, రగడ, జాత్యుపజాతులలో చంద్రగణములు లేవు. సూర్య, ఇంద్రగణములు మాత్రము గలిగిన ఒకే ఒక అక్కర మధ్యాక్కరను అది కవులాదరించిరి. మధురాక్కర తేటగీతి నడక ననుసరించినది కనుక అమాత్రమైనను ఆదరము పొందినది. దానిని నన్నయ ప్రయోగించి చూపగా 'తద్రచనయకా' రచించిన ఎఱ్ఱన అనుసరించినాడు. తేటగీతికి వికృత రూపాన్ని సమకూర్చే ఆ అక్కరతో ఇతర అక్కరలవలెనే తెలుగు కవులకు అనంతర కాలమున అక్కర లేకపోయినది.

పట్టుకారు శబ్దము ఏ విధముగా దేశ్య శబ్దమగునో శ్రీ కపిలవాయి లింగమూర్తిగారు 'భారతి' లోనే (82 నవంబరు) వివరించినా శ్రీ శ్రీరామమూర్తిగారు "వెనుకటి నిఘంటువులలో చూపబడిన దేశ్య శబ్దములు అనేకము, ఇప్పటి భాషాచరిత్రను బట్టి అన్యదేశ్య శబ్దములగునని" వ్రాసిరి.

నన్నయ ప్రయోగించిన 'గాడీ' శబ్దము అన్యదేశ్యమని వెనుకటితరం పండితులు అముద్రితగ్రంథ చింతామణిలో వ్రాశారట. అయితే అది దేశ్యశబ్దమేనని ఇప్పటి పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. పండితులు, విమర్శకులు ఏకాభిప్రాయంతో అంగీకరించని ఇటువంటి "శబ్ద ప్రయోగమును బట్టి కావ్యరచనా కాలములు" నిర్ణయించుట ఎంతవరకు సమంజసము?

దాన రాజును, దేవవర్మను చారిత్రక వ్యక్తులుగా నిలబెట్టటానికి డా॥ శ్రీరామమూర్తిగారు చెప్పే వివరణలు పేలవముగా

"ఠెంకి" లేదా "ఠెంకి" లని చూస్తే సంస్కృతం "స్థానక-" గుర్తుకి వస్తుంది.

పండిట్ హర్ గోవింద్‌దాస్ శేఠ్ యొక్క "పాయి అసద్ద మహణ్ణవో" (1925) లో "వేలు" అంటే "చోర, తస్కర, మసల" అని అర్థాలు ఇవ్వబడ్డాయి।

-ఒక విలేఖరి

# 'ఇనుప యెడ్లు', 'వెల్లెడ్లు'

'ఇనుపయెడ్లు' అన్న పదం ఆంధ్రదేశం కోస్తా ప్రాంతం లోని మధ్య కాలపు తెలుగు శాసనాలలో తరుచు కన్పిస్తుంది. ఈ పదానికి అర్థవివరణ సూర్యరాయాంధ్ర నిఘంటువు (1979-ప్రతి, పుట 492)లో ఈ విధంగా ఈయబడింది :

'ఇను(న్ప)పయెడ్లు- ఈన్పఎడ్లు. త. ఈన్- ఈను; ఆడు-మేక; గొఱ్ఱె. వ్యు. ఈనునట్టి మేక; గొఱ్ఱె-అనగా ఆడుమేక, ఆడు గొఱ్ఱె. ఈన్పయెడ్లు అనునదే ప్రథమ రూపమని తోచు చున్నది. ఇది ప్రాచీన శాసనములందు మాత్రమే కాన్పించు చున్నది.'

అయితే ఈ పదం పుట్టు పూర్వోత్తరాలను గురించి శ్రీ బులుసు వేంకట రమణయ్యగారు (భారతి, 1937, జూలై, పుటలు 25-27) చర్చిస్తూ-" 'ఇనుపయెడ్లు' అనగా 'నల్లని పశువులు' అని మాత్రమే మొదటి యర్థము. 'ఇనుము', దానికి సంబంధించిన పదములును ద్రావిడ భాషలలో నల్లని వస్తువులనే తెలుపు చున్నవి... భగవంతుని దీపారాధనమునకు నల్లని పశువుల నేయియే శ్రేష్ఠమైనది. కావుననే పెక్కు శాసనములలో "ఇనుపయెడ్లు" అను పదమే తఱచు ప్రయోగింపబడినది. కాలక్రమమున పయి పదము లోని ఏకదేశమగు 'ఇనుము' 'ఎనుము' గా మారి 'బఱ్ఱె(గేదె)' అను నర్థమున రూఢమయినది. అవశిష్టమగు 'ఎడ్లు' పదము 'వృషభములు' అను నర్థమున రూఢమయినది. నిరుప పదమగు "ఎడ్లు" అను పదముకూడ "ఇనుపయెడ్లు" వలెనే పాడిపశువులను తెల్పునటుల శాసనములు కలవు....ఇనుపయెడ్లుకు నిఘంటువున గల వ్యుత్పత్త్యర్థము కూడ సరియైనది కాదు. అందు 'ఈను+ఆడు(లు)' ఈన్పయెడ్లయి, క్రమముగ 'ఇనుపయెడ్ల'యినట్లు చెప్పబడినది. అట్టి వ్యుత్పత్తికి తగిన ప్రమాణము అందు కానబడదు... 'ఇనుపయెడ్లు' మొదటిరూపము; 'ఈనుపెడ్లు, ఈన్పయెడ్లు' అనునవి మీఁది దాని అపభ్రంశములు" అని నిర్ణయించారు. డా॥ బూదరాజు రాధాకృష్ణగారు (ప్రాచీనాంధ్ర శాసనములు- 1971- పుటలు 231, 241) కూడ 'ఇనుపయెడ్లు'లోని పూర్వపదమైన 'ఇనుప'కు 'నల్లటి' అన్న అర్థాన్నే ప్రతిపాదించారు. 'ఎడ్లు' అన్న పదాన్ని శాసన భాషలో 'ఆవులు-ఎద్దులు, గేదెలు-దున్నలు' కు పర్యాయపదంగా వాడారనీ, ఇందుకు కారణం ఆ పదానికి ముందు ఉన్న 'ఇనుప' ('ఇనుము' కు విశేషణం) పదమే కావచ్చుననీ వారు అభిప్రాయ పడ్డారు. శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారు తమ 'శాసనశబ్దకోశము' లో ఇనుపయెడ్లుకు "ఆడు మేకలు లేక గొఱ్ఱెలు" అన్న అర్థాన్ని మాత్రమే ఇచ్చారు. డా॥ పి. వి. పరబ్రహ్మశాస్త్రిగారు మల్లికార్జున చోడుని ఒల్లాల శాసనాన్ని (ఎపిగ్రాఫియా ఆంధ్రికా, 4వ సంపుటం, పుటలు 55-65, 143) ప్రకటిస్తూ 'ఇనుపఎడ్లు' అన్న పదం దీపారాధనకు అవసరమయ్యే నేతికి గాను సమర్పించబడిన గొఱ్ఱెలు, మేకలు, ఆవుల సంఖ్యను తెలియజేసే సందర్భంలో మధ్యకాలం నాటి తెలుగు శాసనాల్లో కన్పిస్తున్నదని తెలిపారు. దీపారాధనకు అవసరమైన నేతికి ఈయబడిన ఈ పశువుల సంఖ్య సహజంగానే కాలక్రమేణా పెరుగుతూ ఉంటుంది. అయితే దీపదాత ఎన్ని పశువులనైతే దానమిచ్చి, ఆ పశువులను ఒక వ్యక్తి అధీనంలో ఉంచాడో, అన్ని పశువులకు మాత్రమే ఆ వ్యక్తి పూచీ పడవలసి ఉంటుంది. ఆ సంఖ్య కంటె ఎక్కువగా అభివృద్ధి పొందిన పశువులు, ముఖ్యంగా మగ పశువులు, ఆ వ్యక్తికే చెందుతాయి. ఆ విధంగా దేవాలయానికి ఎల్లప్పుడూ చెందే పశువుల సంఖ్యను సూచించేదే ఈ 'ఇనుపయెడ్లు' అన్న పదం అని వారు అభిప్రాయ పడ్డారు.

ఈ పై వివరణలనూ, శాసనాధారాలనూ దృష్టిలో ఉంచుకొని 'ఇనుప యెడ్లు' పదాన్ని గురించి మరి కొంచెం విపులంగా పరిశీలించి, అర్థాన్ని సూచించటమే ఈ వ్యాసం ఉద్దేశం.

'ఇనుప యెడ్లు' అన్న పదం ఈ క్రింది రూపాలలో మనకు శాసనాలలో కన్పిస్తుంది.

1. ఈనుపెడ్లు: ద. హిం. శా., 4, సంఖ్య 1315, క్రీ. శ. 1231
2. ఈ (యీ) న్ప యెడ్లు: అదే, సంఖ్య 1118, క్రీ. శ. 1222; అదే, సంఖ్య 1072; ద. హిం. శా., 5, సంఖ్య 220.
3. ఇన్పు ఎడ్లు, యినుపు ఎడ్లు } ద. హిం. శా., 4, సంఖ్య 1087; అదే, సంఖ్య 1122, క్రీ. శ. 1139; అదే. సంఖ్య 1300, క్రీ. శ. 1095.

అయితే 'ఇనుప యెడ్లు' అన్న పదమే శాసనాలలో ఎక్కువగా వాడబడింది.

ఈ పదం వ్యుత్పత్తిని పరిశీలించటానికి ముందుగా శాసనాలలో అది ఏ సందర్భంలో ఉపయోగించబడిందో తెలుసుకోవటం అవసరం. ఇంతవరకు ప్రకటించబడిన శాసనాలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ పదం కేవలం దీపారాధనకు అవసరమైన నేతిని సమకూర్చటానికిగాను దానంచేయబడినఆవులను, గొఱ్ఱెలను సూచించే సందర్భంలో మాత్రమే ఉపయోగించబడినదని స్పష్టం అవుతుంది. పాయసాది నివేదనలకు గాని, క్షీరాభిషేకానికిగాని అవసరమయ్యే పాలనిమిత్తం దానం ఈయబడిన ఆవులను ఏ ఒక్క శాసనంలోనూ కూడా 'ఇనుపయెడ్లు'గా పేర్కొనకపోవటం గమనార్హం. ఇక 'ఇనుపయెడ్లు' పదం కేవలం గొఱ్ఱెలను, మేకలను మాత్రమే సూచిస్తుందని సూ. ని., శా. శ. కో. లు అభిప్రాయపడుతున్నా, శ్రీ. బు. వేం. ర. గారూ, డా॥శాస్త్రిగారూ సూచించినట్లు ఈ పదం ఆవులకూ, గొఱ్ఱెలకూ కూడా వర్తిస్తుందని ఈ క్రింది ఉదాహరణల వలన విశదమౌతుంది.

1. యఖండవర్తి లోహదండు దివియలు రెంటికి........ మొదవులు 50........మొదవులు 50 బెరసి ఇనుపయెడ్లు 100 (ద. హిం. శా., 4, సంఖ్య 1158. క్రీ. శ. 1133).

2. అచంద్రార్కముగా దీవియ నిల్పి దానికిచ్చిన గొఱియలు 50........ఆచంద్రార్కముగా దీవియ నిల్పి దానికిచ్చిన గొఱియలు 50 ఈ రెండు దీవియల గొఱియలు నూఱుం జేకొని.... ఈతని ప్రజల ప్రజల తరమున నీ నూఱు గొఱియలు నినుపయడ్లయి యెల్లకాలము నుండగల యవి (ఎ. పి. ఆంధ్రికా, 4, పుట 65).

ఇక ఈ పదం యొక్క వ్యుత్పత్తిని గురించి పరిశీలిద్దాం. సూ. ని. 'ఇనుపయెడ్లు' లోని పూర్వపదమైన 'ఇనుప' అనేది 'ఈను' కు సంబంధించినదని అభిప్రాయ పడగా, శ్రీ. బు. వేం. ర. గారూ, డా॥ రాధాకృష్ణగారూ ఆ పదం నలుపు రంగుని సూచిస్తుందనీ 'ఎనుము' కు రూపాంతరమనీ అభిప్రాయపడ్డారు. అల్లే రెండవ పదమైన 'ఎడ్లు' తమిళములోని 'ఆడు' పదానికి సంబంధించినదవి సూ. ని. పేర్కొనగా, శ్రీ. బు. వేం. ర. గారూ, డా॥ రాధాకృష్ణగారూ ఆ పదం 'ఎద్దు' కు సంబంధించినదై ఉండవచ్చునని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంలో డా॥ పరబ్రహ్మశాస్త్రిగారి సూచన గమనించ దగింది. దీపదాన సందర్భంగా దాత యిచ్చిన అవుల (లేదా మేకల, గొఱ్ఱెల) స్థిర సంఖ్యను ఈ పదం (ఇనుపఎడ్లు) సూచిస్తుందని వారి అభిప్రాయం. దీపదానం చేసిన దాత దీపానికి కావలసిన నేతికి గాను కొన్ని పశువులను దానం చేయటమూ, ఆ పశువులను ఒక గొల్లని (లేదా ఒకరికంటె ఎక్కువ) అధీనంలో ఉంచటమూ, ఆ గొల్లడు నియమిత పరిమాణంలో నేతిని రోజూ దేవాలయానికి ఇవ్వటమూ జరుగుతూ ఉండినట్లు శాసనాల వలన మనకు విశదమౌతున్నది. గొల్లవి అధీనంలో ఉన్న పశుగణం అభివృద్ధిని పొందటం సహజం. అలాగే కారణాంతరాల వల్ల ఆ పశువుల సంఖ్య తగ్గనూ వచ్చు. వార్ధక్యం వల్ల పశువులు పాలిచ్చే స్థితిలో లేకపోవచ్చు కూడా. అట్టి పరిస్థితులలో నిత్యమూ దేవాలయానికి అందవలసిన నేతిపరిమాణంలో కొరత రాకుండా ఎన్ని పశువులు తగ్గినాయో అన్నిటినీ తిరిగి దీపదాతగానీ, గొల్లడుగానీ ఈయవలసి ఉంటుంది.

ఈ సందర్భంలో కొన్ని తమిళ శాసనాలు మనకందించే వివరాలు పరిశీలించదగినవి. శ్రీనివాస నల్లూరు (తిరుచ్చిజిల్లా)లోని గండరాదిత్యుని కాలంనాటి శాసనం ఒక దాత ఒక అఖండ దీపం ఆచంద్రార్కం వెలగటానికిగాను 30 గొఱ్ఱెలనూ ("ఆడుశెర్మరి"), 30 మేకలనూ ("వెళ్ళాడు") మొత్తం అరవైయింటిని, జరామరణములు లేక నిత్యమైన వాటినిగా ("శావామూవా పేరాడాహ") సమర్పించినట్లు తెలుపుతున్నది ("తిరునొన్దా విళక్కు చన్ద్రాదిత్తవత్ ఎఱిప్పదాహ అట్టి కుడుత్త అడు శెర్మరి పాదియుం వెళ్ళాడు పాదియుం అహ అఱుపదు శావామూవా పేరాడాహ పెరుమానడిగళుక్కు అట్టి కుడుత్తేన్" — ద. హిం. శా., 13, సంఖ్య 2). పటిన్ కోవిల్ గ్రామం (ఉత్తర ఆర్కాటు జిల్లా) లోని మరొక శాసనం కూడా నిత్యమూ ఒక అఖండ దీపారాధనకు కావలసిన ఉతిక్కు నెయ్యికిగాను జరామరణములు లేక నిత్యమైనవిగా ఉండే 90 గొఱ్ఱెలను ఇచ్చినట్లు తెలుపుతున్నది ("నందా విళక్కు ఒన్నినుక్కు నిచ్చం ఉతిక్కుప్పడి నెయ్ కొండెరియ్ప్పదాహ వైత్త శావా మూవాప్పేరాడు తొణ్ణూఱు" — అదే, సంఖ్య 71). ఉడయార్ గుడి గ్రామం (దక్షిణ ఆర్కాటు జిల్లా) లోని ఒక శాసనం — సుందరచోళుని నాటిది — ఒక అఖండ దీపారాధనకు కావలసిన ఉతిక్కు నెయ్యికిగాను 90 గొఱ్ఱెలను ఇచ్చినట్లు తెలుపుతూ, ఈ 90 గొఱ్ఱెలూ జరామరణములు లేని నిత్యమైనవని స్పష్టీకరిస్తున్నది (ఒరు తిరునందా విళక్కెరి వదఱ్కు ... ఉతిక్కు నెయ్ తిరువిళక్కుక్కు అట్టక్కడవ వారాహక్కుడుత్త వాడు 90 ఇత్తొణ్ణూఱాడుం శావా మూవాపేరాడు" — అదే, సంఖ్య 198).

ఈ పై శాసనాలలోని 'శావా మూవా పేరాడు' అన్న పదం ముఖ్యమైంది. 'శావా' అంటే 'మరణములేనిది'; 'మూవా' అంటే 'వార్ధక్యములేనిది'; 'పేర్' అంటే ప్రాణముతో కూడినది; 'ఆడు' అంటే 'గొఱ్ఱె'. అనగా, అఖండ దీపారాధనకు కావలసిన నేతికిగాను ఈయబడిన గొఱ్ఱెలు(లేదా మేకలు) 'జరా మరణములు

లేక నిత్యమైనవి' అని అర్థం. దీని భావం అఖండ దీపారాధనకు కావలసిన నేతికిగాను ఈయబడిన గొఱ్ఱెల సంఖ్యలో తగ్గుదల ఉండకూడదని. కారణాంతరాల వల్ల తగ్గుదల ఏర్పడినట్లయితే దీపదాతగాని, పశువులను అధీనం లోనికి తీసుకొన్న గొల్లడుగాని దేవాలయానికి నిత్యమూ ఇవ్వవలసిన నేతి పరిమాణంలో కొరత రాకుండా ఉండే నిమిత్తమై, ఎన్ని పశువులు తగ్గినాయో అన్నిటినీ ఈయవలసి ఉంటుందని మనం అర్థం చేసుకోవచ్చు.

తెలుగు శాసనాలలోని 'ఇనుప ఎడ్లు' అన్న పదాన్ని పైన పేర్కొన్న తమిళ శాసనాలలోని 'శావా మూవా పేరాడు' అన్న పదంతో పోల్చి చూచుకుంటే 'ఇనుపఎడ్లు' అన్న పదం అర్థం స్పష్టమౌతుంది. తమిళం లోని 'శావా మూవా' అన్న పదం భావాన్నే తెలుగులోని 'ఇనుప' పదం కూడా సూచిస్తుంది. అంటే, 'దాన మిచ్చిన పశువులు ఈనినవిగా–అనగా పాలనిచ్చేవిగా–ఉండ వలెనే గాని వట్టిపోయి పాలు ఈయలేని స్థితిలో ఉన్నవి కాకూడదు' అన్న భావాన్ని 'ఇనుప' పదం సూచిస్తుందన్నమాట. కనుక 'ఇనుప' కు సూ. ని. సూచించినట్లు 'ఈను' అన్న అర్థమే యుక్తమైన దనిపిస్తుంది. అంతేకాక ఈ సూచన ఆమోదయోగ్యమైతే, సూ. ని. అభిప్రాయపడినట్లు శాసనాలలో 'ఇనుప' కు పర్యాయ పదంగా లభిస్తున్న 'ఈనుపు' రూపమే మొదటిదనీ, అదే కాలక్రమేణా 'ఈన్పు', 'ఇన్పు', 'ఇనుప' గా మారినదనీ నిర్ణయించవలసి ఉంటుంది.

ఇక 'ఇనుపయెడ్లు' లోని 'ఎడ్లు' అన్న పదం తమిళంలోని 'ఆడు' పదానికి సంబంధించినదనే అనిపిస్తుంది. పైన చూపిన తమిళ శాసనాల్లోని 'ఆడు' పదం ఇందుకు ఆధారం. అలా అయితే మొదట్లో దీపారాధనకు కావలసిన నేతికి గాను ఇయ్యబడిన గొఱ్ఱెలను 'ఈనుపెడ్లు' అనేవారనీ, కాలక్రమేణా ఈ ఉద్దేశంతో ఇచ్చిన ఏ పశువులనైనా (ముఖ్యంగా ఆవులను) 'ఈనుపెడ్లు' అనే వ్యవహరించసాగారనీ మనం అనుకోవచ్చు. అంటే 'ఈనుపెడ్లు' (లేదా 'ఇనుపఎడ్లు') అనేది పారిభాషిక పదంగా, ఒక నిర్దిష్ట ప్రయోజనాన్ని సూచించేదిగా ఆ కాలంలో వ్యాప్తిలో ఉండేదన్నమాట.

కొన్ని శాసనాలలో నిరుపపదంగా 'ఎడ్లు' అన్న రూపం కూడా ఇటువంటి సందర్భాలలోనే కనిపిస్తుంది (ఉదా: ద. హిం. శా., 6, సంఖ్య 144, క్రీ. శ. 1210; అదే, సంఖ్య 812, క్రీ. శ. 1148). ఈ పదాన్ని కూడా 'ఈనుపెడ్లు' అన్న అర్థంలోనే గ్రహించవలసి ఉంటుంది.

"వెల్లెడ్లు" అన్న పదం కూడా "ఇనుపయెడ్లు" పదం వలెనే దీపారాధనకు కావలసిన నేతి కొరకై ఇచ్చిన పశువులను సూచించే అర్థంలో మాత్రమే మనకు తెలుగు శాసనాలలో కన్పిస్తుంది. (ఉదా: ద. హిం. శా., 6, సంఖ్య 109, క్రీ. శ. 1076; అదే, సంఖ్య 141, క్రీ. శ. 1143; ద. హిం. శా., 10, సంఖ్య 385). ఈ 'వెల్లెడ్లు' పదం తమిళ శాసనాలలో కానవచ్చే 'వెళ్ళాడు' పదానికి సంబంధించినదే కావచ్చు. తమిళంలో 'వెళ్ళాడు' అంటే 'మేకల' ని అర్థం (తమిళ్ లెక్సికన్, పుట 3793). పైన ఉదహరించిన శ్రీనివాస నలూరు తమిళ శాసనం ఒక అఖండ దీపానికి 30 గొఱ్ఱెల ('ఆడు శెర్మరి') నూ, 30 మేకల ('వెళ్ళాడు') నూ దాన మిచ్చిన విషయాన్ని తెలుపుతున్నట్లు గమనించి ఉన్నాము. తెలుగు శాసనాలలో కూడా అఖండ దీపానికి కావలసిన నేతికిగాను మేకలను దానమిచ్చినట్లు స్పష్టంగా తెలిపే సందర్భాలు ఉన్నాయి (ఉదా: ద. హిం. శా., 6, సంఖ్య 181, క్రీ.శ. 1160; అదే, సంఖ్య 598, క్రీ. శ. 1163; అదే, సంఖ్య 599, క్రీ. శ. 1140; ద. హిం. శా., 10, సంఖ్య 134, క్రీ. శ. 1154; అదే సంఖ్య 155, క్రీ. శ. 1172). అందువల్ల తెలుగు శాసనాలలో కనపడే 'వెల్లెడ్లు' పదం తమిళంలోని 'వెళ్ళాడు' పదానికి సంబంధించినదనీ, ఆ పదానికి అర్థం 'మేకల'నీ అనుకోవచ్చు.

డా॥ శివలంక శ్రీరామచంద్రమూర్తి

# తెలుగు మాండలికము క్రియారాహిత్యము

జన వ్యవహారములోని భాష దేశకాల వ్యక్తి భేదాన్ని బట్టి నానా రూపాలుగా గోచరిస్తుంది. మండలాల (జిల్లాల) భేదాన్ని బట్టి ఒకే భాషను ఆయా మాండలిక భాషలుగా పేర్కొంటున్నాము. వ్యక్తి–కాల భేదాన్ని పురస్కరించుకొని భాషాపై విధ్యాన్ని గుర్తించడం చాలా కష్టం.

ప్రాగ్జన్యమయభాష కాలక్రమేణ పరిణతి చెందుతూ ఒక్కొక్క ప్రాంతంలోను భిన్న భిన్నంగా వికాసము నొందింది. వ్యవహర్తల భాషా మాండలికాన్ని బట్టి వారే ప్రాంతానికి చెందిన వారో సులువుగా గుర్తింపదగినట్లు తెలుగుభాష రూపొందింది. మరల తాలూకా పరిధులను బట్టి చూచినా ఈషద్భేదానికి లోనై భాషా తత్వజ్ఞులకు గుర్తింపదగి ఉంటుంది.

స్థూలంగా ఆధునిక తెలుగు వ్యవహార భాషను మూడు విధాలుగా విభజించుకోవచ్చు. మామూలుగా కూడా తెలంగాణా, రాయలసీమ, సర్కారు ప్రాంతాలని వ్యవహారంలో అంటుంటాం. ఈ మూడు ప్రాంతాలలో వ్యవహరింపబడుతున్న తెలుగు భాషను పరిశీలిస్తే నామ క్రియా పదాది ప్రయోగంలో భేదం స్పష్టంగా గోచరిస్తుంది. ఆ భేదంతోపాటు ఆది-అంత దీర్ఘాలు, విరుపులు, కాకువులు, యాస, వేగం ఆ మాండలికాని కొక విలక్షణతను కలిగించి భిన్న ప్రాంతీయులకు సులభ గ్రాహ్యం కాని విధంగాను క్రొత్తదనాన్నీ కలిగిస్తాయి.

రాయలసీమలోని అనంతపురం మాండలిక భాషతో మధ్య సర్కారుజిల్లా పశ్చిమగోదావరి మాండలిక భాషను కొన్ని అంశా లలో తులనాత్మకంగా పరిశీలించుట ప్రస్తుత విషయము.

అనంతపురం జిల్లా కర్ణాటకరాష్ట్ర సరిహద్దులో నుండుటచే నైసర్గికంగా అచటి భాష కన్నడ భాషతో సన్నిహితంగాను, కొన్ని ప్రాంతాలలో సమ్మిశ్రితంగాను గోచరిస్తుంది.

ఏది-యావుదు (కన్నడ)-యావది (అనంతపుర, మాండలిక)

సరిహద్దులలో నున్న సంధి ప్రదేశాలను వదలి తక్కిన భాషను పరిశీలింపగా అనంతపురం భాషలోని పదజాలము, పలుకు బడు క్రియా పద ప్రయోగాల్లో ప్రాచీనాంధ్ర భాషకు మిక్కిలి సన్నిహితంగా గ్రాంథిక భాషకు తోబుట్టువుగా కనిపిస్తుంది.

| ప్రాచీన భాషా ప్రయోగము | అనంతపుర మాండలికము |
|---|---|
| తోడ్కొనిపోయె | తోడుకోని పోయె (పాయ) |
| ఎప్పుడు వచ్చితివి | ఎప్పుడొస్తివి (వచ్చ్+తివి > వస్స్+తివి) |
| రమ్మని చెప్పితి | రమ్మం జెప్తి |
| అయ్యవారు చెప్పిరి | అయ్‌వారు చెప్రి |
| చేసి వైచితిని | చేశే స్తి |
| ఎన్నడు చూచితిని | ఎన్నడు చూస్తి |

అనంతపుర మాండలికము ప్రాచీన భాష నుండి హెచ్చు మార్పులకు గురి కాక ప్రాచీనపు పలుకు బడులను క్రియాపదాది నిష్పత్తిని ఈషద్భేదముతో వ్యవహారమున నిలుపుకొని యున్నది. సాధారణముగా చూచిన ద్రవస్థితి కల్గి ఏకరూపత లేక వైవిధ్యము నొంది యుండుట ఇచటి భాష ముఖ్య లక్షణము.

పశ్చిమగోదావరి తెలుగు మాండలిక భాష స్థితి వేరు. ఈ ప్రాంతము ఏ ఇతర రాష్ట్ర సామీప్యస్థితి నందలేదు. ఇతర భాష లతో స్పర్శ లేదు. ఈ భాష తొలినాటినుండి అచ్చనుగా జన వ్యవహారమున బాగుగా ప్రహతమై ఒక స్థిరరూపాన్ని పొంది ప్రాచీన భాషకు సుదూరంగా పరిణతి చెందింది. యాస ధ్వను లను వదలిపెట్టి పదజాలాన్ని గమనించినచో అర్ధద్రవస్థితి గలిగిన ఈ మాండలికము ఏకరూపత నొందియున్నది.

పశ్చిమగోదావరి మాండలికము క్రియాపద ప్రయోగమున ప్రాచీన రూప సంపదను కోల్పోయి వైశద్యమును పోగొట్టు కొన్నట్లు నాకు తోచుచున్నది. దీనిచే ఈ మాండలిక భాషలోని సౌష్టవము కొంత క్షీణించినదని చెప్పక తప్పదు.

భాషలలో సంపూర్ణ క్రియలతో పాటు అసంపూర్ణ క్రియలు కూడా వాడబడుచున్నవి.

(సంస్కృత) సః గతవాన్, కృతవాన్ అని క్రియల వలె వాడబడు శబ్దములు క్రియలు కావు, కృదన్తములు.

(గమ్ల్ గతౌ) గమ్+క్త్ తవత్=గతవత్, గతవాన్
(కృఞ్ కరణే) కృ+క్తవత్=కృతవత్, కృతవాన్

క్రియాపదములకు బదులుగా కృదంతములు సాధారణముగా ప్రయోగింప బడుతున్నాయి. ఈ సంస్కృత భాషా కృదన్తపదము లకు వెళ్ళినవాడు, చేసినవాడు అని అర్థము.

వచ్చిన+అట్టివాఁడు > వచ్చినట్టివాఁడు > వచ్చినవాఁడు > వచ్చి (వచ్చియున్నవాడు) నాడు > వచ్చాడు, వచ్చేడు, వచ్చిండు (తెలంగాణా)

చేసిన+అట్టివాఁడు >చేసినట్టివాఁడు > చేసినవాఁడు > చేసినాడు>
(చేసియున్నవాడు) చేశాడు, చేశేడు,
చేసిండు (తెలంగాణా)

పై కృదంత రూపములే ఆంధ్రప్రదేశ రాష్ట్రమున సార్వత్రికముగ ఈషద్రూప భేదములతో వ్యవహారములో నున్నవి. ఇవన్నియు అసంపూర్ణ క్రియారూపములుగా భావింపవచ్చు.

సంస్కృత భాషలో భూతకాలిక లకారములు అర్థభేదము ననుసరించి ప్రయోగింపబడుచున్నవి. వీనిని సంపూర్ణ క్రియలుగా భావించుచున్నారు.

| | | |
|---|---|---|
| అగచ్ఛత్ | (గమ్) | లఙ్ |
| జగామ | (గమ్) | లిట్ |
| అగాత్ | (గమ్) | లుఙ్ |

కాల క్రమమున పై క్రియల అర్థభేదమును విస్మరించి సామాన్య భూతకాలిక క్రియలుగా ప్రయోగించుట జరుగుచున్నది.

తెలుగున ఇంత క్రియాపద పరిణతి లేకున్నను ప్రాఙ్నన్నయ కాలమునుండి సంపూర్ణక్రియ మాత్రము వాడుకలో నున్నది.

| | | |
|---|---|---|
| పోయెనివాస భూమికిన్ | — | తిక్కన |
| అడిగితి నొక్కనాడు | — | శ్రీనాథుడు |
| కాంచెన్ వైష్ణవుడు | — | శ్రీకృష్ణదేవరాయలు |
| అటజని కాంచె | — | అల్లసాని పెద్దన |

పై సంపూర్ణ క్రియారూపాలు, అసంపూర్ణ క్రియారూపాలు అనంతపుర మాండలిక భాషలో నేడు వ్యవహారంలో ఉన్నాయి కాని పశ్చిమగోదావరి మాండలికమున సంపూర్ణ క్రియారూపములు కొఱవడి వ్యవహారచ్యుతి నందినవి. వీని నుపయోగింపవలసిన చోట్ల అసంపూర్ణ క్రియలే వాడబడుచుండుట ఒక వింతగా భాసిల్లును.

## సంపూర్ణ క్రియ

| సంస్కృత రూపము | | అనంతపుర మాండలికము | | ప. గో. మాండలికము | |
|---|---|---|---|---|---|
| అపశ్యత్ (దృశిర్) లఙ్ | (Saw) | చూచె, చూశె | ప్రథమ పురుష | —లేదు— | (చూచాడు) |
| అకరోత్ (కృ) - లఙ్ | (Did) | చేసె | | — | (చేశాడు) |
| అగచ్ఛత్ (గమ్)- లఙ్ | (Went) | పోయె, వెళ్ళె | | — | (వెళ్ళాడు) |
| అపశ్యమ్ | (Saw) | చూస్తి | ఉత్తమ పురుష | — | (చూశాను) |
| అకరవమ్ | (Did) | చేస్తి | | — | (చేశాను) |
| అగచ్ఛమ్ | (Went) | వెళ్ళితి, వెళ్తి, పోతి | | — | (వెళ్ళాను) |
| అపశ్యః | (Saw) | చూస్తివి | మధ్యమ పురుష | — | (చూచావు) |
| అకరోః | (Did) | చేస్తివి | | — | (చేశావు) |
| అగచ్ఛః | (Went) | వెళ్తివి, పోతివి | | — | (వెళ్ళావు) |

సంపూర్ణ క్రియలుగా అనంతపుర మాండలికమున నున్న చోట్ల పశ్చిమగోదావరి మాండలికమున అసంపూర్ణ క్రియా రూపములే వాడుకలోనున్నవి. అసంపూర్ణ క్రియలుగా అనంతపుర మాండలికమున నున్న చోట్ల సయితము పశ్చిమగోదావరి మాండలికమున నివే వాడుకలో నున్నవి.

అడిగియున్నాడు (గ్రాంథిక) అడిగినాడు (అనంత) అడిగాడు (ప. గో)
అడిగినవాడు అడిగేడు

అడిగియున్నావు (గ్రాంథిక) అడిగినావు (అనంత) అడిగావు (ప. గో)
అడిగిన వాడవు అడిగేవు

అడిగియున్నాను (గ్రాంథిక) అడిగినాను (అనంత) అడిగాను (ప. గో)
అడిగినవాడను అడిగేను

కొంత విస్తృత పరిధిలో చూచినచో దాదాపు రాయలసీమ అంతటా కనబడుచున్న సంపూర్ణ క్రియాప్రయోగము పశ్చిమ గోదావరిలో (ఇంచుమించు మూడు నాలుగు మండలాల్లో) లుప్తమగుట విచారింప దగిన విషయము. దీనిచే కొంతవరకు నిర్దిష్టత లోపించి వ్యవహారమున భాషాక్లేశము ఏర్పడుచున్నదనిపించును.

**శ్రీ కె. నాగేశ్వరశాస్త్రి**

# మినీకవిత - పాదవిభజన

కొన్ని మినీకవితల్ని వచనత్వం మెండైన రచనలు మాత్రమేఅని, వాటిల్లో కవిత్వం ఉండటంలేదని కొందరు విమర్శిస్తున్నారు. ఈ విమర్శించే వాళ్ళు మారినకవితా స్వరూపాన్ని గ్రహించటంలేదు. పదాల అందమైన పేర్పుడు కవిత్వానికి ప్రధానమనే వీళ్ళఉద్దేశం ఇంకా మారలేదు.

స్వచ్ఛమైన భావుకత వుండి, అది నిర్మాణాత్మకమయినఆలోచనకు దారితీసేదిగా వున్నప్పుడు వాక్యమైనా, మినీకవిత అయినా, వచనకవిత అయినా, పాటయినా పద్యమైనా ఆ రచన కవిత్వమే అవుతుంది. పద్యంలో అక్షర గణాలు సూర్య ఇంద్రాది గణాలుంటే పాటలో మాత్రా గణాలుంటాయి. వచన కవితలో లయవుంటున్నది. ఈ గణాలు, లయ కవిత్వం కావు. కవిత్వానికి పెట్టిన ఆభరణాలు మాత్రమే. మినీకవితలో లయ లేదని కాదు కాని కనీసం ఈ లయ కూడా లేకుండా కొన్ని మంచి మినీ కవితలు ప్రత్యేకంగా వస్తున్నాయి. ఎలాంటి ఆభరణాలు లేకుండా సహజరూపంతో కొన్ని మినీ కవితలలో కవిత్వం మనకు దర్శన మిస్తోందన్నమాట. మినీ కవిత వ్రాసే కవులు లయ కోసమని ఏ మాత్రమూ కృతక ప్రయత్నాన్ని చేయకపోవటమే ఇలాంటి కొత్తరకం మినీ కవితలు రావటానికి కారణం. లయ లేకపోవటం అనేది కవిత్వానికి లోపం కాదు. గద్యంలో కవిత్వం ఉందని అంగీకరించే వాళ్ళు కవిత్వం గద్య తుల్యరూపంలో కనిపిస్తే వ్యతిరేకించ కూడదు. లయ లేకపోవటం వలన కొన్ని మినీ కవితలు గద్య తుల్యాలుగా అనిపిస్తున్నాయి. గద్యంలా లేదా గద్యమే అయినంత మాత్రాన అది కవిత్వం కాదనటానికి వీలులేదు.

లయ నియమంగా పెట్టుకొని వచన కవితలు వ్రాసే కొందరు కవిత్వం కంటే లయకే, తమకు తెలియకుండానే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నట్లు అనిపిస్తోంది. "ఓ కొమ్మా ! నా మనసులో నీ బొమ్మ నిలిచివుంది" అనే వాక్యంలో కవిత్వం లేకపోతే, ఈ మాటలనే అంత్యప్రాస కోసం

"నా మనసులో నీ బొమ్మ
నిలిచివుంది ఓ కొమ్మ !"

అని రెండు పాదాలుగా ప్రదర్శించి వ్రాసినదానిలోనూ కవిత్వం లేనట్లే. కాని ఈ విషయం ఇంకా కొందరు గ్రహించవలసి వున్నది. ఈ మధ్యఒక మిత్రుడు తన కవితలో ఇలా రాశాడు.

"ఆకాశంలో హరివిల్లు
విరిస్తే గుండెలో జల్లు"

అని రెండు పాదాలున్నాయి. అంత్యప్రాస కోసం భావ విశ్రాంతిని ఎలా ఖూనీ చేశాడో ఆశ్చర్యం వేసింది.

"ఆకాశంలో హరివిల్లు విరిస్తే
గుండెలో జల్లు"

అని భావ విశ్రాంతిని బట్టి హాయిగా ఎందుకు వ్రాయలేదని ఆ కవిని ప్రశ్నించాను. ఇలా రాస్తే అది గద్యమై కవిత్వమనిపించు కోదని, తాను వ్రాసిన విధానం కవిత్వం అవుతుందని అతడిచ్చిన సమాధానం. అతడిలాంటి వాళ్ళు, అలాంటి వాళ్ళను ప్రోత్సహించే కొందరు విమర్శకులు గద్యాన్ని పోలిన కొన్ని మంచి

మినీ కవితలను కవిత్వం కాదని కొట్టి పారేస్తున్నారు, వచనత్వం మెండైన రచనలని తీసి పారేస్తున్నారు.

వచన కవితలోని లయ మీది మోజు కూడా తిరస్కరించి సహజంగా, స్వచ్ఛంగా కొన్ని మినీ కవితలు తిరుగుబాటు మనస్తత్వం గల యువకుల నుండి దూసుకు వస్తున్నాయని గ్రహించి అందులోని కవిత్వమేదో 'ఆలోచించి' పరిశీలించటానికి సాహిత్యప్రియులు పూను కోవాలి.

ఉదాహరణకు ఈ కవిత చూడండి. భగ్వాన్ వ్రాసిన ఈ కవిత పేరు "కార్మికులు".

"చేతులు
తమ కంఠాలకు
దారం ఉరితాడు
బిగించినా
మల్లెపూలు
సురభిళాన్ని
వెదజల్లుతూనే వున్నాయ్."

ఇదంతా ఒకటే వాక్యమని, ఒక వాక్యాన్ని కొన్ని లైన్లుగా విడగొట్టితే ఇది కవిత్వ మవుతుందా అని దీని మీద విమర్శించే వాళ్ళున్నారు. ఇలా విమర్శించే వాళ్ళు రెండు రకాలుగా విమర్శిస్తున్నారు. గద్యవాక్యం లాంటి రచన కవిత్వం అవుతుందా అని ఒకటి, ఒక వాక్యాన్ని కొన్ని లైన్లుగా పేర్చటం వలన ప్రయోజనం ఏది లేదనేది మరొకటి. మొదటి రకానికి చెందిన విమర్శకు ఇంతకు ముందే కొంత సమాధానం ఇచ్చాను. దీనిని ఉదాహరణతో పరిశీలించవలసి వుంది.

స్వచ్ఛమైన భావుకత వుండి అది నిర్మాణాత్మక మయిన ఆలోచనను ప్రేరేపించి గంభీర భావాన్ని ప్రతి పాదిస్తుంటే దాని రూపం ఎలా వున్నా అది కవిత్వమే అవుతుందనుకున్నాం. "కార్మికులు" అనే పై మినీకవితలో కవిత్వం వుంది.

ధ్వని కాని, చమత్కారం కాని, రసం కాని, అలంకారం కాని "స్పష్టంగా" ఉంటేనే అది కవిత్వమను కోవాల్సిన పని లేదు. కొన్ని మినీ కవితలలో ఇవంత స్పష్టంగా లేకుండా "ఆలోచన" కు ప్రధాన పాత్ర కల్పించడం వల్ల అవి మంచి కవితలవుతున్నాయి. ఆధునిక కవిత్వంలో కొత్తగా వికసించిన "ఆలోచన" పాత్రను గమనించలేని వాడికి మారుతున్న కవితాతత్త్వం అర్థం కాదు. ఈ "ఆలోచన" కేవలం మినీ కవితకే కొత్త కాదు. వచన కవితలోనే ఇది ప్రధాన పాత్ర వహించ నారంభించి మినీ కవితలో బాగా వ్యాపిస్తోంది. ఆలో చించటం అలవాటయిన వాడికి ఇలాంటి మినీ కవిత లలో అస్పష్టత లేనట్లే.

"కార్మికులు" కవితలోని కవిత్వాన్ని ఈ విధంగా ఆలోచించి గ్రహించ వచ్చును. శీర్షికను అన్వయించ కుండా కవిత చదవగానే మల్లెపూల గురించి కవి చెపు తున్నాడనిపిస్తుంది. శీర్షిక వలన కార్మికులను గురించి కవి ఉద్దేశించాడని స్పష్టమవుతుంది. చేతులంటే దోపిడీ దారుల చేతులు. సురభిళం అంటే శ్రమఫలంగా గ్రహించ వచ్చు. పూలను దారంతో గొంతులు బిగించినా సువా సనలు వెదజల్లుతున్నట్లే ప్రత్యక్షంగా కాని పరోక్షంగాకాని కార్మికుల గొంతుల మీద దోపిడీదారులు కూర్చుంటున్నా వీరు శ్రమఫలా లందజేస్తూనే వున్నారనేది ఈ కవితలోని సామాజిక వాస్తవికత. ఇలా గంభీరమైన భావాన్ని పాఠకులు ఆలోచించి తేలిగ్గానే గ్రహించవచ్చు. కొంద రంటున్నట్లు మినీ కవితలో కవిత్వం పల్చబడలేదు, సంక్షిప్తత అనే లక్షణం వలన చిక్కబడిందంతే.

ఇలా కొన్ని మినీ కవితలలోని కవిత్వాన్ని పాఠకులు ఆలోచించి ఆస్వాదించే అవకాశం ఉన్నది. కనుక వాక్యంలాగా ఉన్నా సరే, ఏవో కొన్ని లైన్లుగా ఆ వాక్యం విడగొట్టబడినా సరే అది కవిత్వం కాదన టానికి వీల్లేదు.

ఇక రెండవరకానికి చెందిన విమర్శ, మినీకవితలో వాక్యాన్ని కొన్ని లైన్లుగా నడుములు విరగ్గొట్టినట్లు

విడగొట్టటానికి ప్రత్యేక ప్రయోజనం ఏదీ లేదనేది. ఈ విమర్శను కూడా సరియైన సమాధానంతో కొట్టి పార వేయవచ్చు.

సాహిత్యంలో వచ్చే ప్రతిమార్పు కూడ సాధారణంగా ఏదో ప్రయోజనం కాంక్షించి మాత్రమే అభివృద్ధి చెందటానికి ప్రయత్నం చేస్తుంది. మినీ కవితలో అనవసరమైన పదాలు ఉండవు, ఖచ్చితమైన పదాల ఎంపిక జరుగుతుంది. కనుక పాఠకుడు ప్రతి పదాన్ని కూడ ఎంతో జాగ్రత్తగా ఆలోచిస్తాడు. ఇందుకు సహకరించటం కోసం స్పష్టంగా చూపాలనుకొన్న పదాన్ని గాని, పద సమూహాన్ని గాని ఒక్కో పాదంలో వుంచుతూ కవులు మినీ కవితలు రచిస్తున్నారు. ఒక వాక్యం అంతా ఒకే పాదంలో రాసినా పాఠకుడి దృష్టి అన్ని పదాల మీద పడి ఆలోచించటానికి ఎందుకు అవకాశముండదని ప్రశ్నించే వారుండవచ్చు. వారి కోసం ఒక ఉదాహరణ

సినిమాలో కథానాయికి అద్భుతంగా నృత్యం చేస్తున్న సన్నివేశం ప్రేక్షకులకు చూపిస్తున్నారనుకోండి. ఆమె ముఖకవళికల్ని భావాను గుణంగా ఎంత చక్కగా ప్రదర్శిస్తుందో తెలియ జెప్పటానికి వెండితెరపై ఆమె ముఖాన్ని మాత్రమే చూపిస్తారు. ఆ తర్వాత ఆమె నడుం ఎలా విన్యాసం చేస్తుందో స్పష్టంగా చూపటానికి నడుం మాత్రమే తెరమీద చూపిస్తారు. హస్త విన్యాసం చూపాలంటే తెరమీద చేతుల్నే చూపించవచ్చు, అలాగే ఆమె పాదాలు కూడా ఇలా ఇన్నిసార్లు కాకుండా ఆమెను ఒక్కటిగానే మొత్తం పరిసరాలతో సహా నృత్యం ముగిసే దాకా చూపించి తీరాలని ఎవడూ ఆశించడు. కథానాయికి ముఖం, నడుం, చేతులు, కాళ్ళు తెరమీద విడివిడిగా చూపినంత మాత్రాన ఆమెను ముక్కలు ముక్కలు చేసి చూపించారని ఏ మూర్ఖ ప్రేక్షకుడూ అనుకోడు. ఆయా భాగాల విన్యాస ప్రాధాన్యతను బట్టి స్పష్టంగా గ్రహింప జేయటం కోసం విడివిడిగా చూపటం సినిమాలో ఒక 'టెక్నిక్'. మినీ కవితలోనూ ఇంతే. ఒక వాక్యాన్ని కవి తన ఉద్దేశాలకు అనుగుణంగా అనేక పాదాలుగా రచిస్తాడు.

ఇంతకు ముందు ఉదహరించిన "కార్మికులు" కవితనే ఈ దృష్టితో పరిశీలింపవచ్చు.

"చేతులు" అనే మాట ప్రాధాన్యత సంతరించుకొన్నటు వంటిది. దోపిడీదారుల చేతులు స్ఫురించాల్సిన అవసరం వుంది. అందుకే చేతులు – ఒక లైను. తమ కంఠాలకు - అన్నప్పుడు పూలగొంతులతో పాటు కార్మికుల గొంతులు కూడా ధ్వనించాలి. కంఠాలకు అని అనటంలో కార్మికుల వాక్స్వాతంత్ర్యం కూడా స్ఫురించాలి. అందుకే 'తమ కంఠాలకు' అనేది మరో లైను. దారం ఉరితాడు - లో పూలకోసం దారం, కార్మికుల కోసం ఉరితాడు అనే భావన కలుగుతుంది. ఉరితాడు అని అనటంలో దుష్ట అర్థిసెన్సు కూడా తలపుకు రావాలి. అందుకే "దారం ఉరితాడు" ఇంకో లైనుగా వుంది. బిగించినా - అనే మాటకు విశేషబోధకత అంతగా లేకపోయినా విశేషబోధకత వున్న రెండు లైన్ల మధ్య ఒంటరిగా వుండవచ్చు. ఇలా విశేషబోధకత లేని లైను వరసగా ఒకటికి మించి రావటానికి వీల్లేదు. ఎందుకంటే ఇలాంటి లైన్లను ఒకే లైనుగా వుంచినా నష్టం ఏదీలేదు.

తర్వాత వచ్చే "మల్లెపూలు" అనే లైను విశేష బోధకత కల్గివుంది. కవితకు ప్రధానమైన విషయం కార్మికులు. ఆ కార్మికులు మల్లెపూల వలన స్ఫురించాలి. మల్లెపూవుల్లోని సౌజన్య లక్షణాలు కార్మికులలో ఏమున్నాయో అవగాహనకు తెచ్చుకోవాలి. "సురభిళాన్ని" అనేది తరువాత లైను. ఇది శ్రమ ఫలాన్ని గుర్తుకు తెస్తుంది. సురభిళానికి, శ్రమ ఫలితానికి ఉన్న పోలికలు గ్రహించాలి. "వెదజల్లుతూనే వున్నాయ్" అనే లైనులో అంతగా విశేషబోధకత లేకపోయినా ఇది కవితకు ముగింపు. మినీ కవితలోని పాద విభజన సూత్రాన్ని ఈ విధంగా విశ్లేషించ వచ్చునన్నమాట.

లయ లేకపోయినా, వాక్యంలాగా అనిపించినా సదా లోచనామృతాన్ని పెంపొందించ గలిగితే మినీ కవితలో కవిత్వం వున్నట్లే. తాను ప్రతిపాదించే విశేష భావాలు అందరూ స్పష్టంగా ఆలోచించి గ్రహించటం కోసం కవి కూడా జాగ్రత్తగా ఆలోచించి సముచిత పదాలు వాడి మినీ కవితను అవసరాన్నిబట్టి అనేక పాదాలుగా విరచిస్తాడు. అది విషయం.

శ్రీ రావి రంగారావు

# బొబ్బిలి బొబ్బ
# బొబ్బిలి: ఒక వివరణ

1983 ఏప్రిల్ భారతి (పుట 69_70) లో అంతకు పూర్వం (సెప్టెంబరు 1982 భారతి) నాచే ప్రచురింపబడిన 'విజయనగరం జిల్లా గ్రామనామములు - ఒక పరిశీలన' వ్యాసములోని 'బొబ్బిలి' గ్రామనామమునకు సంబంధించిన విమర్శనము గమనించితిని. దానిపై ఈ వివరణ అవసరమైనది.

'బొబ్బిలి' కి ఆ పేరు వచ్చుటకు నేనుదహరించిన పద్యము కాని, వివరణ కాని (విమర్శకులకు సరిగా ఉన్నట్లు అనిపించనివి) నా స్వకపోల కల్పితములు గావు. "ఈ పట్టణమున్న స్థలమును చికాకోలు నవాబు షేర్ మొహమ్మద్‌ఖాన్‌చేత నీ సంస్థాన పాలకు లకు ప్రసాదింపబడుటవలన నచట కట్టిన కోటకు, పేటకు నివేశన దాత పేరు 'బ్బెబులి' పేర బెబ్బులి (షేర్ అనగా పెద్దపులి) యని వ్యవహరింపఁగా నదే జనుల వాడుకలో 'బొబ్బిలి' యైనదట.◆ ధ్వని పరిణామ సూత్రముల మేరకు బెబ్బులి, బొబ్బిలి యగుననుట శాస్త్ర విరుద్ధము కాదు. కాని, యీ వ్యుత్పత్తి చరిత్రగతి కనుగుణముగా నున్నదో లేదో చరిత్రకారు లింకను యోజించి చివరి మాటను చెప్పవలసియున్నది." (డా॥ తూమాటి దొణప్ప, ఆంధ్ర సంస్థానములు-సాహిత్యపోషణము, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు, 1969, పుట 294). డా॥ దొణప్పగారు పైసందర్భమున అధస్సూచికలో ఉదహరించిన పద్యమునే నేనును ఉటంకించినాను. ఆ పద్యమిది:

◆"షేరనఁ దురుష్క భాషనుఁ జెలఁగను బులి
పెద్దపులి యను పదమయ్యె బెబ్బులియన
బెబ్బులియె నాఁడు నాటికి బొబ్బిలియన
బొలిచె నక్షరములు మార్పుఁబొంద విపుడు."

విమర్శకులు పై పద్యమునకు, నా (?) వివరణకు అభ్యంతరముగా తోచిన కారణములు ఇవి:

(1) సంస్థాన దస్తావేజు లేమనుచున్నవి?

బెబ్బులియే బొబ్బిలి యైనదని భావించుటకు పూర్వ పరిశోధకులు గూడ (నావలె కేవల చరిత్ర చదువరులు కాక భాషా - ధ్వని పరిణామ విషయాదు లెరిగినవారు) సాక్ష్యాధారముగ నిల్పిన పై పద్యము ప్రపదన పారిజాతము (ఏప్రిల్ 1983 భారతిలో ప్రపచన అని పడినది_అచ్చు తప్పు అనుకొందును) అవతారిక లోనిది. సదరు ప్రబంధ రచయిత కొటికెలపూఁడి కోదండరామ కవి బొబ్బిలి సంస్థానాస్థాన కవి. పైగా, ఆ కృతిని ఎవరి కోరిక మీదైతే రచించి వారికి అంకిత మిచ్చాడో ఆ రాజా శ్వేతా చలపతి రంగారావు (1810_1862) సహాధ్యాయి. తదనంతరం ఈ కృతి బొబ్బిలి మహారాజా సర్ వేంకట శ్వేతా చలపతిరంగారావు సమాదరణమున ప్రకాశితమైనది. (శారదాంబా విలాస ముద్రాక్షరశాల, చెన్నపురి, 1906). కావున ఆ కృత్యవతారికలో బెబ్బులి బొబ్బిలి యైన క్రమము తత్ సంస్థానాధిపతులకు అంగీకార యోగ్యముగా నుండినదని నిశ్చయింప వచ్చును. సంస్థాన దస్తావేజు లేమనుచున్నవి? అని విమర్శకులు ప్రశ్నించిరేకాని ఏమను చున్నవో తెలుపలేదు. దస్తావేజులు నేనూ చూడలేదుగాని సదరు దస్తావేజులకు సాటిపాటియైన చారిత్రక సాక్ష్యాధార గౌరవమును ఆ సంస్థానాస్థాన కవి - సంస్థానాధీశునకు ఆప్తుడుమైన కవి కృతికీయ వచ్చునని అనుకొందును.

(2) "మొదట ఊరి పేరు 'బెబ్బులి'గా పలుకబడుచు, రాను రాను 'బొబ్బిలి' అని పూర్తిగా మారిపోవుటకు స్థానికముగా సాక్ష్యాధారములు కలవా?" అని వారి సందేహమునకు గూడ పై వివరణము సమాధానము కాగలదను కొందును.

(చూ. "బెబ్బులియె నాఁడు నాటికి బొబ్బిలియన" —)

(3) అట్లే, షేర్ ఖాన్ స్మృతి చిహ్నమైన ఊరి పేరు 'షేర్ ఖాన్ పేట' అనియో, 'షేర్ మహమ్మద్ నగరం' అనియో వుండవలెనుగాని వుత్పత్తి "బెబ్బులి" ఏమిటి? అను సందేహమునకు కూడ ఉదహరింపబడిన పద్యము. (షేరనఁదురుష్క భాషనుఁ జెలఁగను బులి; పెద్దపులియను పదమయ్యె బెబ్బులియన) లోనే సమాధానమున్నది. అంతేకాక, ఏ వ్యక్తి పేరుననైనా వెలసిన గ్రామములు యథా తథముగా అక్షరం పొల్లుపోకుండా ఆపేరునే కలిగి వుండాలనే ఖచ్చితమైన నియమమున్నదా!?

విమర్శకు అట్లని వ్రాసినారు. "బెబ్బులి" అనే పదము ప్రసిద్ధమైనది. చెక్కు చెదరక జనులనోట నానుచువుంది. అట్టి సుప్రసిద్ధ పదము మారిపోయినది యనుటలో సామంజస్యము లేదు

బొబ్బిలి యని పలుకుట 'బెబ్బులి' అని పలుకుట కంటే కష్టము. కావున 'బెబ్బులి' ఉచ్చారణ రాను రాను బొబ్బిలిగా మారుటకు వీలు కనబడుటలేదు. తాండ్రపాపారాయుని 'బొబ్బిలి బెబ్బులి' అనుచునే ఉన్నారు. ఇటీవలె, 'బొబ్బిలి పులి' అనే సినిమా వచ్చింది. 'పులి-బెబ్బులి అనే సినిమా రాబోతోంది. సాధారణంగా సినిమాపేర్లు 'క్యాచీ' గా ఉండాలని, జనసామాన్యం నోరుతిరిగేటట్లు సుగమంగా ఉండాలని భావించి నిర్ణయిస్తారు. కావున, ప్రాసబాగున్నా 'బొబ్బిలి బెబ్బులి' అనే పేరు అంగీకార యోగ్యంకాక బొబ్బిలిపులే ఆమోదింపబడిందేమో! అలా అని 'బెబ్బులి' తృణీకరింపబడినదా అంటే అదీ లేదు. పులి - బెబ్బులి రాబోతున్నదికదా. ఈ బెబ్బులి బొబ్బిలబాధ ఎందుకనుకున్నారో యేమో 'పెద్దపులి - చిన్నపులి' అని కూడా ఓ సినిమా పేరుంచారు. ఇంతకీ, బెబ్బులి - బొబ్బిలి కూడా ఈ రోజుల్లో కూడా చాలామంది ఉచ్ఛరించగలిగే పదములే అని తేలుచున్నది. షేర్‌ఖాన్ పేరు ఊరికి పెట్టుకోబోయేవారు తరువాత జరుగబోయే ఈ తర్జన భర్జనలు ఊహించిఉంటే శుభ్రంగా 'పులిఊరు' అని పేరుంచే వారేమో!

విమర్శకులు "బొబ్బిలి మొట్టమొదట 'బొబ్బ బిల్లి'గా వుండెడిదని మన మనుకొనవచ్చును" అంటూ 'బిల్లి' నామాంత్యముగాగల కొన్ని గ్రామ నామములు ఉదాహరణలుగా ఇచ్చారు. ఈ 'బిల్లి' అనే నామాంత్యము మొదట 'పల్లి'కాదుగదా? అనకాపల్లిని కొందరు అనకాపిల్లి అని చీపురుపల్లినికి కొందరు చీపురుపిల్లి అని పలుకుచున్నట్లు. ఈ 'బిల్లి' లాంటిదే 'విల్లి' అనే గ్రామనామాత్యం కూడ. "ఐనవిల్లి ముక్కవిల్లి, ఖండవిల్లి ఆయా నామాలలో వుండుకున్న విల్లి మొట్టమొదట పల్లిలోనుంచి వల్లిగామారి తుట్టతుదకు విల్లిగా నవతరించినదేమో విజ్ఞులు విచారింపగలరు" అని వేళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి (కథలు - గాథలు, తృతీయ భాగం, పుట 500). ఈ లెక్కన, బొబ్బిలి తొలి నామధేయం బొబ్బబిల్లి అనగా బొబ్బపల్లి అనగా పెద్దపల్లి కావచ్చును. కాని కాదు. ఎందుకుకాదో ముందు వివరింపబడుతుంది. ప్రస్తుతానికి బొబ్బబిల్లి యథాతథంగా స్వీకరిస్తే, బిల్లికిని పిల్లికిని స్వారూప్యమున్నది కనుక ఆ గ్రామముండినచోట పిల్లి బొబ్బపెట్టినది కావున (చెవుల పిల్లులు వేట కుక్కలను ఎదిరించిన స్థలాల్లో నగర నిర్మాణం జరిగిన కథలు ఆంధ్రదేశ గ్రామాలకు సంబంధించినవి వున్నవి కనుక) దానికి బొబ్బబిల్లి అని పేరు వచ్చినదనే వ్యాఖ్యానం వెలయింపజేయడానికి వీలుంది. కాని మనమీ విధంగా బొబ్బిలినికి బొబ్బబిల్లిగా సాధించుటకు దానిని పిల్లిమొగ్గలు వేయించ వలసిన అవసరంలేదు. ఎందుకంటే, 'బొబ్బిలి' గ్రామ నామముగా 13, 14 శతాబ్దులనాటి శిలాశాసనములలో కానవస్తోంది. యస్. ఐ. ఐ. వాల్యుం vi, నెం. 798, శ॥సం॥ 1282 (డా. సుందరం-'ది సింహాచలం టెంపుల్', పుట 252), యస్. ఐ. ఐ. వాల్యుం vi , నెం. 950, శ॥సం॥ 1349 (కుందూరి ఈశ్వరదత్తు, శాసనశబ్దకోశము, పుట 76). ఈ శాసనాధారాలను పరిగణనలోనికి తీసుకుంటే, (అంటే ఆ శాసనములలో ప్రస్తావింపబడిన బొబ్బిలియే నేటి బొబ్బిలిగా అంగీకరిస్తే) ప్రప్రదన పారిజాతములోని పద్యమూ, విశాఖపట్నంజిల్లా వృత్తాంత సంగ్రహము మొ॥ సాక్ష్యలబట్టి మనం అనుకున్నట్లు బొబ్బిలిపేరుకును, షేర్ మహమ్మద్‌ఖాన్‌నకును ఎట్టిసంబంధములేదు. నిజానికి ఈ విధమైన సందేహం ఇంతకు పూర్వమే వ్యక్తపరిచినవారున్నారు. "ఈ కోటకు బొబ్బిలి యను నామము ఎట్లువచ్చెనో తెలియదు. అది మునుపటినుండి యున్న గ్రామమై యుండవచ్చును.... పురనిర్మాణము జరిగిన పిదప, కొలది ఏండ్లలో 'బెబ్బులి' యను నామము 'బొబ్బిలి' గా మారెననుట సందేహాస్పదముగా నున్నది. ఈ మార్పు భాషాశాస్త్రదృష్ట్యా సమంజసమనిపించదు." సంగ్రహ ఆంధ్ర విజ్ఞానకోశము, ఆరవ సంపుటము, పుట 460. బెబ్బులి బొబ్బిలి యగుట ధ్వని పరిణామ సూత్రముల మేరకు శాస్త్ర విరుద్ధము కాదను అభిప్రాయమును ఇంతకు ముందే పేర్కొన్నాము. ఈ విధముగా బెబ్బులి బొబ్బిలియగుట గూర్చి భాషా విషయకముగా విరుద్ధాభిప్రాయములున్నవని తేలుచున్నది. శాస్త్రవిరుద్ధమనే అభిప్రాయంతో విమర్శకులు బొబ్బిలిని బొబ్బ బిల్లి - బొబ్బిల్లి - బొబ్బిలి ఇత్యాదిగా సాధించుటకు ప్రయత్నించారు. అంత పరి'శ్రమ' అవసరములేకుండా షేర్ మహమ్మద్‌ఖాన్ కాలము (17 వ శతాబ్ది మధ్య భాగమునకు, ముందే యుండిన 'బొబ్బిలి పేరునకు గల అర్థమునకు వేరొక వివరణ యున్నది. తెలుగువారి నగరల్లో బొబ్బిలి కాయవృక్షసంబంధం.........నివగాం, గార, బొబ్బిలి, సాలూరు వగైరా కూడా చెట్ల పేర్లు" (జి. ఆర్. వర్మ 'కళింజ దేవ' తాడేపల్లిగూడెం, 1977, పుట 25 & 53). కనుక ఈ విధంగా బొబ్బిలి వృక్షసంబంధి, అని తేలుచున్నది.

ఈ వివరణములన్నియు 'విజయనగరం జిల్లా గ్రామనామముల' వ్యాసమందే ఎందుకీయబడలేదన్న ప్రశ్నవచ్చును. కాని ఇట్టి సుదీర్ఘ చర్చలుచేయుట స్థలాభావముకూడ ఒకకారణముగా ఒక వ్యాస పరిధిలో చేయుటకు వీలుండదు కదా! అందులకే ఈ జిల్లా గ్రామ నామములకు సంబంధించిన (వెలువడిన - వెలువడనున్న) వ్యాసములన్నింటికి 'ఒక పరిశీలన' అని చిగురున చేర్చుట జరుగుతోంది. విస్తృత శాస్త్రీయ పరిశోధనలు గావించవలసిన అవసరమును గుర్తించడమూ జరుగుతోంది. ఈ సందర్భమున ఇటువంటి చర్చలు అవశ్యము ఆదరణీయములు.

శ్రీ ఎ. విజయదత్తాత్రేయ శర్మ

# గ్రంథ విమర్శలు

## ఔచిత్య విచార చర్చా, కవికంఠా భరణమ్, సువృత్త తిలకం చ

[క్షేమేంద్ర విరచిత గ్రంథత్రయం. బాలానందిని అనే ఆంధ్ర వ్యాఖ్యానంతో కూడినది. వ్యాఖ్యాత : డాక్టర్ పుల్లెల శ్రీరామచంద్రుడుగారు. డెమ్మీ సైజు. గట్టి బైండు: 16+294 పేజీలు. వెల: రూ. 21 లు. ప్రకాశకులు : సురభారతి సమితి. పుస్తకాలకు : కార్యదర్శి, సురభారతి సమితి, ఉస్మానియా యూనివర్సిటీ కాంపస్, హైదరాబాదు - 500 007].

గొప్ప సంస్కృత విద్వాంసుడును, మహాకవియు అయిన క్షేమేంద్రుడు పదకొండవ శతాబ్దిలో ఉండినవాడు. కాశ్మీరప్రభువు లగు అనంతవర్మ, అతని కుమారుల ఆస్థానవిద్వాంసుడై ఉండిన వాడు. ఈతడు రచించిన గ్రంథాలు పద్దెనిమిది లభించాయట ః వాటిలో, కవిత్వాన్ని గురించి చెప్పిన గ్రంథాలు ఈ మూడు గ్రంథాలున్నూ.

ఔచిత్య విచార చర్చ అలంకార శాస్త్రానికి సంబంధించిన గ్రంథం. క్షేమేంద్రునికంటె ప్రాచీనులైన అలంకారికులలో కావ్య జీవితాన్ని గురించి భిన్నాభిప్రాయాలున్నవి. కావ్యాత్మను గురించి విపులంగా చర్చించిన గ్రంథం ఆనందవర్ధనుని ధ్వన్యాలోకం. అంతకు పూర్వం ఆ విషయాన్ని చర్చించిన గ్రంథాలు లభ్యం కాలేదు. ఆనందవర్ధనుడు "కావ్యస్యాత్మా ధ్వనిః" అని వ్యంగ్యమే కావ్యజీవితమనీ, వస్తుధ్వని, అలంకారధ్వని, రసధ్వనులలో రసధ్వనియే ముఖ్యమైనదనీ చెప్పాడు. అభినవగుప్తుడు ఆ వాదాన్ని సమర్థించాడు. మహిమభట్టు వ్యక్తి వివేకంలో వ్యంగ్యాన్ని అనుమితిలోనే అంతర్భవింప జేశాడు. కుంతకుడు వక్రోక్తి జీవితంలో "వక్రోక్తిః కావ్యజీవితం" అని వక్రోక్తినే కావ్యజీవితంగా చెప్పాడు. క్షేమేంద్రుడు "ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితం" అని ఔచిత్యమే కావ్యజీవితమని అంటున్నాడు. ఇలా చెప్పినా, ఈ వ్యాఖ్యాత "అవతరణిక"లో చెప్పినట్లు, క్షేమేంద్రుని మతం ధ్వన్యాలోకంలో చెప్పినదానికి విరుద్ధం కాదనే చెప్పవలసి ఉన్నది. కావ్యం రసవంతమయి ఉండాలని క్షేమేంద్రుడున్నూ ఒప్పుకుంటున్నాడు. అయితే ప్రధానమైన ఔచిత్యం లేకపోతే రసభంగం అవుతుందనీ, అందువల్ల ముఖ్యంగా కవులు ఔచిత్యాన్ని పాటించాలనీ తన గ్రంథంలో విపులంగా వివరించాడు. ధ్వని కారుడు కూడా. "అనౌచిత్యాదృతే నాన్యత్ రసభంగస్య కారణం" అని ఔచిత్య ప్రాముఖ్యాన్ని వివరించాడు.

ఔచిత్యం, పదగతం, వాక్యగతం, ప్రబంధార్థగతం మున్నగు భేదములచేత పెక్కు విధాలు. మహాకవులు కూడా ఔచిత్యాన్ని పాటించకుండా ఎలా శ్లోకాలు రచించారో చూపిస్తూ, అవి ఏ విధంగా ఉండవలసినదీ ఇందు వివరంగా చూపబడింది. ఇది పాఠకుల పరిశీలా దృష్టిని పెంపొందించడానికి మిక్కిలి ఉపయోగపడే గ్రంథం.

కవికంఠాభరణం నిజంగా కవులకు కంఠాభరణం వంటిదే ః కవిత్వం చెప్పదలచిన వాళ్లు ఏమేమి చెయ్యాలో ఉపదేశించే గ్రంథం ఇది. ఇలాంటి గ్రంథాలు "కావ్య కల్పలత" వంటివి ఉన్నాయి. అయినా ఇందులో సంగ్రహంగా కవికి కావలసిన అంశాలు చెప్పబడ్డాయి. ఇందులో "సంధులు" అనే పేరుతో అయిదు భాగాలున్నవి. మొదటి సంధిలో కవిత్వశక్తిని సంపాదించుటకు తగిన ఉపాయాలు - దైవానుగ్రహ, పరుష ప్రయత్నాలు వివరింపబడ్డాయి. రెండవ సంధిలో ఛాయోపజీవి, పదోపజీవి, పాదోపజీవి, పరోపజీవి అనే చతుర్విధ కవుల విషయం ఉన్నది. మూడవ సంధిలో శబ్ద - అర్థ - అలంకార - రసాదులలో గల చమత్కారాలను గురించిన అంశాలు ఉన్నవి. చతుర్థ సంధిలో గుణ దోషాల వివరణ ఉన్నది. ఇందులో శబ్దవైమల్యం, అర్థవైమల్యం, రసవైమల్యం అనే మూడు కావ్యగుణాలు, శబ్ద కాలుష్యం, అర్థకాలుష్యం, రసకాలుష్యం అనే మూడు కావ్య దోషాలూ ఉదాహరణలతో కూడా వివరించబడినవి. చివరిదైన అయిదవ సంధిలో - కవిత్వం చెప్పదలచిన వారికి ఏయే శాస్త్రాలతోనూ, ఏయే కళలతోనూ పరిచయం ఉండాలో తెలుపబడింది. ఈ చెప్పినవన్నీ కవులు తప్పక గ్రహింపవలసి ఉన్నదని అందరూ అంగీకరిస్తారు.

ఛందశ్శాస్త్రాన్ననుసరించి చూస్తే ఇరువై ఆరు ఛందస్సులున్నాయి. వాటిలో లెక్కలేనన్ని వృత్తాలు ఏర్పడతాయి. అయినా అన్నిటినీ ఎవ్వరూ వాడరు. మిక్కిలి ప్రసిద్ధికెక్కిన అనుష్టుప్,

మున్నగు కొన్నిటినే కవులు వాడుతూ ఉంటారు. ఎందుచేతంటే కొన్ని వృత్తాల నడక సాఫీగా సాగదు. కొన్ని వృత్తాలు కొన్ని భావాలకూ, రసాలకూ అనుగుణంగా ఉండవు. ఏ వృత్తాలను ఎలా నడిపిస్తే అందంగా ఉంటుందో, ఏ వృత్తాలు ఏ రసానికి అనుగుణంగా ఉంటాయో "సువృత్తతిలకం" లో వివరించబడింది. ఇందులో వృత్తావచయం, గుణదోష దర్శనం, వృత్తవినియోగం అనే మూడు 'విన్యాసా' లున్నవి. వీటిలో ప్రసిద్ధాలై బహుళ ప్రచారంలో ఉన్న 26వృత్తాల లక్షణాలు లక్ష్యాలతో ఈయబడినవి. వీటికి ఉదాహరణ, ప్రత్యుదాహరణలు కూడా ఇవ్వబడినవి.

కవులకు అత్యంతోపయుక్తాలయిన ఈ మూడు గ్రంథాలూ ఇదివరలో ప్రత్యేకంగా దేవనాగరి లిపిలో ముద్రితాలయి ప్రచారాన్ని పొందాయి. తెలుగునాట సంస్కృత భాషా వాఙ్మయ ప్రచారాన్ని విస్తృతం చెయ్యడానికి ఉద్దేశించిన "సురభారతీ సమితి" వారు, ఈ మూడిటినీ ఒకే సంపుటంలో తెలుగు లిపిలో ప్రచురించడం దీని ప్రత్యేకత. ఆ సమితి వారు ప్రచురిస్తున్న ఇతర సంస్కృత గ్రంథాల వలెనే ఇవి కూడా ఆంధ్రవ్యాఖ్యతో ప్రకటింపబడుతున్నవి. వ్యాఖ్యాత సుప్రసిద్ధ విద్వాంసులు, సురభారతీ సమితి కార్యదర్శి అయిన పుల్లెల శ్రీరామచంద్రుడుగారు.

డాక్టర్ రామచంద్రుడుగారు అనేక విషయాల్లో 'డాక్టర్' విశిష్టబిరుదాలను పొందిన ప్రతిభావంతులు. పెక్కు శాస్త్రాలలోను, భాషలలోను గట్టి పాండిత్యం సంపాదించిన వారు. ఈయనకు అలంకార శాస్త్రంపైని ప్రత్యేకాదరాసక్తు లున్నాయి. ఆయన ఇది వరకే భామహుని కావ్యాలంకారం, వామనుని కావ్యాలంకార సూత్ర వృత్తి, రాజశేఖరుని కావ్యమీమాంస మున్నగు గ్రంథాలకు వ్యాఖ్యలు వ్రాసి ప్రకటించారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారిచే వీరి వక్రోక్తి జీవితానువాదం ప్రకటింపబడింది. అందులో కుంతకుని అభిప్రాయం చక్కగా వివరించబడింది. వీరి వ్యాఖ్యలన్నీ ఉత్తమశ్రేణికి చెంది అందరి ఆమోదాన్నీ చూరగొన్నవి. వీరు ఒక ప్రక్క ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సంస్కృత విభాగంలో రీడర్ పదవిని నిర్వహిస్తూ, సుర భారతీ సమితి కార్యదర్శిగా, సమితి కార్యకలాపాలను, గ్రంథ ప్రకటనను సమర్థవంతంగా సాగిస్తూ, ఇట్టి ఉత్తమ రచనలు సాగించడం వీరి నిరంతర కృషికీ, శక్తి సామర్థ్యాలకూ దృష్టాంతాలు. వీరి వ్యాఖ్యలను సమన్వయ దృష్టితో చదివిన యెడల, ఇతరుల అపేక్ష అక్కర లేకుండా, ఆయా గ్రంథాలను సులభంగా అర్థం చేసుకోవచ్చును. శ్రీరామచంద్రుడు గారితో పాటు ఇట్టి ఉత్తమ గ్రంథాలను ప్రకటించిన సుర భారతీ సమితి వారిని కూడా అభినందించ వలసి ఉన్నది.

# విశిష్టాద్వైత సిద్ధాంత దర్పణము

[గ్రంథకర్త: శ్రీ కుంటిమద్ది శేషశర్మ. క్రౌన్ 10+78 పేజీలు. వెల : 6 రూ. లు. ప్రకాశకులు : శ్రీలక్ష్మి హయగ్రీవ సేవాట్రస్టు, బెంగుళూరు.]

విశిష్టాద్వైతమతాన్ని గురించిన గ్రంథాలు ద్రవిడ భాషలో చాలా ఉన్నవి. సంస్కృత, ద్రావిడ, ఆంధ్ర భాషల్లో సమర్థులైన విద్వాంసులు వానిని ఆంధ్రంలోనికి తర్జుమాచేసి ప్రకటించినవి కొన్ని ఉన్నవి. ఆ మత గ్రంథాల సారాన్ని గ్రహించి స్వతంత్రంగా వ్రాసినవీ కొన్ని ఉన్నవి. అట్టి స్వతంత్ర గ్రంథాలలో ఈ గ్రంథం ఒకటి. దీనిని సంస్కృతాంధ్రాలలో గట్టి పండితులు, కవులు, విద్వచ్ఛిరోమణులు, విశిష్టాద్వైత మత తత్త్వజ్ఞులు అయిన కుంటిమద్ది శేషశర్మగారు రచించారు. వీరు ఇదివరకే ఈ మతాన్ని గురించిన గ్రంథాలు కొన్ని రచించారు. అవి బహుజనామోదాన్ని పొందాయి. ఇది శ్రీ వేదాంత దేశికులు రచించిన "రహస్యత్రయ" మును అనుసరించి, అందులో చెప్పబడిన సిద్ధాంతాలను తేటతెల్లంగా తెలుగువారికి అందిస్తున్నది. ఇందులో సంగ్రహంగా పురుషార్థాలు, ఆత్మవిచారం, మోక్షస్వరూపం, ప్రకృతి, పరమాత్మ, ప్రకృత్యాత్మ భ్రాంతి, జీవేశైక్య ప్రకృతి కలహం, విశిష్టాద్వైతం, ఉపాయం, జ్ఞాన, కర్మ, భక్తి, ప్రపత్తి యోగాలు, ప్రపత్తిభేదాలు, ఆర్త - దృప్త - ప్రాయశ్చిత్త ప్రపత్తులు, జీవోత్క్రమణం, ఫలం, విరోధి స్వరూపం, పంచ సంస్కారాలు, నిగమనం నిరూపించబడినవి. విశిష్టాద్వైతమతాన్ని గురించి సంగ్రహంగా తెలుసుకోవాలంటే దీనిని చదివితే చాలును. సామాన్య సిద్ధాంత విషయాలు జనసామాన్యం తెలుసుకొనుటకే ఈ గ్రంథం ఉద్దేశించబడినదనీ, గభీరమైన శాస్త్రీయ విషయాలను చూపజాలదనీ రచయితయే చెప్తున్నారు. శాస్త్రీయ విషయాలు పండితులకే గాని, సామాన్యులకక్కర్లేదు.

ఇట్లు సామాన్య ప్రజలకు ఉపయుక్తమైన యీ గ్రంథాన్ని బెంగుళూరులోని లక్ష్మీహయగ్రీవ సేవాట్రస్టువారు ప్రకటించారు. ఆ సంస్థ విశిష్టాద్వైత మత ప్రచారానికి ఉద్దేశించబడినది. ఆ సంస్థవారు ఇదివరకే కన్నడ భాషలో అయిదు పుస్తకాలను ప్రకటించారు. ఆంధ్రుల ఉపయోగార్థం తెలుగులో కూడా గ్రంథాలను ప్రకటించాలనే కోరికతో దీన్ని మొదట ప్రకటించారు. ఆ సంస్థవారు ఇంకా ఇట్టి గ్రంథాలను శేషశర్మగారి కంటె సమర్థులచే రచింపజేసి ప్రకటిస్తే బాగుంటుంది.

ఇది శ్రీ బ్రహ్మతంత్ర పరకాలయోగీంద్రుల ప్రశంసలను అందుకొన్నది.

శ్రీ బులుసు వేంకట రమణయ్య

# వేదాంత తత్త్వాలోకము

[రచయిత: కల్పవిశారద, వ్యాకరణ విద్యా ప్రవీణ, భాషాప్రవీణ, శ్రీ పరాంకుశం వేంకట నృసింహాచార్యులు. డెమ్మీ సైజు, గట్టి బైండు, 12+136 పేజీలు. వెల: రు. 15-00 లు. ప్రతులకు: శ్రీ పి. వి. కృష్ణమాచార్యులు, 5-6-5, ఎన్.బి.ఎన్. పేట, పొన్నూరు - 522 124.]

ఆధ్యాత్మిక విషయాలను అవగాహన చేసుకొనుటకు మతాల తత్త్వాలను గురించీ, ప్రాచీన సంప్రదాయాలను గురించీ ప్రాచీనులైన మహావిద్వాంసులు వ్రాసిన గ్రంథాలు సంస్కృతంలో చాలా ఉన్నవి. ఆ గ్రంథాలలోని దురవగాహాలైన అంశాలు తెలుసుకొనుటకు ఆ గ్రంథాలకు విపులంగా వ్యాఖ్యానాలూ ఉన్నవి. అయినా శాస్త్రవిషయాల యందును, సంప్రదాయాల పట్లను తగిన జిజ్ఞాస లేనందువల్ల వాటిని అవలోడనచేసి విషయాన్ని గ్రహించకుండా పైపైనే చదివి, తాము గ్రహించినవే సిద్ధాంతాలనుకొని భ్రాంతిపడి, ఆ మహాగ్రంథాలను విమర్శించుట నేటి కాలంలో జరుగుతూఉన్నది. తత్త్వజిజ్ఞాసువులు ఆ విమర్శకుల ప్రభావానికి గురి కావడమూ ఉన్నది. అందువల్ల వేదాంత తత్త్వ జిజ్ఞాసువులకు అందుబాటులో ఉంచుటకై యథార్థవిషయాలను తెలుగులో వివరిస్తూరచయిత యీ గ్రంథరచనకు పూనుకున్నట్లు తెలియజేస్తున్నారు. ఇట్టిరచనలు ఇంకా ఎన్నో ఆవసరమైనట్లు కూడా తెలుపుతున్నారు.

వేంకట కృష్ణమాచార్యులు గారు సంస్కృతాంధ్రాలలో విద్వాంసులు. వ్యాకరణ వేదాంత న్యాయశాస్త్రాలలో సమర్థులైన పండితులు. వేదాంత కల్పాలలో ప్రత్యేక కృషి చేసినవారు: రచయితలు. పొన్నూరు శ్రీ భావనారాయణ స్వామి సంస్కృత కళాశాలలో సీనియర్ లెక్చెరర్‌గా పనిచేసి విషయ బోధనలో అనుభవం గడించిన వారు. అందువల్ల సామాన్య పాఠకులకు వేదాంత తత్త్వాన్ని బోధించుటకు అనువైన అంశాలను గ్రహించి పెక్కు విషయాలను ఇందు వివరించారు.

ఇందులో ఎనభైకి పైగా శీర్షికలున్నవి. కొన్ని శీర్షికల క్రింద గీతలు గియబడినవి. అవి ప్రధానమైనవని రచయిత అభిప్రాయమేమో!

ఇందులో వేదాంత విషయాలే కాక ఇతర విషయాలు కూడా ఉన్నవి. సృష్టివిషయం, ఇంద్రియాల స్వరూపం, పంచీకరణం, చతుర్దశభువనాలు, జీవ తత్త్వం, ఆత్మ తత్త్వం, మోక్షములు, భక్తుల వైవిధ్యం, ఈశ్వర తత్త్వం, ఈశ్వరుని కల్యాణ గుణ నిరూపణం, భగవంతుని విశ్వ జగత్కారణత్వం, సృష్టి, స్థితి, లయాలు మున్నగు పెక్కు విషయాలు వివరింపబడినవి. రచయిత విశిష్టాద్వైతమతానికి చెంది ఉండుటవల్ల, ఆ మతానికి సంబంధించిన విషయాలే అధికంగా కానవస్తున్నవి. "వేదాంత తత్త్వాలోక దీపికలు" అనే చివరి శీర్షికలో ఆయన ఇచ్చిన ఆధార గ్రంథాలు కూడా ఆ మతానికి చెందినవిగానే ఉన్నవి.

రచయిత తమ "ఉపోద్ఘాతం" లో మనస్సులో తోచిన అభిప్రాయాలను గ్రంథంలో పెట్టడం కష్టసాధ్యమయిన పని అనీ, అయినా తాను దానికి ప్రయత్నిస్తున్నాననీ తెలియజేశారు. అలాగే చాలా వరకూ ప్రయత్నించారు. ఆయన విద్వాంసులగుట వల్ల విద్వాంసుల శైలిలోనే గ్రంథరచన సాగింది. సామాన్య పాఠకులకు విషయం అర్థం కావడం కష్టంగానే కానవస్తుంది. విషయ విభాగం క్రమ పద్ధతిలో ఉంచే పాఠకులకు శ్రమ కొంత తగ్గి ఉండేది. ఇటువంటి గ్రంథాలు ఎంత సులభపద్ధతిలో ఉంటే అంత మంచిది. అలా లేనప్పుడు వీని వల్ల అనుకున్నంత ప్రయోజనం ఉండదు.

ఇది తిరుమల-తిరుపతి దేవస్థానముల వారి ఆర్థికసహాయంతో ముద్రితమయింది. రచయితకు గల శాస్త్ర పరిజ్ఞానం ఈ గ్రంథం వల్ల వ్యక్తమవుతూ ఉన్నది.

# వేదవిజ్ఞాన దర్శనము

[గ్రంథకర్త: శ్రీ వేదాంతం శ్రీనివాసాచార్యులు. క్రౌన్ సైజు 32+199 పేజీలు. వెల: సాదాప్రతి రు. 16-00 లు. లైబ్రరీ ప్రతి రు. 20-00 లు. ప్రాప్తిస్థానం: శ్రీ వేదాంతం శ్రీనివాసాచార్యులు, మంచికలపూడి - 522 320, గుంటూరు జిల్లా.]

భారతీయ సంస్కృతికీ, విజ్ఞానానికీ మూలం వేదవాఙ్మయమే. అతి ప్రాచీన కాలంనుంచీ వేదాలను సస్వరంగా అప్పగించే పండితులు ఉంటూనే ఉన్నారు. కాని, వారిలో వేదార్థాన్ని గ్రహించినవారు చాలా తక్కువ. దానికి సంస్కృతంలో మంచి పాండిత్యం, శాస్త్రజ్ఞానం అవసరం. వేదార్థం తెలుసుకొనుటకు శిక్ష మున్నగు వేదాంగాలు, షడ్దర్శనాలు కొంత వరకయినా తెలిసివుండాలి. అందువల్ల ఎంతో సమర్థులు గాని వేదార్థాన్ని గ్రహించలేరు. ఆ గ్రహించినవారు, తాము తెలుసుకున్న విషయాలను గ్రంథరూపంగా ప్రకటించడం అరుదు. కొందరు లోకోపకార దృష్ట్యా గ్రంథాలను రచించి ప్రకటించినా, అవి పండితులు మాత్రం గ్రహించగల రీతిలోనే ఉంటాయిగాని, సామాన్య ప్రజలకు ఎక్కువ ఉపయోగపడే రీతిలో ఉండవు. ఈ విషయాన్ని గ్రహించి ఈ గ్రంథకర్త తాము గ్రహించిన విషయాలు జన సామాన్యానికి అందుబాటులో ఉండే రీతిని ఈ గ్రంథాన్ని రచించారు.

శ్రీనివాసాచార్యులు గారు సంస్కృతాంధ్రాలలో సమర్థులైన విద్వాంసులు. వైదిక వాఙ్మయంపైనీ, వేదార్థావగతి పయినీ ఆయనకు ఆసక్తి అధికం. అందువల్ల వేద, వేదాంగాలతోను, షడ్దర్శనాలతో పాటు ఆధునిక విద్వాంసులు రచించిన గ్రంథాలను కూడా పరిశీలించి, సులభమైన శైలిలో ఈ గ్రంథాన్ని రచించి ప్రకటించారు.

ఇందులో మొదట వేదాల స్వరూపం, వేద భాగాలయిన సంహితా, బ్రాహ్మణ, ఆరణ్యక-ఉపనిషత్తులూ, నాలుగు వేదాలూ వివరించబడి, తర్వాత వేదాన్ని అర్థం చేసుకొనుటకు అవసరమైన శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం, సంగ్రహంగా తెలుపబడినవి. తర్వాత కల్ప సూత్రాలను గురించి వివరంగా ఉన్నది. ఆ వెనుక స్మృతుల ననుసరించిన ప్రధాన సంస్కారాలు, పంచ యజ్ఞాలు, పాక, శ్రౌతయజ్ఞాలు ఏవేవో, వాటి ప్రయోజనం ఏమిటో చెప్పబడింది. తర్వాత షడ్దర్శనాలయిన పూర్వోత్తరమీమాంసలు, న్యాయ వైశేషికాలు, సాంఖ్య, యోగాలు విశదీకరించబడినవి. ఆ వెనుక గృహస్థాశ్రమానంతరం గ్రహించదగిన వానప్రస్థ-సన్న్యాసాశ్రమాలను గురించి ఉన్నది. చివర, రచయితకు అత్యంతోపాదేయమని తోచిన భగవద్విషయాన్ని గురించి వివరంగా ఉన్నది.

వేదాలను గురించీ, తదంగాలను గురించీ, వివిధ శాస్త్రాలను గురించీ సంగ్రహంగా తెలుసుకోడానికి ఈ గ్రంథం మిక్కిలి ఉపయోగపడుతుంది. డాక్టర్ కె. ఎస్. రామ్‌గారు ఇంగ్లీషులోను, రొంపిచర్ల శ్రీనివాసాచార్యులుగారు, నారాయణం శ్రీరామాచార్యులుగారు, జనస్వామి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తెలుగులోనూ ఇచ్చిన ప్రశంసా పత్రాలు ఇందులో చేర్చబడినవి.

ఇది వైదిక విజ్ఞాన జిజ్ఞాసువుల ఆదరాన్ని పొందగలదని నా విశ్వాసం.

"ఆంగీరస"

## పడగ కింద పసితనం

[ఆసు రాజేంద్ర. వెల: రు. 3-00 లు. ప్రతులకు: కొల్లూరి ఎక్స్‌రే హౌస్, అమలాపురం - 533 202.]

ఈ వచన గేయ కావ్యం ఈ సమాజంలో దిక్కూ మొక్కూ లేకుండా గాలికి పెరుగుతున్న పిల్లల ఇతి వృత్తం కథగా చేసుకొన్న కావ్యం. ఈ సమాజం పాము పడగ. దాని క్రింద బ్రతుకుతున్న వీళ్ళు దాని కాటుకు గురికాక తప్పదు. ఈ కావ్యంలో అనేక రకాల జీవితాల యథార్థగాథల్ని మన కళ్ళముందుంచారు ఆసు రాజేంద్రగారు. నాగరికతా మేలి ముసుగులో ముఖాన్ని దాచుకున్న నగరం దేహాన్ని శస్త్రచికిత్సచేసి పరిశీలిస్తే-దుమ్ము, ధూళిలో కలిసిపోయిన అనేక నక్షత్రాలు కనబడతాయంటారీయన. చూపుకందని శూన్యంలోంచి రాలిపడిన వజ్రాల వర్షం కోసం ఆశగా ఎదురు చూడటం, ఎడారి బ్రతుకు దారిలో ఒయాసిస్సులకోసం కళ్ళు తెరవకుండానే వెతుకులాడటం ఈ అనాథల నిత్యకృత్యం. గతాన్ని తవ్వి వర్తమానం మీద రువ్వి, భవిష్యత్తుకు మసి పూస్తున్న దేశంలో, మనిషి రూపాయి ముఖంతో వెలిగిపోవాలని బురద కాళ్ళతో ఇతరుల జీవితాల మీంచి తొక్కుకుంటూ పోతున్న కాలంలో నెత్తురును దీపంగా చేసి అంధకారాన్ని చీల్చుకుంటూ పోవడానికి -

కానరాని కటిక చీకట్లో
తన కాలుపై పడ్డది
తాడో పామో
తెలుసుకునే కంటి జ్ఞానమే ఉంటే
ఆ మనిషి చీకటిని
చిత్తుకాగితంలా మడిచి
తన జేబులో కుక్కేసుకుంటాడు.

## గుండె చప్పుళ్లు

[ఆసు రాజేంద్ర. వెల: రు. 7-00 లు ప్రతులకు: శ్రీశ్రీ పబ్లికేషన్స్, స్టుడియో బలరాం, అమలాపురం - 533 201].

ఆసు రాజేంద్రగారి మినీ కవితా సంకలన మిది. దీనికి కుందుర్తిగారు విశాలమైన పీఠికను రాశారు. వచన కవిత, మినీ కవిత, కథాంశావశ్యకత మొదలైన అంశాలపై పీఠికలో వారు చర్చించారు. ఈ మినీ కవితలన్నీ వర్తమాన సమాజ గతి మీద పెట్టిన చెర్లు. మినీ కవితా రూపాన్ని గురించి ఇంతకుముందే చాలా చర్చ జరిగింది కనుక దానిని ఇక్కడ ప్రస్తావించవలసిన అవసరం లేదు. రాజేంద్రగారి కొన్ని మినీ కవితలను ఉదహరిస్తే వారి తత్వమూ, కవితా తత్వమూ పాఠకులకు బోధపడుతుంది.

మన కొంపకు
మనమే నిప్పంటించుకున్నా
అది పగవాడి పనే అంటే
కొండంత ఆత్మ సంతృప్తి—విదేశీహస్తం.

నా దేశంలో బంగారాన్ని
తెల్లకాకులు నల్లకాకులు
పంచేసుకోగా
ఇప్పుడు—
నా దేశానికి మిగిలింది
కాకి బంగారం — కాకి బంగారం

బట్ట కట్టి బజారు కెళ్ళింది
బజారు కెళ్ళి బట్ట విప్పింది—నాగరికత

పాపం
ఇప్పుడు రోడ్లనీ వంతెనల్నీ
బిల్డింగుల్నీ తింటున్నాడు
ఒక్కసారి అవకాశ మిచ్చి చూడండి
ఏకంగా దేశాన్నే తినేస్తాడు—కాంట్రాక్టర్.

## సేసలు (కవితా సంకలనం)

[సంకలనకర్త: కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు. వెల: రు. 3 లు. ప్రతులకు: తుమ్మల శివవేంకటరావు, అశోకనాపేట, ఏలూరు-534006, ఆంధ్రప్రదేశ్.]

సాహితీ సుధ అనే సాహితీ సంస్థ పెదపాడులో ప్రారంభమైన దానికి గుర్తుగా వారు ఈ కవితా సంకలనాన్ని ప్రచురించారు. ఇందులో నిబద్ధ, అనిబద్ధ కవితలున్నాయి. సామవేదం జానకీరామశర్మగారు ఆశీస్సులను, కలపర్తి వేంకటేశ్వర్లుగారు శుభాకాంక్షలను పద్యరూపంలో అందించారు. బండ్లమూడి సత్యనారాయణగారు బళ్ళారి రాఘవ మీద పద్యాలు రాయటమే కాక, తమకు సాహితీసుధ సంస్థవారు చేసిన సన్మానానికి కృతజ్ఞతలు పద్యరూపంలో చెప్పుకున్నారు. తుమ్మల వెంకటసుబ్బారావుగారు సంస్థ పుట్టుపూర్వోత్తరాలు, కవిత్వ తత్వం మొదలైన వాటిని గురించి సింహావలోకనం చేశారు. కొండముదివారు, నౌలూరి శేషగిరిరావుగారు మొదలుగాగల మరికొంత మంది కవితలు దీంట్లో ఉన్నాయి. వారి సాహిత్య కార్యక్రమాలకు సంతోషిస్తూ "ఆల్ వర్స్ ఈజ్ నాట్ పొయిట్రీ" అనే విషయాన్ని వీరంతా గుర్తించాలని ఆశిస్తున్నాను.

## చమత్కార పద్యమంజరి

[చిత్ర విచిత్ర పద్యాలు. గుబ్బల మాధవమూర్తి. వెల: రు. 2-00 లు. ప్రాప్తిస్థానం: జి. సత్యనారాయణమూర్తి, జగ్గన్నపేట - 533 249, రాజోలు తాలూకా, తూర్పు గోదావరి జిల్లా.]

అక్కడక్కడ సభల్లో చదివిన పద్యాలు, ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి సమస్యాపూరణకై పంపిన పద్యాలు మొదలైనవి ఈ సంకలనంలో చోటుచేసుకున్నాయి. 1976 లో ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి మీద, వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ సాధించిన ప్రగతి మీద, ఒకప్పటి మంత్రివర్యులైన రుద్రరాజు రామలింగరాజుగారి జన్మదినోత్సవంపైనా ఇంకా అనేకంపైనా వీరు పద్యాలు రాశారు. వీరు పూరించిన ఒక పద్యం -

"రాధ నేలుకొనియె రాఘవుండు" - సమస్య

సీత బెండ్లియాడి త్రేతాయుగమ్ములో
కానలందు సుఖము గాంచలేక
ద్వాపరమున తాను గోపాలకృష్ణుడై
రాధ నేలుకొనియె రాఘవుండు.

## యువస్వరాలు (కవితా సంకలనం)

[సంపాదకుడు: రాధేయ. సంచాలకుడు: తేజస్వితః. వెల: రు. 3-00 లు. ప్రతులకు: 1. వి. శిరీష్‌కుమార్, ప్రధానకార్యదర్శి, సాంస్కృతీ సమాఖ్య, రాష్ట్రకమిటీ, నున్న, వయా విజయవాడ - 521212. 2. తేజస్వితః, ప్రధానకార్యదర్శి, సాంస్కృతీ సమాఖ్య, జిల్లాకమిటీ, 10/139, బెల్లంమండివీధి, కడప-516001. 3. ఎక్స్‌రే పబ్లిషర్స్, కొల్లూరి హౌస్, అమలాపురం-533 202.]

ఇది యువకవుల కవితాసంకలనం. సమాజంలోని ప్రతిష్టంభనవి తొలగించడానికి నవకవులు కవిత్వాన్ని సాధనంగా స్వీకరించడం హర్షదాయకమని ఈ స్వరాలకు స్వాగతం చెబుతూ సంపాదకులు అంటున్నారు. ఈ సంకలనంలో కవులూ, కవయిత్రులూ కూడా ఉన్నారు. వర్తమాన సమాజంలోని అనేక అవ

లక్షణాలపై వీళ్ళంతా కవిత్వం రాశారు. ఇట్లాగే కొంతకాలం రాసుకుంటూపోతే వీళ్ళకి కవితారహస్యం తెలిసే అవకాశం ఉంది. కవిత్వం ఎవరైనా రాయవచ్చని, దానికి నియమ, నిబంధనలేమీ లేవని, తెలుగు అక్షరాలు, గుడింతాలతోసహా వస్త్రేచాలని ఇందులోవి కవితలు చాలా ఋజువు చేస్తున్నాయి. రాసిన ప్రతిదీ అచ్చులోకి ఎక్కి పాఠకుడి ప్రాణం తియ్యటం ఏమంత మంచిపని కాదు. దేశం మీదికి పుస్తకాన్ని వదిలేటప్పుడు సంపాదకులూ, సంచాలకులూ జాగ్రత్త వహించకపోతే పుస్తకాలు తూకానికి ఉపయోగిస్తాయే తప్ప సాహిత్య పురోగతికి దోహదం చెయ్యవు.

## పూర్వ నైషధము, ఇతర కృతులు

[కాశీభొట్ల సత్యనారాయణ. వెల: రు. 8-00 లు. ప్రతులకు: శ్రీమతి కాశీభొట్ల లక్ష్మి, కేరాఫ్ కాశీభొట్ల సత్యనారాయణ, లెక్చరర్, ఆదర్శ డిగ్రీ కళాశాల, కాకినాడ.]

నలదమయంతుల పూర్వ జన్మకు చెందిన యితి వృత్తంలో పూర్వ నైషధం రాయబడింది. ఆహూకుడు, ఆహూకి అను నిషాద దంపతులు భక్తిపరులు కాగా వారి భక్తిని పరీక్ష పెట్టుటకై ఈశ్వరుడాడిన నాటకం ఈ కావ్యం. ఈశ్వరానుగ్రహ ఫలితంగా వాళ్ళిద్దరూ అనంతర జన్మలో నలదమయంతులుగా జన్మిస్తారు. ఇది కథ. ఈ కథను సత్యనారాయణగారు రసవత్తరంగా నడిపారు. వారి పద్యరచనా నిర్మాణ శిల్పం మెచ్చుకోతగింది. పద్యాన్ని కవిత్వంగా నడపగలిగిన కవులు చాలా అరుదుగా కనబడుతున్నారు ఈనాడు. శివదర్శనం చేయించిన పద్యం ఆయన రచనాసామర్థ్యానికి మచ్చు తునక.

కాంచెన్ కాంచన పంకజాత వికస
 త్కల్లోలినీ ఫేన యు
క్తాంచ చ్ఛాయల పూర్ణ చంద్రుడు పగెదిన్
 ధావళ్య సంయుక్తమా
ప్రాంచద్దాసుని దివ్య దేహాని జటా
 భారాంత గంగాధరున్
అంచల్లీల విలాసహాసరుచులన్
 అర్ధాంగి తా తోడుగా.

ఇతర కృతులలో శూర్పణఖ, కర్ణుని అంతరంగాల ప్రదర్శన, కవి కుటుంబ సంక్షేమం, మందలింపు మొదలైన పద్యాలున్నాయి. ఈ కావ్యానికి ఇద్దరు ప్రసిద్ధులు పీఠికలు రాశారు. ఒకరు ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. ఆయన మార్గంలో ఆయన రాశారు. రెండవవారు సామవేదం జానకిరామశర్మగారు (జానకీ జాని). వారి ఆనందావిర్భూతిలో మరొకరికి బాధ కలిగించే వాక్యాలు అనేకం దొర్లించారు. ఒకరిని స్తుతించటానికి మరొకరిని నిందించవలసిన అవసరం లేదని వీరికి తెలియంది కాదు. వారి విసుర్లన్నీ వచనగేయ కవుల మీద పద్యం రాసిన ప్రతి వాడూ కవి కానక్కర్లేదు. అట్లాగే వచనగేయం రాసిన ప్రతివాడూ కవి అవ్వవలసిన అవసరం లేదు. దేనికైనా కవిత్వమే ప్రధానం. వారు మహాకవిగా పేర్కొన్న శేషేంద్రశర్మగారు వచనకవిత్వానికి సంబంధించినంతవరకూ మంచి కవేగాని మహాకవిగారు. శాస్త్రిగారు- కవిశబ్ద వాచ్యులు అని చాలా మందిని పేర్కొన్నట్లుగానే మహాకవి శబ్దం కూడా అప్రతిష్ఠపాలవటం శాస్త్రిగారికే తెలుసు. విమర్శ గ్రంథాలూ, పీఠికలూ, సమీక్షలూ పతనోన్ముఖ మవుతున్న కవిత్వాన్ని, కవిని బ్రతికించలేవు. తాత్కాలికంగా ఉపశమనం కలిగించవచ్చు. కవిగారు కూడా అ. ర. సం మీద, వి. ర. సం మీద వ్యంగ్యంగా కలాన్ని ఝళిపించారు గాని పాత కథల్ని పాత పద్యాల్లో రాసే వాళ్ళకు ఈ విమర్శ అనవసరం కదా!

కనుకనె కుటుంబ సంక్షేమ కార్యక్రమము
గూడ కవి పాలబడి కర్మ కొలది విరస
మరస మిట్టి వచన మస్తమాను పురిటి
కంపు కొట్టకుండ మము మన్నింపుమప్ప

లాంటి పద్యాలు సత్యనారాయణ గారికి అనావశ్యకం. వారి పద్ధతిలో వారు కవిత్వం రాసుకోవటం కవిత్వానికీ, వారికీ కూడా క్షేమం.

## సాహసి వజీర్ రహ్మాన్

[వెల: రు. 10-00 లు. ప్రతులకు: వజీర్ రహ్మాన్, నెం. 14, ఫస్ట్‌స్ట్రీట్, విశ్వనాథ పురం, మద్రాస్ - 600 024.]

1934 లో వచ్చాడు, 1983 లో వెళ్ళిపోయాడు. ఈ మధ్య కాలంలో 1963 లో 'ఎచటికి పోతావీరాత్రి', 83 లో 'సాహసి'

రెండు కావ్యాలు మాత్రమే ఇచ్చారు. చలం తోవ తన తోవగా, చలం రక్షణ హస్తం తన జీవితానికి తోడుగా, చలం భావం తన ఊపిరిగా జీవించాడు రహ్మాన్. చలం రచనల్లోని కవిత్వాన్ని కవిగా చలం అనే గ్రంథంలో చూపించాడు. మధురానంద కవితాకాశంలోనూ, దుర్గమ జీవన కీకారణ్యంలోనూ, ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ భావ సంపత్తిని, అనుభవాన్ని, జటిల సత్యాల్ని చలం నుంచి జీర్ణించుకున్నాడు. వివిధ భాషలలో అతని కున్న పాండిత్యం, ప్రాచ్య పాశ్చాత్యకవుల, విమర్శకుల తత్వ అవగాహన, కళపట్ల, జీవితంపట్ల అతనికి గల ఆరాధనా భావం, జీవితాన్ని గురించిన అన్వేషణ అతని కవిత్వంలో వెలుగు చూసింది. ఉత్తమ కవిత్వమైన దానికి వివరణలూ, వ్యాఖ్యలూ అవసరం లేదంటాడీయన. దానికదే పాఠకునికి రస స్ఫూర్తిని కలిగిస్తుందని రహ్మాన్ అభిప్రాయం. ఈతని కవిత్వం ఎక్కడో తప్ప ఏ పత్రికల్లోనూ అచ్చు అయింది కాదు, అట్లా కావటం అతనికి ఇష్టం లేదు కూడా. 'తలనెప్పి మాత్రలకీ, గజ్జి మందు ప్రకటనలకీ మధ్య కవిత్వం ఇరికించి అచ్చు వేయడం చూస్తే దేశంలో కవులకి పట్టిన దుస్థితికి దిగులూ, సంపాదకాధముల నిర్లక్ష్యబుద్ధికి అసహ్యమూ' అంటా డాయన. కవి జీవితానికీ, కవిత్వానికీ విడ దీయరాని ఐక్యత ఉంటుందని, జీవితానుభవంలోకి రానిదేదీ కవిత్వం గారాదని, ఒక వేళ వచ్చినా అది నామ మాత్రంగానే మిగిలి పోతుందని చాలా బలంగా చెప్పాడీయన. గొప్ప కవిత్వ సృష్టికి జీవితానుభవమే కాక, అనంతమైన రచనా శిల్ప నైపుణ్యం కూడా అవశ్యకమని ఇతను నమ్మాడు. "నన్ను ఆవేశపర్చిన అనుభవాల్నీ, నాకు తెలిసిన నే నెరిగిన వ్యక్తుల్నీ నా కవిత్వంలో ఇతి వృత్తాలుగా ఏరాను. నా అనుభవానికి రానిదీ, నాకు తెలీనది రాయలేదు. అందువల్లనే సమకాలీన రాజకీయ రగడలు, అ బాపతు ప్రసక్తికాని నా రాతల్లో రాదు. ఇది వాటిపట్ల నాకు విముఖత వల్ల మాత్రం కాదు. వాటిలో నాకు ప్రవేశం, అనుభవం లేకపోవటం వల్లనే" అన్న అతని మాటలు గమనిస్తే అతన్నీ, అతని కవిత్వాన్నీ సరిగా అర్థం చేసుకోవచ్చు. తన చుట్టూ లోకం నిండా అలుముకున్న అశాంతినీ, దుఃఖాన్నీ, దారిద్రాన్నీ, ఎటు చూసినా కనిపించే వినిపించే అమానుషాలను ఆక్రందనలనూ, దిక్కులేని దీనజనుల దుర్భర హాహాకారాలను, మౌనబాధల్ని, వ్యధల్ని, కన్నీళ్ళని ఈ కవి చూశాడు. కనుకనే సముద్రమంత విశాలమైన జీవితాన్ని ఏ ఒక్క చిన్నిరాటకో కట్టెయ్యలేదు. ప్రతిరోజూ ఆత్మనీ, దేహాన్నీ అమ్ముకుని, అవమానాలనూ, ఉమ్ములనూ మోస్తూ, సహిస్తూ, అధికార ధూర్తుల ఇనుపబూట్ల కింద నలుగుతూ, ఎంగిలి మెతుకులు కతికే నికృష్టపు బతుకుని తిరస్కరిస్తూ-పదవులూ, పరుగులూ, ఆశలూ ఆక్రోశాలూ లేని స్వచ్ఛమైన బ్రతుకుని కోరుకున్నాడీకవి. జీవితం ఒక వైకుంఠపాళి అని, దాంట్లో నేర్పరితనం కలవాళ్ళు తెలివి పికిరీలతో కళ్ళు కప్పి పరమపద మెక్కిపోతారని, న్యాయమనీ, దైవమనీ మళ్ళీ మళ్ళీ గళ్ళు లెక్క పెట్టుకుంటూ కూర్చునే వాళ్ళు సర్పకాట్లతో బ్రతుకును ఛిద్రమూ, దరిద్రమూ చేసుకొని ఎప్పటి రొచ్చులోనే మిగిలిపోతారని ఈలోకపు న్యాయాన్ని అక్షరబద్ధం చేశాడు.

జీవితాన్ని ఏ దృక్పథంలోంచైనా గాఢంగా పట్టించుకున్న ఏ రచయితనీ, కవినీ సంఘం గుర్తించకపోగా ద్వేషిస్తుంది. శ్రీ శ్రీ ని ఒక రకంగా ద్వేషిస్తే, చలాన్ని మరో రకంగా ద్వేషించటం మనకు తెలిసిన విషయమే. జీవితంలో ఉన్న నిజాల వైపు హృదయాలను మళ్ళించి నేత్రాలను తిప్పిన వాళ్ళు వీళ్ళు. ఆ నిజం వైపే అంత గాఢానుబంధంతోనూ ప్రయాణం సాగించిన వాడు వజీర్ రహ్మాన్. మంచివాళ్లు బాధ పడుతున్నారు; చెడ్డ వాళ్ళు సుఖపడుతున్నారు. మంచివాళ్ళకు న్యాయం జరుగుతుందా? ఇక్కడ చేసే మంచి చెడులకు ప్రతీకారం ఇక్కడే వాళ్ళకు తెలియకుండా జరగడమేమిటి?? ఇట్లా చలం, రహ్మాన్ ప్రశ్నించుకుంటూ సాగిన అన్వేషణే అతని జీవితం; కవిత్వం.

కవి ఇస్మాయిల్ గారికి తమ్ముడు; చలం గారికి అల్లుడూ వజీర్ రహ్మాన్. ఆనాడు చలం తనకు తనే శిక్షై, శిలవై, గుండె కార్చే ఏకాకి తనంతో అందరికీ దూరమై, బ్రతుకు భారమై, కలుషాలకు, విషాలకు, మురికి మాలిన్యాలకు అతీతంగా సత్యసాధన అనే నిప్పుల భాండం నెత్తిన పెట్టుకుని రమణాశ్రమానికి వెళ్ళి అక్కడ తపనలో, వేదనలో, సాధనలో "లేదు. నాకేం రాలేదు. ఎంత తరచి చూసుకున్నా, ఏ విధంగానూ నాకేం వచ్చినట్లు కనబడదు. ఇదంతా ఏం లాభం లేక పోయిందనిపిస్తోంది" అంటూ వెళ్ళిపోయాడు. వొంటరై బ్రతుకుశోకమై తరగని చోటకేసి చూసి చూసి, ఈ రాత్రి ఇంకెంత దూరమో, ఈ వియోగమింకెంత కాలమో అనుకుంటూ తన సాహసికాన్వేషణాప్రస్థానాన్ని అపుచేసి ఈ లోకశోకాలు తప్పుకొని, ఇరుకు చీకట్లు

విప్పుకొని ఏ నిర్మలోజ్వల స్వర్గ తీరాల్లోనో, అనంత శాంతిలో శయనించటానికి వెళ్ళిపోయాడు కవి, తాత్వికుడు, అన్వేషకుడు వజీర్ రహ్మాన్.

# పువ్వులు నవ్వుతున్నాయి

[జి. కుమారస్వామి నాయుడు. వెల: రు. 5-00 లు. ప్రతులకు: (1) యువభారతి, 5, కింగ్స్‌వే, సికిందరాబాద్ - 500 003; (2) యువభారతి కార్యాలయం, ఆంధ్ర సారస్వత పరిషత్ భవనములు, తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001.]

ఆధునిక కవి గతైక దృక్కు కాక, వర్తమాన క్షణం లోంచి భవిష్యదాశా గీతాన్ని గానం చేసేవాడు. సమాజంలో జనులందరూ సుఖశంగా ఉండాలని కోరుకొనేవాడు. అట్లాంటి కోరికతో భవిష్యత్తు చాలా బాగుండాలనే ఆశతో 'పువ్వులు నవ్వుతున్నాయి' కవితా సంకలనాన్ని రాశారు కుమారస్వామి నాయుడుగారు.

సంఘ దౌష్ట్యానికి నలిగిపోయి వాడిపోయిన పువ్వులన్నీ నవ్వుతున్నాయి. ఈ నవ్వులే ప్రళయ గర్జనలైతే సమాజం మారక తప్పదు గదా! కటికరక్కసులకు పక్కలో బల్లెమవుతానని, విప్లవాకాశంలో చుక్కనవుతానని, తన తరం తలంలో ప్రబోధ రత్నమై మెరుస్తానని, రేపటి తరం గుండెల్లో ప్రజ్వలనమై ప్రభవిస్తానని ఆగామి శుభోదయానికి స్వాగత గీతం పాడతానని చెబుతున్నారీ కవిగారు. మహోజ్జ్వల తేజోవిజయ ధ్వజం నాటి అరుణారుణ జ్వాలా పతాకాన్ని ఎగరేస్తానంటున్నారు. కవితల సమిధలతో చీడపురుగులకు చితి పేరుస్తూ ప్రజాభూజాలను ఓదారుస్తున్నారు. తాను వెలిగించిన కవితా దీపం ఆర్తులకు ఓదార్పు కలిగేవరకూ మార్పుకు నాందీ పలికేవరకూ ఏ ప్రలోభాలకూ మారిపోదని, ఏ గాలికి ఆరిపోదని దానికి జడత జరామరణాదు లసలు లేవని తనమీద తనకు గల నమ్మకాన్ని గాఢంగా చెబుతున్నారు. వీరి కవితలకు కొన్ని ఉదాహరణలు:

రుధిరం ధారవోసి
ఉదయాన్ని సృష్టించినా
తెల్ల వారనే లేదంటారు
తెలివి మాలిన వాళ్ళు— (67)

చరిత్ర నేత్రాల్లో
దుఃఖాశ్రువులు దొర్లితేరాత్రి
ఆనంద బాష్పపుష్పాలు పూస్తే పగలు (51)

ఆలోచన వ్యాకోచిస్తే మహాజనుడు
మనసు సంకోచిస్తే మహాజడుడు
పైరిజాల మోజుల్లోపడి
పైరవీలు చేసేవాడు
కానే కాడు కవి
చీకటి సంస్థానం మీద దాడిచేసి
అస్తమించని రవిలా
వెలిగే వాడే అసలైన కవి. (28)

శ్రీ టి. ఎల్. కాంతారావు

Printed & Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editior: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.